
సత్యమేవ జయతే

సాక్షి



WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 194

శుక్రవారం 4-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 4-10-2024





కావ్య మండవ ప్రముఖ అడ్వకేట్, మహిళా హక్కులు-చట్టాలకు సంబంధించి సీనియర్ లీగల్ కన్సల్టెంట్. ముఖ్యంగా గృహ హింసకు సంబంధించి ఎన్నో కేసుల్ని వాదించి ఎందరికో పరిష్కారం చూపిన అభ్యుదయ న్యాయవాది. మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు ప్రధాన కారణం వారిలో చైతన్యం లేకపోవడమేనంటున్న కావ్య మండవ.. మన దేశంలో చట్టాలు చేయడమే కాదు.. సాంఘిక సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. జండర్ న్యూట్రల్ వంటి వాటిని పటిష్టంగా అమలు చేస్తే కనీసం వచ్చే తరం మహిళల్లోనైనా మార్పులు వస్తాయంటూ మహిళాలోకాన్ని మేలుకొలుపుతున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా రోజుకొక ప్రముఖ మహిళతో ముఖాముఖి.. సాక్షి డిజిటల్ యూ ట్యూబ్‌లో...
https://www.youtube.com/watch?v=aWzeFKw63mU సాక్షి @ నవశక్తి

లలితమ్మకు అరవై దాటాయి. భర్త పోయాడు. ఇద్దరు పిల్లలు. కొడుకు కుటుంబం యూఎస్‌లో ఉంది. కూతురు తన కుటుంబంతో జీవిస్తోంది. జీవితం లలితమ్మను క్రాస్‌రోడ్‌లో నిలబెట్టింది. మీరంగీకరిస్తే పెళ్లి చేసుకుందాం... అంటూ ఒక ప్రతిపాదన. ఇప్పుడామె ఏం చేయాలి? ఆమె తీసుకున్న నిర్ణయం ఏమిటి?

ఆరుపదుల్లో ఏడడుగులు


ప్రతీకాత్మక చిత్రం

ఓ రోజు కొడుక్కి ఫోన్ చేస్తే కోడలు మాట్లాడింది. తన ఆరోగ్య పరిస్థితిని గుర్తు చేస్తూ 'మీరు నా బాధ్యత తీసుకునే కండిషన్‌లో లేరని అర్థమైంది. నన్ను పెళ్లి చేసుకోవడానికి ఓ వ్యక్తి ముందుకొచ్చారు. ఆ విషయం అబ్బాయితో చెప్పడానికి ఫోన్ చేశాను' అన్నది. ఆ కోడలు భర్తకి ఫోన్ ఇవ్వకుండానే 'అత్తయ్యా మీ సంతోషమే మా సంతోషం' అని ఫోన్ పెట్టేసింది. 'మీకు మేమున్నాం' అనే మాట కోసం ఎదురుచూసిన లలితమ్మకు పెళ్లి ఒక్కటే ఆమెకున్న దారి అని చెప్పకనే చెప్పినట్లయింది.

న్యూక్లియర్ ఫ్యామిలీ రోజులివి!

ఏదో ఒక ఇంట్లో కాదు, సమాజంలో సగానికి పైగా కుటుంబాల పరిస్థితి ఇలాగే ఉందన్నారు తోడు– నీడ రాజేశ్వరి. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలుండేవి. ఇప్పుడు దాదాపుగా అన్నీ న్యూక్లియర్ ఫ్యామిలీలే. వీటిలో గ్రాండ్ పేరెంట్స్‌కి స్థానం లేదు. పిల్లలు పుట్టినప్పటి నుంచి నానమ్మ, తాతయ్య అంటే అతిథులుగా వచ్చిపోయేవాళ్లేననే భావనతోనే పెరుగుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొడుకు ఇంట్లోనే అనాథల్లా బతుకీడ్చడానికి ఇష్టపడడం లేదు పెద్దవాళ్లు. నగరంలో సీనియర్ సిటిజెన్ హోమ్స్ ఇలాంటి అవసరం నుంచి మొగ్గతొడినవే. భార్యాభర్త ఇద్దరూ జీవించి ఉన్నంత వరకు పిల్లలతో కలిసి ఉండాలనుకోవడం లేదు. తమకు తాముగా హాయిగా ఉంటున్నారు. వారిద్దరిలో ఒకరు జీవితం చాలించినప్పుడు రెండోవాళ్లు ఒంటరి పక్షులవుతున్నారు. అలాంటి వారికి పెళ్లి బంధంతో ఒక ఆలంబన చేకూర్చడం అవసరం. చివరి శ్వాస వరకు మనిషికి ఎమోషనల్ బాండింగ్ అవసరమే. ఆ బాండింగ్ పెళ్లితోనే సాధ్యం.

సహజీవనమూ సమాధానమే!

"నేను చేసిన పెళ్లిళ్లలో విజయవాడకు చెందిన కోటేశ్వరరావు, రాజేశ్వరి పెళ్లి ప్రత్యేకం. అయితే అరవైలలో పెళ్లి మాత్రమే కాదు, సహజీవనం కూడా ప్రోత్సహించాల్సిన విషయమే. ఇటీవల కొంతమంది విషయంలో లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌నే ప్రోత్సహిస్తున్నాను. సంపన్న కుటుంబాల్లో పెద్దవాళ్ల పెళ్లి ఆస్తి తగాదాలకు దారి తీస్తోంది. బ్యాంకు మేనేజర్‌గా రిటైరైన అరవై ఏళ్ల వ్యక్తి, అదే వయసున్న గృహిణి సహజీవనంలో ఉన్నారు. వాళ్లకిద్దరికీ పిల్లలున్నారు.

ఆ క్షణం నుంచి మందు ముట్టలేదు

భార్య పోయిన తర్వాత మద్యంతో సేద దీరడం అలవాటైంది. రాజేశ్వరిని పెళ్లి చేసుకున్న మూడేళ్ల తర్వాత ఒకసారి విరేచనాలతో తీవ్రంగా బాధపడ్డాను. నాకేదయినా అయితే... అనే ఆలోచన నన్ను భయపెట్టింది. నన్ను పెళ్లి చేసుకున్న తర్వాత రాజేశ్వరి పండుగలప్పుడు పట్టుచీర కట్టుకుని పూలు పెట్టుకుని ఇంట్లో సంతోషంగా ఉండడం కళ్ల ముందు మెదిలింది. ఆమె సంతోషం ఎక్కువ కాలం నిలవాలంటే నేను ఆరోగ్యంగా ఉండాలి కదా అనుకున్నాను. ఆ క్షణం నుంచి మద్యం ముట్టుకోలేదు.

– కోటేశ్వరరావు


పదేళ్ల పెళ్లి వేడుకలో (ఫైల్ ఫోటో)

పన్నెండేళ్ల బాంధవ్యం మాది

పెళ్లినాటికి నాకు 62. ఆయనకు 72. ఆయనతో అంతకు ముందు పరిచయం లేదు. కానీ ఒకరి గురించి మరొకరు సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరమే రాలేదు. వయసురీత్యా ఎదురయ్యే ఆరోగ్యసమస్యలు తప్ప ఇతర అనారోగ్యాలేమీ లేవు. ఒకరికి అవసరమైనవి మరొకరు సమకూర్చిపెట్టుకుంటూ ఒకరినొకరు చంటిపిల్లల్లా చూసుకుంటున్నాం. ఈ జీవితం బాగుంది. రెండేళ్ల కిందట మా పిల్లలు బంధువులంతా కలిసి పదేళ్ల వేడుక కూడా చేశారు.

– రాజేశ్వరి

60 తర్వాత కూడా జీవితం ఉంది



2010లో 'తోడు నీడ' సంస్థను స్థాపించి ఒంటరి జీవితాలకు ఒక శుభారంభం పలికాను. పిల్లలు పెద్దయిన తర్వాత భాగస్వామిని కోల్పోయి ఒంటరిగా జీవిస్తున్న వారిని జంటలుగా మారుస్తున్నాను. అయితే వందమంది మగవాళ్లు తమ ప్రొఫైల్‌ను రిజిస్టర్ చేసుకుంటే ఆడవాళ్ల సంఖ్య యాభైకి మించడం లేదు. ఆడవాళ్లు ఫోన్ చేసి 'పిల్లలెక్కడో ఉన్నారు. మాట్లాడేవాళ్లు లేరు, ఒంటరితనాన్ని భరించలేకపోతున్నాను' అని భోరున ఏడుస్తారు. వాళ్లలో చాలామందికి తమతో పాటు మరొకరికి వండి పెట్టే ఓపిక ఉంటుంది. కానీ ఆర్థిక స్వావలంబన ఉండదు. ఉద్యోగం నుంచి రిటైరైన మరొక పెద్దాయనకు పెన్షన్ వస్తుంటుంది లేదా జీవించడానికి తగినంత డబ్బు ఉంటుంది. వేళకు ఆయన ఆరోగ్యానికి తగ్గట్లు వండిపెట్టే ఆలంబన ఉండదు. అలాంటి వారిని కలిసి జీవించే విధంగా చూస్తున్నాను. పెళ్లి బంధంతో కలుపుతున్నాను. అరవై తర్వాత కూడా జీవితం ఉంది. ఆ జీవితాన్ని ఒంటరితనంతో నిస్సారంగా నెట్టుకెళ్లే పరిస్థితి ఎవరికీ రాకూడదు.

– ఎస్.ఎం. రాజేశ్వరి,
ఫౌండర్, తోడు – నీడ స్వచ్ఛంద సంస్థ

మొదటిరోజే అతడి పిల్లలతో స్పష్టంగా 'మీ ఆస్తి నాకు వద్దు, సవతి తల్లి అనే భావనలో ఉండవద్దు. మీ నాన్న సంరక్షణ చూసుకునే కేర్‌టేకర్‌ని మాత్రమే. నా సంరక్షణ చూసుకునే బాధ్యత మీ నాన్నది. నా కారణంగా మీరు మీ నాన్నకు దూరం కావద్దు. అలాగే నా పిల్లలూ నాకు దూరం కారు' అని స్పష్టంగా చెప్పింది.. ఇరువురి పిల్లలూ ఆమోదించారు. కొడుకులు –కోడళ్లు, కూతుళ్లు– అల్లుళ్లు, మనుమలు, మనుమరాళ్లు పండుగలకు వస్తుంటారు" అంటూ వాలుతున్న పొద్దులో తాను పూయించిన వెలుగు సుమాలను 'సాక్షి'తో పంచుకున్నారు తోడు – నీడ రాజేశ్వరి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

నేడు వరల్డ్ యానిమల్ డే

అమ్మలా ప్రేమను పంచుతున్నారు



జంతు సంక్షేమం. సంరక్షణకు సంబంధించి మహిళల కృషి నిన్నామొన్నటిది కాదు. దీనికి ఎంతో చరిత్ర ఉంది. ప్రపంచవ్యాప్తంగా జంతుసంరక్షణకు సంబంధించిన ఉద్యమాలు, సంస్థలలో ఎక్కువగా మహిళలే నాయకత్వ బాధ్యత వహిస్తున్నారు. మన దేశంలో జంతుసంక్షేమ విధానానికి వెన్నెముక అయిన పీసీఏ యాక్ట్‌లో అప్పటి రాజ్యసభ ఎంపీ, ప్రముఖ నృత్యకారిణి రుక్మిణీ ఆరండల్ కీలకపాత్ర పోషించింది.

'మన దేశంలో జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించే విషయంలో మహిళా నాయకుల చొరవ, శ్రమ ఎంతో ఉంది. జంతు సంరక్షణ ఉద్యమంలో ఎన్నో వినూత్న విధానాలకు రూపకల్పన చేస్తున్నారు. నా మిత్రురాలు స్వర్ణాలీరాయ్ కోల్‌కతాలో బడులు, కాలేజీలకు వెళుతూ వ్యవసాయ రంగంలో జంతువులను ఎలా చూస్తున్నారు నుంచి జంతు సంక్షేమం వరకు ఎన్నో విషయాల గురించి అవగాహన కలిగిస్తుంది. పంజాబ్ యూనివర్శిటీలో వందలాదిమంది విద్యార్థులకు వ్యవసాయంలో భాగమైన జంతువుల సంక్షేమం గురించి ఎంతో అవగాహన కలిగించింది. ఇలాంటి వారు దేశవ్యాప్తంగా ఎంతో మంది ఉన్నారు' అని చెబుతున్నారు అలోక్ పర్ణ సేన్‌గుప్తా.

అలోక్‌పర్ణసేన్ యానిమల్ రైట్స్ అడ్వకేట్. హ్యూమన్ సొసైటీ ఇంటర్నేషనల్, ఇండియా మేనేజింగ్ డైరెక్టర్. వీధికుక్కల సంక్షేమం నుంచి వ్యవసాయ రంగంలో జంతు సంరక్షణ వరకు ఎన్నో అంశాలపై పని చేస్తోంది.

'రుక్మిణీదేవి కృషి వల్లే పీసీఏ చట్టం, యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా అమల్లోకి వచ్చాయి. జంతుసంక్షేమానికి సంబంధించిన లక్ష్యాల కోసం మహిళలు అంబాసిడర్‌లుగా పనిచేస్తున్నారు. తాము పనిచేయడమే కాదు ఇతరులకు స్ఫూర్తిని ఇస్తున్నారు. జంతు సంక్షేమ ఉద్యమంలో కూడా ఎంతోమంది మహిళలు పనిచేస్తున్నారు. కొందరు ప్రముఖంగా కనిపించవచ్చు. చాలామంది తెరవెనుక నిశ్శబ్దంగా పని చేస్తున్నారు' అంటుంది జంతు సంక్షేమ ఉద్యమకారిణి నజరేత్.

చెవి నొప్పి వస్తుంటే..?



చెవినొప్పి చాలా తీవ్రంగా ఉండటమే కాకుండా, ఒక్కచోట కుదురుగా నిలువనివ్వదు. ఏ అర్ధరాత్రో చెవి నొప్పి వస్తే ఏం చేయాలో తెలుసుకుందాం. • చెవిలోపలికి ఏదైనా పురుగు ప్రవేశించడం వల్ల నొప్పి వస్తుంటే చెవి బయట టార్చ్‌లైట్ వేయాలి. టార్చ్‌లైట్ వెలుతురుకు పురుగులు చెవి నుంచి బయటకి వచ్చే అవకాశం ఉంది. • చెవిలో గులివి వల్ల నొప్పి వస్తే డీ-వ్యాక్స్ డ్రాప్స్ వేయవచ్చు. అయితే గులివి తీయడానికి పిన్నీసులు, పెన్సిల్, టూత్‌పిక్ లాంటి వాడిమొన ఉన్నవాటినీ, తాళం చెవుల వంటి వాటిని చెవిలోకి దూర్చకూడదు. • చెవి నొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు కొందరు వేడి చేసి చల్లార్చిన నూనె వంటివి చెవిలో పోస్తుంటారు. ఎట్టిపరిస్థితుల్లోనూ చెవిలో నూనెలాంటివి పోయకూడదు. అవి వినికిడి తగ్గిపోయే ప్రమాదాలను తెచ్చిపెడుతాయి. • నొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు డాక్టర్‌ను సంప్రదించే లోపు తాత్కాలికంగా చాలా పరిమితంగా మాత్రమే నొప్పి నివారణ మందులను ఉపయోగించవచ్చు.

నర – నారీ కథ నవ్వులాట కాదు

గౌరవానికి స్త్రీకారం


'నీల నిర సూర్యన్'లో సంయుక్త

'మా కథలు మేము చెప్పుకోవడం ఈ దేశంలో అంత సులువు కాదు' అంటుంది సంయుక్త విజయన్. పొల్లాచ్చిలో పుట్టి శాన్‌ఫ్రాన్సిస్కోలో స్థిరపడిన ఈ ట్రాన్స్ ఉమన్ మన దేశ తొలి ట్రాన్స్ ఉమన్ డైరెక్టర్‌గా చరిత్రకు ఎక్కింది. పురుషుడిగా పుట్టి స్త్రీగా మారడానికి ఎన్ని అవస్థలు పడిందో ఆ ఘర్షణను 'నీల నిర సూర్యన్' పేరుతో సినిమా తీయడమే కాదు ముఖ్యపాత్ర పోషించింది. నేడు ఈ చిత్రం విడుదల సందర్భంగా సంయుక్త పరిచయం.

2016.

తమిళనాడు–తిరుచ్చిలోని సొంత ఇంటికి దీపావళి పండుక్కు వచ్చిన సంతోష్ అమెరికాకు తిరిగి వెళుతూ 'అమ్మా... వచ్చే దీపావళికి నేను అమ్మాయిగా వస్తాను' అని చెప్పాడు. తల్లి ఉలిక్కి పడలేదు. కన్నీరు కార్చలేదు. 'నీ ఇష్టంరా. నీకెలా సంతోషంగా ఉంటే అలా చెయ్' అంది. అమెరికాకు వెళ్లాక సంతోష్ ట్రాన్స్ ఉమన్‌గా మారడానికి అవసరమైన వైద్యం, చికిత్సలు చేయించుకున్నాడు. శనివారం వరకూ అబ్బాయి రూపంలోనే వెళ్లిన సంతోష్ సోమవారం నుంచి 'సంయుక్త' గా ఆఫీస్‌లో అడుగు 'పెట్టింది'. అయితే స్నేహితులు ఎటువంటి తేడా చూపించలేదు. అబ్బాయి సంతోష్‌తో ఎంత స్నేహంగా ఉన్నారో అమ్మాయి సంయుక్తతో అంత స్నేహంగా ఉన్నారు. 'అందరి కథ ఇంత సులువుగా ఉండదు. అందుకే సినిమా తీశాను' అంటుంది సంయుక్త.



బీటెక్ గ్రాడ్యుయేట్

సంయుక్త తండ్రి టైలర్. తల్లి గృహిణి. ముగ్గురు కుమారుల్లో ఒకడుగా పుట్టాడు సంతోష్. 'అయితే నా భౌతిక రూపానికి నా మానసిక స్వభావానికి పొంతన కుదరలేదు. నాలోని స్త్రీనే నేను స్వీకరించాను. నా తల్లిదండ్రులు ఇందుకు నన్ను ఇబ్బంది పెట్టకపోయినా బయట నేను సంప్రదాయవాదుల గేలిని, అల్లరిని, అవమానాన్ని భరించాను. ట్రాన్స్‌పర్సన్‌ల జీవితం వెండి తెర మీద రావడం తక్కువ. మగవాళ్లు కొందరు ఆ పాత్రలు ధరించారు. ఇటీవల 'తాలి' సినిమాలో సుస్మితా సేన్ బాగా చేసింది. కాని నేను ట్రాన్స్‌ఉమన్‌గా ఉంటూ సినిమా తీయడం వల్ల మేమూ ఇండస్ట్రీలో మా కథలు చెప్పగలం అని నిరూపించదలుచుకున్నాను' అంటుంది సంయుక్త.

సినిమా అంటే తెలియకపోయినా...

'మా పొల్లాచ్చిలో రోజూ షూటింగ్‌లే. కాని ఏవీ నేను చూడలేదు. షార్ట్‌ఫిల్మ్‌లు తీయలేదు. అసిస్టెంట్‌గా పని చేయలేదు. 2020లో నేను సినిమా తీయాలనుకున్నప్పుడు స్క్రిప్ట్ ఎలా రాయాలన్న సంగతిని యూట్యూబ్ పాఠాల ద్వారా తెలుసుకున్నాను. వందల వీడియోలు చూసి రెండేళ్ల పాటు స్క్రిప్ట్ రాశాను. నా జీవితాన్ని, నావంటి వారి జీవితంలోని ఘటనలను కలిపి 'నీల నిర సూర్యన్' సినిమా తీశాను. అంటే నీలి రంగు సూర్యుడు అని అర్థం. అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'ది బ్లూ సన్‌షైన్' పేరుతో ప్రదర్శితమవుతుంది. తమిళ విడుదల కోసం తమిళ పేరు పెట్టాను' అని తెలిపింది సంయుక్త.

సొంత డబ్బు పెట్టి...

సంయుక్త అమెరికాలో అమేజాన్‌లో ఉన్నత ఉద్యోగంలో ఉంది. తన సంపాదనలోని కొంత భాగాన్ని ఈ సినిమా కోసం ఖర్చు పెట్టింది. 'సినిమాల్లో థర్డ్ జెండర్‌ని హాస్యానికే వాడి అపచారం చేశారు. ఇక మీదైనా ట్రాన్స్‌పర్సన్‌లను మర్యాదకరమైన రీతిలో ఇన్‌క్లూజివ్‌గా చూపి చేసిన పాపాన్ని కడుక్కోవాలి సినిమా వారు. పరిస్థితి ఇంకా చిన్న ఊళ్లలో మారలేదు. ఉదాహరణకు ఒక స్కూల్లో టీచర్‌ని పిల్లలు గౌరవిస్తారు. కాని ఆ టీచర్ ట్రాన్స్ ఉమన్ అయితే తేడా వచ్చేస్తుంది. ఈ పరిస్థితి పోవాలి. నేను తీసిన సినిమా కథ మాలాంటి వాళ్ల అస్తిత్వాన్ని గౌరవించవలసిందిగా అర్థం చేసుకోమని కోరుతుంది' అందామె.

స్త్రీగా మాత్రమే

సంయుక్త తనను తాను స్త్రీగా తప్ప ట్రాన్స్‌జెండర్‌గా చెప్పడానికి అంగీకరించదు. 'నేను స్త్రీగా మారదల్చుకున్నాను. మారాను. కనుక నా ఆధార్ కార్డులో స్త్రీ అనే ఉంది. ప్రభుత్వం ఇచ్చే ప్రయోజనాల కోసం ట్రాన్స్‌జెండర్ అనే అస్తిత్వం అవసరమైతే దానిని కొందరు స్వీకరించవచ్చు. కాని నేను పూర్తిగా స్త్రీ అస్తిత్వంతో ఉండాలని కోరుకుంటాను' అంటుంది


సంయుక్త

సంయుక్త. ఆమె మంచి భరతనాట్య కళాకారిణి. చెన్నయ్‌లో ఆరంగేట్రం చేస్తే చాలా మంది మెచ్చుకున్నారు. విస్మరణకు గురైన జీవితాలకు సంబంధించి ఇవాళ అనేక సినిమాలు వస్తున్నాయి. సంయుక్త విజయన్ తీసిన 'నీల నిర సూర్యన్' మరో ముఖ్యమైన కథను చెబుతోంది. మరిన్ని కథలు సంయుక్త నుంచి మనం చూడొచ్చు.



నవరాత్రి వార్డ్‌రోబ్

నవరాత్రులలో దాండియా ఆటలు ప్రత్యేకమైనవి. ఉత్సాహపరిచే ట్యూన్స్‌కి అనుగుణంగా నృత్యం చేయడానికి చాలామంది ఆసక్తి కనబరుస్తుంటారు. ఇలాంటప్పుడు ధరించే డ్రెస్ కూడా అడుగుల కదలికలకు తగినట్టు కదులుతున్న మెరుపులా నవరాత్రులకు ఆకర్షణీయమైన హంగుగా అమరాలి.

ఇండో వెస్ట్రన్ మెరుపుల కళ

నవరాత్రులలో దాండియా నృత్యాలు అనగానే మనకు పెద్ద పెద్ద అద్దాలతో ఎంబ్రాయిడరీ చేసిన సంప్రదాయ లెహంగా– చోలీలు గుర్తుకు వస్తాయి. ఎప్పుడూ ఒకే తరహా కాకుండా ఈసారి దాండియా డ్రెస్సులకు కొంత ఫ్యూజన్ ని జత చేసి, కొత్తగా మెరిపిద్దాం. అందుకు, మీ వార్డ్‌రోబ్‌ని పండగ స్పెషల్‌గా మార్చేయండి. వార్డ్‌రోబ్‌లో ఉన్న డ్రెస్సులతోనే నవరాత్రుల్లో న్యూ లుక్‌తో ఆకట్టుకునే తొమ్మిది ఐడియాలు..

ధోతీ ప్యాంట్‌లను హారమ్ ప్యాంట్స్ అని కూడా పిలుస్తారు. ఇలాంటి పండగల సీజన్‌లో ఈ ప్యాంట్స్ మంచి లుక్‌ని ఇస్తాయి. వీటిమీదకు ఎంబ్రాయిడరీ జాకెట్స్ లేదా సింపుల్ క్రాప్‌టాప్స్ ధరించినా చాలు దాండియా హుషారు వెంటనే పలకరిస్తుంది.



కో ఆర్డ్ సెట్ ధరించాలనుకుంటే లేయర్డ్ లుక్ కోసం పొడవాటి ష్రగ్ ధరించండి.



సిల్వర్/ఆక్సిడైజ్డ్ హారాలు, చైన్లు, థ్రెడ్ జ్యువెలరీ నవరాత్రి డ్రెస్సుల మీదకు ఆకర్షణీయంగా అమరుతాయి. ఆడ–మగ వాళ్లు కూడా ఈ జ్యువెలరీని హెవీ డిజైన్ ధోతీ ప్యాంట్ల మీదకు ధరించవచ్చు.

ప్రతిరోజూ కొత్తదనం నింపుకోవడం ఎలా అని ఆలోచనలో పడినట్లైతే దుపట్టాతో లుక్‌ని ఇట్టే మార్చేయవచ్చు. బాందినీ దుపట్టాలు నవరాత్రి కళను ఇట్టే సృష్టిస్తాయి. సల్వార్ కమీజ్ వేసుకున్నా బాందినీ దుపట్టాలను భుజం మీద నుంచి నడుము వరకు తీసుకువచ్చి, వెడల్పాటి ఎంబ్రాయిడరీ బెల్ట్‌ను పెట్టేస్తే ఆకట్టుకునే లుక్‌తో మెరిసిపోతారు.





ఆక్సిడైజ్డ్ జూకాలు, హారాలు వేసుకుంటే చాలు.



టీనేజ్‌లో ఉన్న అమ్మాయిలు లైట్ వెయిట్‌తో డ్రెసప్ అవాలనుకుంటారు. ఇలాంటప్పుడు ఫ్లోరల్ ప్రింట్స్, బ్రొకేడ్ స్కర్ట్ లేదా పలాజో ధరించి. టాప్‌కి తెల్లటి షర్ట్ జత చేయండి. దీనికి ఆక్సిడైజ్డ్ హారాలను అలంకారానికి ఉపయోగించండి. మోకాళ్ల కింది వరకు ఉండే గాగ్రాలు, ధోతీ ప్యాంట్ల మీదకు స్టైలిష్ క్రాప్ టాప్‌లు వేసుకోవచ్చు.




శారీ గౌన్ లేదా మల్టీకలర్ ప్లెయిన్ షిఫాన్, బనారస్, ఇకత్ శారీస్... కలంకారీ, జైపూర్ ప్రింట్స్ ఈ వేడుకకు బాగా నప్పుతాయి. వీటిమీదకు ఇండోవెస్టర్న్ క్రాప్ టాప్ బ్లౌజ్‌లు, సిల్వర్/ఆక్సిడైజ్డ్ ఆభరణాలు ధరిస్తే ఎందరిలో ఉన్నా ప్రత్యేకంగా కనిపిస్తాం





దాండియా రాత్రిలో అబ్బురపరచడానికి మరో అందమైన ఆలోచన చీరకట్టు. వేరే డ్రెస్సులు వేసుకోవడం ఇష్టం లేదు, చీరతో దాండియాలో పాల్గొనాలంటే స్టైలిష్ బ్లౌజ్ బదులుగా సంప్రదాయ హెవీ ఎంబ్రాయిడరీ వర్క్ బ్లౌజ్‌ను ఎంచుకోవాలి. పెద్ద పెద్ద చెవిపోగులు, పాపిట బిళ్లను జత చేయండి.




'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ణి చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 194

శుక్రవారం 4-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మార్కెట్లో యుద్ధ కల్లోలం

సెన్సెక్స్ 1,769 పాయింట్లు.. నిఫ్టీ 547 పాయింట్ల పతనం -15లో



బోణీ బాగుండాలి

మహిళల టి20 ప్రపంచకప్‌లో నేడు కివీస్‌తో భారత్ తొలి మ్యాచ్.. -15లో



జైళ్లలో కుల వివక్ష వద్దు

కులం ఆధారంగా ఖైదీలపై వివక్ష చూపడం తగదని సుప్రీం తేల్చిచెప్పింది. ఖైదీలందరినీ సమానంగా చూడాలని ఆదేశించింది.

వివరాలు 6లో ▸



ఆహార భద్రతకు మరింత ఊతం

సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రతకు ప్రోత్సాహమే లక్ష్యంగా రెండు పథకాలకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.

వివరాలు 6లో ▸



యువత కోసం ఇంటర్న్‌షిప్

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో కేంద్రం ఇంటర్న్‌షిప్ పథకాన్ని తెచ్చింది. ఏటా రూ.66 వేలు ఇవ్వనుంది.

వివరాలు 6లో ▸



'లడ్డూ'పై విచారణ నేటికి వాయిదా

తిరుమల లడ్డూ తయారీ ఆరోపణలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలన్న పిటిషన్లపై సుప్రీం నేడు విచారణ చేపట్టనుంది.

వివరాలు 13లో ▸

మంత్రిగారూ ఇదేం తీరు?

అక్కినేని కుటుంబంపై మంత్రి సురేఖ వ్యాఖ్యల్ని తప్పుబట్టిన సినీ పరిశ్రమ

నాగార్జున ఫ్యామిలీ, సమంతకు చిరంజీవి, వెంకటేశ్, మహేశ్‌బాబు తదితరుల బాసట



సామాజిక మాధ్యమ వేదికలు ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పోస్టులు

సున్నితమైన అంశాలపై ఎవరు మాట్లాడినా తగిన చర్యలు తీసుకుంటామన్న 'మా'

సమంతపై వ్యాఖ్యలనే సురేఖ వెనక్కు తీసుకోవడంపై దర్శకుడు రాంగోపాల్‌వర్మ అభ్యంతరం

ఆమె అత్యంత జుగుప్సాకరంగా అవమానించింది నాగార్జున, నాగచైతన్యనంటూ పోస్ట్

సమస్య సద్దుమణిగింది... సంయమనం పాటించాలన్న టీపీసీసీ చీఫ్

కేటీఆర్‌కు వ్యతిరేకంగా మహిళా కాంగ్రెస్ ధర్నా..

సురేఖపై పోలీసులకు బీఆర్‌ఎస్ మహిళా కార్పొరేటర్ల ఫిర్యాదు

ఇంత జరుగుతున్నా స్పందించని సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సినీహీరో అక్కినేని నాగార్జున కుటుంబంతోపాటు సినీనటి సమంతపై అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వివాదం ఇంకా సద్దుమణగలేదు. మంత్రి వ్యాఖ్యలను తప్పుబడుతూ చలనచిత్ర ప్రముఖులు గురువారం తీవ్రస్థాయిలో స్పందించారు. అక్కినేని కుటుంబంతోపాటు నటి సమంతకు బాసటగా నిలిచారు. మంత్రి తన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకున్నారని, సినీ ప్రముఖులు దీనిని ఇంతటితో వదిలేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విజ్ఞప్తి చేసినా సోషల్ మీడియా వేదికగా సినీ ప్రముఖుల విమర్శల వరద ఆగలేదు. తెలుగు సినీ పరిశ్రమతోపాటు ఇతర భాషల నటీనటులు కూడా స్పందించారు. మెగాస్టార్ చిరంజీవి, హీరోలు వెంకటేశ్, మహేశ్‌బాబు, రాంచరణ్, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, రవితేజ, నరేశ్, నాని, విజయ్ దేవరకొండతోపాటు సీనియర్ నటి విజయశాంతి, హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్, దర్శకులు రాజమౌళి, హరీశ్ శంకర్, తమిళ నటి

మిగతా 2వ పేజీలో ▶

నాగార్జున పరువునష్టం దావా

మంత్రి కొండా సురేఖపై సినీనటుడు అక్కినేని నాగార్జున నాంపల్లి కోర్టులో పరువునష్టం దావా వేశారు. నటి సమంత, నాగచైతన్య విడాకులు తీసుకోవడంలో తన ప్రమేయం ఉందంటూ మంత్రి చేసిన వ్యాఖ్యలపై నాగార్జున కోర్టును ఆశ్రయించారు. తన కుటుంబ సభ్యుల పరువుకు మంత్రి భంగం కలిగించారని నాగార్జున పేర్కొన్నారు. ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. మరో వైపు కొండా సురేఖపై పలువురు బీఆర్‌ఎస్ మహిళా కార్పొరేటర్లు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేటీఆర్‌తోపాటు సినీ ప్రముఖులపై చేసిన ఆరోపణలకు గాను ఆమెపై కేసు పెట్టాలని కోరారు. కేటీఆర్‌పై ఆమె చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.


ఫామ్‌హౌస్‌ల కోసమే మూసీ ముసుగు!

ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో బీఆర్‌ఎస్ నేతలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫైర్

అక్రమ నిర్మాణాలపై వేటు పడకుండా మూసీ నిర్వాసితులను కవచంగా వాడుకుంటున్నారని ధ్వజం

- కేటీఆర్, హరీశ్, సబిత అక్రమ నిర్మాణాలను కూల్చాలో వద్దో వారే చెప్పాలని డిమాండ్
- బీఆర్‌ఎస్ రూ. 1,500 కోట్ల నిధుల్లోంచి మూసీ బాధితులకు రూ. 500 కోట్లు పంచాలని హితవు
- ఈటల బీజేపీలో చేరినా పదేళ్లు బీఆర్‌ఎస్‌లో ఉన్నందున ఇంకా ఆ కంపు పోలేదని చురకలు

సాక్షి, హైదరాబాద్: చెరువుల్లో అక్రమంగా నిర్మించిన ఫాంహౌస్‌లపై వేటుపడకుండా ఉండేందుకే బీఆర్‌ఎస్ నేతలు ముసుగు తొడుక్కొని మూసీ నిర్వాసితులను రక్షణ కవచంగా వినియోగించుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బురదలో కూరుకుపోతున్న నగరాన్ని కాపాడేందుకు తాము మూసీపై ముందుకెళ్తుంటే దానిపైనా బురదజల్లుతున్నారని పరోక్షంగా కేటీఆర్, హరీశ్‌రావులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని డ్రామాలాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు చేతనైతే ఆ పార్టీ ఖాతాలోని రూ. 1,500 కోట్ల తెలంగాణ ప్రజల సొమ్ములో రూ. 500 కోట్లను మూసీ బాధితులకు పంచాలని సూచించారు. మురికి మూసీలో జీవచ్ఛవాల్లా ఉన్న పేదలు ఆత్మగౌరవంతో బతకడానికి ఇళ్లు ఇస్తుంటే రెచ్చగొట్టడం తగదన్నారు.



ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రాజెక్టు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి

గురువారం సికింద్రాబాద్ సిఖ్ విలేజ్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు కార్యక్రమాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా

మిగతా 12వ పేజీలో ▶

సన్నాల్లో గోల్‌మాల్ జరిగితే కలెక్టర్లే బాధ్యులు

- సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఈ సీజన్ నుంచే....
- ప్రతీరోజు కలెక్టర్లు రెండు గంటలపాటు ధాన్యం సేకరణపై దృష్టి పెట్టాలి
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

5 లో

న్యూస్‌రీల్

గిరిజనుల ఆరోగ్యంపై ఫోకస్



అటవీ ప్రాంతాల్లోని గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని.. ఐటీడీఏల పరిధిలో ఉన్న ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు.

- వివరాలు 5లో ▶

మండలిలో ప్రభుత్వ విప్‌గా పట్నం మహేందర్‌రెడ్డి



శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల కోటా నుంచి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

- వివరాలు 2లో ▶

కేటీఆర్, హరీశ్‌లపై కేసు



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీ రామారావు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావులపై సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- వివరాలు 2లో ▶

ట్రైబల్ వర్సిటీలో చేరేందుకు అనాసక్తి



ములుగు జిల్లాకేంద్రంలో సమ్మక్క–సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో చేరేందుకు విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అడ్మిషన్లకు చివరి రోజు వరకు ముగ్గురే చేరగా.. స్పాట్ అడ్మిషన్ రోజున 10 మంది అర్హత సాధించారు.

- వివరాలు 3లో ▶

పేదల ఇళ్లు కూలిస్తే.. ప్రభుత్వం కూలుతుంది

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి | బుల్డోజర్లు దింపే అధికారం ప్రభుత్వానికి లేదు.. సర్కారును స్తంభింపజేస్తాం



సాక్షి, హైదరాబాద్: పేదవాళ్ల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చే ప్రయత్నం చేస్తే సహించే ప్రసక్తే లేదని, రాష్ట్ర ప్రభుత్వం కూలిపోక తప్పదని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి హెచ్చరించారు. మూసీ సుందరీకరణ పేరుతో పేద ప్రజలమీద ప్రతాపం చూపిస్తే ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామన్నారు. పేదవాళ్ల ఇళ్లపై బుల్డోజర్లు దింపే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. సమగ్రమైన ఆలోచన లేకుండా అక్రమ కట్టడాల పేరుతో పేదల ఇళ్లను కూల్చడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆందోళనలు, మనోవేదనను పరిగణనలోకి తీసుకోకుండా సీఎం రేవంత్ రెడ్డి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గురువారం పార్టీనేతలు ప్రేమ్‌సింగ్ రాథోడ్, కాసం వెంకటేశ్వర్లు, ఎస్.కుమార్, ఎస్.ప్రకాశ్‌రెడ్డిలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వమైనా పేదలకు మేలు చేసే ప్రయత్నంతోపాటు ప్రాజె క్టులు, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల బస్తీలపై కన్నేసి, ఆ ఇళ్లను కూల్చే పనికి శ్రీకారం చుట్టిందని, ఇలా దేశంలో ఎక్కడా ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరిట కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి, పేదల ఇళ్లపై మార్కింగ్ చేయడంతో ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైందని, దాంతో వెనకడుగు వేసిందని గుర్తుచేశారు. హైదరాబా ద్‌లోని 70 శాతం డ్రైనేజీ నీరంతా మూసీలో చేరుతోందని, ప్రతీగల్లీలో డ్రైనేజీ సమస్య నెలకొందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించకుండా రూ.లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణ పేరుతో అనాలోచిత చర్యలకు పాల్పడుతోందని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'అనేక చెరువుల్లో

మిగతా 12వ పేజీలో ▶

మూసీ మురికి అంతా వారి నోట్లోనే

ఇంకా శుద్ధి ఎందుకు, లక్షన్నర కోట్ల ఖర్చు ఎందుకు?:కేటీఆర్

- నమామి గంగేకు కిలోమీటరుకు రూ.17 కోట్లు, మూసీకి 2,700 కోట్లా?
- రేవంత్ ధన దాహం, కుంభకోణాలకు సామాన్యులు బలి అవుతున్నారు
- పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం సీఎం పాలనా వైఫల్యానికి నిదర్శనం



సాక్షి, హైదరాబాద్: 'మూసీ మురికి అంతా వాళ్ల నోట్లోనే.. ఇంకా శుద్ధి ఎందుకు, లక్షన్నర కోట్ల రూపాయల ఖర్చు ఎందుకు'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ నేతలను ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్, మంత్రులు తనపై చేస్తున్న వ్యాఖ్యలపై మండిపడ్డారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా వ్యాఖ్యలు చేసిన ఓ మంత్రికి లీగల్ నోటీసులు పంపించానని, కాంగ్రెస్ పార్టీ రాజకీయ వికారాలకు పాల్పడుతోందని అన్నారు. సీఎంతో పాటు తనపై వ్యాఖ్యలు చేసిన మంత్రిని మానసిక ఆరోగ్య నిపుణుల వద్దకు లేదా మానసిక వైద్యుల వద్దకు పంపాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఆయన కోరారు. రాష్ట్రంలోని అనేక అంశాలకు సంబంధించి కేటీఆర్ గురువారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో వరుస పోస్టులు చేశారు. గంగానది ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నమామి గంగే' ప్రాజెక్టుకు కిలోమీటరుకు రూ.17 కోట్ల చొప్పున ఖర్చవుతుండగా, మూసీ సుందరీకరణకు మాత్రం కి.మీ.కు రూ.2,700 కోట్లు ప్రతిపాదించారన్నారు. ఇది సుందరీకరణ ప్రాజెక్టు కాదని, ప్రజాధనాన్ని లూటీ చేసే పథకమని విమర్శించారు.

గుండెలు ఆగుతున్నా కూల్చుడు ఆగడం లేదు

కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని, బ్యాంకు నుంచి అప్పు తెచ్చి మరీ కట్టుకున్న గూడును ప్రభుత్వం ఎప్పుడు కూల్చుతుందో అన్న భయంతో సామాన్యులు ప్రాణాలు వదులుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. గుండెలు ఆగిపోతున్నా, కుటుంబాలు చెల్లా చెదురవుతున్నా ప్రభుత్వం మాత్రం ఇళ్ల కూల్చివేతలపై

మిగతా 12వ పేజీలో ▶

చంద్రబాబు స్నేహితుడు ఈశ్వరన్‌కు జైలు శిక్ష

సింగపూర్ రవాణా మంత్రిగా ఉండగా అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ

అమరావతి భూ దోపిడీలో బాబు పార్ట్‌నర్ ఈశ్వరన్

స్టార్టప్ ఏరియా పేరిట రియల్ ఎస్టేట్ లావాదేవీలు | నాడు ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం అంటూ బురిడీ

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి పేరిట జరిగిన భూ దోపిడీలో కీలక పాత్రధారిగా వ్యవహరించిన సింగపూర్ మాజీ మంత్రి ఎస్.ఈశ్వరన్ స్వదేశంలో అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ అక్కడి న్యాయస్థానం గురువారం తీర్పునిచ్చింది. రవాణా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఫార్ములా వన్ రేసింగ్ కాంట్రాక్టులో ఈశ్వరన్ అక్రమాలకు తెగబడినట్లు సింగపూర్ అవినీతి నిరోధక విభాగం 'కరప్ట్ ప్రాక్టీసెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' (సీపీఐబీ) విచారణలో నిగ్గు తేలింది. ఈశ్వరన్ అవినీతికి పాల్పడినట్లు న్యాయ విచారణలో కూడా నిర్ధారణ కావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తాజాగా తీర్పునిచ్చింది.

జూనియర్ అధికారి నుంచి మంత్రిగా..

2008లో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖలో జూనియర్ ఆఫీసర్‌గా ఉన్న ఈశ్వరన్ అనతి కాలంలో ఉన్నత స్థానానికి ఎగబాకారు. మొదట పరిశ్రమల శాఖ మంత్రిగా, అనంతరం రవాణా శాఖ మంత్రిగా కీలక పదవులు పొందారు. ఫార్ములా వన్ కార్ రేసింగ్ ముసుగులో సింగపూర్



ఈశ్వరన్‌ను సత్కరిస్తున్న చంద్రబాబు (ఫైల్)


గ్రాండ్ ప్రిక్స్ నిర్వాహకుడు ఓంగ్ బెంగ్ సంగ్ నుంచి ఈశ్వరన్ భారీగా ముడుపులు తీసుకున్నట్లు అవినీతి నిరోధక విభాగం నిగ్గు తేల్చింది. సింగపూర్ గ్రాండ్ ప్రిక్స్ – సింగపూర్ పర్యాటక విభాగాల మధ్య కాంట్రాక్టు రూపంలో ఆయన ముడుపులు తీసుకున్నారు. సింగపూర్ గ్రాండ్ ప్రిక్స్ రేసింగ్, ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, మ్యూజికల్ షోస్, బ్రిటన్‌లో హ్యారీ పోటర్ షోలకు భారీ సంఖ్యలో టికెట్లు యథేచ్ఛగా విక్రయించారని వెల్లడైంది. సింగపూర్ గ్రాండ్ ప్రిక్స్ నిర్వాహకుడు

మిగతా 13వ పేజీలో ▶

ఇదండీ సంగతి



పోన్లెండి సార్! ఖాళీ చేసింది నివాసాన్నే కదా! మీ సీటు మాత్రం అలానే ఉంది.



సింగిల్ జడ్జి తీర్పుపై స్టేకు నిరాకరణ

ముందస్తు చర్యలకు ఆదేశిస్తే.. ఇక్కడ ఆశ్రయించండి: హైకోర్టు

- స్పీకర్ కార్యదర్శికి స్వేచ్ఛ ఇచ్చిన సీజే ధర్మాసనం..
- 'అనర్హత' పిటిషన్ల కేసులో ప్రతివాదులకు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల ఫిరాయింపుపై దాఖలైన అనర్హత పిటిషన్లలో సింగిల్ జడ్జి ఏదైనా ఆదేశాలు జారీ చేస్తే.. ఇక్కడ ఆశ్రయించొచ్చని స్పీకర్ కార్యదర్శికి సీజే ధర్మాసనం స్వేచ్ఛ ఇచ్చింది. ప్రతివాదుల వాదనలు వినకుండా సింగిల్ జడ్జి తీర్పును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. న్యాయ, చట్టసభ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, అసెంబ్లీ స్పీకర్, కేంద్ర ఎన్నికల కమిషన్‌తోపాటు ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, దానం నాగేందర్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, వివేకానంద్, వెంకట్‌రావు, కడియం శ్రీహరిలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను అక్టోబర్ 24కు వాయిదా వేసింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నాలుగు వారాలకు గడువిస్తున్నామని.. ఆ లోగా వివరాలు అందజేయకుంటే మేమే ఆదేశాలు జారీ చేయాల్సి వస్తుందని గత నెల 9న స్పీకర్ కార్యదర్శికి హైకోర్టు తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. సింగిల్ జడ్జి తీర్పులో ఇచ్చిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని అసెంబ్లీ కార్యదర్శి హైకోర్టును ఆశ్రయించారు. 'స్పీకర్ అధికారాల్లో కోర్టులు జోక్యం చేసుకోలేవని కిహోటో హాలోహాన్ కేసులో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. సింగిల్ జడ్జి తీర్పు దీనికి విరుద్ధంగా ఉంది. మణిపూర్ శాసనసభ స్పీకర్ కీషమ్ మేఘచంద్ర సింగ్ వర్సెస్ స్పీకర్ కేసులో

మిగతా 13వ పేజీలో ▶



గ్రామీణ ఓటర్లు @ 1,67,33,584

- వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాను ప్రచురించిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- నల్లగొండ జిల్లా టాప్... మేడ్చల్ లాస్ట్

13 లో

పురుషులు	మహిళలు
82,04,518	85,28,573

ట్రాన్స్‌జెండర్లు: 493

గురువారం బీరుట్‌లో ఇజ్రాయెల్ దాడులు చేసిన ప్రాంతంలో పొగలు ▼



బీరుట్‌పై భీకర దాడి

హెజ్‌బొల్లా పౌరవిభాగం సభ్యులు సహా తొమ్మిది మంది మృతి.. దక్షిణ లెబనాన్ వద్ద కొనసాగుతున్న పరస్పర దాడులు

అటు డోమ్.. ఇటు ఫతాహ్!

ఇజ్రాయెల్, ఇరాన్ అస్త్రశస్త్రాలు

వివరాలు 6లో ▶

క్లుప్తంగా...

మండలిలో ప్రభుత్వ విప్‌గా పట్నం మహేందర్‌రెడ్డి



సీఎంను కలిసిన పట్నం మహేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల కోటా నుంచి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మండలిలో ప్రభుత్వ విప్‌గా నియమితులైన నేపథ్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, మనోహర్ రెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, రోహిణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేతలు వజ్రేష్ యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, కొలను హనుమంత్‌రెడ్డి తదితరులు మహేందర్‌రెడ్డిని అభినందించిన వారిలో ఉన్నారు.

72 గంటల్లో రాజీనామా చేయండి.. లేదంటే కేసు వేస్తా

- మంత్రి కొండా సురేఖకు కేఏ పాల్ వార్నింగ్
- సమంత, నాగార్జునల ఇంటికి వెళ్లి క్షమాపణ చెప్పాలని డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: మంత్రి కొండా సురేఖ తన పదవికి 72 గంటల్లో రాజీనామా చేయాలని, లేదంటే కేసు దాఖలు చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో చేసిన వ్యాఖ్యలకుగాను రాహుల్‌గాంధీ ఏఏ సెక్షన్ల కిందైతే సభ్యత్వాన్ని పోగొట్టుకున్నారో ఆ సెక్షన్ల కంటే మించిన కేసు కొండా సురేఖపై నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. సినీతారలు సమంత, అక్కినేని నాగార్జునలపై చేసిన వ్యాఖ్యలకుగాను వారి ఇళ్లకు వెళ్లి క్షమాపణ కోరాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలోని ఏపీ తెలంగాణ భవన్‌లో కేఏ పాల్ విలేకరులతో మాట్లాడారు. 'రాహుల్‌గాంధీ పార్లమెంటులో ఒక వ్యాఖ్య చేస్తే ఆయన ఎంపీ సభ్యత్వమే పోగొట్టుకోవాల్సి వచ్చింది. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలతో పోలిస్తే కొండా సురేఖ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం. కొండా సురేఖకు నోటీసులు ఇచ్చి ఎందుకు అరెస్టు చేయలేదు? సమంతకు ఎంత మనోవేదన ఉంటుందో ఊహించారా?' అంటూ పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండా సురేఖపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి డిమాండ్ చేశారు. హైడ్రా విషయంలో తీవ్ర వ్యతిరేకత పెరుగుతున్న వేళ ప్రజల దృష్టి మళ్లించేందుకే కొండా సురేఖతో సీఎం రేవంత్ ఈ వ్యాఖ్యలు చేయించారేమో? అని అనుమానం వ్యక్తం చేశారు.

తిరుమల బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



తిరుమల: తిరుమలలో అక్టోబర్ 4–12 వరకు జరుగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. స్వామివారి సర్వ సేనాధిపతి విష్వక్సేనుడు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను స్వామి తరఫున విష్వక్సేనుడు పర్యవేక్షించే కార్యక్రమమే ఈ అంకురార్పణ. వైఖానస ఆగమశాస్త్రబద్ధంగా ఈ వేడుక నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ముందురోజైన గురువారం సాయంసంధ్యా సమయంలో విష్వక్సేనుడు ఛత్రచామర, మేళతాళాల నడుమ ఆలయ పురవీధుల్లో ఊరేగింపుగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవాలు విజయవంతం కావాలనే సత్సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపడతారు. రంగనాయక మండపంలో ఆస్థానం నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ ఈవో జె.శ్యామలరావు, ఏఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈవోలు గౌతమి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాల్సిందే

సాక్షి, హైదరాబాద్: ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతుల్లేకుండా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్ రెడ్డికి చాడ లేఖ రాశారు. ప్రభుత్వం పెడుతున్న ఆంక్షలతో పూర్తిస్థాయిలో రైతులందరికీ రుణమాఫీ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్‌లు సరైన సమయంలో రైతుల రుణమాఫీ వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వకపోవడంతో చాలా మందికి రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉమ్మడి కుటుంబం రేషన్ కార్డు ప్రాతిపదికన కాకుండా.. బ్యాంకు, వ్యవసాయ అధికారులతో రైతుల పంట రుణాల మాఫీపై ఇంకా లోతైన అధ్యయనం చేయాలని కోరారు.

మంత్రిగారూ ఇదేం తీరు?

▶ మొదటి పేజీ తరువాయి

కుష్బూ తదితరులు కూడా మంత్రి సురేఖ వ్యాఖ్యలను తప్పుపడుతూ 'ఎక్స్', ఇన్‌స్టాలలో పోస్టులు పెట్టారు. సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ సైతం మంత్రి వ్యాఖ్యలను తప్పుబట్టారు.

ఆ వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలని సురేఖకు టీపీసీసీ చీఫ్ సూచన!

మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో మరింత నష్టం జరగకుండా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ నష్ట నివారణ చర్యలు చేపట్టారు. కొండా సురేఖతో మాట్లాడి తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని ఆయన సూచించినట్లు సమాచారం. రాజకీయ విమర్శల్లో సినీ కుటుంబాన్ని, మహిళా నటిని కించపరిచేలా వ్యాఖ్యానించడం ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని.. అగ్ర నాయకత్వానికి సంజాయిషీ చెప్పుకోవాల్సి వస్తుందని ఆయన చెప్పినట్లు తెలిసింది. దీంతో సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నట్లు 'ఎక్స్' లో పోస్టు చేశారు. 'నా వ్యాఖ్యల ఉద్దేశం మహిళలపట్ల ఒక నాయకుడి చిన్నచూపు ధోరణిని ప్రశ్నించడమేగానీ గౌరవ నటి సమంత మనోభావాలను దెబ్బ తీయడం కాదు. స్వయం శక్తితో మీరు ఎదిగిన తీరు నాకు కేవలం అభిమానం మాత్రమే కాదు, ఆదర్శం కూడా. నా వ్యాఖ్యలపట్ల మీరు కానీ, మీ అభిమానులు కానీ మనస్తాపానికి గురైనట్లయితే బేషరతుగా నా వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నాను.. అన్యధా భావించవద్దు' అని పేర్కొన్నారు.

మూసీ మురికంతా వాళ్ల నోట్లోనే ఉందన్న కేటీఆర్

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనదైన శైలిలో స్పందించారు. 'మూసీ మురికి అంతా వాళ్ల నోట్లోనే ఉంది. ఇంకా శుద్ధి ఎందుకు.. లక్షన్నర కోట్లు ఖర్చు ఎందుకు?' అని ప్రశ్నించారు. కాగా, కేటీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాంపల్లి వద్ద ధర్నా నిర్వహించారు.

స్పందించని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యల దుమారం రేగుతున్నా... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. నగరంలో జరిగిన డిజిటల్ కార్డుల సమావేశంలో మిగిలిన విషయాలు మాట్లాడినా ఈ వివాదంపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం గమనార్హం.

సురేఖ వ్యాఖ్యల్ని తప్పుబడుతూ 'మా' లేఖ..

సినీ పరిశ్రమకు చెందిన సభ్యుల వ్యక్తిగత జీవితాలతో ముడిపడి ఉన్న సున్నితమైన అంశాలపై ఎవరు మాట్లాడినా తగిన చర్యలకు ఉపక్రమిస్తామని తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ స్పష్టం చేసింది. తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు మంచు విష్ణు.. అసోసియేషన్ తరఫున కొండా సురేఖ వ్యాఖ్యలను తప్పుపడుతూ అధికారికంగా సుదీర్ఘ లేఖ విడుదల చేశారు. మరోవైపు తన మాటలు సినీనటి సమంత మనోభావాలను దెబ్బతీశాయని తెలిసి ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నట్లు మంత్రి కొండా సురేఖ పోస్ట్ చేయడాన్ని ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తప్పుపట్టారు. 'కొండా సురేఖ కేవలం సమంతకి క్షమాపణ చెప్పడం ఏంటి.. అక్కడ అత్యంత జుగుప్సాకరంగా అవమానించింది నాగార్జునని, నాగ చైతన్యని' అని 'ఎక్స్'లో తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

మంత్రి కొండా సురేఖపై నాగార్జున పరువు నష్టం కేసు

నాంపల్లి కోర్టును ఆశ్రయించిన సినీ హీరో అక్కినేని



సిటీ కోర్టులు: మంత్రి కొండా సురేఖపై సినీ హీరో నాగార్జున నాంపల్లి క్రిమినల్ కోర్టులోని స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ఎక్సైజ్ కోర్టులో గురువారం పరువు నష్టం కేసు దాఖలు చేశారు. నాగ చైతన్య– సమంత విడాకుల విషయంపై కొండా సురేఖ మాటలు అసంబద్ధమైనవిగా ఉన్నాయని, ఆమె మాట్లాడిన మాటలు తమ కుటుంబ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయని, ఆమెపై చర్యలు తీసుకోవాలని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. 'కొండా సురేఖ చేసిన కామెంట్ వల్ల మా కుటుంబ పరువు పోయింది. ఆమె చేసిన కామెంట్‌ను మేం వ్యతిరేకిస్తున్నాం. దిగ్గజ నటుడు అక్కినేని నాగేశ్వరరావు కుటుంబాన్ని సంబంధం లేకుండా రోడ్డుకు లాగుతున్నారు. ఆయన కుమారుడిగా అక్కినేని నాగార్జునగా చలనచిత్ర పరిశ్రమలో నాలుగు దశాబ్దాల గౌరవ ప్రదమైన జీవితాన్ని కొనసాగిస్తున్నాను. ఒక నటుడిగానే కాకుండా నిర్మాతగా, టెలివిజన్ హోస్ట్‌గా, స్టూడియో యజమానిగా మంచి గుర్తింపు పొందాను. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో 90కి పైగా చిత్రాల్లో నటించాను. అనేక ప్రతిష్టాత్మక అవార్డులు పొందిన వ్యక్తిని. నా కుటుంబాన్ని ఉద్దేశపూర్వకంగా రోడ్డుకు లాగుతున్నారు. నా కుమారుడు అక్కినేని నాగ చైతన్య సినిమాల్లో నటిస్తూ మా కుటుంబ గౌరవాన్ని కొనసాగిస్తున్నాడు. 2017లో నాగ చైతన్య–సమంతల వివాహం చాలా ఘనంగా జరిగింది. వ్యక్తిగత విభేదాల కారణంగా 2021లో విడాకులు తీసుకున్నారు. ప్రస్తుతం ఎవరి జీవితాన్ని వారు సంతోషంగా కొనసాగిస్తున్నారు. అయినా కావాలనే వారి వ్యక్తిగత జీవితాన్ని పబ్లిసిటీ చేస్తున్నారు. ఎలాంటి సంబంధం లేని నా కుటుంబ పరువు తీయడం సరైంది కాదు. కొండా సురేఖ వివిధ పార్టీల్లో పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. సినీ రంగానికి ఎలాంటి సంబంధం లేని ఆమె ఈ రకంగా కామెంట్ చేయడం సరైంది కాదు. ఆమె మాట్లాడిన మాటలు తన కుటుంబానికి ఎంతో బాధను కలిగించాయి. అందుకే మంత్రిపై చర్యలు తీసుకొని, నా కుటుంబ పరువు కాపాడండి' అని నాగార్జున ఆ పిటిషన్ పేర్కొన్నారు.

బేషరతుగా నా వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకున్నా..

- మీడియా సమావేశంలో అటవీశాఖ మంత్రి కొండా సురేఖ
- కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో అనుకోకుండా ఓ కుటుంబం గురించి మాట్లాడా



సాక్షి ప్రతినిధి, వరంగల్: గాంధీభవన్‌లో బుధవారం మాట్లాడిన సందర్భంగా చేసిన కొన్ని వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానని అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. మాజీ మంత్రి కేటీఆర్‌తోపాటు మరికొందరు సినీ ప్రముఖులు, వారి కుటుంబాలపై సురేఖ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ గురువారం హనుమకొండలో మీడియా సమావేశంలో మాట్లాడారు. 'కేటీఆర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వల్లే భావోద్వేగంతో బుధవారం నేను గాంధీభవన్‌లో మాట్లాడాల్సి వచ్చింది. కేటీఆర్ గతంలో వ్యవహరించిన తీరు, మహిళలను చులకనగా చూసిన విధానం, ఆయన క్యారెక్టర్ గురించి విమర్శలు చేయాల్సి వచ్చింది. ఆ సందర్భంలో నాకు ఇంకెవరిపైనా ద్వేషం, కోపం లేవు' అని కొండా సురేఖ అన్నారు. 'అనుకోని ఆ సందర్భంలో ఒక కుటుంబం గురించి మాట్లాడాను. అది అనుకోకుండా నా నోటి నుంచి వచ్చింది. ఆ కుటుంబం సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ చూశాక చాలా బాధపడ్డా. నేను ఏ విషయంలోనైతే బాధపడుతున్నానో ఆ విషయంలో ఇంకొకరిని నొప్పించానని తెలిసి అదేరోజు రాత్రి నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటూ 'ఎక్స్'లో పోస్ట్‌చేశా. నాకు జరిగిన అవమానం, బాధ ఇంకొకరికి జరగకూడదని బేషరతుగా నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నా' అని సురేఖ వివరించారు.

కేటీఆర్ విషయంలో తగ్గేదే లేదు..

అయితే కేటీఆర్ విషయంలో వెనక్కి తగ్గేదే లేదని కొండా సురేఖ తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో తనపై జరిగిన ట్రోలింగ్‌కు కేటీఆర్ క్షమాపణ చెప్పి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. కేటీఆర్ క్షమాపణ చెప్పకపోగా తనను క్షమాపణ చెప్పాలనడం దొంగే దొంగ అన్నట్లుందని వ్యాఖ్యానించారు. కేటీఆర్ తనకు పంపిన లీగల్ నోటీసుపై చట్టపరంగా ముందుకెళ్తానని చెప్పారు.

కేటీఆర్, హరీశ్‌లపై కేసు


సైబరాబాద్ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసిన రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీ రామారావు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావులపై సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు ఆదేశాల మేరకే పలు యూట్యూబ్ చానళ్లు అడ్డగోలు కథనాలను ప్రసారం చేస్తున్నాయని, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలు ట్రోలింగ్స్ చేస్తున్నారంటూ రఘునందన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేటీఆర్, హరీశ్‌లతో పాటు పలు యూట్యూబ్ చానళ్లపై ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఓ అధికారిక కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు మధ్య జరిగిన చిన్న సంఘటన సోషల్ మీడియాలో ట్రోలింగ్ కావడంపై ఆయన సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీఎం రేవంత్ తియ్యని మాటలు చెప్పి మాదిగలను మోసం చేశాడు

- ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో 9న రాష్ట్రవ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన ర్యాలీలు... 15న ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటన
- మీడియా సమావేశంలో అధ్యక్షుడు మందకృష్ణ



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు తియ్యని మాటలు చెప్పి మోసం చేశారని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంద కృష్ణ మీడియాతో మాట్లాడారు. రెండ్రోజుల క్రితం డీఎస్సీ ద్వారా 11వేల ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఫలితాలు ప్రకటించిన సీఎం ఈనెల 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు ఇస్తానని చెప్పడాన్ని తప్పుబట్టారు. ఇటీవల యూజీ నీట్–2024 మొదటి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా జరిగిన సీట్ల కేటాయింపుల్లో మాదిగ పిల్లలు తీవ్రంగా నష్టపోయారన్నారు. అతి త్వరలో గ్రూప్ ఉద్యోగాల పరీక్షల ఫలితాలు ఇస్తానని సీఎం చెప్పడాన్ని చూస్తుంటే వర్గీకరణ చేయకుండానే ఈ ప్రక్రియ పూర్తి చేస్తానని చెప్పినట్టు ఉందన్నారు. మాల కులానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు సీఎం రేవంత్ ప్రభుత్వాన్ని ప్రభావితం చేశారని, అందుకే వర్గీకరణ అమలు చేస్తానని చెప్పిన సీఎం ఇప్పుడు మాటమార్చాడని చెప్పారు. ఈ పరిస్థితిని ఉపేక్షించేది లేదని, వర్గీకరణ కోసం ఎంఆర్‌పీఎస్ ఉద్యమాలు చేస్తుందని, ఈనెల 9న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ల వరకు నల్లజెండాలతో ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో అంబేడ్కర్ విగ్రహం నుంచి జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు ర్యాలీలు చేపట్టాలన్నారు. ఈ నెల 15న హైదరాబాద్‌లో ఎంఆర్‌పీఎస్‌తో పాటు అనుబంధ సంఘాల విస్తృతస్థాయి సమావేశంలో ఉద్యమ కార్యాచరణ ఖరారు చేస్తామని తెలిపారు. వర్గీకరణ కమిటీలో సభ్యుడైన మంత్రి దామోదర రాజనర్సింహ మాదిగలకు తీవ్ర అన్యాయం చేస్తున్నట్లు కనిపిస్తోందని, వర్గీకరణ చేయకుండా డీఎస్సీ ఫలితాలు ఇచ్చేటప్పుడు సీఎం పక్కనే ఉండటం శోచనీయమన్నారు. మాదిగలకు న్యాయం చేయలేని మంత్రి దామోదర తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

డీఎంహెచ్‌వోలే మింగేశారా?

- హెల్త్ సబ్‌సెంటర్లకు ఇవ్వాల్సిన రూ.9 కోట్లలో అక్రమాలు
- వాటిని తమకు లబ్ధి జరిగేలా ఉపయోగించుకుంటున్నారన్న విమర్శలు
- కంటి వెలుగు కింద సర్కారు ఇచ్చిన బకాయి సొమ్మునూ మింగేశారన్న ఆరోపణ
- గగ్గోలు పెడుతున్న ఏఎన్‌ఎంలు... పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు

ఆయన పేరు డాక్టర్ పాపారావు. రెండు నెలల క్రితం వరకు యాదాద్రి జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా పనిచేసి, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వోగా బదిలీపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో చౌటుప్పల్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ యశోదకు యాదాద్రి ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో బాధ్యతలు అప్పగించారు. కానీ ఆమెకు చెక్ పవర్ ఇవ్వలేదు. రంగారెడ్డి జిల్లాకు వెళ్లిన పాపారావు వద్దే చెక్ పవర్ ఉంది. ఇప్పటికీ యాదాద్రి వైద్య సిబ్బంది జీతాలకు సంబంధించిన సంతకాలు ఆయనే చేస్తున్నారు. ఏ ఫండ్ రిలీజ్ కావాలన్నా, ఆయన సంతకం కోసం అక్కడకు వెళ్లాల్సిందే. బదిలీపై రంగారెడ్డి జిల్లాకు వెళ్లిన పాపారావుకు యాదాద్రి డీఎంహెచ్‌వోకు సంబంధించిన చెక్ పవర్ ఇప్పటికీ ఉంచడంలో ఔచిత్యమేంటి?

సాక్షి, హైదరాబాద్: పలు జిల్లాల డీఎంహెచ్‌వోలు ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. సబ్ సెంటర్లకు సర్కారు నుంచి వచ్చిన సొమ్ము ఇవ్వకపోవడం, కంటి వెలుగు కింద డాక్టర్లకు ఇవ్వాల్సిన సొమ్ము, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన నిధులను తమ వద్దే ఉంచుకోవడం..ఇలా తమకు ఇష్టం వచ్చినట్టుగా నిధులను పక్కదారి పట్టించి వాడుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రజారోగ్య సంచాలకుల విభాగంలోని కొందరు పెద్దల అండదండలు చూసుకొని చాలామంది డీఎంహెచ్‌వోలు అక్రమాలకు పాల్పడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

రూ. 9 కోట్లు ఏమయ్యాయి?

రాష్ట్రంలో నాలుగు వేలకు పైగా ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వాటి నిర్వహణ బాధ్యత ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు చూస్తారు. స్థానికులకు అవసరమైన సాధారణ వైద్య సేవలు అందుతాయి. ప్రభుత్వం చేపట్టే వైద్య,ఆరోగ్య కార్యక్రమాలను గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించేందుకు ఈ కేంద్రాలే కీలకం. సబ్ సెంటర్ల నిర్వహణ, బీపీ మిషన్లు వంటి వైద్య పరికరాలు, ఫర్నిచర్ కొనుగోలు తదితర అవసరాల నిమిత్తం ఏడాదికి ప్రభుత్వం రూ. 50 వేల వరకు ఇస్తుంది. అందుకోసం ఈ ఏడాది ప్రతీ జిల్లాలో సబ్ సెంటర్ల



కోసం రూ. 25 లక్షల చొప్పున అన్ని జిల్లాలకు కలిపి రూ. 9 కోట్లు ఈ ఏడాది జూలై 25వ తేదీన నిధులు విడుదల చేసినట్టుగా డీఎంహెచ్‌వోలకు ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. అయినా ఆ నిధులు సబ్ సెంటర్లకు వెళ్లనేలేదు. డీఎంహెచ్‌వోలు తమ వద్దే ఉంచుకోవడం విమర్శలకు తావిస్తోంది. సబ్ సెంటర్లకు అవసరమైన వాటిని తామే కొనుగోలు చేసి ఇస్తామని కొందరు డీఎంహెచ్‌వోలు చెబుతున్నారని సబ్ సెంటర్లలోని వైద్య సిబ్బంది అంటున్నారు. అసలు డీఎంహెచ్‌వోలకు ఈ నిధులతో సంబంధం లేదని, కానీ కమీషన్ల కోసం తామే ఫర్నిచర్, పరికరాల కొనుగోలు చేపడతామని చెబుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు డీఎంహెచ్‌వోలైతే ఏవో బిల్లులు పెడుతూ వాటిని తమ సొంత అవసరాలకు వాడుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

కంటి వెలుగు డబ్బులూ కాజేశారు...

ఏడాదికి ఒక్కో పీహెచ్‌సీకి రూ. లక్షన్నర వరకు ఇవ్వాలి. కానీ రెండేళ్లుగా అవేవీ పీహెచ్‌సీలకు పంపడం లేదని మెడికల్ ఆఫీసర్లు అంటున్నారు. మరోవైపు రెండేళ్ల క్రితం 'కంటి వెలుగు'కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో అనేకమంది మెడికల్ ఆఫీసర్లు సొంత జేబు నుంచి ఖర్చు చేశారు. ఆ సొమ్ము విడుదలైనా డీఎంహెచ్‌వోలు ఇవ్వడం లేదన్న విమర్శలున్నాయి. ఒక జిల్లాలోని పీహెచ్‌సీ డాక్టర్ తనకు రూ.60 వేలు కంటి వెలుగు బకాయి రావాల్సి ఉన్నా, తనకు ఇవ్వడం లేదని ఆయన వాపోయారు. అనేకమంది డీఎంహెచ్‌వోల వ్యవహారశైలి, అక్రమాలపై విచారణ జరపాలని కొందరు మెడికల్ ఆఫీసర్లు కోరుతున్నారు.

సినీ ప్రముఖులు ఏమన్నారంటే...

'మా'సభ్యులపై దుర్మార్గపు మాటలను ముక్తకంఠంతో వ్యతిరేకిస్తాం

మహిళా మంత్రి చేసిన అవమానకరమైన వ్యాఖ్యలకు చాలా బాధపడ్డాను. మా సభ్యులపై ఇలాంటి దుర్మార్గపు మాటల దాడులను చిత్ర పరిశ్రమ ముక్తకంఠంతో ఖండిస్తుంది. సంబంధంలేని వ్యక్తులను, మహిళలను రాజకీయాల్లోకి లాగి నిరాధారమైన ఆరోపణలు చేయడం మంచిది కాదు. **- చిరంజీవి**

బాధ్యతను మరిచి వ్యక్తిగత దాడా?

బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి రాజకీయ లబ్ధి కోసం వ్యక్తిగత విషయాన్ని తన ఆయుధంగా మార్చడం దురదృష్టకరం. ముఖ్యమైన స్థానాల్లో ఉన్న వ్యక్తులు సంయమనం పాటించాలి. **- వెంకటేశ్**

సాటి మహిళపై నిరాధార ఆరోపణలా?


మంత్రి కొండా సురేఖ సినీ ప్రముఖులపై చేసిన వ్యాఖ్యలు చాలా బాధ కలిగించాయి. ఒక కూతురి తండ్రిగా, భార్యకు భర్తగా, తల్లికి కొడుకుగా.. ఓ మహిళా మంత్రి మరో మహిళపై చేసిన ఆమోదయోగ్యంకాని వ్యాఖ్యలు, భాషపట్ల తీవ్ర వేదనకు గురయ్యాను. ప్రజాజీవనంలో ఉన్న వారు సినిమా వాళ్లను టార్గెట్ చేసుకోవడం బాధాకరం. **- మహేశ్‌బాబు**

ఆమోదయోగ్యం కాదు..



రాజకీయ లబ్ధి కోసం వ్యక్తిగత జీవితాలపై బురద జల్లడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. రాజకీయాలకు అతీతంగా గౌరవం ఉండాలి. **- ప్రభాస్**

గౌరవప్రదమైన వ్యక్తుల గురించి నీచమైన వ్యాఖ్యలా?



కొండా సురేఖ గారు చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం. గౌరవప్రదమైన వ్యక్తుల గురించి నీచమైన వ్యాఖ్యలు ఓ ఎన్నికైన ప్రజాప్రతినిధి నుంచి రావడం షాక్‌కు గురిచేసింది. మా వ్యక్తిగత జీవితాలు మాకు ఎంతో పవిత్రమైనవి. మేం మా గౌరవాన్ని కోరుకుంటున్నాం. మనం ప్రజాజీవితంలో ఉండేవాళ్లం. మనల్ని మనం పెంచుకోవాలి తప్ప పరస్పరం దుమ్మెత్తిపోసుకోకూడదు. **- రాంచరణ్**

సినీ పరిశ్రమపై నిరాధార ప్రకటనలు బాధాకరం

వ్యక్తిగత జీవితాలను రాజకీయాల్లోకి లాగడం సరికాదు. మీలాంటి బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్నవారు తప్పనిసరిగా పబ్లిక్ ఫిగర్ల గౌరవాన్ని, గోప్యతను గౌరవించాలి. సినీ పరిశ్రమ గురించి నిర్లక్ష్యపూరితంగా చేస్తున్న నిరాధార ప్రకటనలు బాధాకరం. **- జూనియర్ ఎన్టీఆర్**

రాజకీయాలు దిగజారకూడదు



రాష్ట్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, విద్య, ఆరోగ్యం, పెట్టుబడుల రాకను ఆశించి ఓటు వేస్తామనే విషయాన్ని రాజకీయ నాయకులకు గుర్తు చేయాలనుకుంటున్నాను. కానీ దిగజారుడు రాజకీయాలను ఎంతమాత్రం అనుమతించం. **- విజయ్ దేవరకొండ**

నిరాధార ఆరోపణలు సహించలేం



ఎవరి హద్దుల్లో వారుంటూ పరస్పరం గౌరవించుకోవాలి. నిరాధార ఆరోపణలు సహించలేనివి, ప్రత్యేకించి ఉన్నత స్థాయిల్లో.. **- రాజమౌళి, దర్శకుడు**

రాహుల్‌గాంధీ స్పందించాలి




మీ రాజకీయ లబ్ధి కోసం సినీతారల వ్యక్తిగత జీవితాలపై తప్పుడు ఆరోపణలు చేయడం విచారకరం. మంత్రి కొండా సురేఖ నిరాధార ఆరోపణలు చేయడం మంచిది కాదు. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న ఇలాంటి పరిణామాలను రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరిదిద్దాలి. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలి. **- మంచు విష్ణు, 'మా' అధ్యక్షుడు**

నాకు ఏ పార్టీతో, వ్యక్తితో సంబంధం లేదు

నాకు రాజకీయంగా ఏ వ్యక్తితోగానీ, ఏ రాజకీయ పార్టీతోగానీ సంబంధం లేదు. నా పేరును హానికరమైన రీతిలో ఉపయోగించవద్దని కోరుతున్నాను. నిరాధార, దుర్మార్గమైన వదంతులు మహిళలపై వ్యాప్తి చెందడం బాధాకరం. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న మహిళ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయం. గౌరవం కోసం మౌనంగా ఉండటం బలహీనతగా భావించడం తప్పు. **- రకుల్‌ప్రీత్ సింగ్**

దిగజారుడు ఆరోపణలు మంచిది కాదు



సమంత, అక్కినేని కుటుంబంపై మంత్రి కొండా సురేఖ అక్క చేసిన వ్యాఖ్యలు బాధాకరం. రాజకీయ విమర్శల కోసం ఏమాత్రం సంబంధం లేని నటీనటుల పేర్లు తీసుకురావడం, వాళ్ల వ్యక్తిగత జీవితంపై దిగజారుడు ఆరోపణలు చేయడం మంచిది కాదు. **- సాయిదుర్గతేజ్**

సినిమా వాళ్లను టార్గెట్ చేస్తారా?

తెలుగు రాష్ట్రాలకు ఏ విపత్తు వచ్చినా ముందుండే సినిమా వారిని చులకన చేస్తూ మాట్లాడటం తప్పుడు సంప్రదాయం. అక్కినేని కుటుంబంపై మంత్రి కొండా సురేఖ మాట్లాడిన తీరు బాధాకరం. దీన్ని మొదలు పెట్టింది మీరే.. సంస్కారవంతంగా ముగించాల్సిన బాధ్యత కూడా మీదే. **- హరీశ్ శంకర్, దర్శకుడు**

మనం మాట్లాడిన మాటకు మనం బానిసలం

ఏదైనా మాట్లాడే ముందు మనిషి రెండో ఆలోచన, విశ్లేషణ ఆ వ్యక్తికి నిజమైన స్నేహితమని ఏఎన్ఆర్ గారు చెప్పినట్లు ఒక చానల్‌లో చూశాను. జీవితాన్ని చదివి చూసిన మహోన్నతుల మాటలు ఎన్నటికీ సమాజానికి కూడా సందేశాత్మకాలే. అల్లు రామలింగయ్య గారు మాతో ఎప్పుడూ చెప్పే ఒక్క మాట కూడా ఇక్కడ ప్రస్తావించాలి. మనం మాట్లాడిన మాటకు మనం బానిసలం, మాటలాడని మాటకు మనమే యజమానులం అని. **- విజయశాంతి**

ఎల్లో జర్నలిజం భాష ఇది

ఎల్లో జర్నలిజంలో మునిగిపోయే వారు మాత్రమే ఈ భాష మాట్లాడతారని నేననుకున్నాను. మీలో కొన్ని విలువలు ఉన్నాయని భావిస్తున్నాను. కానీ ఒక స్త్రీని ఇంతగా అవమానించడాన్ని భరించలేకపోతున్నాను. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి కించపరిచే ప్రకటనలు చేయకూడదు. తప్పుడు ఆరోపణలపై ఒక మహిళగా మొత్తం సినీ పరిశ్రమకు క్షమాపణ చెప్పాలి. **- కుష్బూ, సినీనటి**

మంత్రి 'గౌరవప్రదమైన ప్రకటన'తో షాక్ అయ్యాను

వివిధ రంగాలలో మహిళల దృష్టిని ఆకర్షించే వారిగా.. సంచలనాలకు థంబ్‌నెయిల్స్‌గా ఉపయోగిస్తున్నారు. అధికారులను కూడా వదిలిపెట్టలేదు! నేను వ్యక్తిగత అనుభవం నుంచి మాట్లాడుతున్నాను. ఎంత కష్టపడి పైకిఎదగాలంటే అంత పెద్ద అపవాదు భరించాల్సి వస్తుంది! మహిళలను, కుటుంబాలను, సామాజిక నిబంధనలను గౌరవిద్దాం. మంత్రి కొండా సురేఖ ఇచ్చిన గౌరవప్రదమైన ప్రకటనను చూసి షాక్ అయ్యాను. ప్రతిదీ రాజకీయాల కోసం కాకూడదు. ప్రజా జీవితంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించుకుందాం. **- స్మితా సబర్వాల్, సీనియర్ ఐఏఎస్**











తెలంగాణ, ఏపీల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున బెజవాడ దుర్గమ్మ, వరంగల్ శ్రీభద్రకాళి అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా.. అలంపూర్ జోగుళాంబ అమ్మవారు, నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారు, శ్రీశైల భ్రమరాంబాదేవి శైలపుత్రిగా దర్శనమిచ్చారు.

క్లుప్తంగా...

చార్మినార్ వద్ద బతుకమ్మ

- హైకోర్టు అనుమతి

సాక్షి, హైదరాబాద్: చార్మినార్ వద్ద శుక్రవారం బతుకమ్మ నిర్వహణకు హైకోర్టు అనుమతించింది. బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతిస్తూ.. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్య 100 మంది మహిళలతో మాత్రమే నిర్వహించుకోవాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. శాంతిభద్రతలకు ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని చార్మినార్ ఏసీపీని ఆదేశించింది. భాగ్యలక్ష్మి ఆలయం వద్ద బతుకమ్మ నిర్వహణకు పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ.. బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు వి.శిల్పారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. బతుకమ్మ నిర్వహణకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

6 నుంచి కళాశాలలకు దసరా సెలవులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలలకు ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకూ దసరా సెలవులు ఇస్తున్నట్టు ఇంటర్ బోర్డ్ ఒక ప్రకటనలో తెలిపింది. కళాశాలలు తిరిగి 14వ తేదీన తెరుచుకుంటాయని పేర్కొంది. ప్రభుత్వ కళాశాలలతో పాటు, ప్రైవేటు కళాశాలలు సెలవులు అమలు చేయాలని ఆదేశించింది.

7న రెండో విడత చేప పిల్లల పంపిణీ

సాక్షి, హైదరాబాద్: మొదటి విడతలో తొమ్మిది జిల్లాల్లో ఉచిత చేప పిల్లల పంపిణీ జరిగిందని, రెండో విడత ఈనెల 7 నుంచి మిగతా 24 జిల్లాల్లో ఉంటుందని మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక అల తెలిపారు. చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, సంబంధిత జిల్లా, మత్స్యశాఖ సహకార సంఘాల సభ్యులు పాల్గొనాలని కోరారు.

హుజూర్‌నగర్ ఐటీఐ నిర్మాణానికి రూ.14.35 కోట్లు

సాక్షి, హైదరాబాద్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) శాశ్వత భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.14.35 కోట్లు విడుదల చేసింది. ఈ ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్ మెన్, డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లతో పాటు వెల్డర్ ట్రేడ్‌లను ప్రవేశపెడుతుండటంతో ఇక్కడి నిరుద్యోగులకు ఎంతో ప్రయోజనం కలగనుందనే ఆలోచనతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఐటీఐ మంజూరు కోసం కృషి చేశారు. గతంలో తాను మంజూరు చేయించిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ సమీపంలో రామస్వామి గుట్ట వద్ద కొత్తగా మంజూరైన ఐటీఐని నెలకొల్పనున్నట్లు గురువారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు.

6న రెవెన్యూ అధికారులతో సమావేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లతో ఈ నెల 6న ప్రత్యేక సమావేశం నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్ణయించారు. జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో ఉదయం 10.30 గంటలకు ఈ సదస్సు ప్రారంభం కానుంది. ఇందులోభాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లకు, విభాగాధిపతులకు ప్రత్యేకంగా సమాచారాన్ని అందించారు. జిల్లా కలెక్టర్లు, ఇతర విభాగాధిపతుల పరిధిలోని డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు తప్పకుండా ఈ సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను, హెచ్‌ఓడీలను మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రధానంగా రెవెన్యూ సంబంధిత అంశాలపైనే చర్చించనున్నట్లు సమాచారం. ఈ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు మంత్రి పొంగులేటి ఆదేశించారు.

2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ

- లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- రాష్ట్రంలో సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు జపాన్ కంపెనీకి ఆహ్వానం
- జపాన్‌లో రోహ్మ్ కంపెనీ సెమీ కండక్టర్ల విభాగాన్ని పరిశీలించిన భట్టి



రోహ్మ్ కంపెనీ ప్రతినిధులతో భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్‌ఎనర్జీని ఉత్పత్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. ఈ నేపథ్యంలో సెమీకండక్టర్ల పరిశ్రమలకు తెలంగాణలో మంచి అవకాశాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. జపాన్ పర్యటనలో భాగంగా ఆయన గురువారం క్యోటో నగరానికి సమీపంలో ఉన్న ప్రముఖ సెమీకండక్టర్ల పరిశ్రమ రోహ్మ్‌ను సందర్శించి, నిర్వాహకులతో మాట్లాడారు. భట్టికి రోహ్మ్ కంపెనీ ప్రెసిడెంట్ ఇనో, కంపెనీ ఉన్నతాధికారులు తకహసి, అండో, కాత్సునో, తనాక తకాషీ తదితరులు స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భిన్న రంగాల్లో సెమీకండక్టర్ల ఆవశ్యకత ఎంతో ఉందని భట్టి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు కల్పిస్తున్న అవకాశాలను దృష్టిలో ఉంచుకొని విడిగా కానీ ఉమ్మడి భాగస్వామ్యంతో కానీ తెలంగాణలో సెమీ కండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని రోహ్మ్ యాజమాన్యానికి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. భారతదేశంలో ఇప్పటికే మూడు చోట్ల తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు కల్పిస్తున్న సౌకర్యాలు వ్యాపార అభివృద్ధికి అనుకూలంగా ఉన్నందున ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని రోహ్మ్ సంస్థ తెలిపింది. సాయంత్రం క్యోటో నగరానికి సమీపంలో ఉన్న పానసోనిక్ కంపెనీ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రికి ఆ కంపెనీ ప్రెసిడెంట్ నబి నకానీషి ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల గురించి వివరించారు. తాము ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఈవీ వాహనాలకు సంబంధించిన బ్యాటరీలు సరఫరా చేస్తున్నామని భారతదేశంలోనూ ఒక ప్లాంట్ ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామని తెలిపారు. తెలంగాణలో పానసోనిక్ ప్లాంట్ ఏర్పాటు చేయవచ్చని, ప్రభుత్వం ద్వారా పూర్తి సహకారం అందిస్తామని భట్టి హామీ ఇచ్చారు.

భట్టికి బౌద్ధ గురువు ఆశీర్వచనాలు

క్యోటో నగరానికి సమీపంలో ఉన్న టోజీ బౌద్ధ ఆలయాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర ఉన్నతాధికారులు గురువారం ఉదయం సందర్శించారు. వారికి బౌద్ధ గురువు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ పర్యటనలో భట్టితో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ఇంధనశాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పాల్గొన్నారు.



శాసనసభ ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ప్రాంగణంలో బతుకమ్మ పండుగ సంబురాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరయ్యారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకయిన బతుకమ్మ పండుగను మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, విప్‌లు రామచంద్రు నాయక్, ఆది శ్రీనివాస్, లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎములాడలో ఏడొద్దులకే 'సద్దుల' సంబురం

- వేములవాడ నియోజకవర్గంలో మూడు రోజులు సద్దుల బతుకమ్మ వేడుకలు
- కోనరావుపేట, చందుర్తి, బోయినపల్లిలో తొమ్మిది రోజులకు..
- రుద్రంగి, కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో దసరా తర్వాత



మూలవాగులో బతుకమ్మ నిమజ్జనోత్సవంలో మహిళలు (ఫైల్)

వేములవాడ: తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలో ప్రత్యేకంగా కొనసాగుతాయి. వేములవాడ పట్టణంలో బతుకమ్మ పండుగ ప్రారంభమైన ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తుంటే.. కోనరావుపేట, చందుర్తి, బోయినపల్లి మండలాల్లో తొమ్మిది రోజులకు.. రుద్రంగి, కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో మాత్రం దసరా పండుగ మరుసటి రోజు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సద్దుల బతుకమ్మ వేడుకలు ఇలా మూడు రోజులు జరుగుతుండటంతో ఈ ప్రాంతంలోని ఆడబిడ్డలకు అత్తగారింటి వద్ద ఒక రోజు, తల్లిగారింటి వద్ద మరో రోజు.. బంధువుల ఇళ్లలో ఇంకో రోజు వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కుతుంది. వేములవాడ పట్టణంలో మాత్రం రాజన్న ఆలయ అర్చకుల సూచనల ప్రకారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఏడు రోజులకు నిర్వహిస్తుంటారు. సప్తమాతృకలను పూజించడంతోనే ఇక్కడ ఏడు రోజుల్లోనే సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకుంటామని ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమశంకరశర్మ, ప్రధాన అర్చకుడు శరత్‌శర్మ చెబుతున్నారు. ఈ సారి వేములవాడలో ఈ నెల 8న సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవాలని అర్చకులు సూచించారు.

సప్తమాతృకలను పూజించడమంటే..



సప్తమాతృకలు అంటే.. బ్రహ్మి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, చాముండి, ఇంద్రాణి దేవతలను పూజించడం. అష్టమం, నవమం, దశమం కూడా ఉంటాయి. అష్టమం, నవమం, దశమం చేయకుండా కేవలం సప్తమాతృక పూజ మాత్రమే కాబట్టి.. ఏడు రోజుల్లో పండుగ జరుపుకోవడం వేములవాడలో ఆనవాయితీగా వస్తోంది.

– చంద్రగిరి శరత్‌శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

హైదరాబాద్‌లో మారియట్ గ్లోబల్ సామర్థ్య కేంద్రం

- మంత్రి శ్రీధర్‌బాబుతో మారియట్ ప్రతినిధుల భేటీ



సాక్షి, హైదరాబాద్: ఆతిథ్య రంగంలో అమెరికా ప్రధాన కేంద్రంగా ఉన్న మారియట్ హోటల్స్ హైదరాబాద్‌లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన గ్లోబల్ సామర్థ్య కేంద్రం (జీసీసీ) ఏర్పాటు చేస్తోందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఆతిథ్య రంగానికి సంబంధించిన సామర్థ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం దేశంలో మొదటిసారి అని పేర్కొన్నారు. మారియట్ గ్లోబల్ ప్రతినిధులు గురువారం సచివాలయంలో శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. ఈ భేటీకి ముందు మంత్రితో కలిసి మారియట్ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి జీసీసీ ఏర్పాటుపై తమ ఆసక్తిని వెల్లడించారు. ఈ సామర్థ్య కేంద్రం వచ్చే ఏడాది మార్చిలోగా కార్యకలాపాలు ప్రారంభిస్తుందని, మొదటి దశలో 300 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే నగరంలో వివిధ టెక్ కంపెనీలకు చెందిన సామర్థ్య కేంద్రాలు సుమారు 200 వరకు ఉన్నాయన్నారు. తెలంగాణలో 10 లక్షల మంది సాఫ్ట్‌వేర్ నిపుణులు ఉండగా, ఏటా లక్షన్నర మంది ఇంజనీరింగ్ విద్యార్థులు చదువులు పూర్తి చేసుకొని బయటకు వస్తున్నారని ఆయన తెలిపారు. వీరందరికీ హైదరాబాద్‌లోని గ్లోబల్ సామర్థ్య కేంద్రాలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని చెప్పారు. త్వరలో కార్యరూపం దాల్చనున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీలో మారియట్ సంస్థ హోటళ్లను నిర్మించడానికి ఆసక్తితో ఉందన్నారు. ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీ పూర్తి కాలుష్య రహితంగా ఉంటుందని శ్రీధర్‌బాబు వెల్లడించారు. రసాయన కాలుష్య వ్యర్థాలు ఉత్పత్తి అయినా వాటిని ఆయా కంపెనీలే సొంత ట్రీట్మెంట్ ప్లాంట్లలో శుద్ధి చేసుకుంటాయన్నారు. గ్రీన్‌ఫార్మా సిటీలో ఏర్పాటయ్యే ఫార్మా కంపెనీల వివరాలపై మరో పది రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. ఈ భేటీలో మారియట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ రెవెన్యూ, టెక్నాలజీ ఆఫీసర్ డ్రూ పింటో, గ్లోబల్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ నవీన్ మంగ, చీఫ్ సేల్స్, మార్కెటింగ్ ఆఫీసర్ జాన్ టూమీ తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ పుట్ల శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: జిల్లా వైద్య, ఆరోగ్య అధికారుల (డీఎంహెచ్‌వో) సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నల్ల గొండ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ మేరకు 2024–26 ఏడాదికి రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు డాక్టర్ పుట్ల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సుధాకర్‌లాల్, కోశాధి కారిగా డాక్టర్ అప్పయ్య, ఉపాధ్యక్షులుగా డాక్టర్ హరీశ్‌రాజ్, డాక్టర్ కోటాచలం, డాక్టర్ రాంకుమార్, డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, కార్యదర్శులుగా డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ మధుసూదన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా డాక్టర్ రఘునాథస్వామి, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ పద్మ, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి ఎన్నికయ్యారు. వీరంతా వివిధ జిల్లాల్లో డీఎంహెచ్‌వోలుగా పనిచేస్తున్నారని పుట్ల శ్రీనివాస్ వెల్లడించారు. డీఎంఈ విభాగంలోని వైద్యాధికారులకు ఉద్యోగ విరమణ వయస్సు 65 ఏళ్లు పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. విరమణ పొందిన వారికి వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరగా రావడం లేదని అదేవిధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులుగా కీలకమైన స్థానంలో ఉన్నప్పటికీ తమకు వాహన సదుపాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ట్రైబల్ వర్సిటీలో చేరేందుకు అనాసక్తి

- స్పాట్ అడ్మిషన్‌తో కలిపి మొత్తం 13 మందే...
- అడ్మిషన్ల గడువు 11వ తేదీకి పెంపు.. 14 నుంచి తరగతులు ప్రారంభం



ములుగు జిల్లా కేంద్రంలోని ట్రైబల్ యూనివర్సిటీ

సాక్షిప్రతినిధి, వరంగల్: ములుగు జిల్లాకేంద్రంలో సమ్మక్క–సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ (ఎస్ఎస్‌సీటీయూ)లో చేరేందుకు విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అడ్మిషన్లకు చివరి రోజు వరకు ముగ్గురే చేరగా.. స్పాట్ అడ్మిషన్ రోజున 10 మంది అర్హత సాధించారు. మొత్తం 13 మందికి గాను ఐదుగురు బీఏ ఎకనామిక్స్‌లో, ఎనిమిది మంది బీఏ ఇంగ్లిష్‌లో సీట్లు పొందారు. 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఎస్ఎస్‌సీటీయూ తన కార్యకలాపాలను ప్రారంభించింది. సెప్టెంబర్ 20న బీఏ (హానర్స్) ఇంగ్లిష్, బీఏ (హానర్స్) ఎకనామిక్స్ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 1న అడ్మిషన్ కౌన్సెలింగ్ ముగియగా, కేవలం మూడు సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. గురువారం స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ చేపట్టారు. రెండు కోర్సులలో 47 సీట్లకుగాను 13 సీట్లే భర్తీ అయ్యాయని, దీంతో అడ్మిషన్ల గడువు ఈ నెల 11వ తేదీ వరకు కొనసాగుతుందని ఎస్ఎస్‌సీటీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పోరిక తుకారాం చెప్పారు. 14వ తేదీ నుంచి క్లాసులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఎవరైతే సత్యాన్ని తిరస్కరిస్తారో, వారికి కఠినమైన శిక్ష పడుతుంది. ఎవరైతే విశ్వసించి, సత్కార్యాలు చేస్తారో, వారికి క్షమాపణ మరియు గొప్ప ప్రతిఫలం (స్వర్గం) ఉంటాయి.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 4 అక్టోబర్ 2024

వాయు కాలుష్యంపై మొద్దునిద్ర

దేశ రాజధానిలో 60 శాతం అధికంగా కుంభవృష్టి కురిపించి, వారంరోజులు ఆలస్యంగా నైరుతీ రుతుపవనాలు నిష్క్రమించాయో లేదో అక్కడి వాయు కాలుష్యంపై యథాప్రకారం చర్చ మొదలైంది. వాయు నాణ్యత మెరుగుదలకు తీసుకున్న చర్యలేమిటని గురువారం సర్వోన్నత న్యాయస్థానం హరియాణా, పంజాబ్ ప్రభుత్వాలను నిలదీసింది. వాయు కాలుష్యం ఉగ్రరూపం దాలుస్తోందని, రైతులు పంట వ్యర్థాలు తగులబెట్టకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించింది. గోధుమ పంట చేతికొచ్చాక వ్యర్థాలను తొలగించటం ఖర్చుతో కూడుకున్నదన్న కారణంతో రైతులు అక్కడే తగలబెడతారు. ఆ మంటలకు పంటభూమిలోని పోషకాలు, పంటలు ఏపుగా పెరగడానికి తోడ్పడే సూక్ష్మజీవులు నశిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆ వ్యర్థాలను సేకరించి ఇతరేతర పదార్థాలతో మిశ్రమం చేసి సేంద్రియ ఎరువుగా మార్చవచ్చని సూచిస్తున్నారు. కానీ దీన్ని రైతులకు చేరేయటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. రైతులకయ్యే వ్యయాన్ని భరిస్తే ఈ సమస్య చాలావరకూ తగ్గుతుందని గతంలో సుప్రీంకోర్టు ఢిల్లీ, పంజాబ్, హరియాణాలకు సలహా ఇచ్చింది. కానీ పట్టించుకున్నవారేరి? దానిసంగతలావుంచి సుప్రీం సూచనతో ఏర్పాటైన కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సీఏక్యూఎం) సమావేశాలే సక్రమంగా జరగటం లేదు. ఆగస్టు నెలాఖరున జరిగిన కమిషన్ సమావేశానికి 11 మంది సభ్యుల్లో అయిదుగురే హాజరయ్యారంటే...అందులో పంట వ్యర్థాల విషయంపై చర్చించనేలేదంటే కమిషన్ తీరుతెన్నులెలా వున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఢిల్లీలో సాధారణంగా అక్టోబర్ మధ్యనుంచి వాయు కాలుష్యం పెరగటం మొదలై నవంబర్ నాటికి ఉగ్రరూపం దాలుస్తుంది. పర్యవసానంగా నగర జీవితం అస్తవ్యస్తమవుతుంది. పాఠశాలల పనివేళలు మార్చటం, ప్రభాతవేళ ఆరుబయట వ్యాయామాలు చేయొద్దని పౌరులకు సూచించటం వంటివి మొదలవుతాయి. వాయు కాలుష్యానికి మూలం ఎక్కడుందో గుర్తించటానికే దీర్ఘకాలం పట్టగా, అనంతర చర్యలైనా చురుగ్గా ముందుకు కదలటం లేదు. కాలుష్యంలో 70 శాతం వాటా వాహనాలదేనని ఢిల్లీలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) తేల్చి కూడా చాన్నాళ్లయింది. ఆ తర్వాతి స్థానం పరిశ్రమలదేనని కూడా ఆ నివేదిక చెప్పింది. కానీ ఆ దిశగా పెద్దగా అడుగులు పడలేదు. మన దేశంలో ఆటోమొబైల్ పరిశ్రమ శక్తిమంతమైనది. దాదాపు అయిదు లక్షల కోట్ల టర్నోవర్ గల ఆ పరిశ్రమ రెండున్నర కోట్లమందికి ఉపాధి కల్పిస్తోంది. అందువల్ల వాటి జోలికి పోయేందుకు ప్రభుత్వాలు సిద్ధపడవు సరికదా... వాహనాల అమ్మకాలు పెరగటానికి, ఆ పరిశ్రమల లాభార్జనకూ భిన్నరూపాల్లో తోడ్పాటునందిస్తాయి. మార్కెట్‌లోకొచ్చే వాహనాలు కాలుష్య కారకాలుగా ఉంటున్నాయని తేలినా నిర్లిప్తంగా ఉండిపోయిన సందర్భాలు గతంలో కోకొల్లలు. 2005 నుంచి అందుబాటులోకొచ్చిన బీఎస్ 3 (భారత్ స్టేజ్ 3) ప్రమాణాలున్న వాహనాలు అధికంగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయని ఆరోపణలొచ్చినా చర్య తీసుకునేందుకు ఏ వ్యవస్థా సిద్ధపడలేదు. ఆ ప్రమాణాలతో విడుదలైన ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతోపాటు కార్లు, భారీ కమర్షియల్ వాహనాలపై చర్యలు తీసుకోలేదు. చివరకు సుప్రీంకోర్టే బీఎస్ 3 ప్రమాణాలున్న వాహనాల విక్రయాన్ని 2017లో నిషేధించింది. వీటి సంగతలావుంచి ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచటానికి అవసరమైన పథకాల రూపకల్పన సక్రమంగా ఉండదు. త్వరితగతిన పనులు పూర్తిచేసుకోవాలంటే సొంత వాహనాలే దిక్కన్న అభిప్రాయం పౌరుల్లో స్థిరపడిపోయింది. దీనికి తోడు ప్రజా రవాణా కోసం ఇప్పటికీ చాలా రాష్ట్రాలు డీజిల్ బస్సులే వాడుతున్నాయి. విద్యుత్, సీఎన్‌జీ వాహనాల వినియోగం మొదలైనా వాటి సంఖ్య స్వల్పం. ఢిల్లీ మెట్రో నిడివి ప్రస్తుతం దాదాపు 400 కిలోమీటర్ల మేర ఉంది. దాన్నింకా పెంచటానికి కృషిచేస్తున్నారు. ఈ సర్వీసును బస్సులతో అనుసంధానించి మారుమూల ప్రాంతాలకు కూడా సులభంగా వెళ్లగలిగే సదుపాయం కల్పిస్తే సొంత వాహనాల వినియోగం తగ్గుతుంది. ఇక ఏదైనా అనుకోనిది జరిగితే తప్ప పరిశ్రమలపై సాధారణంగా ప్రభుత్వాలు చర్యలకు సిద్ధపడవు. నిర్దిష్ట కాల వ్యవధిలో నిర్వహించే తనిఖీలు చాలా సందర్భాల్లో లాంఛనప్రాయమవుతాయి. జరిమానాల వంటివి విధించినా అవి నామమాత్రంగానే ఉంటున్నాయి. ఉపాధి కల్పనకూ, సంపద వృద్ధి కావటానికీ పరిశ్రమలు అవసరమే. కానీ ప్రజారోగ్యంతో ఆటలాడుకునేవారినీ, చట్టాలను ఉల్లంఘించేవారినీ దండించాల్సిందే.

వాయు కాలుష్యంపై విచారణ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్య గమనించదగ్గది. రుతుపవనాలు నిష్క్రమించి శీతాకాలం ఇంకా ప్రవేశించని అక్టోబర్ నెల ఒకప్పుడు ఢిల్లీలో ఎంతో ఆహ్లాదకరంగా ఉండేదని న్యాయమూర్తులు అన్న మాటల్లో వాస్తవం ఉంది. కొన్ని దశాబ్దాల క్రితం వరకూ ఉండే ఆ వాతావరణం ఇప్పుడు ఎందుకు మాయమైంది? కారకులెవరు? చిత్తశుద్ధితో ఆలోచించాలి. కాలుష్యంలో తమ బాధ్యత లేదని, పొరుగు రాష్ట్రమే ఈ సమస్యకు కారణమని పంజాబ్, హరియాణా, రాజస్తాన్‌లు పరస్పరారోపణలు చేసుకోవటం రివాజుగా మారింది. అటు కేంద్రం సైతం మొత్తం భారాన్ని రాష్ట్రాలపై వేసి తప్పుకుంటోంది. ఏతావాతా సమస్య యథాతథంగా మిగిలిపోతున్నది. ఈ వైఖరి సరికాదు. ఇటీవల వెలువడిన లాన్సెట్ నివేదిక వాయు కాలుష్యం వల్ల ఢిల్లీలో ఏటా 12,000మంది మరణిస్తున్నారని తేల్చింది. అందుకే అందరూ మేల్కొనాల్సిన సమయమిది. ప్రభుత్వాలన్నీ కలిసికట్టుగా కార్యాచరణకు దిగి తమవంతు బాధ్యత నెరవేర్చటంతోపాటు కాలుష్యంపై ప్రజల్లో చైతన్యం కలిగించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.విదియ రా.2.54 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** చిత్త సా.5.35 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.11.46 నుండి 1.30 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.14 నుండి 1.02 వరకు, **అమృత ఘడియలు:** ఉ.10.25 నుండి 12.11 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.46
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

పశ్చిమాసియా చిచ్చుకు బాధ్యులెవరు?

విశ్లేషణ



టంకశాల అశోక్

లెబనాన్‌పై దాడి, హెజ్బొల్లా అధినేత సయ్యద్ హసన్ నస్రల్లా హత్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై వందలాది మిస్సైళ్లతో ఇరాన్ విరుచుకు పడింది. వాటిలో అనేకాన్ని ఇజ్రాయెల్ కూల్చివేయగలిగిందిగానీ వాళ్ల నగరాలు, సైనిక స్థావరాలు ధ్వంసమయ్యాయి. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించింది. ఇదే కొనసాగితే దారుణ విధ్వంసం తప్పదు. ఇప్పటికైనా దౌత్య యత్నాలు సాగుతాయా అన్నది ప్రశ్న. యూదులకు ఒక దేశం ఉండాలన్న సూత్రంతో పాలస్తీనాను రెండుగా విభజించటం ఒక చారిత్రక విషాదమనుకుని అంగీకరించినా, కనీసం రెండు స్వతంత్ర దేశాల సూత్రానికి ఇజ్రాయెల్‌తో పాటు అమెరికా కట్టుబడి ఉంటే సమస్య కాలక్రమంలో సమసిపోయేది. అట్లా జరగకపోవటం వల్లనే పరిస్థితి ఇంతవరకు వచ్చింది.

ఇరాన్ ఈ నెల ఒకటవ తేదీ రాత్రి ఇజ్రాయెల్‌పై వందలాది మిస్సైళ్లతో దాడి చేసింది. అవి అగ్ని బాణాల వలె ఇజ్రాయెల్ పైకి దూసుకుపోయి కురుస్తుండటం ఆ రోజు రాత్రి ఆకాశంలో కనిపించి ప్రపంచమంతా ఊపిరి బిగబట్టింది. ఇక రానున్న రోజులలో ఏమి కావచ్చునన్నది అందరి ఆందోళన, భయం. ఇందుకు దోహదం చేసిన పరిణామాలు గత కొద్ది రోజులలో చోటు చేసుకున్నాయి. హెజ్బొల్లా అధినేత సయ్యద్ హసన్ నస్రల్లాను ఇజ్రాయెల్ హత్య చేసింది. లెబనాన్‌పై దాడులు ప్రారంభించింది. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ యుద్ధ నౌకలు మధ్యధరా సముద్రంలోకి ప్రవేశించి ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచాయి. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ మంగళవారం నాడు ఒక వీడియో విడుదల చేస్తూ నేరుగా ఇరాన్‌ను ఉద్దేశించి రెండు కీలకమైన మాటలు అన్నారు. మొత్తం పశ్చిమాసియాలో ఏ ప్రాంతం కూడా తమ బలానికి అతీతమైనది కాదన్నది మొదటిది. ఇరానియన్ నాయకుల వల్లనే అక్కడి ప్రజలు పేదరికానికి, ఇతర సమస్యలకు గురవుతున్నారనీ, వారు లేకుంటే ఇరాన్ బాగా అభివృద్ధి చెందుతుందనీ, వారికి తమ నాయకుల సమస్య త్వరలో తీరిపోతుందన్నదీ రెండవది. హెజ్బొల్లా అధినేత హత్య నేపథ్యంలో ఇటువంటి హెచ్చరికలతో ఇరాన్ అగ్ర నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీని వెంటనే తాము సురక్షితమనుకునే రహస్య స్థావరానికి తరలించారు.

త్వరత్వరగా చోటు చేసుకున్న ఈ పరిణామాల నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి జరిపింది. ఇరాన్ వందలాది మిస్సైళ్లలో అనేకాన్ని ఇజ్రాయెల్‌తో అమెరికా నౌకా దళాలు కూల్చివేశాయి గానీ, మరెన్నో ఇజ్రాయెలీ నగరాలను, సైనిక స్థావరాలను ధ్వంసం చేశాయి కూడా. ఇది ఇంతటితో ఆగుతుందా, లేక యుద్ధం పెచ్చరిల్లుతుందా అనే ప్రశ్నకు సమాధానం ప్రధానంగా ఇజ్రాయెల్ చర్యలపై ఆధారపడి ఉంటుంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ మాత్రం మంగళవారం రాత్రే ఒక ప్రకటన చేస్తూ, తమవైపు చర్యలు ప్రస్తుతానికి ఇంతటితో ఆపుతున్నామనీ, ఇజ్రాయెల్ వైఖరిని బట్టి తదుపరి చర్యలుంటాయనీ అన్నారు. మరొకవైపు ఇజ్రాయెల్ ప్రధాని, సైన్యాధిపతి తాము ప్రతీకారం తీర్చుకొనగలమన్నారు. లోగడ హమాస్ నాయకుడు ఇస్మాయెల్ హానియేను తమ దేశంలోనే హత్య చేసినందుకు, అదే విధంగా తమ అగ్రశ్రేణి సైనిక బ్రిగేడియర్ జనరల్ అబ్బాస్ నిల్ఫరోషాన్‌ను హత్య చేసినందుకు ప్రతీకారంగా కూడా ఇజ్రాయెల్‌పై ఇరాన్ మిస్సైళ్లతో దాడి జరిపి, అది తమ హెచ్చరిక అని ప్రకటించింది. అపుడు కూడా ఇజ్రాయెల్ ప్రతీకార ప్రకటనలు చేసింది. కానీ బయటి రాజ్యాలు ఇజ్రాయెల్ వైపు కొన్ని, ఇరాన్ వైపు కొన్ని దౌత్య యత్నాలు చేయటంతో అది అంతటితో నిలిచిపోయింది. ఇపుడు తిరిగి అటువంటి స్థితే తలెత్తుతున్నది. అయితే ఈసారి కూడా దౌత్య యత్నాలు సాగుతాయా లేక పరిస్థితి



విషమిస్తుందా అన్నది ప్రశ్న. గతానికి, ఇప్పటికి కొన్ని తేడాలు ఉన్నాయన్నది గమనించవలసిన విషయం. పోయినసారివలె గాక ఇపుడు లెబనాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధం మొదలుపెట్టింది. ఇరాన్ అధినేతలను హత్య చేయగలమనే సర్వగర్భమైన హెచ్చరికలు చేసింది. పశ్చిమ దేశాల నౌకా బలాలు మధ్యధరాలో ప్రవేశించటమేగాక, ఇరాన్ మిస్సైళ్లను ఎదుర్కొనే రూపంలో ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొన్నాయి. అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఇజ్రాయెల్‌కు పూర్తి మద్దతును మరొకమారు ప్రకటించారు. ఇవీ తేడాలు. కనుక, రానున్న రోజులలో ఏమైనా జరగవచ్చు. లేదా జరగక పోవచ్చు. అన్ని వివాదాలకు, ఘర్షణలకు, యుద్ధాలకు కారణమైన పాలస్తీనా సమస్య పరిష్కారం కానిదే ఏదీ ఆగబోదన్నది మౌలిక విషయం.

ప్రస్తుత పరిస్థితికి సంబంధించి కొన్ని ముఖ్యమైన విషయాలున్నాయి. మొదటిది–గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం. హమాస్ దళాలు గత అక్టోబర్‌లో తమ భూభాగంపై దాడి జరిపి సుమారు 1,200 మంది పౌరులను హత్య చేశారన్న దాన్ని సాకుగా చేసుకుని ఇప్పటికే ఇజ్రాయెల్ 42,000 మంది పాలస్తీనియన్లను గాజాలో చంపివేసింది. గాజాకు సంబంధించి మరొక స్థాయిలో ఇజ్రాయెల్ చెప్తున్నది, అక్కడ తమ సైనిక నియంత్రణ ఇక శాశ్వతంగా ఉంటుంది. పాలస్తీనియన్లే పాలించినా పర్యవేక్షణ తమదవుతుంది. ఐక్యరాజ్య సమితి సైతం వ్యతిరేకిస్తున్నా, అసలు వెస్ట్ బ్యాంక్ మొత్తంగా ఇజ్రాయెల్‌లో భాగమే, తమదే అనటం రెండవది! పాలస్తీనియన్లకు మద్దతుగా హెజ్బొల్లాతో పాటు, యెమెన్‌లోని హౌతీలు, ఇరాక్ తదితర దేశాల మిలిటెంట్లు ఎన్ని నష్టాలనైనా ఎదుర్కొంటూ నిలవడమన్నది మూడవ ముఖ్యమైన విషయం. లెబనాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధం నాల్గవ ముఖ్య విషయం. ఇక చివరిది ఇరాన్. వారి సైనిక బలం సంఖ్య రీత్యా ఇజ్రాయెల్‌ను మించినదే అయినా, వైమానిక బలం, సాంకేతిక శక్తి అందుకు సాటిరావు. పైగా, ఉక్రెయిన్‌లో వలెనే ఇక్కడ కూడా మొత్తం అమెరికా కూటమి తమ ఆయుధ శక్తి, ధన బలంతో ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచింది. రెండు దేశాల మధ్య భూతల యుద్ధం జరిగితే ఇరాన్‌ది పైచేయి కావచ్చునేమోగానీ, మధ్యలో సిరియా, జోర్డాన్, ఇరాక్ భూభాగాలు ఉన్నందున అది వీలయ్యేది కాదు. అందువల్ల క్షిపణులు, యుద్ధ విమానాలపై ఆధారపడాలి. అంతమాత్రాన ఇజ్రాయెల్ గెలిచి తీరుతుందని కాదు. ఫలితం ఎట్లున్నా... ఇరాన్‌తో పాటు పాలస్తీనియన్లు, హెజ్బొల్లా, హౌతీలు, లెబనాన్‌తో పాటు ఇరాకీ మిలిటెంట్లు ఒకేసారి విరుచుకుపడితే ఇజ్రాయెల్‌కు తీవ్ర నష్టాలు తప్పవు. పైగా, ఇజ్రాయెల్‌కు, అమెరికాకు వ్యతిరేకంగా యుద్ధాలు జరిగినప్పుడల్లా ప్రపంచమంతటి నుంచి ముస్లిం యువకులు వేలాదిగా వెళ్లి పాల్గొనటాన్ని చూశాము. దీనంతటి పర్యవసానం యుద్ధం పూర్తి స్థాయికి పరిణమించటం.

అట్లా జరగకుండా ఉండాలంటే ఏకైక మార్గం దౌత్య యత్నాలు! అయితే, అమెరికా కూటమి బాహాటంగా ఇజ్రాయెల్‌తో నిలవటం, గాజా యుద్ధాన్ని ఆపించక పోవటమేగాక ఐక్యరాజ్యసమితిని, ప్రపంచాభిప్రాయాన్ని తోసిరాజంటోంది. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌తో ముడిపడి వారి సామ్రాజ్యవాద ప్రయోజనాలు అటువంటివి. సుమారు 120 సంవత్సరాల క్రితం మొదలై, 80 ఏళ్ల నుంచి క్రమంగా జటిలంగా మారుతూ, మరొక 20 ఏళ్లకు కొరకరానికొయ్య అయిపోయిన ఈ సమస్యకు మొట్టమొదటి నుంచి కూడా ఏకైక కారణం వారి ప్రయోజనాలే. 1948కి ముందు అసలు లేనే లేని ఇజ్రాయెల్ సృష్టిని, యూదులకు ఒక దేశం ఉండాలన్న సూత్రంతో ఆమోదించి పాలస్తీనాను రెండుగా విభజించటం ఒక చారిత్రక విషాదమనుకుని అంగీకరించినా, కనీసం రెండు స్వతంత్ర దేశాల సూత్రానికి ఇజ్రాయెల్‌తో పాటు అమెరికా కట్టుబడి ఉంటే సమస్య కాలక్రమంలో సమసిపోయేది.

అట్లా జరగకపోవటం వల్లనే పరిస్థితి ఇంతవరకు వచ్చింది. పశ్చిమం చిచ్చును సృష్టించింది. దీన్ని ఇన్ని దశాబ్దాలుగా సాగిస్తున్నది వారు మాత్రమేనని మరొకసారి చెప్పనక్కర లేదు. ముఖ్యంగా గాజా మారణహోమం నుంచి మొదలుకొని జరుగుతున్నదేమిటో ఇజ్రాయెల్, అమెరికాలు గుర్తించక తప్పదు. వారు తమ ఆయుధ బలంతో పైచేయి సాధిస్తుండవచ్చుగాక. కానీ, ప్రపంచం దృష్టిలోనే గాక అంతర్జాతీయ సంస్థల ఎదుట గతంలో ఎన్నడూ లేనంతగా ఏకాకులయ్యారు. వియత్నాం యుద్ధం తర్వాత అంతటి వ్యతిరేకతను, ఏహ్యతను తిరిగి 50 ఏళ్ల తర్వాత చూస్తున్నాము. అపుడు జరిగిన అమెరికా క్యాంపస్ ప్రదర్శనలు మళ్లీ ఇప్పుడు కనిపిస్తున్నాయి. దీనంతటి నుంచి ఇజ్రాయెల్, అమెరికాలు పాఠాలు నేర్చుకుంటే వారికే మంచిది. చరిత్రలో అనేక సామ్రాజ్యాలు బలంతో విర్రవీగి నేలకూలాయి. అమెరికా సైతం నెమ్మదిగా అదే దిశలో పయనిస్తున్నదని పలువురు పాశ్చాత్య మేధావులే హెచ్చరిస్తున్నారు కూడా!

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఖండనార్హం



అమెరికా (డెమోక్రాట్) ఉపాధ్యక్ష అభ్యర్థి టిమ్ వాల్జ్ 'ఇజ్రాయెల్ విస్తరణ'కు పిలుపునిచ్చారు: దానర్థం వలసవాదం అనే! దీన్ని తీవ్ర పదజాలంతో ఖండించాలి.

– జాసన్ హికెల్, ప్రొఫెసర్

మాటలు దొరక్క...



ఒక మీడియా సంస్థకు క్లైమేట్ కోర్సును హిందీలో రూపొందించడానికి సాయం చేయాల్సి వచ్చింది. పదాలతో ఎంత ఇబ్బంది అయిందంటే, మరికాస్త సమయం అడగాల్సి వచ్చింది. నా మాతృభాష (కన్నడ)లో అయినా ఇదే పరిస్థితి. మన వాతావరణ మార్పు చర్చ అంతా కేవలం ఇంగ్లిష్‌లోనే ఉండటం బాధాకరం.

– రుపికా పార్‌టీకర్, జర్నలిస్ట్

మారే సమస్యలు



ఎన్నికల్లో కీలక అంశాలు : ఇండియా – ఉద్యోగాలు, ఆర్థిక అసమానతలు, అవినీతి, పాలన, ప్రాథమిక సేవల అందుబాటు (ఆరోగ్యం, నీళ్లు, పారిశుద్ధ్యం), గ్రామీణాభివృద్ధి, రైతుల సమస్యలు, మౌలిక సదుపాయాలు, విద్య, నైపుణ్యాల వృద్ధి. అమెరికా – ద్రవ్యోల్బణం, ఆర్థికవ్యవస్థ, ఆరోగ్యరక్షణ వ్యయం, వాతావరణ మార్పు, ఎనర్జీ విధానం, తుపాకుల నియంత్రణ, వలసల విధానం, గర్భస్రావ హక్కులు. ప్రథమ, తృతీయ దేశాల ఎన్నికల అంశాల్లో తేడా కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

భారతీయమే!



ఇండియాకు బీజేపీ చేసిన అత్యంత మూర్ఖమైన సెల్ఫ్–గోల్ ఉర్దూను విదేశీ భాషలా చూడటం. ఉర్దూ భారతీయ భాష!

– గౌరవ్ సబ్‌నీస్, ఆంట్రప్రెన్యూర్

బయటపడే మార్గం లేదు!



తాలిబన్లు ఇప్పుడు 2021 సంవత్సరానికి ముందున్న విడాకుల ఉత్తర్వులను తిరగదోడుతున్నారు. దీని ద్వారా వేలాది మంది మహిళలు తమ హింసాత్మక వివాహ బంధాల్లోనే బలవంతంగా కొనసాగాల్సి ఉంటుంది. విడాకుల కోసం వారు ఏ చట్టపరమైన న్యాయాన్నీ కోరే అవకాశం లేదు. అఫ్గానిస్తాన్‌లో లింగ వివక్ష క్రమంగా పెరుగుతోంది.

– సారా వహీదీ, ఆంట్రప్రెన్యూర్

ఎక్కడున్నాం?



అమెరికా, చైనా కొత్త ఆవిష్కరణల్లో బిజీగా ఉన్నాయి. ఇజ్రాయెల్ క్షిపణులను సాంకేతిక పరిజ్ఞానంతో అడ్డుకుంటోంది. యూఏఈ కృత్రిమ మేధ రంగంలో ముందుకు వెళ్తోంది. ఇండియా భారీ సెమీ కండక్టర్ తయారీదారుగా మారనుంది. పాకిస్తాన్ మాత్రం విరోధుల మీద మీమ్స్, వీడియోలతో పోరాడుతోంది.

– హుసేన్ హక్కానీ, పాక్ మాజీ రాయబారి

కల్లలేనా?



బ్రాంప్టన్‌లోని ఒక రెస్టారెంట్ కొంతమంది వెయిటర్లను తీసుకోవాలనుకుంది. దాదాపుగా 3,000 మంది విద్యార్థులు (అత్యధికులు భారతీయులు) వరుసకట్టారు. కెనడాలో నిరుద్యోగిత భయం పుట్టిస్తోంది; దీనికితోడు పెరుగుతున్న జీవన వ్యయాలు కొంతమందికి నరకం చూపుతున్నాయి. ఎన్నో కలలతో కెనడా వెళ్లాలనుకునేవారు బాగా ఆలోచించుకోవాలి.

– రమణ్‌దీప్ సింగ్ మాన్, ఇంజినీర్ రైతు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇన్ బాక్స్

అన్నీ నేనే! అంతా నేనే!!

నేను శ్రీశ్రీ అభ్యుదయ ఆత్మని
గుళ్ల చుట్టూ తిరుగుతూ పొర్లుదండాలు పెడతాను

నేను గురజాడ అడుగుజాడని
సనాతన గుహల్లో దాక్కుని కొంగజపం చేస్తాను

నేను భగత్ సింగ్ భావజాలాన్ని
సెక్యులరిజం గొంతుకు ఉరిబిగించి ఊపిరితీస్తాను

నేను కార్ల్ మార్క్స్ కంచు కాగడాని
పెట్టుబడిదారుల పంచన చేరి ఎర్రబావుటా ఎగురవేస్తాను

నేను అభినవ గాంధేయవాదిని
చెడూగిడూ అంటే రెండు చెంపలూ ఛళ్లుమనిపిస్తాను

నేను నవ్యాంధ్ర శేషేంద్రని
కాషాయ దీక్షలు చేసి కరువు కాటకాల్ని కాలరాస్తాను

నేను చే గువేరా చైతన్య స్ఫూర్తిని
విప్లవ విదూషకుణ్ణి

నేను... మీకు తెలుసు!

– రాశ్రీ
మొబైల్: 76739 55949

కాంగ్రెస్ విశ్వసనీయతను కోల్పోతోంది!

అభిప్రాయం



గండ్ర వెంకటరమణారెడ్డి

పార్టీ ఫిరాయించిన శాసన సభ్యుల అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందంటూ స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలను బట్టి... తమపై అనర్హతా వేటు ఖాయమనే స్పష్టత, ఫిరాయించిన పది మందికి వస్తున్నట్టుగా అర్థమవుతోంది. ఫిరాయించిన ఎమ్మెల్యేలంతా సాంకేతికంగా బీఆర్ఎస్ శాసనసభ్యులే అంటూ టీపీసీసీ కొత్త చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చేసిన కామెంటుకు విరుద్ధంగా, తామంతా కాంగ్రెస్ సభ్యులమే అన్నట్టుగా కడియం వ్యాఖ్యలు ఉండటం హస్తం పార్టీలో నెలకొన్న అయోమయానికి నిదర్శనం.

గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జాతీయ కాంగ్రెస్ ఇచ్చిన మేనిఫెస్టో 'న్యాయ్ పత్ర్'లో ఫిరాయింపుల చట్టానికి మరింత పదును పెడతామని హామీ ఇచ్చింది. రేవంత్ రెడ్డి తమ సొంత పార్టీ మేనిఫెస్టోనే తుంగలో తొక్కేలా వ్యవహరించడం మొదట్నుంచీ కాంగ్రెసులో కొనసాగుతున్న ముఖ్యులకు రుచించడం లేదు.

బీఆర్ఎస్ హయాంలో ఎమ్మెల్యేల ఫిరాయింపులు జరగలేదా, ఇపుడు సీఎం రేవంత్ రెడ్డి ఫిరాయింపులను ప్రోత్సహిస్తే తప్పేంటి అన్నట్టుగా ముఖ్యమంత్రి అనుయాయులు మాట్లాడుతున్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. తొలి ఎన్నికల అనంతరం బొటాబొటి మెజారిటీతో బీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో తెలంగాణలో రాజకీయ పునరేకీకరణలో భాగంగా కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్‌సీపీ, సీపీఐలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు బీఆర్ఎస్‌లో చేరారు. ఆ తర్వాత 2018లో బీఆర్ఎస్ రెండోసారి బంపర్ మెజారిటీతో గెలవడంతో హస్తం పార్టీలోని అంతర్గత కలహాలు, గ్రూపు రాజకీయాల కారణంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో కొందరు, ఇక తమ పార్టీకి భవిష్యత్తు లేదని తమదైన నిర్ణయం తీసుకున్నారు. సీఎల్పీలోని సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది ఓ గ్రూపుగా విడిపోయి బీఆర్ఎస్ఎల్పీలో



విలీనమైంది. ఇది పూర్తిగా రాజ్యాంగ నిబంధనల ప్రకారం జరిగిన విలీనం. ఫిరాయింపుల చట్టం పరిధిలోకి రాదు.

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక పోతోంది కాంగ్రెస్. రెండు లక్షల్లోపు ఉన్న పంట రుణాలు రైతులందరికీ మాఫీ కాకపోయినా, అయినట్టు రేవంత్ రెడ్డి పంద్రాగస్టు నాడు ఖమ్మం జిల్లా వైరాలో జరిగిన బహిరంగసభలో ప్రసంగించడం అన్నదాతలను దగా చేయడమే! రైతుబంధు స్కీమును రైతు భరోసాగా మార్చి రైతులతో పాటు కౌలు రైతులకు కూడా ఏటా రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ ఖరీఫ్ సీజను దాటినా రైతు భరోసా ఊసే ఎత్తడం లేదు. రైతుభరోసా విషయంలో కౌలు రైతులు భూయజమానులతో మాట్లాడుకోవాలంటూ వ్యవసాయ మంత్రి తుమ్మల చావు కబురు చల్లగా చెప్పడం ద్వారా రైతులను వంచించారు.

రైతు కూలీలకు ఏటా రూ. 12 వేలు అన్న హామీని కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా మరచిపోయినట్టుంది. పంటలకు బోనస్ హామీ వట్టి బోగస్‌గా మిగిలిపోయింది. మహిళలకు ఉద్దేశించి 'మహాలక్ష్మి' పథకంలో భాగంగా 'రూ. 500కే గ్యాసు సిలిండర్' పథకాన్ని పేరుకైతే ప్రారంభించారు. కానీ అమలు అంతంతే. మహిళలకు నెలకు రూ. 2,500 అన్న వాగ్దానం, 'కల్యాణమస్తు' పథకం కింద ఆడబిడ్డ వివాహానికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీలను రేవంత్ ప్రభుత్వం అటకెక్కించి అక్కాచెల్లెమ్మలను దగా చేసింది. ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలు తన కుటుంబ సభ్యులవైనా 'హైడ్రా' వదలదని సీఎం రేవంత్ రెడ్డి గంభీర ప్రకటనలు చేశారు. కానీ దుర్గం చెరువు కింద ముఖ్యమంత్రి సొంత సోదరుడి భవనాన్ని టచ్ కూడా చేయలేదు.

తొమ్మిదిన్నర నెలల రేవంత్ ప్రభుత్వ పాలనలో ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చే విధానాల అమలుపై ఒకటి రెండు అంశాల్లో మినహా చాలా వాటిపై కనీస కసరత్తు లేకపోవడంతో కాంగ్రెసు సర్కారు విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతోంది.

వ్యాసకర్త భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే

అహంకారంతో అనర్థం

అహంకారంతో మనిషి తనంతవాడు లేడనీ, తలచుకుంటే తను చేయలేనిది ఏదీ లేదనీ గర్విస్తుంటాడు. తను ఎవరినీ లెక్క చేయడు. కానీ తనకు అందరూ ఒదిగి ఉండాలని భావిస్తాడు. ఈ అహంకార భావనతో తన పతనాన్ని తానే కొని తెచ్చుకుంటాడు. అహంభావికి ఆత్మ పరిశీలన ఉండదు. తను చేసే పనులు ఎంత వరకు సమంజసం అనే విచక్షణ ఉండదు.

రామాయణంలో రావణాసురుడు ఎవరెన్ని హితోక్తులు చెప్పినా సీతను అపహరించి తీసుకురావటానికే నిశ్చయుడవుతాడు. ఇందుకు మారీచుని మాయలేడి రూపంలో చిత్రకూటానికి వెళ్ళమని కోరతాడు. మారీచుడు ఇది చేయకూడని పని అని ఎంత చెప్పినా వినడు. చెప్పినట్లు వినకపోతే, తన చేతిలో మారీచునికి మరణం తప్పదంటాడు. మారీచుడు మాయలేడిగా మారి శ్రీరాముని చేతిలో మరణించటమే శ్రేష్ఠమనుకుని అంగీకరిస్తాడు.

జ్యోతిర్మయం

సీతమ్మను లంకకు తెచ్చాక, తమ్ముడు విభీషణుడు ఆమెను శ్రీరామునికి అప్పగించమనీ, కోరి హాని తెచ్చుకోవద్దనీ ఎన్ని విధాల హితవు చెప్పినా రావణుడు పెడ చెవిన పెట్టాడు. అశోక వనంలో సీతాదేవి కూడా రామునితో తలపడటం అవివేకమని హెచ్చరిస్తుంది. సీతాన్వేషణ చేస్తూ లంకకు చేరిన హనుమంతుడు కూడా రావణుడు చేస్తున్నది తప్పని చెబుతాడు. ఎవరెన్ని చెప్పినా రావణుడు వినలేదు. మానవ మాత్రుడు రాముడు వానరసేనతో వచ్చి, తన వంటి పరాక్రమ శాలిని ఏం చేయగలడని అహంకరిస్తాడు. అడవిలో కందమూలాలను, కూరగాయలను తింటూ తాపసుల్లా కాలం గడుపుతున్న రామలక్ష్మణులు తన పరాక్రమం ముందు ఏ మాత్రం చాలరనీ, వారిపై ఆశ వదులుకుని తన మాట వినమనీ సీతతో అంటాడు.

తన అనుచిత భాషణతో సీతాదేవిని కించపరచి, రాముని అవమానపరిచి, ఎంతో ప్రతిభావంతుడైన రావణాసురుడు కేవలం అహంకారం వల్ల తగిన ఫలితాన్నే పొందాడు. అహంకారం ఎవరికైనా, ఎప్పుడైనా అనర్థ హేతువే!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

సన్నాల్లో గోల్‌మాల్ జరిగితే కలెక్టర్లే బాధ్యులు

- సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఈ సీజన్ నుంచే..
- ప్రతీరోజు కలెక్టర్లు రెండు గంటలపాటు ధాన్యం సేకరణపై దృష్టి పెట్టాలి
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్ నుంచే సన్నాలకు కనీస మద్దతు ధరకు(ఎంఎస్‌పీ) అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. సన్నవడ్లకు బోనస్ ఇవ్వటం ఇదే మొదటిసారి కావటంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి తప్పు జరగకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందని హెచ్చరించారు. సన్న వడ్ల కొనుగోలుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ, డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, టీచర్ల నియామక ప్రక్రియను దసరాలోపు పూర్తి చేసే అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యకార్యదర్శులు వెంకటేశం, రఘునందన్‌రావు, పౌరసరఫరాల కమిషనర్ డీఎస్.చౌహాన్ జిల్లాల నుంచి మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ సన్నాల సేకరణకు వీలుగా వేర్వేరు కొనుగోలు కేంద్రాలు, లేదా వేర్వేరు కాంటాలు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సన్న రకాలను ధ్రువీకరించే యంత్రాలు, సిబ్బందిని అన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. సన్నవడ్ల సేకరణలో అప్రమత్తంగా లేకపోతే గోల్‌మాల్ జరిగే ప్రమాదముందని సీఎం అప్రమత్తం చేశారు. అటువంటి తప్పులు, అవకతవకలు జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని చెప్పారు. రాష్ట్రంలో ఈ వానాకాలంలో 66.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారని, ఈసారి రికార్డు స్థాయిలో 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని సీఎం చెప్పారు. ధాన్యం సేకరణకు రాష్ట్ర వ్యాప్తంగా 7,000 ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోగా వారి ఖాతాల్లో డబ్బులు చేరాలన్నారు. ఒకవేళ కొనుగోలు కేంద్రాలు సరిపోని పక్షంలో కలెక్టర్లు నిర్ణయం తీసుకొని అదనంగా కొత్త కేంద్రాలను తెరవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి

ప్రతీ కేంద్రానికి ఓ నంబర్..

ప్రతీ కొనుగోలు కేంద్రానికి ఒక నంబర్ కేటాయించాలని, ఆ కేంద్రంలో కొనుగోలు చేసిన వడ్ల సంచులపైన ఆ నంబర్ తప్పకుండా వేయాలని సీఎం సూచించారు. దీంతో ఏ తప్పు జరిగినా, ఏ దశలో గోల్‌మాల్ జరిగినా సులభంగా తెలుసుకునే వీలుంటుందన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా కట్టడి చేయాలని ముఖ్యమంత్రి పోలీస్ అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని మార్గాల్లోనూ నిఘా ఉంచాలని, చెక్ పోస్టుల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు

రైతులను వేధించొద్దు...

తాలు ,తరుగు, తేమ పేరుతో రైతులను మోసం చేసే వారిని సహించొద్దని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలని సీఎం చెప్పారు. రైతులు ఎక్కడ కూడా దోపిడీకి గురి కాకూడదని, రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును కలెక్టర్లు బాధ్యతగా స్వీకరించాలని కోరారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడే సంఖ్యలో గోనె సంచులు, టార్పాలిన్లు, మాయిశ్చర్ మెషీన్లు, డ్రైయర్లు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రతి గంటకోసారి కొనుగోలు కేంద్రాలకు వాతావరణ శాఖ సూచనలను చేరవేయాలని, దానికి అనుగుణంగా కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. కలెక్టర్లు తమ జిల్లాలో జరుగుతున్న కొనుగోళ్ల ప్రక్రియను సమీక్షించాలని, ప్రతి రోజు ఉదయం నేరుగా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. పాత పది జిల్లాలకు నియమించిన ప్రత్యేకాధికారులు ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని సీఎం సూచించారు. సమస్యల పరిష్కారానికి పౌరసరఫరాల విభాగంలో 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. జనవరి నుంచి రేషన్‌షాపుల్లోనూ సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. డిఫాల్ట్ మిల్లర్లకు ధాన్యం ఇవ్వొద్దని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన 5వ తేదీలోగా పూర్తి చేయండి

అన్ని జిల్లాల్లో డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనను 5వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. మొత్తం 11,062 మంది ఎంపికైన అభ్యర్థులకు దసరా పండగలోపు నియామక పత్రాలను అందిస్తామని ప్రకటించారు. అక్టోబర్ 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు వీలుగా జిల్లాల్లో వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే 9,090 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని విద్యాశాఖ అధికారులు సీఎంకు వివరించారు.

క్లుప్తంగా...

కాంగ్రెస్ మహిళా నేత ఝాన్సీరెడ్డికి గాయాలు



ఆస్పత్రిలో ఝాన్సీరెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి పొంగులేటి తదితరులు

తొర్రూరు: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో గురువారం కాసం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో అపశ్రుతి చోటు చేసుకుంది. సినీ నటి ప్రియాంక మోహ, నిర్వాహకులతో కలసి ప్రారంభోత్సవానికి వచ్చిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి వేదికపై అభివాదం చేస్తుండగా స్టేజీ కుప్పకూలింది. ఈ ఘటనలో ఝాన్సీరెడ్డికి గాయాలయ్యాయి. వెంటనే ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఝాన్సీరెడ్డిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పరామర్శించారు. వారి వెంట పాలకుర్తి, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు మామిడాల యశస్వినిరెడ్డి, భూక్య మురళీనాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బెట్టింగ్ యాప్‌లో అప్పులతో యువకుడి ఆత్మహత్య

- సిద్దిపేట జిల్లాలో ఘటన



ఈదారి నవీన్

మిరుదొడ్డి(దుబ్బాక): ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌కు అలవాటు పడ్డ ఓ యువకుడు చివరికి అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చాలంటూ బెట్టింగ్ యాప్ నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం మిరుదొడ్డి పీఎస్ పరిధిలో గురువారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. రుద్రారం గ్రామానికి చెందిన ఈదారి నవీన్ (27) గ్రామంలో వ్యవసాయ సంబంధిత ఎరువులు, విత్తనాలను విక్రయిస్తూ భార్య రాధిక, కుమారుడి(2)ని పోషించుకుంటున్నాడు. సొంత ఇల్లు నిర్మించుకోవడానికి డబ్బులు సమకూర్చుకోవాలన్న ఉద్దేశంతో ఇటీవల ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. బెట్టింగ్‌లకు బానిసగా మారిన నవీన్ అప్పుల ఊబిలోకి కూరుకుపోయాడు. రూ.లక్షల్లో అప్పు ఉండటంతో తీవ్ర మనస్తాపానికి గురై 1న పురుగు మందును తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిద్దిపేటలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల స్వైరవిహారం.. ఏడుగురికి గాయాలు

- కుక్కల బెడద తగ్గించాలని ఆందోళనకు దిగిన కోరపల్లి గ్రామస్తులు



చికిత్స పొందుతున్న అక్షర

జమ్మికుంట: కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కోర పల్లిలో కుక్కలు స్వైర విహారం చేశాయి. ఏడుగురిపై దాడి చేయగా ఓ మూడేళ్ల చిన్నారికి తీవ్రగాయాలు కావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కోరపల్లి గ్రామంలో బుధవారం రాత్రి బతుకమ్మ ఆడుకుని ఇంటికి వెళ్తున్న మద్దుర్ల అక్షర (3), గట్టమ్మ, స్వరూపపై కుక్కలు దాడి చేశాయి. గురువారం ఉదయం సైతం గ్రామానికి చెందిన కృతికరావు, రాజశేఖర్, రాజమల్లును కుక్కలు గాయపరిచాయి. జమ్మికుంట పరిధిలోని కొత్తపల్లిలోనూ రమ అనే మహిళపై కుక్కలు దాడి చేశాయి. వీరందరినీ జమ్మికుంటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అక్షరకు పెదవి, చేతులపై తీవ్ర గాయాలు కావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ నేపథ్యంలో గ్రామంలో కుక్కల సంచారం ఎక్కువైందని, పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని కోరపల్లి గ్రామస్తులు పంచాయతీ ఎదుట ఆందోళనకు దిగారు. పంచాయతీ కార్యదర్శి రామారావు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

చండూరు: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలను సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఒక రైతు మృతి చెందాడు. నల్లగొండ జిల్లా చండూరు మండలం కస్తాల గ్రామ పంచాయతీ పరిధిలోని మెండువారిగూడెంలో గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. మెండువారిగూడెం గ్రామానికి చెందిన మెండు మల్లారెడ్డి (42) పొలం వద్ద బోరు మోటారుకు తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతోంది. దీంతో రైతు గురువారం పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి తీగలు సరిచేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

గిరిజనుల ఆరోగ్యంపై ఫోకస్

- ఐటీడీఏల పరిధిలో కొత్త ఆసుపత్రుల ఏర్పాటుకు నిర్ణయం
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించిన మంత్రి దామోదర
- అత్యవసర పరిస్థితులలో వైద్య సేవలకోసం బైక్ అంబులెన్స్‌లు

సాక్షి, హైదరాబాద్: అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని.. ఐటీడీఏల పరిధిలో ఉన్న ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారు లను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో నివసి స్తున్న ప్రజలు అరగంట లోపలే చేరుకునేలా ఐటీడీఏల పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రుల నెట్‌వర్క్ ఉండాలన్నారు. ఇందుకు అనుగుణంగా కొత్తగా సబ్ సెంటర్లు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు, కమ్యూ నిటీ హెల్త్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాద నలు రూపొందించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారు లు, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్లకు మంత్రి సూచించారు. ఈ మేరకు రాష్ట్రంలోని మన్ననూరు, భద్రాచలం, ఏటూరు నాగారం, ఉట్నూరు ఐటీడీ ఏల పరిధిలో ఉన్న ఆసుపత్రులు, వైద్య సౌకర్యా లు, తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం సమీక్షించారు. హైదరా బాద్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసులో జరిగిన ఈ సమావేశంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ శరత్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కర్ణన్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

ప్రత్యేక వార్డులు.. బర్త్ వెయిటింగ్ రూంలు..

ఐటీడీఏ పరిధిలో ఉన్న జిల్లా, ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌ను మంత్రి ఆదేశించారు. అటవీ ప్రాంతాలు, రోడ్ కనెక్టివిటీ సరిగా లేని ప్రాంతాల్లో నివసిస్తున్న గర్భిణుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. ట్రైబల్ ఏరియాలో ఉన్న అన్ని ఆసుపత్రుల్లో బర్త్ వెయిటింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గర్భిణీ, ఆమెతోపాటు వచ్చిన కుటుంబ సభ్యులకు భోజనం, మంచినీరు ఇతర వసతులు కల్పించాలన్నారు. 108 అంబులెన్స్‌లు వెళ్లలేని ప్రాంతాల్లో బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. ఐటీడీఏ పరిధిలో నివసిస్తున్న ప్రిమిటివ్ ట్రైబ్స్ కోసం ఆదిలాబాద్ రిమ్స్ వంటి పెద్ద దవాఖానాల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. వారి భాషలో మాట్లాడగలిగే వైద్య సిబ్బందిని ఆ వార్డుల్లో నియమించాలని సూచించారు.

జీపీఎస్ ట్రాకర్‌తో రాబందు

- స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు
- పరిశోధనల కోసం మహారాష్ట్ర నుంచి వదిలినట్లు గుర్తింపు



అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న రాబందు

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో నాలుగు రోజులుగా కెమెరా లేని జీపీఎస్ ట్రాకర్‌తో తిరుగుతున్న రాబందును అటవీశాఖ అధికారులు గురువారం చిన మిడిసిలేరు ప్రాంతంలో పట్టుకున్నారు. ఆదివారం నీరసంగా, కదల్లేని స్థితిలో నాయకకాలనీలోని ఏకలవ్య పాఠశాల సమీపంలో ఈ రాబందు కనిపించగా స్థానికులు మాంసాహారం పెట్టగా తినేసి వెళ్లిపోయింది. ఈ విషయం బయటపడటంతో అటవీ అధికారులు రంగంలోకి దిగారు. అయితే మహారాష్ట్రకు చెందిన ముంబై నేచురల్ హిస్టరీ సొసైటీ వారు నాగపూర్‌లోని పెంచ్ టైగర్ రిజర్వ్ నుంచి ఆగస్టు 10న ఇలాంటి రాబందులను వదిలిపెట్టినట్లు తెలిసింది. ఈ రాబందు ఎక్కువ దూరం వెళ్లలేకపోతుండటాన్ని జీపీఎస్ ద్వారా గుర్తించిన అక్కడి అధికారులు ప్రస్తుతం తెలంగాణలో ఉన్నట్లు తెలిసి అటవీశాఖ రాష్ట్ర కార్యాలయానికి సమాచారం ఇవ్వగా చర్ల రేంజ్ అధికారులు గుర్తించి పట్టుకున్నారు. రేంజ్ కార్యాలయానికి తరలించి ఆహారం అందించి పశువైద్యుల ద్వారా పరీక్ష చేయిస్తున్నారు. కాగా, తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఈ రాబందు తిరుగుతుండటంతో మావోయిస్టుల కదలికలను గుర్తించేందుకు పోలీసులే పంపించారనే చర్చ జరిగింది. చివరకు పరిశోధనల కోసం విడిచిపెట్టినట్లు తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఆయిల్‌పామ్ హబ్‌గా తెలంగాణ

- రుణమాఫీ వందశాతం పూర్తి చేస్తాం: తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల. చిత్రంలో పొన్నం ప్రభాకర్

గజ్వేల్: తెలంగాణను ఆయిల్ పామ్ హబ్‌గా తీర్చిదిద్ది, దేశానికే ఆయిల్ అందించే స్థాయికి తీసుకొస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం గజ్వేల్‌లో మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవా నికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి హాజర య్యారు. ఈ సందర్భంగా తుమ్మల ప్రసంగిస్తూ సిద్దిపేట జిల్లాలో ఖమ్మం జిల్లాకు దీటుగా 11 వేల ఎకరాలకుపైగా పామాయిల్ సాగవుతున్నద న్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పామాయిల్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తామ న్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అమలైన విధంగా యాంత్రీకరణను రూ.600 కోట్లతో అమలు చేయడానికి సంకల్పించినట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అని, రైతులకు వందశాతం రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు. అటవీ, పర్యావరణ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎక్కడా కనిపించడం లేదన్నారు. కేసీఆర్ కనిపించడం లేదంటూ గజ్వేల్ కాంగ్రెస్ నేతలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు ఇవ్వక పోగా, రాష్ట్రంలో వరద విపత్తుపై రూ.10వేల కోట్లతో ప్రతిపాదనలు పంపితే కేవలం రూ.400 కోట్లు విడుదల చేయడం దారుణమన్నారు. రాష్ట్రానికి జరిగిన ఈ అన్యాయంపై బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు.

ఏఎంఆర్ నిశ్శబ్ద మహమ్మారి

- దీనిని అరికట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం
- శిల్పకళా వేదికలో జీ-స్పార్క్ సదస్సులో మంత్రి దామోదర రాజనర్సింహ



ఏఎంఆర్ యాక్షన్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'ఏఎంఆర్ (యాంటీ బయాటిక్స్ నిరోధకత) ఒక నిశ్శబ్ద మహమ్మారి.. దానిపై యుద్ధం చేయాలి.. అందుకోసం ఓ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు' మంత్రి సి.దామోదర రాజనర్సింహ చెప్పారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై గ్లోబల్ సౌత్ కాన్ఫరెన్స్ జీ-స్పార్క్-2024 గురువారం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఏఎంఆర్ యాక్షన్ ప్లాన్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ ఇన్‌ఫెక్షన్ నివారణ, నియంత్రణతోపాటు ఏఎంఆర్ ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద సమస్యగా పరిణమించనున్నాయని పేర్కొన్నారు. కేరళ ఆరోగ్య శాఖ మాజీ మంత్రి శైలజ మాట్లాడుతూ 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఏఎంఆర్‌ను ఎదుర్కోవాలంటే వెయ్యి ట్రిలియన్ డాలర్లు అవసరం పడుతుందని వివరించారు. ఏఎంఆర్‌ను పెద్ద సమస్యగా కేరళ తొలిసారిగా గుర్తించి, 2018లోనే కార్‌సాప్ పేరుతో యాక్షన్ ప్లాన్ కూడా రూపొందించినట్టు తెలిపారు.

నర్సులు డాక్టర్లకు సబార్డినేట్లు కాదు..

నర్సులు అంటే డాక్టర్ల కింద పనిచేసే సబార్డినేట్లు కాదని ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ వ్యాఖ్యానించారు. నర్సులకు గౌరవం అందాల్సిన అవసరముందన్నారు. నర్సుల పట్ల డాక్టర్ల ప్రవర్తన మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో భారత ప్రతినిధి డాక్టర్ అనుజ్‌శర్మ, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ ఆఫ్రికా నెట్‌వర్క్ ప్రొఫెసర్ చెడ్లీ అజౌజ్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ డైరెక్టర్ డాక్టర్ అతుల్ గోయెల్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం నుంచి పరారైన బాలికలపై లైంగికదాడి

- జనగాంలో ఐదుగురు నిందితుల అరెస్ట్

సైదాబాద్ (హైదరాబాద్): డీ అడిక్షన్ సెంటర్ నుంచి పరారైన ఇద్దరు బాలికలపై ఐదుగురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఐఎస్‌సదన్ డివిజన్ సరస్వతినగర్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌లో మల్కాజ్‌గిరికి చెందిన బాలిక (15)ను సెప్టెంబర్‌లో, జనగాంకు చెందిన బాలిక (15)ను జూలై 10న వారి తల్లిదండ్రులు చేర్పించారు. అయితే గత నెల 24న ఉదయం బాలికలు సెంటర్‌నుంచి పరారయ్యారు. నిర్వాహకుల ఫిర్యాదుతో సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పరారైన బాలికలు జనగాంకు చేరుకున్నారు. వారిలో ఒక బాలిక అక్కడ ఉన్న ఒక యువకుడిని ఫోన్ అడిగి తీసుకొని తెలిసిన వ్యక్తికి ఫోన్ చేసి రావాల్సిందిగా కోరగా, అతను మరునాడు వస్తానని చెప్పాడు. దాంతో తాము ఫోన్ అడిగిన యువకుడినే బాలికలు ఆశ్రయం కల్పించాల్సిందిగా కోరారు. అతను వారిని తన స్నేహితుడి బేకరీకి తీసుకెళ్లాడు. ఆరోజు రాత్రి ఇద్దరు యువకులు వారిపై అత్యాచారం చేశారు. మరుసటి రోజు వారు మరో ముగ్గురు స్నేహితులతో కలిసి బాలికలను ఆలేరుకు కారులో తీసుకెళుతూ మరలా ఐదుగురు వారిపై లైంగికదాడి చేశారు. అనంతరం ఆలేరులో బాలికలను దింపి యువకులు వెళ్లిపోయారు. తిరిగి జనగాం చేరుకున్న వారిని సైదాబాద్ పోలీసులు గుర్తించి తీసుకువచ్చి భరోసా కేంద్రానికి పంపారు. అక్కడి సిబ్బంది బాలికల నుంచి లైంగికదాడికి సంబంధించి వివరాలు తెలుసుకొని పోలీసులకు సమాచారమిచ్చారు. సైదాబాద్ పోలీసులు రెండు రోజుల క్రితం జనగాం నుంచి ఐదుగురు యువకులను అరెస్ట్ చేసి తీసుకువచ్చి రిమాండ్‌కు తరలించారు.

నాణ్యతలేని మందుల గుర్తింపు

- జనవరి నుంచి తనిఖీల్లో 107 రకాల మందులు గుర్తించిన డీసీఏ అధికారులు

సాక్షి, హైదరాబాద్: నాణ్యత ప్రమాణాలు పాటించకుండా మార్కెట్‌లో విక్రయిస్తున్న 107 రకాల నాణ్యతలేని మందులను గుర్తించినట్టు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) డీజీ కమలాసన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌లో విక్రయిస్తున్న నాసిరకం మందులను గుర్తించేందుకు డీసీఏ అధికారులు రిస్క్ బేస్డ్ శాంపిలింగ్‌ను చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 93 రకాల మందులు నాసిరకమని డ్రగ్ కంట్రోల్ లేబొరేటరీ పరీక్షల్లో తేలినట్లు తెలిపారు. అదేవిధంగా సెప్టెంబర్‌లో సేకరించిన వాటిలో 14 రకాల నాసిరకం మందులు ఉన్నట్లు తేలిందన్నారు. నాసిరకం మందులను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనుమ తులు లేకుండా మందుల తయారీ లేదా నాసిరకం మందుల తయారీ గుర్తిస్తే డీసీఏ అధికారులకు సమాచారం ఇవ్వాలని కమలా సన్‌రెడ్డి ప్రజలకు సూచించారు.

ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలపై వేటు

- ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలం, నిర్లక్ష్య ఫలితం
- నిఘా సమాచారం మేరకు చర్యలు తీసుకున్నట్టు మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమైన, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ కొరడా ఝుళిపించారు. ఒకేసారి మల్టీజోన్-2లోని తొమ్మిది జిల్లాల్లో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, 13 మంది ఎస్సైలను వీఆర్ (వేకెన్సీ రిజర్వ్)కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. వేటు పడిన వారిలో కొందరికి ఇసుక అక్రమ రవాణాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు ఉన్నట్టు నిఘా అధికారుల నివేదికలు, ఇతర విచారణ తర్వాతే చర్యలు తీసుకున్నట్టు ఐజీ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ విషయంలో 14 మంది ఎస్సైలను వారు పనిచేస్తున్న స్థానాల నుంచి బదిలీ చేసినట్టు వెల్లడించారు. ఇసుక అక్రమ రవాణా, గ్యాంబ్లింగ్, మట్కాలకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని ఐజీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

వేటు పడింది వీరిపైనే..

సంగారెడ్డి రూరల్, తాండూర్ రూరల్, తాండూరు టౌన్ సీఐలతోపాటు వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్ (ఎస్), పెన్‌పహాడ్, వాడపల్లి, హాలియా ఎస్సైలు ఉన్నారు. త్వరలో వీరిని లూప్‌లైన్‌కు బదిలీ చేస్తామని ఐజీ తెలిపారు. రాష్ట్ర నిఘా అధికారుల నివేదికలు, ఇతర విచారణల ద్వారా ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటికే అడవిదేవులపల్లి, వేములపల్లి, నార్కట్‌పల్లి, చండూర్, మాడుగులపల్లి, తిప్పర్తి, చింతలపాలెం, తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం, అచ్చంపేట, బొంరాస్‌పేట, తాండూర్, చిన్నంబావి ఎస్సైలను స్థానచలనం చేసినట్టు పేర్కొన్నారు.

వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్‌పై వేటు

జోగిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో ఓ బాలికపై జరిగిన రేప్ కేసులో అలసత్వం, దర్యాప్తులో అవకతవకలకు పాల్పడినందుకు సీఐ నాగరాజును సస్పెండ్ చేసినట్టు మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. నాగరాజు ప్రస్తుతం వికారాబాద్ టౌన్ ఎస్‌హెచ్ఓగా పనిచేస్తున్నాడు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఫోకస్

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై కూడా ఫోకస్ పెట్టనున్నట్టు ఐజీ సత్యనారాయణ వెల్లడించారు. దీనిపై ఇప్పటికే రహస్య విచారణ జరుగుతోందని, రేషన్ బియ్యం అక్రమ రవాణాలో స్థానిక నిందితులతోపాటు అంతర్రాష్ట్రంగా అక్రమ రవాణా చేసే ప్రధాన నిందితులపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల ఎస్పీలను ఐజీ ఆదేశించారు.

బీరుట్‌పై భీకర దాడి

హెజ్‌బొల్లా పౌరవిభాగం సభ్యులు సహా తొమ్మిది మంది మృతి

దక్షిణ లెబనాన్ వద్ద కొనసాగుతున్న పరస్పర దాడులు

బీరుట్/జెరూసలేం: హెజ్‌బొల్లా చీఫ్‌ను అంతం చేసి దాడులను ఉధృతంచేసిన ఇజ్రాయెల్ ఇప్పుడు ఏకంగా లెబనాన్ దేశ రాజధాని నడిబొడ్డున దాడికి తెగబడింది. బీరుట్ నగరంలో దేశ పార్లమెంట్, ప్రధాన మంత్రి కార్యాలయం, ఐక్యరాజ్యసమితి లెబనాన్ ప్రధాన కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న ప్రాంతంపై దాడి చేసింది. గురువారం తెల్లవారుజామున సెంట్రల్ బీరుట్‌లోని బషౌరా జిల్లాలోని ఒక అపార్ట్‌మెంట్‌పై జరిగిన దాడిలో 9 మంది మృతిచెందారు. దీంతో భవంతిలోని హెజ్‌బొల్లా హెల్త్‌సెంటర్ దెబ్బతింది. చనిపోయిన వారిలో హెజ్‌బొల్లా ఆరోగ్యకేంద్రంలో పనిచేసే ఏడుగురు సభ్యులున్నట్లు లెబనాన్ ఆరోగ్య శాఖ ధృవీకరించింది. మవాద్ ప్రాంతంలోని హెజ్‌బొల్లా మీడియా సంబంధాల భవనం మీదా దాడులు జరిగాయి. బింట్ జిబేయిల్ పట్టణంలోని ఆర్మీ పోస్ట్‌పై జరిగిన శతఘ్ని దాడిలో ఒక లెబనాన్ సైనికుడు చనిపోయారు.

రెడ్‌క్రాస్ సిబ్బంది దుర్మరణం

దక్షిణ లెబనాన్‌లో గాయపడిన పౌరులను తరలిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది వాహనంపై దాడి జరిగింది. తయ్యిబే గ్రామ సమీపంలో జరిగిన ఈ దాడిలో నలుగురు పారామెడికల్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ''ఐరాస శాంతిపరిరక్షక దళాల సమన్వయంతో ముందస్తు సమాచారంతోనే వైద్యసిబ్బంది వెళ్తున్నారు. అయినాసరే వారిపై దాడి జరిగింది. ఇది ముమ్మాటికీ అంతర్జాతీయ చట్టాలు, ఒడంబడికలను ఉల్లంఘించడమే. వాళ్ల వద్ద ఆయుధాలు ఉన్నాయని ఎలా ఓ నిర్ణయానికొస్తారు? సొంత నిర్ణయాలు తీసుకుని దాడులు చేసే అధికారం ఇజ్రాయెల్‌కు ఎవరిచ్చారు?'' అని లెబనాన్ ఆరోగ్య మంత్రి ఫిరాస్ అబియద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోవైపు దక్షిణ లెబనాన్ భూభాగాన్ని ఇజ్రాయెల్ ఆక్రమించడం మొదలెట్టింది. ఆక్రమణను ప్రతిఘటిస్తూ లెబనాన్ సైన్యం జరిపిన దాడిలో ఇజ్రాయెల్‌కు చెందిన ఎనిమిది మంది సైనికులు చనిపోయారు.

తరలిపోతున్న విదేశీయులు

సంక్షోభం నేపథ్యంలో తమ పౌరులను స్వదేశానికి తరలించేందుకు స్పెయిన్ రంగంలోకి దిగింది. బీరుట్ ఎయిర్‌పోర్ట్‌కు రెండు విమానాలను హుటాహుటిన పంపించింది. ఐరాస శాంతి కార్యక్రమాల్లో భాగంగా బీరుట్‌లో ఉన్న 676 మంది తమ సైనికులు తదుపరి ఆదేశాలు వచ్చేదాకా అక్కడే ఉంటారని స్పెయిన్ పేర్కొంది. ట్రిపోలీ నౌకాశ్రయం నుంచి 300కుపైగా తుర్కియే దేశస్తులు స్వదేశం పయనమయ్యారు. బ్రిటన్, ఆస్ట్రేలియా, జపాన్, ఇటలీ దేశస్తులు సైతం లెబనాన్ వీడుతున్నారు. గత 24 గంటల్లో 28 మంది హెల్త్‌వర్కర్లు చనిపోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది. ఇరాన్, లెబనాన్‌లపై ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఇజ్రాయెల్ దాడులు చేస్తోందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ అసహనం వ్యక్తంచేశారు.



బీరుట్ శివారు ప్రాంతంలో బాంబు దాడి దృశ్యం

హమాస్ నేతను చంపేశాం

ఇజ్రాయెల్ ప్రకటన



మూడు నెలల క్రితమే గాజా స్ట్రిప్‌లో హమాస్ సీనియర్ నేత రావీ ముష్తాహాను చంపేశామని ఇజ్రాయెల్ గురువారం ప్రకటించింది. కమాండర్లు సమీ సిరాజ్, సమీ ఔదేహ్‌లనూ చంపేశామని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. అయితే వీరి మరణవార్తపై హమాస్ స్పందించలేదు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పైకి హమాస్ చేసిన దాడి వెనుక సూత్రధారి, హమాస్ టాప్ కమాండర్ యాహ్యా సిన్వర్‌కు ముష్తాహా అత్యంత సన్నిహిత నేత. సిన్వర్ ఇంకా గాజాలోనే రహస్య ప్రదేశంలో దాక్కున్నాడని ఇజ్రాయెల్ సైన్యం భావిస్తోంది.

సిరియాలో ఆయుధాగారంపై దాడులు

తమకు ముప్పుగా పరిణమించొచ్చు అని అనుమానించిన ప్రతి లక్ష్యంపై ఇజ్రాయెల్ గురిపెడుతోంది. ఇందులోభాగంగా గురువారం సిరియా పశ్చిమతీరంలోని లటాకియా ప్రావిన్స్‌లోని రష్యా ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఖమేమిన్ ఆయుధాగారంపై ఇజ్రాయెల్ మెరుపుదాడులు చేసినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. గురువారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో 30 క్షిపణులను ఇజ్రాయెల్ ప్రయోగించింది. హెజ్‌బొల్లాకు అధునాతన ఆయుధాలు ఇక్కడి నుంచి సరఫరా అవుతాయని, వీటిని ధ్వంసంచేసి హెజ్‌బొల్లాకు ఆయుధాల కొరత సృష్టించడమే ఈ దాడుల అసలు లక్ష్యమని తెలుస్తోంది. గత షెడ్యూల్ ప్రకారం ఖాసిమ్ ఫార్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన సరకు రవాణా విమానం ద్వారా ఇక్కడి ఆయుధాలను ఇరాన్‌కు చేరవేయాల్సిఉంది. ఈలోపే ఇజ్రాయెల్ దాడి చేసింది.

100 మంది నవజాత శిశువులకు నస్రల్లా పేరు

హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా పట్ల ఇరాక్ ప్రజలు తమ అభిమానాన్ని ఘనంగా చాటుకున్నారు. నస్రల్లా మరణం ఇరాక్‌లో మరీ ముఖ్యంగా మెజారిటీ షియా జనాభాలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఆయనకు నివాళిగా దేశంలోని సుమారు 100 మంది నవజాత శిశువులకు 'నస్రల్లా' పేరు పెట్టుకున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 100 మంది శిశువులు ఆ పేరుతో నమోదు అయ్యారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది షియా సమాజం ఆయనను ఎంతగా ఆరాధిస్తోందో ఇట్టే అర్థమవుతోంది. షియాలు ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా, ప్రతిఘటనకు చిహ్నంగా నస్రల్లాను చూస్తారు. షియా వర్గాల్లో నస్రల్లాకు గణనీయమైన ఫాలోయింగ్ ఉంది. నస్రల్లాను ఇరాక్ ప్రధాని మొహమ్మద్ షియా అల్ సుడానీ అమరుడిగా అభివర్ణించారు. ఇరాక్‌తో నస్రల్లాకు మతపరంగానేకాకుండా రాజకీయ భావజాలపరంగా లోతైన అనుబంధం ఉంది. 2003 ఇరాక్‌ను అమెరికా ఆక్రమించడాన్ని నస్రల్లా బహిరంగంగానే విమర్శించి అక్కడి షియాలకు ఆరాధ్యుడయ్యాడు.

అటు డోమ్..ఇటు ఫతాహ్!

ఇజ్రాయెల్, ఇరాన్ అస్త్రశస్త్రాలు


ప్రాచీన మత సంబంధ కట్టడాల్లోకి పాలస్తీనియన్లను అనుమతించకపోవడంతో ఇజ్రాయెల్, హమాస్ మధ్య మొదలైన యుద్ధం లెబనాన్ మీదుగా ఇప్పుడు ఇరాన్‌ను తాకింది. హమాస్, లెబనాన్ కంటే ఇరాన్ ఇప్పుడు ఇజ్రాయెల్‌కు ప్రధాన యుద్ధక్షేత్ర పోటీదారుగా నిలిచింది. ఫతాహ్–2 హైపర్‌సోనిక్ క్షిపణులను ప్రయోగించి ఇరాన్.. ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థల సమర్థతను ప్రశ్నార్థకం చేసింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్, ఇరాన్‌ల సైనికసత్తాపై మరోమారు చర్చ మొదలైంది. అనూహ్యంగా దూసుకొచ్చే శత్రు క్షిపణులను గాల్లోనే తుత్తునియలు చేసే గగనతల రక్షణ వ్యవస్థలకు ఇజ్రాయెల్ పెట్టింది పేరు. అలాంటి వ్యవస్థలనూ ఇరాన్‌కు చెందిన ఫతాహ్ క్షిపణులు ఛేదించుకుని రావడం రక్షణ రంగ నిపుణులనూ ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీంతో ఇజ్రాయెల్ మోహరించిన భిన్న శ్రేణుల గగనతల రక్షణ వ్యవస్థలుసహా ఇరుదేశాల సైనికపాటవంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సైనిక బలగాల్లో ఇరాన్ పైచేయి

ఇజ్రాయెల్‌తో పోలిస్తే ఇరాన్ సైనికబలం పెద్దది. ఇరాన్‌లో 3,50,000 మంది ఆర్మీ, 1,90,000 ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్, 18వేల మంది నేవీ, 37 వేల మంది వాయుసేన, 15వేల మంది ఎయిర్‌డిఫెన్స్ సైనికులున్నారు. మరో 3,50,000 మంది రిజర్వ్ బలగాలున్నారు. ఇజ్రాయెల్‌లో కేవలం 1,26,000 మంది ఆర్మీ, 9,500 మంది నేవీ, 34,000 మంది ఎయిర్‌ఫోర్స్, 4,65,000 మంది రిజర్వ్‌బలగాలున్నాయి.

రక్షణ బడ్జెట్‌లో ఇజ్రాయెల్ ముందంజ

ఇరాన్ 2023 ఏడాదిలో రక్షణ కోసం 10.3 బిలియన్ డాలర్లు ఖర్చుచేస్తే ఇజ్రాయెల్ గత ఏడాది ఏకంగా 27.5 బిలియన్ డాలర్లు ఖర్చుచేసింది. 2022తో పోలిస్తే ఈ బడ్జెట్ 24% అధికం కావడం విశేషం.



పదాతిదళంలో ఇరాన్ మేటి

10,513 యుద్ధట్యాంకులు, 6798 శతఘ్నులు, 640 ఆయుధాల రవాణా వాహనాలు, 55 సైనిక హెలికాప్టర్లు ఇరాన్ సొంతం. ఇజ్రాయెల్ వద్ద 400 యుద్ధ ట్యాంకులు, 530 శతఘ్నులు, 1,190 ఆయుధాల రవాణా వాహనాలున్నాయి.

ఎయిర్‌ఫోర్స్‌లో ఇజ్రాయెల్ హవా

ఇజ్రాయెల్ వద్ద అమెరికా తయారీ అత్యాధునిక ఎఫ్ రకం జెట్ యుద్ధవిమానాలున్నాయి. మొత్తంగా 345 యుద్ధవిమానాలున్నాయి. 43 ఆర్మీ హెలికాప్టర్లున్నాయి. ఇరాన్ వద్ద 312 యుద్ధవిమానాలు, 23 ఆర్మీ విమానాలు, 57 హెలికాప్టర్లున్నాయి.

ఇరాన్ వద్ద అధిక జలాంతర్గాములు

ఇరాన్ వద్ద 17 జలాంతర్గాములు, 69 గస్తీ, నిఘా నౌకలు, 7 యుద్ధనౌకలు, 23 విమానవాహక నౌకలున్నాయి. ఇజ్రాయెల్ వద్ద కేవలం ఐదు జలాంతర్గాములు, 49 గస్తీ/యుద్ధ నౌకలున్నాయి.

విభిన్న గగనతల రక్షణ వ్యవస్థలు

ఇజ్రాయెల్‌లో మొత్తంగా 10 ఐరన్‌డోమ్ వ్యవస్థలున్నాయి. ఇవిగాక డేవిడ్స్ స్లింగ్, ఆరో సిస్టమ్స్ మోహరించాయి. ఇరాన్ వద్ద 'పరారుణ'గుర్తింపు వ్యవస్థ ఉంది. వీటి సాయంతో ఎస్–200, ఎస్–300, దేశీయ 373 క్షిపణి వ్యవస్థలను ప్రయోగించి శత్రు క్షిపణులను నేలకూలుస్తుంది. ఇదిగాక ఎంఐఎం–23 హాక్, హెచ్‌క్యూ–2జే, కోర్డాడ్–15, చైనా తయారీ సీహెచ్–ఎస్ఏ–4, 9కే331 టోర్ ఎం 1 క్షిపణులున్నాయి.

అణ్వాయుధాలు

ఇజ్రాయెల్ వద్ద దాదాపు 90 దాకా అణ్వాస్త్రాలున్నాయి. అయితే ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయో లేదో ఎవరికీ తెలీదు. కానీ అణ్వాయుధాల్లోని వార్‌హెడ్‌లో వాడే యురేనియంను మిలటరీ గ్రేడ్‌కు తెచ్చేందుకు ఆ మూలకం శుద్ధి ప్రక్రియను ఇరాన్ వేగవంతంచేసింది.

ఇజ్రాయెల్, ఇరాన్ బలాబలాలు

	ఇజ్రాయెల్	ఇరాన్
సైనికులు	6,34,500	9,60,000
రక్షణ బడ్జెట్	రూ.2.31 లక్షల కోట్లు	రూ.86వేల కోట్లు
యుద్ధవిమానాలు	345	312
శతఘ్నులు	530	6,798పైగా
హెలికాప్టర్లు	43	57కుపైగా
జలాంతర్గాములు	5	17

బాలిస్టిక్ క్షిపణులు

ఇరాన్ వద్ద తాండార్ 69, ఖొరమ్‌షహర్, సెజ్జిల్ బాలిస్టిక్ క్షిపణులున్నాయి. ఇజ్రాయెల్ వద్ద లోరా, జెరికో పేర్లతో 150 కి.మీ.ల నుంచి 6,500 కి.మీ.లు దూసుకుపోయే విభిన్న బాలిస్టిక్ క్షిపణులున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

మణిపూర్‌లో ఠాణాపై దాడి

ఆయుధాల దోపిడీ

ఇంఫాల్: మణిపూర్‌లోని ఉఖ్రుల్ పట్టణంలో పోలీస్‌స్టేషన్‌పై మూకుమ్మడిగా దాడి చేసిన దుండగులు ఆయుధాలను ఎత్తుకుపోయారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా వివాదాస్పద భూమిని శుభ్రం చేయడంపై బుధవారం నాగా తెగలోని రెండు వర్గాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో అస్సాం రైఫిల్స్‌కు చెందిన జవాను సహా ముగ్గురు చనిపోగా, 20 మంది వరకు గాయపడ్డారు. వీరిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఘర్షణలు కొనసాగు తుండగానే ఒక వర్గం యువకులు వినో బజార్‌లోని పోలీస్‌స్టేషన్‌లోకి చొరబడి, ఆయుధాలను ఎత్తుకుపోయారని అధికా రులు చెప్పారు. అస్సాం రైఫిల్స్ క్యాంప్‌నకు కూతవేటు దూరంలోనే ఉన్న ఈ ఠాణాలో దోపిడీకి గురైన ఆయుధాల వివరాలను మాత్రం వెల్లడించలేదు. అయితే, దుండగులు ఎత్తుకుపోయిన వాటిలో ఏకే–47, ఇన్సాస్ రైఫిళ్లు వంటివి కూడా ఉన్నట్లు చెబుతున్నారు. ఘటనల నేపథ్యంలో పట్టణంలో నిషేధాజ్ఞలు విధించారు. మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.

జైళ్లలో కుల వివక్ష వద్దు

- కారాగారాల్లో అందరినీ సమానంగా చూడాల్సిందే
- మూడు నెలల్లోగా జైలు మాన్యువల్ నిబంధనలు మార్చాలి
- అన్ని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశాలు

న్యూఢిల్లీ: కులం ఆధారంగా మనుషులపై వివక్ష చూపడం అనే సామాజిక నేరం దేశంలో శతాబ్దాలుగా కొనసాగుతోంది. ఆధునిక యుగంలోనూ సమాజంలో కుల వివక్ష కనిపిస్తోంది. ఆఖరికి ఖైదీలను సంస్కరించడానికి ఉద్దేశించిన జైళ్లలోనూ కుల వివక్ష తప్పడం లేదు. కింది కులాల ఖైదీలకు కష్టమైన పనులు అప్పగించడం, వేరే వార్డులు కేటాయించడం, వారిపై దాడులు, హింస సర్వసాధారణంగా మారిపోయింది. ఈ పరిణామంపై దేశ అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. కుల ఆధారంగా ఖైదీలపై వివక్ష చూపడడం తగదని తేల్చి చెప్పింది. కారాగారాల్లో ఖైదీలందరినీ సమానంగా చూడాలని ఆదేశించింది. వివిధ రాష్ట్రాల్లోని కారాగారాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని, కులం ఆధారంగా ఖైదీలపై వివక్ష చూపుతున్నారని పేర్కొంటూ మహారాష్ట్రలోని కల్యాణ్ ప్రాంతానికి చెందిన జర్నలిస్టు సుకన్య శాంత సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. స్టేట్ ప్రిజన్ మాన్యువల్ నిబంధనలను పిటిషనర్ సవాలు చేశారు. ఈ వ్యాజ్యంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఖైదీలను కులం ఆధారంగా విభజిస్తున్న మాన్యువల్‌లోని నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని తేల్చిచెప్పింది. మూడు నెలల్లోగా నిబంధనల్లో సవరణలు చేయాలని ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది. ఖైదీలపై వివక్షను అంతం చేసేలా అన్ని రాష్ట్రాలూ జైలు మాన్యువల్ నిబంధనలు మార్చాల్సిందేనని తేల్చిచెప్పింది. జైళ్లలో చోటుచేసుకున్న కుల వివక్ష ఘటనలను సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. మూడు నెలల తర్వాత వీటిని 'విచారించాల్సిన కేసుల జాబితా'లో చేర్చాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. తమ తీర్పుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరిస్తూ నివేదిక సమర్పించాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. నిర్బంధంలో ఉన్నవారికి సైతం గౌరవంగా జీవించే హక్కు ఉందని ధర్మాసనం ఉద్ఘాటించింది. మానవులంతా సమానంగా జన్మించారని ఆర్టికల్ 17 చెబుతున్నట్లు గుర్తుచేసింది. ప్రధానంగా ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో జైలు మాన్యువల్ నిబంధనలు మార్చాలని స్పష్టంచేసింది.

పని విషయంలో సమాన హక్కు ఉండాలి

''జైలు మాన్యువల్‌లో కులం కాలమ్ అవసరం లేదు. చిన్న కులాల ఖైదీలతో మరుగుదొడ్లు కడిగించడం, ట్యాంక్‌లు శుభ్రం చేయించడం వంటి పనులు, అగ్ర కులాల ఖైదీలకు సులభమైన వంట పనులు అప్పగించడం ముమ్మాటికీ వివక్షే అవుతుంది. ఇలాంటి చర్యలు అంటరానితనం పాటించడం కిందకే వస్తాయి. కులం ఆధారంగా ఖైదీలను వేరే గదుల్లో ఉంచడం సమంజసం కాదు. వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించడం వలసవాద వ్యవస్థకు గుర్తు. షెడ్యూల్డ్ కులాల ఖైదీలకే పారిశుధ్య పనులు అప్పగించడం తగదు. పని విషయంలో అందరికీ సమాన హక్కు ఉండాలి. కేవలం ఒక కులం వారినే స్వీపర్లుగా ఎంపిక చేయటం సమానత్వ హక్కుకు వ్యతిరేకం. కింది కులాల ఖైదీలకు మాత్రమే ఇలాంటి పనులు అప్పగించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 15ను ఉల్లంఘించడమే అవుతుంది'' అని సుప్రీంకోర్టు తీన తీర్పులో వెల్లడించింది.



ఉదయం నుంచి బీజేపీకి ప్రచారం.. మధ్యాహ్నం కాంగ్రెస్ గూటికి!

నాటకీయ ఫక్కీలో పార్టీ మారిన హరియాణా నేత తన్వర్



చండీగఢ్: హరియాణాలో బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ అశోక్ తన్వర్ నాటకీయ ఫక్కీలో కాంగ్రెస్‌లో చేరారు. మరో రెండు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా చోటుచేసుకున్న ఈ అనూహ్య పరిణామం బీజేపీకి ఊహించని ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. అశోక్ తన్వర్ గురువారం ఉదయం నుల్వా నుంచి పోటీలో ఉన్న బీజేపీ అభ్యర్థి తరఫున ఓట్లు అభ్యర్థిస్తున్నారు. మళ్లీ బీజేపీదే అధికారం అంటూ పలు చోట్ల ప్రసంగించారు కూడా. మధ్యాహ్నమయ్యే సరికి సీను మారింది. మహేంద్రగఢ్‌లో జరిగిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ర్యాలీలో 1.45 గంటల సమయంలో ఆయన ప్రత్యక్షమయ్యారు. ప్రత్యేక ప్రకటన ఉందంటూ రాహుల్ తన ప్రసంగం చివర్లో ప్రకటించడం..అందరినీ ఆశ్చర్యపరుస్తూ తన్వర్ వేదికపై ప్రత్యక్షమవడం వెంటవెంటనే జరిగిపోయాయి. రాహుల్ ఆయన్ను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికల ప్రచారానికి మరికొద్ది గంటల్లోనే తెరపడనుండగా ఈ పరిణామం చోటుచేసుకోవడం విశేషం.

కుమారస్వామిపై బలవంతపు వసూళ్ల కేసు



బెంగళూరు: రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఫిర్యాదుతో కేంద్రమంత్రి హెచ్.డి. కుమారస్వామిపై బలవంతపు వసూళ్లు, బెదిరింపుల కేసు నమోదైంది. కుమారస్వామి, జేడీఎస్ మాజీ ఎమ్మెల్సీ రమేశ్ గౌడపై బెంగళూరులోని అమృతహళ్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైందని పోలీసులు గురువారం వెల్లడించారు. రియల్టర్ విజయ్ టాటా వీరిపై ఫిర్యాదు చేశారు. తాను జనతాదళ్ (ఎస్) సోషల్ మీడియా విభాగం ఉపాధ్యక్షుడిగా పనిచేసి.. రియల్‌ఎస్టేట్ వ్యాపారంపై దృష్టి పెట్టడానికి వీలుగా పార్టీ కార్యకలాపాలను దూరంగా ఉన్నానని విజయ్ తెలిపారు. 'ఆగస్టు 24న రమేశ్ గౌడ నా ఇంటికి వచ్చారు. తన ఫోన్ నుంచి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రి కుమారస్వామికి కాల్ చేశారు. ఆయనతో నన్ను మాట్లాడించారు. చన్నపట్న ఉపఎన్నిక నిమిత్తం జేడీఎస్‌కు రూ.50 కోట్లు ఇవ్వాలని కుమారస్వామి కోరారు. తన కుమారుడు నిఖిల్ కుమారస్వామిని నిలబెడుతున్నట్లు తెలిపారు. డబ్బు ఇవ్వలేనని అశక్తత వ్యక్తం చేశాను. దాంతో తీవ్ర పరిణామాలుంటాయని కుమారస్వామి నన్ను బెదిరించారు' అని విజయ్ టాటా ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై స్పందన కోరగా.. ఇది చర్చించే అంశమేనా? వీటన్నింటికీ నేను బదులివ్వాలా? వీధిలో కుక్కలెన్నో మొరుగుతుంటాయి.. వాటన్నింటికీ స్పందించాలా? అని కుమారస్వామి విలేకరులతో అన్నారు.

సావర్కర్ మాంసాహారి: గుండూరావ్



బెంగళూరు/న్యూఢిల్లీ: హిందుత్వ సిద్ధాంతకర్త వినాయక్ దామోదర్ సావర్కర్‌పై కర్ణాటక మంత్రి దినేశ్ గుండూరావ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'సావర్కర్ మాంసాహారి, గో వధకు ఆయన వ్యతిరేకం కాదు. ఒక విధంగా ఆధునిక భావాలు కలిగిన వ్యక్తి. అదే సమయంలో గాంధీజీ శాకాహారి, హిందూమత విశ్వాసి. వీరిద్దరి దారులు వేర్వేరు అని బుధవారం బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో సావర్కర్, మహాత్మాగాంధీలను పోలుస్తూ మంత్రి అన్నారు. అంతటితో ఆగకుండా, పాకిస్తాన్ వ్యవస్థాపకుడు జిన్నా మరో అతివాది. కరడుగట్టిన ఇస్లాం విశ్వాసి. మద్యం తాగేవారు. పంది మాంసం తినేవారు. అయితే, ద్విజాతి సిద్ధాంతం, రాజకీయాలతో ముస్లింలకు ఆదర్శంగా నిలిచారు. సావర్కర్ మాదిరిగా జిన్నా ఛాందసవాది కాదు'అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో మంత్రి గురువారం వివరణిచ్చారు. మహాత్మాగాంధీ హత్యకు సంబంధించిన పుస్తకం విడుదల సందర్భంగా జరిగిన ఓ ఆరోగ్యకరమైన చర్చలో ఆ మాటలు అన్నట్లు చెప్పుకున్నారు. దేశంలో ఛాందసవాదాన్ని అడ్డుకుని, మహాత్ముని సిద్ధాంతాలను వ్యాప్తి చేయాల్సిన అవసరముందని చెప్పారు.

సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రతకు

మరింత ఊతం



- రూ.లక్ష కోట్లకుపైగా నిధులతో పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషోన్నతి యోజన
- రూ.10,103 కోట్లతో 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్ సీడ్స్'
- మరో 5 భాషలకు ప్రాచీన హోదా
- 11.72 లక్షల మంది రైల్వే ఉద్యోగులకు ఉత్పాదకత అనుసంధానిత బోనస్
- ఆమోద ముద్ర వేసిన కేంద్ర మంత్రివర్గం

న్యూఢిల్లీ: కేంద్ర వ్యవసాయ శాఖ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను రెండు పథకాలు... పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషోన్నతి యోజనగా హేతుబద్ధీకరించాలన్న ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దేశంలో సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రతకు మరింత ప్రోత్సాహం ఇవ్వడమే లక్ష్యంగా ఈ రెండు భారీ పథకాలకు ఆమోద ముద్ర వేసింది. రూ.లక్ష కోట్లకుపైగా నిధులతో పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(పీఎం–ఆర్‌కేవీవై), కృషోన్నతి యోజన(కేవై)ను అమలు చేసేందుకు అంగీకారం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ గురువారం సమావేశమైంది. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సుస్థిర వ్యవసాయానికి ఊతం ఇవ్వడానికి, పీఎం–ఆర్‌కేవీవై, ఆహార భద్రతలో స్వయం సమృద్ధి కోసం కృషోన్నతి యోజనను అమలు చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ రెండు పథకాల మొత్తం వ్యయం రూ.1,01,321 కోట్లు కాగా, ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.69,088 కోట్లు, రాష్ట్రాల వాటా రూ.32,232 కోట్లు. పీఎం–ఆర్‌కేవీవైకి రూ.57,074 కోట్లు, కృషోన్నతి యోజనకు రూ.44,246 కోట్లు ఖర్చు చేస్తారు. దాదాపు 18 పథకాలను ఈ రెండు పథకాలుగా హేతుబద్ధీకరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వీటిని అమలు చేస్తారు.

- వంట నూనెల ఉత్పత్తిని భారీగా పెంచి, స్వయం సమృద్ధి సాధించడానికి 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్ సీడ్స్'కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. రూ.10,103 కోట్లతో 2024–25 నుంచి 2030–31 వరకు ఈ కార్యక్రమం అమలు చేస్తారు. 2030–31 నాటికి దేశంలో నూనె గింజల ఉత్పత్తిని 69.7 మిలియన్ టన్నులకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే నూనె గింజల సాగును అదనంగా 40 లక్షల హెక్టార్లు పెంచాలని నిర్ణయించింది.
- మరాఠీ, పాళీ, ప్రాకృతం, అస్సామీ, బెంగాలీ భాషలకు ప్రాచీన భాష హోదా కల్పించేందుకు కేంద్ర కేబినెట్ అంగీకరించింది. ఈ చరిత్రాత్మక నిర్ణయమని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. భారతీయ భాషలకు ప్రాచీన హోదా ఇచ్చే విధానాన్ని 2004 అక్టోబర్ 12న కేంద్ర ప్రారంభించింది. ఇప్పటివరకు తమిళం, సంస్కృతం, తెలుగు, కన్నడ, మలయాళం, ఒడియా భాషలకు ఈ హోదా లభించింది.
- 11.72 లక్షల మంది రైల్వే ఉద్యోగులకు ఉత్పాదక అనుసంధానిత బోనస్ చెల్లించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 78 రోజులకు గాను మొత్తం రూ.2,028.57 కోట్లు చెల్లించనున్నట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రైల్వే శాఖ పనితీరును మరింత మెరుగుపర్చడానికి ప్రోత్సాహకంగా ఉద్యోగులకు ఈ బోనస్ చెల్లిస్తుంటారు.
- చెన్నై మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

యువత కోసం

కొత్తగా ఇంటర్న్‌షిప్ పథకం

- ఏటా రూ.66వేలు ఆర్థిక తోడ్పాటు
- ఐదేళ్లలో కోటి మంది లబ్ధిదారులు: కేంద్రం



న్యూఢిల్లీ: యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఇంటర్న్‌షిప్ పథకాన్ని తీసుకొచ్చింది. ఏటా రూ.66,000 మేర ఆర్థికసాయం అందించనుంది. ఐదేళ్లకాలంలో మొత్తంగా కోటి మంది 21–24 ఏళ్ల యువత ఈ పథకం ద్వారా లబ్ధిపొందనున్నారని కేంద్రప్రభుత్వం గురువారం ప్రకటించింది. 2024–25 ఆర్థికసంవత్సరంలో తొలుత పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రభుత్వం ఈ పథకం కోసం రూ.800 కోట్లు ఖర్చుచేయనుంది. ఈ ఆర్థికసంవత్సరంలో డిసెంబర్ రెండో తేదీన ప్రారంభమయ్యే ఈ పథకం ద్వారా 1,25,000 మంది లబ్ధిపొందే వీలుందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. టాప్ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే యువతకు బీమా సౌకర్యం సైతం కల్పించనున్నారు. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో పనిచేసే www.pminternship.mca.gov.inలో యువత ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

రూ.6,000 అదనం

నెలకు రూ.5,000 చొప్పున ఏడాదికి రూ.60,000 ఆర్థికసాయం అందనుంది. దీనికి అదనంగా ఏడాదిలో ఒకసారి రూ.6,000 గ్రాంట్ ఇవ్వనున్నారు. దీంతో ఏడాదికి ప్రతి లబ్ధిదారుడు రూ. 66,000 లబ్ధి పొందనున్నారు. ఈ వెబ్ పోర్టల్‌లో అక్టోబర్ 12వ తేదీ నుంచి 25వ తేదీ లోపు అందుబాటులో ఉన్న సమాచారంతో దరఖాస్తులను నింపొచ్చు. వీటిని అక్టోబర్ 26వ తేదీన షార్ట్‌లిస్ట్ చేస్తారు. తర్వాత అభ్యర్థులను అక్టోబర్ 27వ తేదీ నుంచి నవంబర్ 7వ తేదీలోపు కంపెనీలు ఎంపిక చేస్తాయి. ఎంపికైన అభ్యర్థు లు తమ నిర్ణయాన్ని నవంబర్ 8–15ల మధ్య తెలపాల్సి ఉంటుంది. ఒక్కో అభ్యర్థికి గరిష్టంగా మూడు ఆఫర్స్ ఇస్తారు.

టాప్ 500 కంపెనీల ఎంపిక

గత మూడేళ్లలో కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధి పథకంలో భాగంగా తమ నికర లాభాల్లో కొంతమేర సమాజసేవ కోసం సవ్యంగా ఖర్చుచేసిన టాప్ 500 కంపెనీలను ఈ పథకం కోసం కేంద్రం ఎంపికచేస్తుంది.

రిజర్వేషన్లూ వర్తిస్తాయి!

అభ్యర్థుల ఎంపికలో రిజర్వేషన్లనూ వర్తింపజేస్తారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే అలెంబిక్, మహీంద్రా అండ్ మహీంద్రా, మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్‌లు 1,077 ఆఫర్లను ఇప్పటికే ప్రకటించాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



'ఆది-అంతం' తేల్చాల్సిందే!
నగరంలో మరోసారి అక్రమ ద్రవ్యమార్పిడి దందా వెలుగులోకి వచ్చింది. సుల్తాన్‌బజార్ పోలీసులు ముగ్గురు ఏజెంట్లను పట్టుకున్నారు.
-8లో



సైక్లింగ్ క్వీన్స్!
నగర మహిళలు సైక్లింగ్‌పై మక్కువ పెంచుకుంటున్నారు. అపార్ట్‌మెంట్లు, కాలనీల్లోని మహిళలు అసోసియేషన్‌గా ఏర్పడి కొత్త ఆలోచనలతో ముందుకెళ్తున్నారు.
- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
34.0/23.0

వాతావరణం
గ్రేటర్‌లో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 34, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.







బతుకమ్మ పాట.. దాండియా ఆట

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన అటుకుల బతుకమ్మ సంబరాలు అలరించాయి. మరోవైపు సికింద్రాబాద్‌లోని మానేపల్లి నవరాత్రి ఉత్సవ్‌లో భాగంగా క్లాసిక్ గార్డెన్స్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ముంబై బ్యాంబూ బీట్స్ బ్యాండ్ రాక్స్ ఆధ్వర్యంలో దాండియా ఆటలతో సందడి చేశారు. - గన్‌ఫౌండ్రీ

ధరల దడ



భగ్గుమంటున్న కూరగాయలు
- వారంరోజుల్లోనే పైపైకి..
- నిత్యం సుమారు 3.5 వేల టన్నులు అవసరం
- 2 వేల టన్నులు మాత్రమే నగరానికి రాక
- ఆశించిన దిగుమతులు లేక పెరుగుతున్న ధరలు

బహిరంగ మార్కెట్‌లో కిలో కూరగాయల ధరలు (రూపాయల్లో)

కూరగాయలు	గత వారం	ప్రస్తుతం
టమాటా	20	60
బెండ	40	80
బీన్నీస్	80	150
వంకాయ	40	60
దొండ	50	80
క్యాబేజీ	40	80
పచ్చిమిర్చి	40	80
కాకర	60	80
బీర	80	100
చిక్కుడు	80	120

సాగుపై వర్షాల ప్రభావం సైతం ఓ కారణమే



బీన్నీస్.. బిరబిరా..

సాక్షి, సిటీబ్యూరో: కూరగాయల ధరలు మండిపోతున్నాయి. గతంలో లేని విధంగా అక్టోబర్ నెలలో ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి అని నగర మార్కెట్ వర్గాలు అంటున్నాయి. ప్రత్యేకంగా బీన్నీస్ ధర గతంలో ఎన్నడూ లేని విధంగా రిటైల్ మార్కెట్‌లో కేజీ రూ. 150-160 పలుతోంది. దీంతో పాటు చిక్కుడు, బీర ధరలు కూడా సెంచరీ దాటాయి. పైగా మార్కెట్‌కు డిమాండ్‌కు తగ్గట్టుగా కూరగాయలు సరఫరా కాకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి అమ్ముతున్నారు. నగరానికి నిత్యం 3.5 వేల టన్నుల కూరగాయలు అవసరమైతే గురువారం కేవలం 2 వేల టన్నుల దిగుమతి అయినట్లు మార్కెట్ లెక్కలు చెబుతున్నాయి. గతంలో రాష్ట్రంలో ఉత్పత్తులు తగ్గితే పక్క రాష్ట్రాల నుంచి భారీగా దిగుమతులు పెరిగేవి. ప్రస్తుతం పక్క రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉండడంతో నగరానికి దిగుమతులు బాగా పడిపోయాయి. వర్షాలతో కూరగాయల సాగుకు తీవ్ర నష్టం జరగడంతోనే దిగుమతులు తగ్గినట్టు నగరంలోని మార్కెట్ అధికారులు చెబుతున్నారు.

సాధారణంగా వేసవిలో కూరగాయల ధరలు ఎక్కువగానే ఉంటాయి. కానీ ఈ ఏడాది కూరగాయల సాగు తగ్గడంతో పాటు అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లి అక్టోబర్ ప్రాంభంలోనే ధరలు విపరీతంగా పెరిగాయని హోల్‌సేల్ వ్యాపారులు అంటున్నారు. ప్రత్యేకంగా బీన్నీస్ మార్కెట్‌కు దిగుమతి తగ్గడంతో హోల్‌సేల్ మార్కెట్‌లో కేజీ రూ. 130-135 వరకు పలికింది. లోకల్ బీన్నీస్ రాకపోవడంతో కర్ణాటక నుంచి దిగుమతి చేసుకోవడంతో ధర పెరిగిందని మార్కెట్ అధికారులు అంటున్నారు. వర్షాలతో స్థానిక పంట దెబ్బ తినడంతో ఇతరరాష్ట్రాల నుంచి బీన్నీస్ దిగుమతి అవుతోంది.

ట'మోత'

టమాటా ధరలు కూడా ఈ సీజన్‌లో విపరీతంగా పెరిగాయి. గత నెల వరకు టమాటా కిలో రూ.20 లోపే ఉంది. ఈమధ్య కురిసిన వర్షాలతో ధరలు అమాంతంగా పెరిగాయి. బహిరంగ మార్కెట్‌లో కేజీ ధర రూ.60-70 విక్రస్తున్నారు. నిత్యం నగర మార్కెట్లకు దాదాపు 100కుపై లారీల టమాటా దిగుమతి అయ్యేది. గురువారం కేవలం 25-30 లారీలు మాత్రమే దిగుమతి అయ్యిందని మార్కెట్ అధికారులు చెప్పారు. బీన్నీస్, టమాటాలే కాకుండా మిగతా కూరగాయల ధరలు సైతం పైపైకి వెళ్తున్నాయి. కేవలం వారం రోజుల తేడాతో వంటింట్లో ధరలు కుతకుతమంటుండటంతో సామాన్య కుటుంబాలు తల్లడిల్లే పరిస్థితి నెలకొంది.

కరెంటోళ్ల తీర'కాసులు'

ఫైళ్లు తొక్కిపెడుతూ.. అక్రమ వసూళ్లకు పాల్పడుతూ..



- క్షేత్రస్థాయిలో కొంత మంది ఇంజినీర్ల నిర్వాకం
- భారీగా పేరుకుపోయిన డీటీఆర్, కొత్త కనెక్షన్ల జారీ దరఖాస్తులు
- నెల రోజులు దాటినా పెండింగ్‌లోనే..

సాక్షి, సిటీబ్యూరో: కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీ, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, ప్యానల్ బోర్డులు కొంత మంది ఇంజినీర్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. పట్టా భూములతో పాటు ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్ భూముల్లోనూ భారీగా నిర్మాణాలు వెలుస్తున్నాయి. శంషాబాద్, మొయినాబాద్, గండిపేట్, రాజేంద్రనగర్, కొండాపూర్, అయ్యప్ప సొసైటీ, శంకర్‌హిల్స్, మణికొండ తదితర ప్రాంతాల్లో చేపట్టే మెజార్టీ నిర్మాణాలకు జీహెచ్ఎంసీ లేదా ఆయా మున్సిపాలిటీల నుంచి ఎలాంటి అనుమతులు ఉండవు. కానీ.. వీటికి విద్యుత్ కనెక్షన్ జారీ చేయాల్సిందిగా కోరుతూ ఆయా వినియోగదారులు డిస్కంకు దరఖాస్తు చేసుకుంటున్నారు. నిర్దేశించిన ఫీజులను కూడా ఆన్‌లైన్ ద్వారా డిస్కంకు చెల్లిస్తున్నారు. ఎలక్ట్రిసిటీ సిటిజన్ చార్టర్‌లోనూ ఏ దరఖాస్తు ఎన్ని రోజుల్లో పరిష్కరించాలో స్పష్టంగా ప్రకటించారు. ప్రతీ అర్జీకి నిర్ణీత గడువు విధించింది. వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, ఆమోదించడమో, తిరస్కరించడమో చేయాలి. కానీ.. కొందరు ఇంజినీర్లు రోజుల తరబడి ఫైళ్లను తొక్కిపెడుతున్నారు. వినియోగదారు, కాంట్రాక్టర్ నేరుగా కలిసి కొంత ముట్టజెప్పితే గానీ.. పని చేయడం లేదనే ఆరోపణలు లేకపోలేదు.

శివారు సర్కిళ్లలోనే అత్యధికం

రాజేంద్రనగర్ సర్కిల్‌లో అత్యధికంగా 560 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే.. సైబర్‌సిటీలో 550, సరూర్ నగర్‌లో 380, మేడ్చల్‌లో 141, సంగారెడ్డిలో 171, బంజారాహిల్స్‌లో 55, హైదరాబాద్ సెంట్రల్‌లో 28 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. వీటిలో ఒక్క ఇబ్రహీం బాగ్ ఏడీఈ పరిధిలోనే 177 దరఖాస్తులు రోజుల తరబడి తొక్కిపెట్టి ఉండటం గమనార్హం. అదే విధంగా మోకిల సెక్షన్ పరిధిలో 160 ఫైళ్లు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంటే, రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మామిడిపల్లిలో 158 అర్జీలు, సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని తుర్కయాంజాల్‌లో 130, ఇబ్రహీంపట్నంలో 126 సర్వీసులు పెండింగ్‌లో పెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

ఇంజినీర్ల తీరుపై సీఎండీ ఆగ్రహం..

ఇటీవల ఇదే అంశంపై సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఆయా సెక్షన్ ఇంజినీర్లపై సీరియస్ అయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. నిజానికి వినియోగదారు నుంచి ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తును గరిష్ట సమయంలో పరిష్కరించాలి. కానీ.. నెల రోజులు దాటినా.. ఆయా దరఖాస్తులను క్లియర్ చేయకపోవడాన్ని ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. రోజువారీ సమీక్షల్లోనూ ఇదే అంశాన్ని ప్రధానంగా ప్రశ్నిస్తుండటంతో క్షేత్రస్థాయిలోని సంబంధిత ఇంజినీర్లు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఫోకల్ పోస్టు కోసం రూ.లక్షలు ఖర్చు చేసి వస్తే.. తీరా సీఎండీ వరుస సమీక్షలు నిర్వహించి పెండింగ్ ఫైళ్లపై ఆరా తీస్తుండటంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం

మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. ప్రమాద రహిత ప్రయాణ సదుపాయమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు. గురువారం ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో వర్క్‌షాపులో జరిగిన తొలి భద్రతా సదస్సులో ఆయన మాట్లాడారు. అటు ప్రయాణికులు, ఇటు ఉద్యోగులు, సిబ్బంది భద్రతపై మెట్రో అనుసరిస్తున్న ప్రమాణాలకు అనేక భద్రతా అవార్డులు కూడా లభించినట్లు గుర్తు చేశారు. కచ్చితమైన భద్రత ప్రమాణాల అమలు కోసం నిరంతరం కృషి చేయాలని ఆయన సూచించారు. ఎల్అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ, సీఈఓ, కేవీబీరెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రతపై గొప్ప నిబద్ధతను కలిగి ఉన్నట్లు చెప్పారు. ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్, కియోలిస్ సంస్థకు చెందిన ఉన్నతాధికారులు, భద్రతా నిపుణులు, సిబ్బంది ఏర్పాటు చేసిన సేఫ్టీవాక్‌లో పాల్గొన్నారు. అనంతరం సేఫ్టీ ప్యాకెట్ డైరీని ఆవిష్కరించారు. ఎల్అండ్‌టీ మెట్రోరైల్ సీఈఓ సుధీర్ చిప్లుంకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఇరుకు' ఇక్కట్లు!



ఇన్నాళ్లూ పెద్ద పెద్ద గదుల్లో ఉన్నాం..
- ఇప్పుడు డబుల్ బెడ్రూం ఇళ్లలో ఉండేదెలా?
- మూసీ ఉమ్మడి కుటుంబాల్లో అసంతృప్తి
- ఖాళీ చేసినవారికి తప్పని కష్టాలు
- ఆందోళనకు దిగుతున్న పేదలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని మూసీ పరీవాహక పునరావాసం కింద 'డబుల్ బెడ్రూం' ఇళ్ల కేటాయింపు ఉమ్మడి కుటుంబాల్లో దుమారం రేపుతోంది. డబుల్ బెడ్రూం ఇళ్లలో ఇరుకు గదులు ఫ్యామిలీ ప్యాక్‌లకు సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో డబుల్ బెడ్రూం ఇళ్లలో ఎవరు ఉండాలన్న అంశం కుటుంబాల్లో కలతలు సృష్టిస్తోంది. మూసీ నది పరీవాహకంలో నివసిస్తున్న నిరుపేద ఉమ్మడి కుటుంబాలు ఇళ్ల ఖాళీకి అంగీకరిస్తున్నా.. పునరావాసం కింద ఇంటికి ఒక డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపును మాత్రం ససేమిరా అంగీకరించడం లేదు. కుటుంబంలోని సభ్యులందరికీ సరిపోయేలా డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని ఆందోళనకు దిగి స్థానిక ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నారు. మరోవైపు ఇప్పటికి ఇళ్లను ఖాళీ చేసి పునరావాసం కింద డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాలకు తరలి వెళ్లిన ఉమ్మడి కుటుంబాలు చిన్న చిన్న గదులతో నానా కష్టాలు పడుతున్నారు.

సందట్లో సడేమియా


మూసీ నివాసితులకు పునరావాసం కింద డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తుండటంతో వివాహాలతో వేరుపడిన కుటుంబాలు సైతం ఈ ఇళ్ల కోసం ఉమ్మడి కుటుంబాలు అంటూ ఐక్యత చాటుతున్నాయి. ఏకంగా కొన్ని ప్రాంతాల్లో రెండు మూడు రోజులుగా ఆందోళనకు దిగుతున్నాయి. దీంతో వాస్తవంగా ఒకే ఇంటిలో ఉమ్మడిగా నివాసించే కుటుంబాలపై సైతం సర్వే అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. మరోవైపు మూసీ పరీవాహక పరిధిలో అద్దె ప్రాతిపదికన నివాసం ఉంటున్న కుటుంబాలు సైతం తమకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలనే డిమాండ్‌తో ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

తప్పని కష్టాలు..

మూసీ పరీవాహకంలో నివాసాలు ఖాళీ చేసి పునరావాసం కింద డబుల్ బెడ్రూం ఇళ్లకు తరలిన కుటుంబాలు ఇరుకు గదులతో నానా కష్టాలు పడుతున్నారు. మూసీ పరీవాహకంలో సుమారు 300 వరకు కుటుంబాలను దాదాపు 14 డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాలకు తరలించారు. నదీగర్భంలోని ఆక్రమించిన స్థలాల్లో తాత్కాలికంగా నివాసం ఏర్పాటు చేసుకున్న కుటుంబాలు సానుకూలత వ్యక్తం చేయడంలో డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించి పునరావసం కల్పించారు. అయితే.. ఆయా కుటుంబాల్లో సుమారు 20 శాతం వరకు ఉమ్మడి కుటుంబాలు ఉండటంతో డబుల్ బెడ్రూం ఇరుకు గదులు సభ్యులకు సరిపడకపోవడంతో కష్టాలు తప్పడం లేదు. దీంతో వారు సైతం అదనపు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం..

వివరాలు పక్కాగా సేకరించాలి
- అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్



సాక్షి, సిటీబ్యూరో: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం కుటుంబ వివరాలు పక్కాగా సేకరించాలని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ (రెవెన్యూ, ఐటీ) సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్లో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, తహసీల్దార్లు, ఏఎంసీలు, డీపీఓలు, సీఓలు తదితరులకు ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం సేకరించాల్సిన వివరాలు, ఫార్మాట్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం పైలట్ ప్రాజెక్టు కింద జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో రెండు కాలనీలను ఎంపిక చేశామన్నారు. ఆయా కాలనీల్లో కుటుంబాల వివరాలు ఇంటింటికీ తిరిగి సేకరించాలని, ఒక్కో టీమ్ ప్రతి రోజు కనీసం 40 ఇళ్లను సర్వే చేయాలని సూచించారు. అయిదు రోజుల్లోగా ఇంటింటి సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వే సందర్భంగా ఆయా కుటుంబాల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలు, కొత్త ఫ్యామిలీ, మైగ్రేషన్, పర్మనెంట్‌గా విదేశాలకు వెళ్లిన వారి వివరాలు తీసుకొని ఎంట్రీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 8 వరకు ఇది పూర్తి చేయాలని, 9న స్క్రూటినీ ఉంటుందని, 10న ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆమె తెలిపారు. ఒక కుటుంబానికి ఒక్క కార్డు మాత్రమే ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టులో ఒక కుటుంబాన్ని ఒక యూనిట్‌గా గుర్తించి ఐడీ కార్డు ఇస్తారని తెలిపారు. హెడ్ ఆఫ్ ది ఫ్యామిలీగా కుటుంబంలోని సీనియర్ మహిళను తీసుకోవాలన్నారు. ఒక కుటుంబం ఒక చోట మాత్రమే నమోదు చేసుకోవాలని తెలిపారు. నిర్ణీత సమయంలోగా సర్వే పూర్తి చేయాలని స్నేహ శబరీష్ ఆదేశించారు.

జీహెచ్ఎంసీ పరిధిలో కుటుంబ డిజిటల్ సర్వేకు ఎంపిక చేసిన కాలనీలు.. నియోజకవర్గాల వారీగా

పటాన్‌చెరు - గౌతమ్ నగర్, మల్కాజిగిరి - గాయత్రి నగర్, కుత్బుల్లాపూర్ - అయోధ్య నగర్, కూకట్‌పల్లి - సంగీత్ నగర్, ఉప్పల్ - భవాని నగర్, ఎల్బీ నగర్ - జనప్రియ హోమ్స్, మహేశ్వరం - టెలిఫోన్ కాలనీ, రాజేంద్ర నగర్ - గుమ్మకంద కాలనీ, శేరిలింగంపల్లి - పీజేఆర్ కాలనీ, ముషీరాబాద్ - శ్రీనివాస పురం కాలనీ, మలక్‌పేట్ - వాహెద్ నగర్, అంబర్‌పేట్ - ఖాద్రీబాగ్, ఖైరతాబాద్ - లక్ష్మీ నగర్ కాలనీ, జూబ్లీ హిల్స్ - ఎల్.ఎన్ నగర్ (కృష్ణా నగర్), సనత్ నగర్ - సైంటిఫిక్ కాలనీ, నాంపల్లి - ఏపీహెచ్‌బీ కాలనీ, కార్వాన్ - బాగ్దాద్ కాలనీ, గోషామహల్ - హిందీ నగర్, చార్మినార్ - మోతీ గల్లీ, చాంద్రాయణగుట్ట - గులాం ముర్తుజా కాలనీ, యాకుత్‌పుర - నెహ్రూ నగర్, బహదూర్‌పుర - రామ్నాస్‌పురా, సికింద్రాబాద్ - మహ్మద్ గూడ, కంటోన్మెంట్ - అంజయ్య నగర్.

ప్రాణం తీసిన సిగరెట్ గొడవ..

- అనుమానాస్పద మృతి కేసులో వీడిన మిస్టరీ
- సోదరుడే హత్య చేసినట్లు గుర్తింపు

అమీర్‌పేట: అనుమానస్పద మృతి కేసులో మిస్టరీని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు ఛేదించారు. హత్య చేసి మెట్లెక్కబోతూ జారిపడగా కడుపులో కత్తి గుచ్చుకుని చనిపోయాడని కట్టు కథ అల్లినట్లు గుర్తించారు. నిందితుల మాటలపై అనుమానం రావడంతో ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా ఓ ఇంటి సీసీ కెమెరాలో హత్య దృశ్యాలు నిక్షిప్తమయ్యాయి. దీంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం చెప్పాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బల్కంపేటకు చెందిన సర్దార్ గురుప్రీత్ సింగ్ (26) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేసేవాడు. మంగళవారం సాయంత్రం అతను కృష్ణానగర్‌లోని ఓ మద్యం షాపు వద్ద తన పెదనాన్న కుమారుడు సర్దార్ బల్వీర్‌సింగ్‌ను కలిశాడు. అప్పటికే అక్కడ బల్వీర్‌సింగ్ స్నేహితులు కరణ్‌సింగ్ పేరుతో ఉన్న ఇద్దరు వ్యక్తులు, ఏఆర్ కానిస్టేబుల్ సాయి ఉన్నారు. ఐదుగురు కలిసి మద్యం సేవించారు. అనంతరం సాయి సిగరేట్ వెలిగించగా తనకు సిగరెట్ పొగ పడదని గురుప్రీత్ అభ్యంతరం చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం అక్కడి నుంచి వెళ్లి అమీర్‌పేట సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వెనక ఓ షాపు వద్ద కూర్చుని మరోసారి ఫుల్ మద్యం తాగారు. ఆ తర్వాత సాయి సిగరేట్ వెలిగించగా అభ్యంతరం చెప్పిన గురుప్రీత్‌సింగ్ సాయి బైక్ తాళాలు లాక్కున్నాడు. దీతో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో బల్వీందర్ అడ్డుకుని తమ్ముడిని మందలించాడు. తమ్ముడినైన తనవైపు కాకుండా కానిస్టేబుల్‌కు మద్దతుగా మాట్లాడతావా అంటూ గురుప్రీత్ అతడితో వాదనకు దిగాడు. బైక్ తాళాలు ఇవ్వమని అడుగుతున్నా ఇవ్వకపోవడంతో ఆగ్రహానికి లోనైన బల్వీందర్ కత్తితో తమ్ముడి కడుపులో పొడిచాడు. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వీరు జరిగిన సంఘటనపై కట్టు కథ అల్లారు. అర్థరాత్రి ఇంటికి వచ్చి మెట్లపై జారి పడటంతో నడుముకు ఉన్న కంజర్ (కత్తి) కడుపులో గుచ్చుకోవడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి తండ్రికి సైతం ఫోన్ చేసి ఇదే విషయం చెప్పారు. బస్తీ నాయకులు సైతం నిందితుడికి పత్తాసు పలికి కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా హత్య దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధాన నిందుతుడైన బల్వీందర్‌సింగ్‌తో పాటు మరో ముగ్గురిపై హత్య కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ సాయి, కరణ్‌సింగ్‌ల కోసం గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.



గురుప్రీత్‌సింగ్ (ఫైల్)

లివ్ ఇన్ ఫామ్ హౌస్‌పై పోలీసుల దాడి

- విందులో అనుమతి లేకుండా మద్యం పంపిణీ
- డీజే, మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఘట్‌కేసర్: అనుమతి లేకుండా ఫామ్ హౌస్‌లో బర్త్ డే పార్టీ నిర్వహించిన వారిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేట్ ప్రగతి నగర్ కాలనీకి చెందిన నలమాస అఖిల్ కుమార్‌గౌడ్ తన పుట్టిన రోజు సందర్భంగా ఎదులాబాద్ కొత్తగూడెంలోని అశోక్‌కు చెందిన ''లివ్‌ఇన్'' ఫామ్‌హౌజ్‌లో బుధవారం రాత్రి విందు ఏర్పాటు చేశాడు. విందులో అనుమతి లేకుండా స్నేహితులకు మద్యం సర్వ్ చేయడమే కాకుండా డీజే ఏర్పాటు చేశాడు. దీనిపై సమాచారం అందడంతో ఎస్సై ప్రభాకర్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో ఫామ్ హౌస్‌పై దాడి చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'ఆది-అంతం' తేల్చాల్సిందే!

- రూ.1.21 కోట్లు సీజ్ చేసిన సుల్తాన్‌బజార్ పోలీసులు
- ముగ్గురు హుండీ ఏజెంట్ల పట్టివేత
- ఎవరు... ఎవరికి పంపారన్నది ఇప్పటికీ మిస్టరీనే
- ఐటీ, ఈడీ దర్యాప్తులోనూ ఈ అంశాలు బయటకు





సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మరోసారి అక్రమ ద్రవ్యమార్పిడి దందా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్‌జోన్ పరిధిలోని సుల్తాన్‌బజార్ పోలీసులు ముగ్గురు ఏజెంట్లను పట్టుకుని... రూ.1.21 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల హడావుడి ముగిసిన తర్వాత ఇంత పెద్ద మొత్తంలో నగదు దొరకడం ఇదే తొలిసారి. ఈ వ్యవహారంలో ఏజెంట్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ మొత్తానికి సంబంధించిన 'ఆది-అంతం' గుర్తించాల్సి ఉంది. భవిష్యత్తులో ఆదాయపుపన్ను శాఖ (ఐటీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎంటరైతే కరెన్సీ కట్టల వెనుక ఉన్న కీలకాంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

'లోకల్' అయితే హుండీ పేరుతో...

రెండు దేశాల మధ్య జరిగే అక్రమ ద్రవ్య మార్పిడిని హవాలా అని, ఒకే దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య జరిగే మార్పిడిని హుండీగా పేర్కొంటారు. నగరం కేంద్రంగా సాగే దందాలో హవాలా కంటే హుండీనే ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా ఈ రెండు రకాలైన మార్గాలను పన్ను ఎగ్గొట్టేందుకు వ్యాపారస్తులు ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఎన్నికల సీజన్‌లో ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ అనధికారిక ఖర్చుల కోసం అక్రమ ద్రవ్యమార్పిడి మార్గాన్నే ఆశ్రయిస్తుంటారు. నగరంలోని బేగంబజార్, సుల్తాన్‌బజార్, సికింద్రాబాద్, పాట్‌మార్కెట్‌లతో పాటు ఓల్డ్ సిటీలోని కొన్ని ప్రాంతాల కేంద్రంగానే ఈ అక్రమద్రవ్య మార్పిడి ఎక్కువగా జరుగుతోంది.

ముగ్గురిని పట్టుకున్న పోలీసులు...

ఈస్ట్‌జోన్ పరిధిలో ఉన్న సుల్తాన్‌బజార్ పోలీసులు మంగళవారం రూ.1.21 కోట్ల అక్రమ నగదు స్వాధీనం చేసుకున్నారు. హనుమాన్‌టెక్డీ వద్ద లక్ష్మణ్, వసంత్‌లను పట్టుకుని వీరి నుంచి రూ.కోటి స్వాధీనం చేసుకున్నారు. వీరిని విచారించిన నేపథ్యంలో సమీపంలోని శివ టవర్స్‌లో ఉండే ఏజెంట్ తరుణ్ విషయం బయటికి వచ్చింది. దీంతో అతడి కార్యాలయంపై దాడి చేసిన పోలీసులు అతడిని పట్టుకోవడంతో పాటు మరో రూ.21 లక్షల నగదు సీజ్ చేశారు. ముంబైకి చెందిన బబ్లు ఈ దందాకు కీలక సూత్రధారిగా వెలుగులోకి వచ్చింది. పరారీలో ఉన్న ఇతడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

ఇచ్చే వారు, పుచ్చుకునే వారు ఎవరు?

హవాలా, హుండీ దందాలు కేవలం ఏజెంట్ల మధ్య సాగవు. ఉత్తరాదిలో ఉన్న సూత్రధారులకు ఇక్కడి వాళ్లు ఏజెంట్లుగా వ్యవహరిస్తారు. వారి నుంచి వచ్చే ఆదేశాల ఆధారంగా నగరంలోని వ్యాపారుల నుంచి నిర్దిష్ట మొత్తం తీసుకోవడం, వారికి డెలివరీ చేస్తుంటాడు. మరోపక్క ఇక్కడి వాళ్లు అందించే నగదునూ తీసుకుని ఉత్తరాదిలో ఉన్న తమ ఏజెంట్లకు సమాచారం ఇస్తారు. వారు అక్కడ ఉన్న వారికి ఆ మొత్తం డెలివరీ చేస్తుంటారు. ఈ లావాదేవీలన్నీ రూ.10 నోటు ఆధారంగా జరుగుతాయి. నగదు తీసుకున్న ఏజెంట్ ఓ నోటు సీరియల్ నెంబర్ చెప్తాడు. నగదు తీసుకునే వ్యక్తి అక్కడి ఏజెంట్‌కు ఈ నెంబర్ చెప్తేనే నగదు ఇస్తారు. ఈ నోటు ఫొటోను ఇద్దరు ఏజెంట్లు వాట్సాప్ ద్వారా షేర్ చేసుకుంటారు.

ఆ విభాగాలు తేల్చాల్సిందే...

ఇలాంటి అక్రమ ద్రవ్యమార్పిడి కేసుల దర్యాప్తులో పోలీసులకు పాత్ర పెద్దగా ఉండదు. కేవలం అనుమానాస్పదంగా ఉన్న నగదు స్వాధీనం చేసుకుని, బాధ్యులను అదుపులోకి తీసుకుంటారు. ఇతర నేరాలకు సంబంధించి కోణం లేకపోతే ఆ మొత్తాన్ని ఆదాయపు పన్ను శాఖకు అప్పగిస్తారు. సుల్తాన్‌బజార్ పోలీసులు పట్టుకున్న ముగ్గురూ ఏజెంట్లే. వీరికి నగదు ఇచ్చింది ఎవరు? ఆ మొత్తాన్ని తీసుకువెళ్లి ఎవరికి ఇవ్వాలనుకున్నారు? తదితర అంశాలు ఆ శాఖతో పాటు ఈడీ రంగంలోకి దిగితే ఆ విభాగం నిగ్గు తేల్చాల్సిందే. ఈ కేసును ఆదాయపు పన్ను శాఖ అధికారులు అన్ని కోణాల్లోనూ క్షుణ్ణంగా దర్యాప్తు చేసే అవకాశం ఉంది.

బైక్ ఢీ కొని వ్యక్తి మృతి

లంగర్‌హౌస్: డ్రైవింగ్ చేయడానికి కారులో ఒకరికొకరు మారుతున్న సమయంలో బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్సై రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పల్ ఫిర్జాదిగుడకు చెందిన మహ్మద్ రియాజ్(48), మహ్మద్ అజర్ స్నేహితులు. బుధవారం రాత్రి వీరు కారులో కర్నాటకకు బయల్దేరారు. లంగర్‌హౌస్ టిప్పుఖాన్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే మహ్మద్ రియాజ్ తాను కారు డ్రైవింగ్ చేస్తానని చెప్పడంతో అజర్ కారును రోడ్డు పక్కన ఆపాడు. రియాజ్ కిందకు దిగి డ్రైవింగ్ సీట్‌లోకి మారే క్రమంలో వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలు కావడంతో రియాజ్‌తో ద్విచక్రవాహనదారుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రియాజ్ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఘనంగా వాల్యూయర్స్ డే

ఖైరతాబాద్: బ్యాంకు రుణాలను సురక్షితంగా కాపాడటంలో వాల్యూయర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ఎస్‌బీఐ హెచ్‌ఎల్‌ఎస్‌టీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బి.రాములు తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ వాల్యూయర్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం ప్లాజా హోటల్‌లో 55వ వాల్యూయర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ బి.రాములు మాట్లాడారు. ఇటీవలి హైడ్రా కూలివేతలలో బ్యాంకు రుణాలకు సంబంధించిన ఆస్తులు ఏవీ ప్రభావితం కాకుండా తమ సేవలను అందించినందుకు అన్ని బ్యాంకుల ప్యానెల్ వాల్యూయర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూషన్ ఆఫ్ వాల్యూయర్స్ చైర్మన్ పి.మధు, సెక్రటరీ కె.చిరంజీవి, మాజీ చైర్మన్లు దేశ్‌పాండే పాల్గొన్నారు.

హార్న్‌బిల్ మ్యూజిక్ ఫెస్టివల్ బ్రోచర్ ఆవిష్కరణ

మాదాపూర్: నాగాలాండ్‌లో అక్టోబర్ 18నుంచి 21 వరకు చారిత్రాత్మకమైన ది హార్న్‌బిల్ మ్యూజిక్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఫెస్టివల్ బ్రోచర్‌ను విడుదల చేశారు. బ్యాటిల్ ఆఫ్ ది బ్యాండ్స్ పేరుతో నిర్వహించనున్న ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాల కళాకారులు పాల్గొననున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు 4 మిలియన్ల ప్రైజ్ మనీగా ఇవ్వనున్నారు. తర్వాతి స్థానాలు దక్కించుకున్న బ్యాండ్‌లకు వరుసగా 2 మిలియన్ల రూపాయలు, 1.5 మిలియన్లు, రూ. 5 లక్షలు బహుమతులుగా అందజేయనున్నారు. కార్యక్రమంలో సుచిర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్, శ్రేయాస్ గ్రూప్ డైరెక్టర్ శ్రీనివాస్, నాగాలాండ్ ముఖ్యమంత్రి సలహాదారుడు అబుమెహతా తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

చౌటుప్పల్, భువనగిరి ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

కవాడిగూడ: చౌటుప్పల్, భువనగిరి ట్రిపుల్ ఆర్(రీజినల్ రింగురోడ్డు) అలైన్‌మెంట్ మార్చాలి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల ఐక్య వేదిక, భూనిర్వాసితుల ఐక్య వేదిక యాదాద్రి సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు హాజరైన ఈటల మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ఎవరూ ఆనందంగా లేరని, ఎవరిని కదిలించినా ఏదో ఒక దు:ఖంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కుటుంబాలతో సహా ధర్నా చేస్తున్నారంటే వారు ఎంత బాధలో ఉన్నారో అర్థం అవుతోందని, రైతులు చేసే పోరాటానికి మా సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ విషయంలో గత ప్రభుత్వ ఆలోచనకు భిన్నంగా కొద్దిమంది అవసరాలకు అనుగుణంగా అలైన్‌మెంట్ మార్చే ప్రయత్నం జరిగిందని, దీనివల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. చౌటుప్పల్‌లో రైతుల భూములతోపాటు చౌటుప్పల్ పట్టణాన్ని కూడా విడదీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ రైతులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు తెగించి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, రైతు ఐక్య వేదిక నాయకులు చింతల దామోదర్‌రెడ్డి, కృష్ణ, నర్సింహ, శ్రీశైలం, సురేందర్‌రెడ్డి, మల్లేశం, రామలింగం గౌడ్, దబ్బేటి రాములు, భాగయ్య, నర్సిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వెంకటేశం, పాండుయాదవ్, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

బాలుడిపై లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: సరూర్‌నగర్ మైనారిటీ బాలుర వసతి గృహంలో 7వ తరగతి చదువుతున్న బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.16వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి గురువారం తీర్పు చెప్పారు. కోర్టు ఏపీపీ సునీత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆసిఫ్‌నగర్‌కు చెందిన బాలుడు సరూర్‌నగర్ మైనారిటీ బాలుర వసతి గృహంలో 7వ తరగతి చదువుతున్నాడు. అక్కడే హౌస్ కీపింగ్ విధులు నిర్వహిస్తున్న మహ్మద్ అబ్దుల్ మాజీద్ 2018 ఏప్రిల్ మొదటి వారంలో అర్ధరాత్రి గదిలోకి వెళ్లి బాలుడిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. తరువాత సెలవులకు ఇంటికి వచ్చిన బాలుడికి తీవ్ర రక్తస్రావం జరుగుతుండటంతో గుర్తించిన తండ్రి ఆరా తీయగా అసలు విషయం చెప్పాడు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు సరూర్‌నగర్ పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం గురువారం నిందితుడికి పైవిధంగా శిక్ష విధిస్తూ, బాధితుడిరి రూ. 5లక్షలు నష్టపరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది. నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసులు రవి, చందర్‌రావులను ఉన్నతాధికారులు అభినందించారు.



నిందితుడు మహ్మద్ అబ్దుల్ మాజీద్

జలమండలిలో రేషనలైజేషన్

- 8 డివిజన్ల పరిధి సర్దుబాటు

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి డివిజన్ల రేషలైజేషన్ ప్రక్రియ చేపట్టింది. సుమారు ఎనిమిది డివిజన్ల పరిధిని వివిధ డివిజన్ల కింద సర్దుబాటు చేసింది. అదే విధంగా డివిజన్ల పరిధిలో హెచ్చు తగ్గులుగా ఉన్న నల్లా కనెక్షన్ల సంఖ్యను సైతం 50 వేల నుంచి 60 వేల వరకు సర్దుబాటు చేసింది. జలమండలి పరిధిలో మొత్తం మీద 49 డివిజన్ల ఉండగా రేషలైజేషన్ ప్రక్రియతో 41 డివిజన్లుగా మారాయి. కోర్ సిటీ ఎనిమిది డివిజన్ల పరిధిలో ఎలాంటి మార్పు లేకపోగా, శివారు పరిధిలో ఎనిమిది డివిజన్లు ఉండగా రేషలైజేషన్ ప్రక్రియతో తొమ్మిది డివిజన్లుగా మారాయి. శేరిలింగం పల్లి డివిజన్‌ను రెండు డివిజన్లుగా విభజించారు. ఓఆర్ఆర్ డివిజన్ పరిధిలోని ఏడు డివిజన్లు ఉండగా వాటిని ఐదు డివిజన్లకు కుదించారు. ట్రాన్స్‌మిషన్ డివిజన్‌లో ఎలాంటి మార్పు లేక పోగా ప్రాజెక్టు డివిజన్లలో ఐదింటిని ఎత్తివేశారు. దీంతో ప్రాజెక్టు డివిజన్ల సంఖ్య 13 నుంచి 8 డివిజన్లకు చేరింది. ఇతరాత్ర తొమ్మిది డివిజన్ల పరిధిని ఏడు డివిజన్లలో సర్దుబాటు చేశారు

తెలంగాణ అగర్వాల్ సమాజ్ సేవలు అభినందనీయం

- రాష్ట్ర డీజీపీ జితేందర్
- ఘనంగా అగ్రసేన్ మహారాజ్ జయంతి వేడుకలు

శంషాబాద్: అగ్రసేన్ మహారాజ్ 5148 జయంతి వేడుకలు పట్టణంలోని క్లాసిక్ త్రీ కన్వెన్షన్‌లో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు రాష్ట్ర డీజీపీ జితేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాజ్ అగ్రసేన్ బోధనలు పాటించాలని సూచించారు. మహిళా సాధికారత , సామాజిక సేవలపై అగ్రసేన్ మహారాజ్ వేల ఏళ్ల క్రితమే బోధించారన్నారు. తెలంగాణ అగర్వాల్ సమాజ్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ హోం కార్యదర్శి రవిగుప్తా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, సీఐడీ డీజీపీ శిఖాగోయల్, అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు మనీష్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



అగ్రసేన్ మహారాజ్ జయంతి వేడుకల్లో రాష్ట్ర డీజీపీ జితేందర్

సీవరేజీ ఓవర్ ఫ్లో తగ్గాలి ..!

- స్పెషల్ డ్రైవ్ సీవరేజీ పనుల పరిశీలన
- క్షేత్ర స్థాయిలో ఎండీ అశోక్ రెడ్డి పర్యటన



స్థానికులతో ముచ్చటిస్తున్న దృశ్యం

సాక్షి,సిటీబ్యూరో: ''నిరంతరం డ్రైనేజీ పైప్‌లైన్ల క్లీనింగ్ జరగాలి... ఎప్పటికప్పుడు మురుగు వ్యర్థాలు బయటికి తీయాలి.. అప్పుడే మ్యాన్ హోళ్ల ఓవర్ ఫ్లో సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది' అని జల మండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. మహానగరంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సీవరేజ్ ఓవర్ ఫ్లో ' (సాఫ్) స్పెషల్ డ్రైవ్ పని తీరును పరిశీలించేందుకు గురువారం ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటించారు. కేపీహెచ్ బీ, ఫేజ్-15 కైత్లాపూర్ తదితర ప్రాంతాల్లో సీవరేజీ డీసిల్టింగ్ పనులను పరిశీలించారు. పని చేస్తున్న సమయంలో రక్షణ పరికరాలు ఉపయోగించాలని సూచించారు. సిల్ట్ కార్టింగ్ వాహనాల కార్మికులతో మాట్లాడారు. వాహనాల్లో పనిచేసే సిబ్బంది వివరాలు అడిగి.. వారికి ఏవైనా సమస్యలున్నాయా అని వాకబు చేశారు. ధ్వంసమైన మ్యాన్ హోళ్లను గుర్తించి, వాటి స్థానంలో వెంటనే కొత్త వాటి నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. హౌసిగ్ బోర్డు కాలనీలో బ్లాకులను గుర్తించి, 6 ప్లాట్లకు ఒక కమ్యూనిటీ సిల్ట్ ఛాంబర్ ను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

స్థానికులతో ముచ్చట

ఫేజ్-15 కైత్లాపూర్‌లో స్థానిక కార్పొరేటర్, కాలనీ వాసులుతో ఎండీ అశోక్ రెడ్డి ముచ్చటించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీవరేజీ అవుట్ లెట్ లేక రహదారులపై మురుగు పొంగుతుందని వారు ఎండీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సమస్యను పరిశీలించి అవుట్ లెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత స్థానిక డబుల్ బెడ్ రూమ్ కమ్యూనిటీ ప్రాంగణంలో పర్యటించారు. అక్కడ అపరిశుభ్రంగా ఉన్న సంపును పరిశీలించి..వినియోగానికి వీలుగా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జలమండలి ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యకు కారణం గుర్తించాలి

స్పెషల్ డ్రైవ్‌లో సీవరేజీ ఓవర్ ఫ్లో కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి చొరవ చూపాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. 90 రోజుల్లో మురుగు సమస్యలను 30 శాతానికి తగ్గించేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రతి డివిజన్‌లో దీర్ఘకాలికంగా, తరచూ వచ్చే సీవరేజీ ఫిర్యాదులను శాశ్వతంగా పరిష్కరించడానికి అంచనాలు రూపొందించుకోవాలని సూచించారు. అధికారుల నుంచి సిబ్బంది వరకు శక్తివంచన లేకుండా పనిచేస్తే అద్భుత ఫలితాలు రాబట్టవచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు.

సెలవులో హెచ్ఎండీఏ కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సెలవుపై వెళ్లారు. ఈ నెల 15వ తేదీ వరకు విదేశీ పర్యటన నిమిత్తం ఆయన సెలవులో వెళ్లారు. దీంతో మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ తాత్కాలికంగా హెచ్ఎండీఏ కమిషనర్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

సత్యసాయి నిగమాగమంలో హస్తకళా ప్రదర్శన


చీరలను తిలకిస్తున్న వర్ధమాన నటి వాణ్య అగర్వాల్

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో జగదీశ్వర్ హస్తకళ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–2024ను వర్ధమాన నటి వాణ్య అగర్వాల్ ప్రారంభించారు. చేనేతకళాకారులను ప్రోత్సహించి వారి వస్త్రాలను ధరించాలని కోరారు. ఈ ప్రదర్శనలోని సిల్క్, కాటన్ వస్త్రాలు మగువల మనసు దోచుకుంటున్నాయి. ఈ వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు జయేష్‌గుప్తా తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 08 వరకూ కొనసాగుతుంది.

వీధిదీపాల సమస్య పరిష్కరించాలని వినతి


జెడ్‌సీకి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్ : డివిజన్‌లోని అనేక ప్రాంతాల్లో వీధిదీపాలు సరిగ్గా వెలగడం లేదని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు గురువారం ఆమె జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం దేదీప్యవిజయ్ మాట్లాడుతూ ఈ సమస్యపై నాలుగు నెలలుగా ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. జవహర్‌నగర్, యాదగిరినగర్, ఈస్ట్ రహమత్‌నగర్ బస్తీలతో పాటుగా పలు కాలనీల్లో వీధిదీపాల సమస్య ఎక్కువగా ఉందన్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేత విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా అగ్రసేన్ మహారాజ్ జయంతి


అగ్రసేన్ మహరాజ్‌కు నివాళులు అర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

బంజారాహిల్స్: అగ్రసేన్ మహారాజ్ జయంతి సందర్భంగా బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12 చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ అహింస, శాంతి, దయ త్యాగానికి నిలువెత్తు నిదర్శన అగ్రసేన్ మహారాజ్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో అగర్వాల్ సమాజం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, గిరీష్ కుమార్ సంఘీ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యిమంది న్యూట్రీషన్లను తయారు చేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పంజగుట్ట: ఆరోగ్యకర సమాజమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా వెయ్యిమంది హెల్త్ అండ్ న్యూట్రీషన్ అంబాసిడర్(హెచ్‌ఎన్‌ఏ)లను తయారు చేస్తున్నామని హెచ్‌ఎన్‌ఏ కౌన్సిల్ కో ఆర్డినేటర్ డాక్టర్ మోనికా స్రవంతి తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారికి 20 రోజులపాటు 20 సెషన్స్ ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు ఇస్తామని చెప్పారు. పోషకాహారం వండే పద్ధతులను నేర్పిస్తామని ఆమె పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిల్లెట్ న్యూస్ చైర్మన్ శ్రీనివాస్‌తో ఆమె మాట్లాడారు. మన పూర్వీకులు చిరుధాన్యాలు తినేవారని, దీంతో వారిలో రోగనిరోధక శక్తి తగినంతగా ఉండేదన్నారు. కానీ, ఇప్పుడు అంతా కల్తీ ఆహారం తీసుకుని అనేక రోగాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ శిక్షణ ఈ నెల 14 నుంచి 24 వరకు కొనసాగుతుందని, ప్రతీనెలా హెచ్‌ఎన్‌ఏ కౌన్సిల్ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ అఖిలజ, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్(బోరబండ): మారుతున్న సమాజంలో కంప్యూటర్ వినియోగం విస్తృతంగా పెరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. స్వరాజ్‌నగర్‌లోని అల్‌ఖైర్ సొసైటీ సహకారంతో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని సూచించారు. అల్‌ఖైర్ సేవలు మరింత విస్తరించాలని నిర్వాహకులను కోరారు. జమాతే ఇస్లామి హింద్ జూబ్లీహిల్స్, అల్‌ఖైర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ రుక్నుద్దీన్ నాద్వి నిజామీ బస్తీ నాయకుడు రిజ్వీ, డివిజన్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, మహేష్‌గౌడ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్ అభివృద్ధికి కృషి చేయాలి

హైడ్రా కమిషనర్ రంగనాథ్


రంగనాథ్‌ను సన్మానిస్తున్న మధురానగర్ కాలనీ నేతలు

వెంగళరావునగర్: గత 44 ఏళ్లుగా మధురానగర్ కాలనీతో తనకు ఎంతో అనుబంధం ఉందని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ అన్నారు. మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్44వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. కాలనీ పుట్టక ముందు నుంచే తమ కుటుంబం ఇక్కడ ఉంటోందన్నారు. కాలనీని మరింత అభివృద్ధి చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రముఖ సినీ హాస్యదర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ ఎన్ని హాస్యసినిమాలు చేసినా సెట్స్ మీద లేనంత ఆనందం కాలనీలోని తన ఇంటికి వస్తే కలుగుతుందని, మధురానగర్‌కు అంత ప్రత్యేకత ఉందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్, కాలనీ ఇన్‌చార్జి ప్రెసిడెంట్ ఎస్.వి.మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, జాయింట్ సెక్రటరీ సి.హనుమంతరావు, కోశాధికారి కె.సుగుణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, మెంబర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గుంటూరు శ్రీఅమృతలహరి థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన 'నాన్న–నేనొచ్చేస్తా'నాటిక ప్రదర్శన, ప్లేబ్యాక్ సింగర్ ఆర్.ఎల్.రచిత ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని కేన్సర్ ఆస్పత్రి పక్క వీధిలో ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్ ఆక్రమణలను, డబ్బాకొట్లను జీహెచ్‌ఎంసీ అధికారులు గురువారం తొలగించారు. దీనిని సర్కిల్–18 ఏఎంహెచ్‌వో డాక్టర్ భార్గవ్ నారాయణ పర్యవేక్షించారు. డబ్బాల వెనుక పేరుకుపోయిన వ్యర్థాలు రెండు టిప్పర్ లారీల మేర ఉన్నాయని తెలిపారు. డబ్బాల మాటును పెద్ద ఎత్తున వ్యర్థాలు పోగుకావడం వల్ల దోమలు వృద్ధి చెందడంతో పాటు అపరిశుభ్ర వాతావరణం ఏర్పడిందని చెప్పారు. మరోసారి డబ్బాలు ఏర్పాటు చేసిన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



డైట్‌ను పునరుద్ధరించాలని వినతి

ఖైరతాబాద్: హైదరాబాద్ జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డీఐఈటీ) పునరుద్ధరణ, డీఈడీ సీట్ల కేటాయింపు చేపట్టాలని కోరుతూ తెలంగాణ డైట్ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రామిరెడ్డి, కార్యదర్శి రవీందర్, ఉపాధ్యక్షుడు జహీరుదీన్ మాట్లాడుతూ హైదరాబాద్ నేరెడ్‌మెట్‌లో జిల్లా విద్యాశిక్షణాసంస్థ (డైట్)లోని డీఈడీ (డిప్లమా ఇన్ ఎడ్యుకేషన్)లో సీట్లు కేటాయించాలని కోరారు. మొదటి సంవత్సరం 150 సీట్లు వెంటనే కేటాయించాలని, కన్వీనర్ డీసెట్ 2024ను వెంటనే భర్తీ చేయాలని, రాష్ట్రంలో ఉమ్మడి పది జిల్లాలకుగాను హైదరాబాద్ మినహా 9 జిల్లాలకే డైట్ కేటాయించడం శోచనీయమని అన్నారు. దీం స్థానిక అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు.

అభిషేకాలు.. పారాయణాలు..

కనులపండువగా తొలిరోజు నవరాత్రి వేడుకలు


శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా శ్రీనగర్ కాలనీ భ్రమరాంబికా దేవి అమ్మవారు..


స్వర్ణ కవచాలంకరణలో బంజారాహిల్స్‌లోని విజయకనకదుర్గా దేవి అమ్మవారు


బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మతల్లి...


శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా ఫిలింనగర్ శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారు

శ్రీ దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అమ్మవారి ఆలయాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. వేకువజామునే అమ్మవారికి అభిషేకంతో పూజలు ప్రారంభమయ్యాయి. ఫిలింనగర్ దైవసన్నిదానంలో రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి వేకువజామునే పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. 21 మంది మహిళలతో కలిసి అమ్మవారికి సౌందర్యలహరి పారాయణం నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. శ్రీనగర్‌కాలనీలోని శ్రీ భ్రమరాంబికా అమ్మవారి ఆలయంలో నిర్వహించిన చండీ హోమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఫిలింనగర్ మాగంటి కాలనీలోని కనకదుర్గా దేవి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమానికి మహిళలు భారీగా తరలివచ్చారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని శ్రీ కనక దుర్గాదేవి అమ్మవారు స్వర్ణ కవచాలను ధరించి భక్తులకు దర్శనమిచ్చారు. బంగారు కవచాలు ధరించిన అమ్మవారిని దర్శించేందుకు స్థానిక భక్తులతో పాటు విదేశీయులు సైతం రావడం గమనార్హం. జర్మనీ దేశానికి చెందిన దంపతులు ఆలయానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. – బంజారాహిల్స్


ఫిలింనగర్ దైవసన్నిదానంలో సౌందర్య లహరి పారాయణంలో పాల్గొన్న భక్తులు...


మాగంటి కాలనీ కనకదుర్గా దేవి ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు..


బంజారాహిల్స్‌లోని అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్న జర్మనీ దేశస్తులు...


బంజారాహిల్స్‌లోని కనకదుర్గా దేవి ఆలయంలో చండీహోమంలో భక్తులు..

కేంద్రం బీసీ కులగణన చేపట్టాలి

కుమారస్వామి విజ్ఞప్తి

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం వెంటనే దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి డిమాండ్ చేశారు. బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వ పదేళ్ల పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఆరోపించారు. గురువారం దళ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఏకకాలంలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంపై జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఒత్తిడి పెంచాలని కోరారు. కుల గణన చేసేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, నేషనల్ కాన్ఫరెన్స్ ఆర్‌జేడీ, జనతాదళ్, టీడీపీ, శివసేన, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరుతూ ఆయా పార్టీల నాయకత్వాలకు లేఖలు రాయనున్నట్లు తెలిపారు.

కులగణన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేయాలి

పంజగుట్ట: ఎస్సీ కులగణన తర్వాతే రిజర్వేషన్లను వర్గీకరించాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీల్లో 57 ఉపకులాలు రాజకీయంగా, ఆర్థికంగా, రిజర్వేషన్ ఫలాలు పొందడంలో వెనకబడి ఉన్నారని అన్నారు. వర్గీకరణ కోసం మంత్రుల కమిటీ కాకుండా రాజకీయాలకు అతీతంగా ఉండే జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. రాజకీయ కమిటీ దురుద్దేశంతో ఒక వర్గానికి కొమ్ముకాసేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేస్తారని వార్తలు వస్తున్నాయని, కానీ ప్రభుత్వం వద్ద ఎస్సీ ఉపకులాల లెక్కలు సరిగ్గా లేవని అన్నారు.

అందరికీ వైద్యం ప్రభుత్వ బాధ్యత

లిబర్టీ: అందరికీ వైద్యం అందించే బాధ్యత ప్రభుత్వాలపైన ఉందని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలు, వికలాంగులు, మానసిక రోగులకు ఉచిత వైద్యం అందించాలని కోరారు. ఆదిలీలా ఫౌండేషన్ మాతృదేవో భవ ఆధ్వర్యంలో గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. వ్యక్తులు, శక్తులు, స్వచ్ఛంద సంస్థలు వైద్యసేవలు అందించి పేదలకు, మధ్య తరగతి వర్గాలకు చేయూతనివ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో కె.బి.శ్రీధర్ పాల్గొన్నారు.

ఎన్నిక


వెంకటేష్‌గౌడ్

లిబర్టీ: నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఎన్‌ఎఫ్ ఐఆర్‌టీడబ్ల్యూయూ) జాతీయ ఉపాధ్యక్షులుగా రాష్ట్రానికి చెందిన బి.వెంకటేష్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు రెండురోజులపాటు బెంగళూరులో జరిగిన జాతీయ మహాసభల్లో ఈ ఎన్నిక జరిగింది. ఆటో, క్యాబ్, మోటార్ వాహనాల డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగిస్తానని వెల్లడించారు.

సన్మానం



వెంగళరావునగర్ : మధురానగర్ కాలనీలోని విజ్ఞానజ్యోతి పబ్లిక్ స్కూల్ సీనియర్ ప్రిన్సిపాల్ జె.అరుణకుమారిని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సన్మానించారు. అరుణకుమారి మధురానగర్‌కాలనీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నో సేవలు అందించడమే కాకుండా, నాలుగుసార్లు డైనమిక్ ప్రిన్సిపాల్‌గా అవార్డు తీసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 6న తుది ఓటరు జాబితా


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి

బంజారాహిల్స్: ఓటరు జాబితా సవరణపై ఇంటింటి సర్వే దాదాపుగా పూర్తికావచ్చిందని జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి తెలిపారు. జనవరి 6వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఇక్కడ జరిగిన ఖైరతాబాద్ నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఎల్‌వోలు, ఓటరు జాబితాలో అర్హుల పేర్ల నమోదుకుగాను ఇంటింటికీ వెళ్లారని తెలిపారు. ఈ నెల 29న ముసాయిదా జాబితా ప్రకటిస్తారన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024–25లో భాగంగా ఓటరు జాబితా తయారు చేస్తున్నామన్నారు.

'లేపాక్షి'లో బొమ్మల కొలువు


ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–69లోని నందిగిరి హిల్స్ లేపాక్షి ఎంపోరియంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు విశేషంగా ఆకట్టుకుంటోంది. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలతో తీర్చిదిద్దిన ఈ బొమ్మల కొలువు కొనుగోలుదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ, దసరా పురస్కరించుకుని ఈ బొమ్మల కొలువు ఏర్పాటు చేసినట్లు లేపాక్షి హస్తకళల ఎంపోరియం మేనేజర్ సుబ్బారావు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల సంప్రదాయ హస్తకళలు ఉట్టిపడే ఆకృతులు ఇక్కడ కొలువుదీరాయి. ఈ బొమ్మలన్నీ చక్కగా తీర్చిదిద్ది షోరూంను అందుబాటులో ఉంచారు.

బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో లక్కీ డ్రా కాంటెస్ట్


లక్కీ డ్రా కాంటెస్ట్‌ను ప్రారంభిస్తున్న సినీ తారలు మాళవిక శర్మ, సీరత్ కపూర్

బంజారాహిల్స్: బజాజ్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఇండియాలోనే బిగ్గెస్ట్ ఫెస్టివల్ ఆఫర్లను ప్రకటించింది. గురువారం బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూంలో జరిగిన ఈ కాంటెస్ట్ ప్రారంభోత్సవంలో సినీ తారలు మాళవిక శర్మ, సీరత్ కపూర్ సందడి చేశారు. ఈ సందర్భంగా వారు లక్కీ డ్రా కాంటెస్ట్ కూపన్లతోపాటు పలు ఆఫర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత కరణ్ బజాజ్ మాట్లా డుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని అన్ని బజాజ్ స్టోర్లలో 2025 జనవరి 8వ తేదీ వరకు ఈ కాంటెస్ట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. 1 కోటి రూపాయల వరకు నగదు బహుమతితో పాటు 30 ఆల్టో కార్లు గెలుచుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

చిన్నారుల బతుకమ్మ సందడి



శ్రీనగర్‌కాలనీ: చిన్నారులు బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. గురువారం ఎర్రగడ్డ సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ నృత్యాలతో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేబినెట్‌లో లంబాడీలకు స్థానం కల్పించాలి

రౌండ్ టేబుల్ భేటీలో వక్తల డిమాండ్



పంజగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు లంబాడీలు ఎంతో కీలకపాత్ర పోషించారని, ఇదే విషయం ముఖ్యమంత్రి కూడా అనేక సభల్లో చెప్పారని, కానీ కేబినెట్‌లో మాత్రం వారికి స్థానం కల్పించకపోవడం బాధాకరమని వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే గిరిజన సంఘాల నేతలు అందరం కలిసి ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలిసి మంత్రిపదవి ఇవ్వాలని కోరతామని పేర్కొన్నారు. మంత్రిపదవి కేటాయించాలని కోరుతూ గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి రవీంద్ర నాయక్, గిరిజన శక్తి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్ చౌహాన్, రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్ మాట్లాడుతూ త్వరలోనే ప్రభుత్వం కేబినెట్‌ను విస్తరించనున్న నేపథ్యంలో లంబాడీలకు స్థానం కల్పించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన జేఏసీ ప్రతినిధి రాజేష్ నాయక్, వివిధ గిరిజన సంఘాల నాయకులు రామచందర్ నాయక్, సురేష్ నాయక్, రాంబల్ నాయక్, శ్రీరాం నాయక్, అంజయ్య, ధనుంజయ్ పాల్గొన్నారు.


రహమత్‌నగర్ గౌరి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో

రహమత్‌నగర్(బోరబండ): దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో మొదలైయ్యాయి.రహమత్‌నగర్,బోరబండ డివిజన్‌లలో వివిధ బస్తీల్లో నిర్వహకులుమండపాలు ఏర్పాటు చేసి అమ్మవార్లను ప్రతిష్ఠించారు. తొలిరోజైన గురువారం రాత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిద ప్రాంతాల్లోని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.రహమత్‌నగర్‌లోని గౌరి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి.


జీటీఎస్ దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

వెంగళరావునగర్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్ ఎస్పీఆర్ హిల్స్‌లోని సంతోష్‌గిరి ప్రాంతంలో ఓ మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టుగా పోలీసులకు సమాచారం అందింది. దాంతో ఎస్ఐ అవినాష్ బాబు తన సిబ్బందితో సంఘటనాస్థలానికి వెళ్లగా, వారిని చూసి ఆమె పారిపోవడానికి ప్రయత్నించింది. పోలీసులు ఆమెను పట్టుకొని విచారించారు. మొత్తం 14 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్ : ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉండే తానాజీ బబ్లూ కొంతకాలంగా బార్బర్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 1వ తేదీ రాత్రి ద్విచక్ర వాహనాన్ని తన ఇంటి ముందు పార్క్ చేశారు. మరుసటి రోజు ఉదయం చూడగా అది కనిపించలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యభిచార నిర్వాహకుడి అరెస్టు

పంజగుట్ట: వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని పంజగుట్ట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యూసూఫ్‌గూడకు చెందిన శంకర్(42) గత మే నెలలో పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శబరినాథ్ గల్లీలో వ్యభిచారం నిర్వహిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లగా శంకర్ గమనించి అక్కడ నుంచి పరారయ్యాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న శంకర్‌ను గురువారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

రెడ్డి ప్రజాప్రతినిధుల సన్మానసభకు సీఎంకు ఆహ్వానం



రాంగోపాల్‌పేట్: రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే రెడ్డి ప్రజాప్రతినిధుల సన్మాన సభకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జేఏసీ ప్రతినిధులు ఆహ్వానం పలికారు. గురువారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. 6వ తేదీ హైటెక్ సిటీలోని శిల్పారామంలో రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లను ఘనంగా సన్మానించనున్నామని వారు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రెడ్డి జేఏసీ చైర్మన్ అప్పమ్మగారి రాంరెడ్డి, కో చైర్మన్ పైళ్ల హరినాథ్‌రెడ్డి, మేడ్చల్ అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, నారెడ్డి రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

14న ఎఫ్‌డీడీఐ 4వ స్నాతకోత్సవం

రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) నాల్గవ స్నాతకోత్సవాన్ని ఈ నెల 14వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ ఆడిటోరియంలో ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నర్సింహుగారి తేజ్ లోహిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొంటారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీడీఐలో వివిధ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను, మెడల్స్‌ను ఆయన చేతులమీదుగా పంపిణీ చేస్తారు.

టీవీఏసీ జేఏసీ చైర్మన్‌గా ధన్‌రాజ్

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ల సంఘం సెంట్రల్ సర్కిల్ కొత్త కార్యవర్గం ఎన్నికైంది. చైర్మన్‌గా ఎం.ధన్‌రాజు, కన్వీనర్‌గా శంకర్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా సైదులుగౌడ్, సంయుక్త కార్యదర్శిగా బాలకృష్ణ, కో కన్వీనర్‌గా జాకీర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా అరుణ్, సభ్యులుగా జి.మల్లేష్, ఎంఏ ఖాదీఖాన్, టి.శ్రీనివాస్, రాజేష్ ఎన్నికైనట్లు రాష్ట్ర కో కన్వీనర్ గాంబో నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జేఎల్ ఫలితాలు విడుదల చేయాలని వినతి



సాక్షి, సిటీబ్యూరో: ఉపాధ్యాయ నియామకాలతో పాటు 1,392 జూనియర్ లెక్చరర్ పోస్టులకు సంబంధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించాలని జూనియర్ లెక్చరర్స్ అభ్యర్థుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేసినప్పుడే రాష్ట్రం అభివృద్ధిపథంలో నడుస్తుందన్నారు. 1:2 జూనియర్ లెక్చరర్స్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తయ్యిందని, వెంటనే తుది ఫలితాలను విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ కాలేజీల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం తమవంతు కృషి చేస్తామని వివరించారు. ఈ దసరా పండగలోగా నియామకాలు ఇవ్వాలని కోరారు. తమ అభ్యర్థనను శాంతియుతంగా సీఎం దృష్టికి తీసుకెళ్లడానికి ఇక్కడికి విచ్చేశామని తెలిపారు. అనంతరం పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ని ఆయన నివాసంలో కలిసి జేఎల్ ఫలితాలు త్వరగా వచ్చేలా చూడమని వినతి పత్రం సమర్పించారు.

20న జాతీయ జ్ఞాపకశక్తి పోటీలు



పంజగుట్ట: ఇండియన్ మెమొరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన బేగంపేటలోని హోటల్ మనోహర్‌లో 15వ ఇండియన్ నేషనల్ మెమరీ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు పోటీల ఇన్‌చార్జి డాక్టర్ పి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పోటీల కరపత్రాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాపకశక్తికి సంబంధించి ఒక క్రీడ ఉందని, ఇప్పటి వరకు చాలామందికి తెలియకపోవడం బాధాకరమన్నారు. పోటీల్లో ఏడేళ్ల నుంచి 73 ఏళ్ల వయస్సు ఉన్నవారు పాల్గొంటారని, అందరికీ ఒకే తరహా పరీక్ష ఉంటుందన్నారు. ఒకదానికి మరోదానికి సంబంధం లేని పదాలు ఒక్క రోలో 20 ఉంటాయని, వాటిని ఒక్కసారి చూసి తిరిగి అదే ప్రకారం రాయడం, ఒక పేజీలో వెయ్యి అంకెలు ఉంటాయని దాన్ని 5 నిమిషాలు చూసి తిరిగి అదే వరుసక్రమంలో రాయడం, ఆడియోలో సెకండ్‌కు ఒక అంకె చెబుతారు మొత్తం 100 అంకెలు ఒక్కసారి ఆడియో విని అదే వరుస క్రమంలో రాయడం ఇలా మొత్తం 10 విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీలకు 3 దేశాల నుంచి 13 రాష్ట్రాల నుంచి 180కి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. హైదర్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలోని ఐదుగురు విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చానని వారు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. పి.ఆర్.శ్రీనివాస్, శ్రీవల్లి, షాజీ, కార్తీక్ పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో.. దళితుల ఇళ్లు కూల్చొద్దు

డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

కాచిగూడ: హైడ్రా పేరుతో.. దళితుల ఇళ్ల కూల్చివేతలను తక్షణమే నిలిపివేయాలని దళిత బహుజన పార్టీ(డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నారాయణగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ చెరువులు, భూములు, నీటి కుంటలు, రహదారులను కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా నిర్మించుకున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా దళితులు, పేదలు నిర్మించుకున్న ఇళ్లు, గుడిసెలను కూల్చివేసి వారిని రోడ్డుమీద పడేయడం దారుణమన్నారు. ఈ అన్యాయంపై బాధితులు అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కొందరు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుల నాయకత్వంలో హైడ్రా పనిచేస్తోందని, వారు రూ.కోట్ల ముడుపులు రియల్ ఎస్టేట్ బిల్డింగ్ వ్యాపారుల దగ్గర తీసుకొని కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన నీటి శుద్ధి కార్యక్రమంలో భాగంగా నలభై వేల కోట్ల రూపాయల నిధులను దుర్వినియోగం చేయడానికి మూసీ ప్రాజెక్టు అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కూల్చివేతలను ఆపాలని హైకోర్టులో అత్యవసర పిటిషన్లు దాఖలు చేయడం జరిగిందని తెలిపారు. దళితులు, పేదలు ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి దళితులకు ద్రోహం చేశారని అన్నారు. కార్యక్రమంలో సిలివేరి వసంతరావు, చిప్పరి సుబ్బారావు, డాక్టర్ వీఎల్ రాజు, జొన్నలగడ్డ భాస్కర్, పి.సుచంద్ర పాల్గొన్నారు.

బండి నమోదైనా.. తప్పని బాదుడు

- నకాలంలో ఆర్సీలు అందక వాహనదారుల ఇబ్బందులు
- ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కింద కేసులు, చలాన్లు
- స్మార్ట్‌కార్డుల కొరత కారణంగా నిలిచిపోయిన జారీ
- కొత్త కార్డుల కాంట్రాక్ట్‌పై సన్నాహాలు



సాక్షి, సిటీబ్యూరో: కొత్త బండి మోజు తీరకుండానే చలాన్ల మోత మోగిస్తున్నాయి. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కింద కేసులు నమోదవుతున్నాయి. ఆర్సీలు లేకుండా నడుపుతూ అడ్డంగా బుక్ అవుతున్నారు. నిజానికి తప్పిదం తమది కాకపోయినా మూల్యం చెల్లించాల్సి వస్తోంది. గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ఆర్టీఏ కార్యాలయాల నుంచి వాహనదారులకు సకాలంలో ఆర్సీ స్మార్ట్‌కార్డులు అందకపోడం వల్ల ఈ పరిస్థితి నెలకొంటోంది. కొత్త బండి కొనుగోలు చేసిన సంతోషం క్షణాల్లో ఆవిరవుతోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీఏలో వాహనం నమోదైన వారం, పది రోజుల్లోనే స్మార్ట్‌కార్డు ఇంటికి చేరాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా నెలలు గడిచినా కార్డులు రావడం లేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రవాణాశాఖలో స్మార్ట్‌కార్డుల కొరత వల్లనే ఈ జాప్యం చోటుచేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. స్మార్ట్‌కార్డుల నాణ్యత పెంచేందుకు ఇటీవల పాత కాంట్రాక్ట్‌ను రద్దు చేశారు. కానీ దాని స్థానంలో కొత్త కాంట్రాక్ట్ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడం వల్ల రవాణాశాఖకు స్మార్ట్‌కార్డుల మెటీరియల్ సరఫరా నిలిచిపోయినట్లు సమాచారం. దీంతో కొన్ని చోట్ల స్మార్ట్ కార్డులు అందుబాటులో ఉన్నప్పటికీ మరికొన్ని ఆర్టీఏ కేంద్రాల్లో కొరత ఏర్పడింది. ఇది వాహనదారులకు ఆర్థిక భారంగా మారింది.

గ్రేటర్‌లో వేలల్లో డిమాండ్

గ్రేటర్ హైదరాబాద్‌లోని 10 ఆర్టీఏ కార్యాలయాల్లో ప్రతిరోజూ సుమారు 2,500 వాహనాలు కొత్తగా నమోదవుతాయి. అలాగే బ్యాంకు ఈఎంఐలు చెల్లించిన అనంతరం స్మార్ట్‌కార్డుల్లో హైపతికేషన్ రద్దు కోసం వచ్చే వాహనదారులు కూడా పెద్ద సంఖ్యలోనే ఉంటారు. దీంతో తెలంగాణలోని ఇతర ప్రాంతాలకంటే హైదరాబాద్‌లో డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల ఆర్సీల కోసం ముద్రించే స్మార్ట్‌కార్డులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. రెండు కేటగిరీల్లో కనీసం రోజుకు 5,000 కార్డులను ప్రింట్ చేసి స్పీడ్ పోస్టు ద్వారా వాహనదారులకు చేరవేయాల్సి ఉంటుంది. ఒక్కో కార్యాలయం నుంచి సుమారు 500 కార్డులకు డిమాండ్ ఉంటుంది. కానీ ఇందుకు తగిన విధంగా కార్డుల మెటీరియల్ లేకపోవడం వల్ల కొరత తలెత్తుతోంది.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్షకుపైగా కార్డుల కొరత ఉండగా, సెప్టెంబర్ నాటికి 40 వేలకు పైగా అందజేసినట్లు రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. మరికొద్ది రోజుల్లో కొత్త కార్డుల సరఫరాకు ఒప్పందం ఏర్పడనుందని, ఆ తర్వాత పూర్తిస్థాయిలో కార్డులను జారీ చేస్తామని తెలిపారు. కానీ ప్రస్తుతం నెలకొన్న జాప్యం వల్ల వాహనదారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. 'హైపతికేషన్ కాన్సిల్ చేసుకొని నెల దాటింది. కానీ ఇప్పటి వరకు కార్డు రాలేదు. బండి బయటకు తీయాలంటే భయమేస్తోంది..' అని తుర్కయంజాల్ ప్రాంతానికి చెందిన శ్రీధర్ అనే వాహనదారుడు విస్మయం వ్యక్తం చేశారు. ఇప్పటికే చలాన్ల పేరిట రూ.300 చెల్లించినట్లు చెప్పారు. మరోవైపు స్మార్ట్‌కార్డుల కోసం ఆర్టీఏ చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తుందని, గంటల తరబడి పడిగాపులు కాసినా అధికారులు స్పందించడం లేదని చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన ఓ వాహనదారుడు ఆందోళన వ్యక్తం చేశారు.

ఒక్కో కార్డు రూ.685

డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీల కోసం ఆర్టీఏకు ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. డ్రైవింగ్ లైసెన్సుల కేటగిరీ మేరకు రూ.685 నుంచి రూ.1500 వరకు ఖర్చవుతుంది. ఆర్సీలకు మాత్రం రూ.685 వరకు చెల్లించాలి. ఇందులో సర్వీస్ చార్జీల రూపంలో రూ.400, స్మార్ట్‌కార్డుకు రూ.250 చొప్పున చెల్లించాలి. మరో రూ.35 స్పీడ్‌పోస్ట్ చార్జీలు చెల్లించాలి. ఇలా అన్ని చార్జీలు కలిపి ముందే చెల్లించినా నెలల తరబడి పడిగాపులు కాయాల్సి రావడం గమనార్హం.

సారథి వస్తే ఆన్‌లైన్‌లోనే..

మరోవైపు తరచూ కార్డుల జారీలో నెలకొంటున్న జాప్యం, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఆధార్ తరహా ఆన్‌లైన్‌లోనే డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీలను డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయాన్ని అధికారులు సీరియస్‌గా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం సికింద్రాబాద్‌లో ట్రయల్ రన్ పూర్తి చేసుకున్న సారథి సాంకేతిక వ్యవస్థ పూర్తిస్థాయిలో అమలైతే ఈ సేవా కేంద్రాల నుంచే స్మార్ట్ కార్డులను అందజేసే అవకాశం ఉంటుందని ఒక అధికారి చెప్పారు. ఇందుకు మరి కొంత సమయం పట్టవచ్చు.

ఆర్‌పీఐ క్రిస్టియన్ సెల్ జాతీయ అధ్యక్షుడిగా జాన్‌మాస్క్



బంజారాహిల్స్: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా క్రిస్టియన్ సెల్ జాతీయ అధ్యక్షుడిగా నగరానికి చెందిన జాన్‌మాస్క్‌ను నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రాందాస్ గురువారం నియామక పత్రం అందజేశారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఉన్న దళిత క్రైస్తవుల హక్కులతో పాటు వారికి చేరాల్సిన పథకాలపై కృషి చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జాన్‌మాస్క్ మాట్లాడుతూ దళిత క్రైస్తవుల పక్షాన సమస్యలు, హక్కులకై పోరాడేందుకు ఆర్‌పీఐ పార్టీ తరఫున తనను జాతీయ అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చడంపై ఎన్డీఏ కూటమి ద్వారా అన్ని రాష్ట్రాల నాయకులను కలుస్తామని అన్నారు. డిసెంబర్ 3వ తేదీన ఆర్‌పీఐ పార్టీ తరఫున భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు ప్రధాని నరేంద్ర మోదీని కూడా కేంద్ర మంత్రి రాందాస్ సారథ్యంలో ఆహ్వానించనున్నట్లు తెలిపారు. క్రైస్తవులపై చేస్తున్న దాడులను వ్యతిరేకించడంతో పాటు దాడికి పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తామని తెలిపారు.

పారిశ్రామికరంగం అభివృద్ధితోనే దేశప్రగతి

టీజీఐఐసీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి



టీజీఐఐసీసీ చైర్‌పర్సన్‌కు బొకే అందజేస్తున్న నూతన కార్యవర్గం

కుషాయిగూడ: పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందినప్పుడే ఆ దేశం, రాష్ట్రం ప్రగతి సాధిస్తుందని టీజీఐఐసీసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సిరి గార్డెన్స్‌లో జరిగిన కాప్రా చిన్న తరహా సూక్ష్మ పరిశ్రమల యజమానుల సమాఖ్య ప్రమాణస్వీకార మహోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూక్ష్మ పరిశ్రమల మనుగడను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామిక ప్రగతికి దోహదపడాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్‌కు పెద్దపీట వేస్తున్నారన్నారు. నైపుణ్యత పెంచుకోవడంతో గుర్తింపు లభిస్తుందని, ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ప్రభుత్వం అందజేసే ప్రోత్సాహకాలను అందిపుచ్చుకోవాలన్నారు. అసోసియేషన్ భవనానికి అనువైన స్థలాన్ని గుర్తించి అందజేయాలని అధికారులను ఆదేశించారు. పారిశ్రామికవాడల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పారిశ్రామికవేత్తల అవసరాలు తీర్చేందుకు అందుబాటులో ఉంటానన్నారు. పారిశ్రామికవేత్తలు కార్మికులకు తోడ్పాటు అందించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, టిఫ్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, ఐలా చైర్మన్ రోషిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పావనీ రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మహేష్‌గౌడ్‌తో పాటు నూతన అధ్యక్షుడు దుర్గం యాదయ్య యావవ్, ఉపాధ్యక్షులు మచ్చ అశోక్‌గౌడ్, టి.మోహన్ సిద్ధూ, ప్రధాన కార్యదర్శి కె.విద్యాసాగర్‌చారి, కోశాధికారి కె.దామోదరచారి, జాయింట్ సెక్రటరీ హీరాలాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేష్‌రెడ్డి ఎన్నికయ్యారు.

న్యాయం కోసం పోరాటం

- న్యాయవాదులకు రక్షణ లేదా?
- విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన
- డీజీపీ కార్యాలయాన్ని ముట్టడించిన న్యాయవాదులు



నాంపల్లి కోర్టులో ధర్నా చేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజావర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు

సిటీ కోర్టులు: న్యాయవాది ఖలీల్‌పై మాదన్నపేట పోలీసుల దాడిని నిరసిస్తూ న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. గురువారం హైదరాబాద్‌లోని అన్ని కోర్టులు (నాంపల్లి క్రిమినల్ కోర్టు, సిటీ సివిల్ కోర్టు, ఫ్యామిలీ కోర్టు, సికింద్రాబాద్ కోర్టు, కూకట్‌పల్లి, మల్కాజిగిరి) విధులు బహిష్కరించిన న్యాయవాదులు వీ వాంట్ జస్టిస్, పోలీసుల దాడులను అరికట్టాలి అంటూ పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. నాంపల్లి క్రిమినల్ కోర్టులో నిరసన సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజావర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు నెలల్లో న్యాయవాదులపై జరిగిన దాడులు గుర్తుచేసుకుంటే చాలా బాధగా ఉందన్నారు. తాము కొంత కాలంగా న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేసి న్యాయవాదులపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నామన్నారు. ఈ విషయంపై వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేసినా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతోనే దాడులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులపై దాడికి పాల్పడుతున్న పోలీసులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడమే కాకుండా వెంటనే వారిని సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే ఈ నిరసనలు మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

డీజీపీ కార్యాలయం ముట్టడి

న్యాయవాదులపై జరుగుతున్న దాడులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీకి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తే పోలీసులు లోపలికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో డీజీపీ కార్యాలయాన్ని న్యాయవాదులు ముట్టడించారు. పోలీసులు డౌన్ డౌన్ అంటూ రోడ్డుపై బైఠాయించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా డీజీపీ తమ సమస్యలను వినాలని, డీజీపీ కార్యాలయం మెయిన్ గేట్ వద్ద కూర్చొని ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ సీవీ శ్రీనాథ్, సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌చారి, జనరల్ సెక్రెటరి డి.హర్షవర్ధన్ ఆయా కోర్టుల న్యాయవాదులు ఎం.రమేశ్, జక్కుల లక్ష్మణ్, తిరుపతి వర్మ, చింతల కృష్ణ, గంపా వెంకటేశం, ఈశ్వర్‌కుమార్, బాల్‌రాజు, శ్రీను, ఆకుల వెంకట్రామ్, ఎం.నర్సింహ, నర్రి స్వామి, శ్రీధర్, సాంబశివగౌడ్, అంజయ్య, నాగయ్య, మహేశ్‌బాబు, విజయ్, అమర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ భూమి కేటాయింపు
ఉపసంహరించుకోండి



ఆందోళన చేస్తున్న పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 18 ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం(జేఎన్ఎఫ్ఏయూ)కు కేటాయించవద్దని అంబేడ్కర్ వర్సిటీ పూర్వవిద్యార్థుల సంఘం సభ్యులు పరిపాలన భవనం ఎదుట పెద్దఎత్తున నిరసన తెలిపారు. భూకేటాయింపు ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉన్నత విద్యావ్యాప్తిలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు, మహిళలకు తక్కువ ఫీజులతో ఉన్నత విద్య అందిస్తున్న విశ్వవిద్యాలయ భూమిని వేరే విశ్వవిద్యాలయానికి కేటాయించడాన్ని ఆ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పూర్వ విద్యార్థుల సమాఖ్య అధ్యక్షులు సాక వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినదించారు. వీరి నిరసనకు యూనివర్సిటీ జేఏసీ, ఉద్యోగులు మద్దతు తెలిపారు. విశ్వవిద్యాలయ విస్తరణకు, మౌలిక వసతుల కల్పనకు ఎక్కువ మొత్తంలో భూమి అవసరం ఉందని, ఈ క్రమంలో అందుబాటులో ఉన్న కొద్దిపాటి భూమిలో పదెకరాల భూమి వేరే యూనివర్సిటీకి కేటాయింపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ యూనివర్సిటీ భూమిని వేరే వాళ్లకు కేటాయించడం అంటే ఉన్నత విద్యావ్యాప్తిని, దూరవిద్య విస్తరణను అడ్డుకోవడమేనని జాయింట్ యాక్షన్ కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, చైర్‌పర్సన్ పల్లవీ కాబ్డే, పూర్వ విద్యార్థుల సమాఖ్య అధ్యక్షులు సాక వెంకటేశ్వర్లు, విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ ఎల్వీకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే జాయింట్ యాక్షన్ కమిటీ తీసుకునే నిర్ణయాలకు తమ అసోసియేషన్ పూర్తి మద్దతు ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశంలో పూర్వ విద్యార్థుల సమాఖ్య సెక్రటరీ ఉదయిని, రుశేంద్రమణి, యాదగిరి, మంజుల, పూర్వ విద్యార్థులు ఉమారాణి, క్రాంతి, అనిల్, సువర్ణ, చిరంజీవి, ఉద్యోగులు రవీంద్రనాథ్ సోలోమన్, కిషోర్‌కుమార్‌రెడ్డి, రమాదేవి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

27న మాల మహానాడు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

కాచిగూడ: మాల మహానాడు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 27వ తేదీన లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరుగుతాయని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని మాల మహానాడు కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ, క్రీమిలేయర్ చేపట్టవద్దని అన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, భూమి పంపిణీ చేయాలని కోరారు. మాల భవన్ సాధన కోసం ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, బ్యాగ్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. దళితులపై దాడులు, హైడ్రా ఆధ్వర్యంలో దళితుల ఇళ్ల కూల్చివేత, దళితబంధు అమలు తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి మాల మహానాడు ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మాల కులాన్ని కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ ఉపయోగించుకుంటోందని, సీఎం రేవంత్‌రెడ్డికి పాలేర్లుగా మాల మంత్రులు, ఎమ్మెల్యేలు పనిచేయడం సిగ్గుచేటన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం జాతీయ చైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో జేఎన్ రావు, జె.భాస్కర్‌రావు, ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.



నగరంలో నేడు

- చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయం వద్ద బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే తదితరులు పాల్గొంటారు.
- హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా 'డిజైన్ డెమోక్రసీ 2024, మ్యూజియం ఆఫ్ తెలంగాణ'ను ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర ఐటీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఇండియన్ బ్యాడ్మింటన్ చీఫ్ నేషనల్ కోచ్ పుల్లెల గోపీచంద్ పాల్గొంటారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

62 అడుగుల మహాశక్తి దుర్గామాత విగ్రహం



సుల్తాన్‌బజార్: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని నవరాత్రి నవదుర్గ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశంలోనే 62 అడుగుల అతిపెద్ద మహాశక్తి దుర్గామాత విగ్రహం చాదర్‌ఘాట్‌లోని విక్టరి ప్లే గ్రౌండ్‌లో నిర్వాహకుడు గులాబ్ శ్రీనివాస్ ఏర్పాటు చేశారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిజాం మునిమనవడికి డాక్టరేట్



సాక్షి, సిటీబ్యూరో: భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆమోదిత కార్పొరేట్ వ్యవహారాల సంస్థ గౌరవ డాక్టరేట్ అవార్డు మండలి ఏడో నిజాం మునిమనవడు నవాబ్ నజాఫ్ అలీ ఖాన్‌కు డాక్టరేట్ అవార్డు అందించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన డాక్టరేట్ అవార్డు కౌన్సిల్ సదస్సులో సామాజిక సేవ కేటగిరి కింద మాజీ కేంద్ర మంత్రి షానవాజ్ హుస్సేన్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

రూ.4,500 కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: రాష్ట్రంలో 16 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థుల మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు రూ.4,500 కోట్లను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ, ఈబీసీ ఇంజినీరింగ్ తదితర వృత్తి విద్య కోర్సుల పూర్తి ఫీజు పథకాన్ని పునరుద్ధరించాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఫీజు బకాయిలు చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్స్ పెంచాలని, 6 నెలల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆయన విమర్శించారు. విద్యార్థుల ఫీజు బకాయిలకు సంబంధించి బడ్జెట్ విడుదల చేయకపోతే రాష్ట్రాన్ని స్తంభింపజేస్తామని ఆయన హెచ్చరించారు. ఎక్కడికక్కడ మంత్రులు, ప్రజాప్రతినిధులను గ్రామాల్లో తిరగకుండా అడ్డుకుంటామని అన్నారు. మూసీ సుందరీకరణకు రూ.లక్షా 50వేల కోట్లు ఖర్చు పెట్టే ప్రభుత్వం విద్యార్థుల చదువుపై రూ.4,500 కోట్లు ఖర్చు పెట్టడానికి ఎందుకు వెనకాడుతోందని ప్రశ్నించారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కాలేజీ యాజమాన్యాలు కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత కోర్సుల్లో సీటు వచ్చినా చదవలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలకు ఎంపికైనా సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు కోల్పోతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల ఫీజు బకాయిలు, మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని ఆయన కోరారు.

మారుత్ డ్రోన్స్ ఉచిత డీజీసీఏ పైలట్ శిక్షణ

- డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ అర్హతతో సర్టిఫికెట్
- వ్యవసాయ రంగంలో వినూత్న టెక్నాలజీకి శ్రీకారం



సాక్షి, సిటీబ్యూరో: వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించే దిశగా ప్రముఖ డ్రోన్ టెక్నాలజీ కంపెనీ 'మారుత్ డ్రోన్స్' వినూత్న ప్రణాళిక చేపట్టింది. ఇందులో భాగంగా తమ డ్రోన్స్ కస్టమర్లకు తయారీ, శిక్షణ కోసం డీజీసీఏ సర్టిఫికెట్‌తో ఉచిత డీజీసీఏ సర్టిఫైడ్ పైలట్ శిక్షణ అందిస్తోంది. ఈ కాంప్లిమెంటరీ డ్రోన్ శిక్షణ ద్వారా కస్టమర్లు 10 సంవత్సరాల పాటు చెల్లుబాటయ్యే డీజీసీఏ సర్టిఫై చేసిన రిమోట్ పైలట్ సర్టిఫికెట్(ఆర్‌పీసీ)ని పొందవచ్చు. ఈ శిక్షణలో భాగంగా అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకొని, డ్రోన్ నియామకాలపై అవగాహన పెంచుకుంటారు. ఇందులో భాగంగా కొత్త కస్టమర్లకు రూ.47 వేల విలువైన బ్యాటరీ సెట్ ఉచితంగా అందిస్తున్నారు. వ్యవసాయ అవసరాలకు డ్రోన్లు ఉపయోగించడానికి స్వయంగా రిమోట్ పైలట్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. ఈ సర్టిఫికెట్ పొందడానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ అర్హత ప్రమాణాలు, ప్రక్రియను నిర్దేశించింది. అక్టోబరు నెల పంటలు చేతికొచ్చే సమయం వేళ.. మారుత్ అక్టోబర్ నెల మొత్తం తమ కస్టమర్లకు ఉచిత డ్రోన్ శిక్షణ అందించనుందని మారుత్ డ్రోన్స్ సీఈఓ ప్రేమ్‌కుమార్ విశ్వవాత్ పేర్కొన్నారు. మారుత్ డ్రోన్స్ ఉపయోగించే డ్రోన్ వ్యాపారి నెలకు రూ.40 నుంచి రూ.90 వేల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. సాధారణంగా శిక్షణకు రూ.42 వేలు ఖర్చవుతుందని ఆయన వివరించారు. ఆసక్తి గల కస్టమర్లు ఉచిత డ్రోన్ పైలట్ శిక్షణ నిమిత్తం ఈ నెల 31వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శుక్రవారం, 4, అక్టోబర్, 2024




ఆఫీస్, మెట్రోకి సైకిల్ పైనే సవారీ

వందల కిలోమీటర్ల ప్రయాణం

ఆరోగ్యం, స్వచ్ఛమైన వాతావరణం కోసమే

సైక్లింగ్ క్వీన్స్!

ప్రతి వారం క్లబ్స్‌తో లాంగ్ టూర్

గృహిణి శారీరకంగా ఆరోగ్యంగా, మానసికంగా ప్రశాంతంగా ఉంటేనే కుటుంబ సభ్యులంతా హాయిగా ఉంటారు. పిల్లలకు మనం నేర్పించిన అలవాట్లే వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి. ప్రయోజకులను చేస్తాయి. మన కోసం.. మన పిల్లల భవిష్యత్తు కోసం ఆలోచించి సైక్లింగ్ చేయాలని నిర్ణయించుకున్నాం. అపార్ట్‌మెంట్, కాలనీలోని మహిళలంతా కలసి చిన్న అసోసియేషన్‌గా ఏర్పాటై నిత్యం వివిధ రకాల కొత్త ఆలోచనలతో సైక్లింగ్ చేస్తున్నాం. ఐదు కిలో మీటర్లు నుంచి వంద కిలో మీటర్ల వరకూ సూర్యోదయానికి ముందే లేచి సైకిల్‌పై బయలుదేరి పోతాం. స్వచ్ఛమైన వాతావరణంలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటామంటున్నారు నగర మహిళలు.. రోజురోజుకూ సైకిల్ సవారీపై మక్కువ పెంచుకుంటున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

ఏ చిన్న సందర్భం వచ్చినా.. ఛారిటీ ఈవెంట్ నిర్వహించినా సభ్యులంతా ఏక తాటిపై సైక్లింగ్‌కు సిద్ధమవుతున్నారు. ఇలా నగరంలో పదుల సంఖ్యలో మహిళా సైక్లింగ్ అసోసియేషన్లు ఏర్పాటవుతున్నాయి. నెలలో రెండు నుంచి మూడు దఫాలు ప్రత్యేకంగా క్యాంప్‌లు ఏర్పాటు చేసుకుని, కాలుష్యానికి దూరంగా స్వచ్ఛమైన వాతావరణంలో కొండలు, వాగులు, జలపాతాలు, నీటి వనరులను, వ్యవసాయ ప్రాంతాలు చుట్టివస్తున్నారు.

వారాంతం, సెలవు దినాల్లో సూర్యోదయానికి ముందే సైకిల్ రైడ్ ప్రారంభిస్తారు. సరస్సులు, వ్యవసాయ ప్రాంతాలు, ట్రెక్కింగ్, కొండలు, జలపాతాలు, తదితర ప్రాంతాలను సైకిల్‌పై చుట్టివస్తున్నారు. సుమారు

సూర్యోదయానికి ముందే...

100 కిలో మీటర్ల వరకూ సైకిల్‌పై వెళ్లిపోతున్నారు. సమీపంలోని వికారాబాద్‌కు ఎక్కువ మంది మహిళా సైక్లిస్టులు ఆసక్తి చూపిస్తున్నారు. అక్కడి వాతావరణం, అనువైన రహదారి మార్గం ఇందుకు కారణమని అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో నిత్యం ఉదయం, సాయంత్రం ఓఆర్ఆర్‌కు ఆనుకుని ఉన్న ట్రాక్‌పై సైకిల్ సవారీ చేస్తున్నారు.

20 నుంచి 30 మందితో..

2019 నుంచి సైక్లింగ్ ప్రారంభించా. 20 నుంచి 30 మందితో కార్యక్రమాలు ప్రారంభించాం. ఇప్పుడు సంఖ్య పెరిగింది. వృత్తి రీత్యా, వ్యక్తిగతంగా ఉన్నటువంటి మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలంటే సైక్లింగ్ వంటి ఫిట్నెస్ యాక్టివిటీ అవసరం. నిత్యం కాలుష్య నగరం నుంచి నేచర్ వైపు వెళ్లాలని ఆసక్తి. కార్యాలయం నుంచి ఇంటికి వచ్చేసరికి నీరసంగా ఉంటుంది. ఫిజికల్ యాక్టివిటీ ఉండటం వల్ల ఫ్రెష్‌గా ఉంటాం. ఫ్రెండ్స్‌తో సైక్లింగ్ చేయడం వల్ల ఉల్లాసంగా ఉంటాం. నగరంలో సైక్లింగ్ ట్రాక్స్ ఉన్నాయి. వాటికి బారికేడ్స్ పెడితే ధైర్యంగా రైడ్ చేయగలం. లేకుంటే ఇతర వాహనాలు వేగంగా వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రద్దీ సమయంలో సైక్లింగ్ చేయాలంటే భయమేస్తోంది. చిన్నవారైనా పెద్దవారైనా సైక్లింగ్ అవసరం. వారంలో కనీసం ఒక దఫా చేవెళ్ల వైపు రైడ్‌కు వెళతాం. ట్రాఫిక్ ఫ్రీ, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటర్నల్ రూట్స్ బాగుంటాయి.

- సౌజన్యారెడ్డి, శ్రేయాస్స్ క్రియేటివ్ స్కూల్ ప్రిన్సిపాల్



సంఘాలుగా ఏర్పడి..

భాగ్యనగరంలో అపార్ట్‌మెంట్లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల్లో మహిళలు సైక్లింగ్ అసోసియేషన్లు, క్లబ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వారంలో కనీసం ఒకటి, రెండు దఫాలు టూర్ ప్లాన్ చేసుకుంటున్నారు. ముందుగా సైక్లింగ్ చేయాలనుకునే రూట్ మ్యాప్‌ను చెక్ చేసుకోవడం, ఆ దారిలో ఉన్న వాతావరణం, ట్రాఫిక్, తదితర అంశాలను అంచనా వేసుకుంటారు. అనంతరం లక్ష్యాన్ని నిర్దేశించుకుంటారు.

నేచర్ రైడ్స్‌కి వెళతాం..



కరోనాలో సైక్లింగ్ ప్రారంభించాను. అప్పటి వరకూ సైకిల్ రాదు. మా సహచర మిత్రులు సైక్లింగ్ పోదాం, ఆరోగ్యం, మానసికంగా ఉల్లాసంగా ఉంటామంటే అప్పటికప్పుడే నేర్చుకున్నాను. మా కమ్యూనిటీలో అందరం నేర్చుకున్నాం. ఉదయం సుమారు 60 కిలోమీటర్ల దూరం వెళుతున్నాం. మా రైడ్స్ బాగుంటాయి. ప్రకృతిలో సైక్లింగ్ అంటే ఇష్టం. మేం ఎక్కువ నేచర్ రైడ్స్ వెళుతుంటాం.

- లావణ్య, పుప్పాలగూడ

ఫ్యామిలీ కోసం రైడ్స్..



ఫ్యామిలీని బాగా చూసుకోవాలంటే సైక్లింగ్ వంటి శారీరక, మానసిక వ్యాయామం అవసరం. చిన్నప్పటి నుంచి సైకిల్ వచ్చు. 2020లో స్నేహితులతో సైక్లింగ్ ప్రారంభించాం. లాక్ డౌన్ ఉండటంతో వ్యాయామం కోసం సైకిల్ మొదలు పెట్టాం. నెమ్మదిగా గ్రూప్ తయారయ్యింది. ఇప్పుడు అంతా కలసి సుమారు 100 కిలో మీటర్ల వరకూ రైడ్‌కు పోతున్నాం. ఉదయం వెళ్లి తిరిగి 10 గంటలకు వచ్చేస్తున్నాం. వాహనాల్లో కంటే సైకిల్ జర్నీ మంచిదని నా అభిప్రాయం. లాక్‌డౌన్ కంటే ముందు కమ్యూనిటీలోనే సైక్లింగ్ చేయడం అలవాటు. ఆ తరువాత నెలలో కనీసం రెండు దఫాలైనా స్నేహితులంతా కలసి ఒక టార్గెట్ ప్లాన్ చేసుకుని ఎంజాయ్ చేసి వస్తాం.

- నాగసుధీర, మణికొండ

బేగంపేటలో ఐస్‌ఫ్రూప్స్



సనత్‌నగర్: ఫ్రూట్ ఆధారిత ఐస్‌క్రీమ్ బ్రాండ్ ఫ్రూప్స్ అవుట్‌లెట్‌ను బేగంపేటలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడళ్లు సందడి చేశారు. ఫ్రూట్ ఫ్లేవర్ ఐస్‌క్రీమ్‌లను ఆరగిస్తూ రుచులను ఆస్వాదించారు. ఫ్రూప్స్ అవుట్‌లెట్ నిర్వాహకుడు ఆర్యమాన్ షా మాట్లాడుతూ ఐస్‌క్రీమ్ లవర్స్ కోసం ఎన్నో రకాల ఫ్రూట్ ఫ్లేవర్స్ అందుబాటులో ఉంచామన్నారు. కాలాజామున్, మస్క్ మెలాన్, మిక్స్‌డ్ బెర్రీస్, మలై ఐస్‌క్రీం, డ్రైఫ్రూట్స్ టాపింగ్స్, రియల్ చాక్లెట్, సిక్స్ పాప్సికల్స్, రబ్డీ కుల్ఫీ, స్పెషల్ సీతాఫల్ తదితర ఫ్లేవర్స్ అందుబాటులో ఉన్నాయని వివరించారు.



కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్

సాక్షి, సిటీబ్యూరో: కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు నగరం వేదిక కానుంది. ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్‌లో శనివారం కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం కానుంది. ముంబైలోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ కొరియా అసోసియేషన్‌తో ఈ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు లిటిల్ ఫారెస్ట్, సాయత్రం 5:30 గంటలకు సన్‌సెట్ ఇన్ మై హోమ్‌టౌన్ చిత్రాల స్క్రీనింగ్ ఉంటుంది.

కూర్గ్‌లో 'కాఫీ కథలు'..



సాక్షి, సిటీబ్యూరో: కొన్ని దశాబ్దాలుగా కోట్లాది మంది కాఫీ ప్రియుల ఆస్వాదనకు మూల కారణంగా ఉన్న అనేకమంది కాఫీ రైతుల జీవితాలకు అద్దం పట్టేలా ఒక చిత్రం రూపొందింది. ప్రముఖ కాఫీ బ్రాండ్ నెస్‌కెఫె ఆధ్వర్యంలో ప్రకృతి అందాలకు, కాఫీ పంటకు పేరొందిన కూర్గ్‌లో ఈ చిత్రం రూపొందిందని నెస్లె ఇండియా సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. ఈ చిత్రానికి జార్జ్. కె.ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్నారని, అంతేకాకుండా తాజాగా తాము విడుదల చేసిన 5 తాజా కొత్త ప్యాక్‌ల మీద ఉన్న క్యూ ఆర్ కోడ్స్ స్కాన్ చేయడం ద్వారా నగరవాసులు కాఫీ రైతుల కథలను తెలుసుకోవచ్చన్నారు.

నేటి నుంచి 'డిజైన్ డెమోక్రసీ' ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: ఇంటీరియర్‌కు సంబంధించిన విభిన్న రకాల ఉత్పత్తులను ప్రదర్శించే డిజైన్ డెమోక్రసీ ప్రదర్శన శుక్రవారం నుంచి నగరంలోని మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగనుంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రదర్శన నిర్వహణలో మ్యూజియం ఆఫ్ తెలంగాణ కూడా పాలు పంచుకోనుందని, పలువురు టాప్ డిజైనర్లు ఇందులో పాల్గొంటారని, ఇంటీరియర్ డిజైనింగ్, గార్డెనింగ్ తదితర అంశాలపై ఆసక్తిదాయకమైన సెషన్లు ఉంటాయని వివరించారు. ఈ ప్రదర్శన 3 రోజుల పాటు కొనసాగుతుందన్నారు.



రైట్ స్వైప్!

- సోషల్ యాప్‌లో పాజిటివ్ కోణం ఆవిష్కరణ
- యూట్యూబ్‌లో ఆదరణ పొందుతున్న షార్ట్‌ఫిల్మ్
- తల్లి, అన్నదమ్ముల 'ఫ్యామిలీ కథా చిత్రం'



సోషల్ మీడియా, యాప్స్.. ఇటీవలి కాలంలో జరుగుతున్న ఉదంతాలు, వెలుగుచూస్తున్న అంశాలు, ఎదురవుతున్న అనుభవాలతో అత్యధికుల్లో వీటిపై వ్యతిరేక భావం ఉంటోంది. యాప్‌ల ద్వారా ఏర్పడే స్నేహాల వల్ల నష్టాలే ఎక్కువ అనే భావన అనేక మందిలో ఉంది. అయితే వీటిని సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితాలు ఉంటాయని చూపించాలని భావించిన ఓ కుటుంబం 'రైట్ స్వైప్' చేసింది. 14.23 నిమిషాల నిడివితో యూట్యూబ్‌లో విడుదలైన ఈ షార్ట్ ఫిల్మ్ ఐదు రోజుల్లో 21 వేల వ్యూస్ సొంతం చేసుకుంది. సినీ రంగానికి చెందిన అనేక మంది మన్ననలు పొందుతోంది.

- సాక్షి, సిటీబ్యూరో

ఈ షార్ట్‌ఫిల్మ్‌ను ఓ తల్లి, ఇద్దరు కుమారులు కలిసి తెరకెక్కించారు. నగరానికి చెందిన గృహిణి వంగల శ్వేత దీనికి నిర్మాతగా ఉన్నారు. లఘు చిత్రాల నిర్మాణం కోసం శ్వేత వారాహి ప్రొడక్షన్స్ పేరుతో ఓ బ్యానర్ ఏర్పాటు చేశారు. యువతకు సందేశం ఇవ్వాలనే ఉద్దేశంతో రూపొందించిన ఈ షార్ట్‌ఫిల్మ్‌కు ఆమె పెద్ద కుమారుడు సంకీర్త్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. చిన్న కుమారుడు సుదర్శన్ హీరోగా నటించగా.. క్లాస్‌మేట్ అయిన ఉత్తరాది యువతి శ్రేయ వెర్మ హీరోయిన్ పాత్ర పోషించారు.

టైటిల్‌లో విషయం తెలిసేలా...

ఈ చిత్రానికి 'రైట్ స్వైప్' అనే టైటిల్‌ను ఎంచుకోవడంలోనే 'ఫ్యామిలీ టీమ్' వినూత్నంగా వ్యవహరించింది. డేటింగ్ యాప్స్‌లో రిక్వెస్ట్ వచ్చినప్పుడు రైట్ స్వైప్ చేస్తే అంగీకరించినట్లు.. లెఫ్ట్ స్వైప్ చేస్తే తిరస్కరించినట్లు లెక్క. ఈ నేపథ్యంలోనే ఓ యాప్ ఆధారంగా సాగే ఈ చిత్రానికి రైట్ స్వైప్ అనే టైటిల్ ఎంచుకున్నారు. యాప్ ద్వారా పరిచయమైన యువతీ-యువకుల మధ్య ఏర్పడే స్నేహం, ప్రేమ, వారి జీవితాల్లో వచ్చే సానుకూల మార్పుల నేపథ్యంగా చిత్ర కథ నడుస్తుంది. ఈ షార్ట్‌ఫిల్మ్‌ను ఆస్కార్ గ్రహీత చంద్రబోస్, సుచిత్ర దంపతులు గతనెల 28న రిలీజ్ చేయగా.. ప్రముఖ నటులు మురళీమోహన్, రఘుబాబు, సుమ, రాజీవ్ కనకాల, ఎస్వీ కృష్ణారెడ్డి వంటి పలువురి ప్రశంసలు పొందింది.



శిల్పారామంలో దసరా ఉత్సవాలు



మాదాపూర్: శిల్పారామంలో దసరా ఉత్సవాల్లో భాగంగా.. జానపద నృత్యాలతో కళాకారులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో శారీస్ ఆఫ్ ఇండియా, బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దేశంలోని చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను స్టాల్స్‌లో అందుబాటులో ఉంచనున్నారు. యువతను ఆకట్టుకునే విధంగా డ్రెస్ మెటీరియల్స్ వంటి అనేక రకాల వస్త్రాలను ప్రదర్శనలో ఉంచారు.



ప్రతి ఒక్కరూ..

బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం సందర్శకుల కోసం దాండియాని నిర్వహించనున్నారు. దాండియాలో ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చు. శిల్పారామం ప్రధాన లాన్‌లో ప్రత్యేకంగా మ్యూజిక్ సిస్టమ్ ఏర్పాటు చేసి వసతులను కల్పిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ప్రతిరోజు సాయంత్రం..

సందర్శకులను ఆకట్టుకునేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 5.30 గంటలకు ఆంఫీ థియేటర్‌లో మహిషాసురమర్ధిని, నవదుర్గ, అవతారిణీ, దేవివైభవం, కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ, కథక్, కర్ణాటక గాత్రం, వీణ కచేరీలను ఏర్పాటు చేస్తున్నారు.



శారీస్ ఆఫ్ ఇండియా మేళాలో..

పోచంపల్లి, గద్వాల్, కోట, మంగళగిరి, పుల్కారి, కశ్మీరీ, బెంగాలీ కాటన్, పట్టు, బనారసీ, బెంగళూరు సిల్క్, ఛందేరీ, కలంకారీ, కోస, ముంగా, మస్లీన్, తస్సార్, జాందానీ, బాందిని, తదితర పట్టు, కాటన్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, ఓణీలు, దుప్పట్లు తదితర ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 13 వరకూ ఎగ్జిబిషన్‌లో గృహాలంకరణ ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఫుట్‌బాల్ టీమ్‌ను దత్తత తీసుకుంటాం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
- సీఎం కప్ లోగో, మస్కట్ ఆవిష్కరణ



సీఎం కప్ లోగోను ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, శివసేనారెడ్డి, వివేక్, షబ్బీర్ అలీ, జితేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. క్రీడల అభివృద్ధికి ఇప్పటికే ప్రకటించిన పలు ప్రణాళికలతో పాటు మరిన్ని కొత్త అంశాలతో ముందుకు వెళుతున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో భాగంగానే చీఫ్ మినిస్టర్స్ (సీఎం) కప్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. 'పల్లెల నుంచి ప్రపంచ స్థాయి విజేతల కొరకు' అనే నినాదంతో త్వరలోనే జరగనున్న ఈ టోర్నీకి సంబంధించిన లోగో, మస్కట్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాలుగు దశల్లో జరిగే టోర్నీ అక్టోబర్ 21న ప్రారంభమవుతుంది. తెలంగాణ రాష్ట్ర పక్షి పాలపిట్టను టోర్నీ మస్కట్‌గా ఉంచి దానికి 'నీలమణి' అని పేరు పెట్టారు. ఇటీవల కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇచ్చిన సమయంలో అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) అధికారులతో చర్చించామని.. దానికి అనుగుణంగా భారత్ అండర్–17 ఫుట్‌బాల్ టీమ్‌ను దత్తత తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. గోవాలో జరిగిన జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన, గత ఏడాది జరిగిన సీఎం కప్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు కలిపి మొత్తం రూ.1.02 కోట్లు, రూ.52 లక్షలు చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని ఈ కార్యక్రమంలో సీఎం అందజేశారు.



ప్రతిభకు గుర్తింపుగా బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ మొహమ్మద్ సిరాజ్‌లను ప్రభుత్వ ఉద్యోగంతో గౌరవించిన విషయాన్ని రేవంత్ గుర్తు చేశారు. కార్యక్రమంలో నిఖత్ జరీన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. భవిష్యత్తులో ఆటగాళ్లను తీర్చిదిద్దేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, శాసనసభ్యులు వివేక్, రాంచంద్ర నాయక్, ప్రభుత్వ సలహాదారులు జితేందర్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, పార్లమెంటు సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డీజీపీ జితేందర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, సాంస్కృతిక పర్యాటక శాఖ కార్యదర్శి వాణిప్రసాద్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారిలతో పాటు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బస్తీవాసుల వాదన వినకుండా నోటీసులా?

- నోటీసులను కొట్టివేసిన హైకోర్టు
- హస్మత్‌పేట వాసులకు ఊరట

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం హస్మత్‌పేట బస్తీవాసుల వాదన వినకుండా, ఎలాంటి వివరాలు లేకుండా నోటీసులు జారీ చేయడం చెల్లదని హైకోర్టు తేల్చిచెప్పింది. తహసీల్దార్ జారీ చేసిన నోటీసులను కొట్టివేసింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టారని, వెంటనే వాటిని తొలగించాలని ఆగస్టు 21న తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాల్ చేస్తూ హస్మత్‌పేట హరిజన బస్తీకి చెందిన మల్లయ్యతో పాటు మరో 9 మంది హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... తహసీల్దార్ జారీ చేసిన నోటీసుల్లో ఎంత విస్తీర్ణంలో ఆక్రమణ ఉందనిగానీ, సర్వే నంబర్లుగానీ లేవన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి... తహసీల్దార్ నోటీసులను కొట్టివేశారు.

ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటా: మాజీ మంత్రి సబిత



సాక్షి, హైదరాబాద్: తన కుమారులకు మూడు ఫామ్ హౌస్‌లు ఉన్నాయని.. వాటిని కూల్చాలో వద్దో చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి 'ఎక్స్'వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రేవంత్‌రెడ్డి గారూ.. ఆత్మాభిమానం కన్నా మించిన ఆస్తి లేదని నమ్ముతున్న వ్యక్తిని నేను. మీ ముందు కానీ మరి ఇంకెవరి ముందు కానీ 'పేద ఏడుపులు' ఏడ్చిన సందర్భం నాకు ఆ దేవుడు కలిగించలేదు. మా పార్టీ, కుటుంబంపై చేసిన విమర్శలను మీ విజ్ఞతకే వదిలేస్తున్నాను. మా అబ్బాయి కడుతున్న 'ఇల్లు' మినహాయించి, మిగతా మూడు 'ఫామ్ హౌస్‌లు' ఎక్కడున్నాయి అనే వివరాలను ప్రజల ముందు పెట్టండి. మీరు ఎన్ని రకాలుగా వ్యక్తిగతంగా టార్గెట్ చేసినా ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటాను'అని సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు.

రియల్ ఎస్టేట్ దందా కోసమే ఫోర్త్ సిటీ

సీఎం విధ్వంసకర నిర్ణయాలతో హైదరాబాద్ ప్రతిష్టకు మచ్చ: వివేకానంద్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పనిచేస్తూ దందా కోసం ఫోర్త్ సిటీని తెరమీదకు తెస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మండిపడ్డారు. కల్పిత నగరం ఫోర్త్ సిటీకి మెట్రో రైలును తీసుకెళ్తానంటూ హైదరాబాద్ నగరాన్ని విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో వివేకానంద్ గురువారం మీడియాతో మాట్లాడారు. మెట్రో రైలును రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు పొడిగించేందుకు రెండో దశ పనుల కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.24 వేల కోట్లతో ప్రతిపాదించిందని, కాంగ్రెస్ మాత్రం మెట్రో కోసం కేవలం రూ.11 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో పెట్టిందన్నారు. ఊహల నగరం ఫోర్త్ సిటీకి మెట్రో రైలు పేరిట కేసీఆర్ ప్రభుత్వ ప్రతిపాదనలను రేవంత్ రద్దు చేశారన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి మెట్రో రైలు అవసరముందని ఎన్నికల ప్రచారంలో రేవంత్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

ఈడీ దాడుల వివరాలు బయట పెట్టాలి: దాసోజు



సాక్షి, హైదరాబాద్: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన దాడిలో వెలుగు చూసిన విషయాలను ప్రజలకు చెప్పాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. పార్టీ నేతలు దూదిమెట్ల బాలరాజు యాదవ్, కిశోర్‌గౌడ్, తుంగ బాలుతో కలసి దాసోజు శ్రవణ్ గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పొంగులేటి నివాసంలో చేతి వాచీల వ్యవహారంలో ఐదు రోజుల కిందట జరిగిన దాడిలో రూ.1,600 కోట్లు, పెద్ద మొత్తంలో బంగారం దొరికినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. మంత్రి పొంగులేటి నివాసంపై ఈడీ దాడులు జరిగినా కాంగ్రెస్ నాయకులు నోరు మెదపడంలేదని విమర్శించారు. ప్రస్తుతం కర్ణాటక ముఖ్యమంత్రి సలహాదారుగా ఉన్న సునీల్ కనుగోలు, గౌతమ్ అదానీ, మంత్రి పొంగులేటి బుధవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో భేటీ వెనుక మర్మమేంటో బయటపెట్టాలని నిలదీశారు. బీజేపీతో అంటకాగే వ్యాపారవేత్తలతో కాంగ్రెస్ నేతలకు పనేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

రాజకీయ కక్షతోనే మూసీపై కేటీఆర్ విమర్శలు

సాక్షి, హైదరాబాద్: కేవలం రాజకీయ కక్ష సాధింపుతోనే మూసీపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మూసీకిరువైపులా హద్దులు నిర్ధారించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చింది మీ ప్రభుత్వమేనని మరిచిపోయారా? అని గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు.

ఫాంహౌస్‌ల కోసమే మూసీ ముసుగు!

▶ మొదటి పేజీ తరువాయి

కేటీఆర్, హరీశ్‌రావులతోపాటు సబితా ఇంద్రారెడ్డి ముగ్గురు కుమారులకు చెందిన ఫాంహౌస్‌ల అక్రమ నిర్మాణాలను కూల్చాలో వద్దో చెప్పాలని వారినే ప్రశ్నించారు. కేవీపీ రామచంద్రరావు ఫాంహౌస్‌లను కూలగొట్టాలో వద్దో కూడా సలహా ఇవ్వాలన్నారు. నాలాలు, చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూముల్లో అక్రమాలు చేసిందెవరో తేల్చుకుందాం రావాలని సవాల్ విసిరారు. నల్లచెరువు, సున్నం చెరువు, మూసీ ఒడ్డున అక్రమంగా ప్లాట్లు వేసి అమ్మింది బీఆర్‌ఎస్ వారు కాదా? అని సీఎం ప్రశ్నించారు.

బలిసినోళ్లు వదిలిన నీళ్లు పేదలు తాగాలా?

'హైదరాబాద్‌కు తాగునీరు అందించిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో బలిసినోళ్లు ఫాంహౌస్‌లు కట్టుకొని వారి డ్రైనేజీ తీసుకొచ్చి వాటిల్లో కలిపితే ఆ నీళ్లు నగర ప్రజలు తాగాల్నా?' అని సీఎం రేవంత్ నిలదీశారు. అక్రమాలకు పాల్పడ్డ వారిని వదలబోమని, ఒక్కొక్కడినీ చింత పండు చేస్తానని హెచ్చరించారు.

అఖిలపక్షంలో మంచి సూచనలివ్వండి..

నిర్వాసితులు ఇళ్లు పోయిన దుఃఖంలో ఆవేశంగా ఉంటారని.. 20 ఏళ్లపాటు ప్రజాక్షేత్రంలో తిరిగిన తనకు పేదల కష్టాలు, రాజకీయాల లోతు తెలియక కాదని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అయినప్పటికీ రాబోయే తరాల భవిష్యత్ దృష్ట్యా ముందుకే వెళ్తానన్నారు. హైదరాబాద్ నగరాన్ని, రాష్ట్రాన్ని ముంచేస్తున్న మూసీ వరదలకు విపక్షాలు చేతనైతే పరిష్కారం చెప్పాలని సూచించారు. అఖిలపక్ష సమావేశాలు పెడతానని, మంచి సూచనలివ్వాలని కేటీఆర్, హరీశ్‌లను కోరారు. మూసీలో నిర్వాసితులయ్యే వారికి 15 వేల డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుతోపాటు రూ. 25 వేల చొప్పున నగదు అందించాలని ఆదేశించినట్లు తెలిపారు.

ఈటలకు ఇంకా ఆ వాసనలు పోలేదు..

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పైనా సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. ఆయన పార్టీ మారినా పదేళ్లు బీఆర్‌ఎస్‌లో ఉన్నందున ఇంకా ఆ గబ్బు (కంపు) పోలేదని ఎద్దేవా చేశారు. కేటీఆర్, హరీశ్ ఏం మాట్లాడితే తెల్లారే ఆ జిరాక్స్ కాపీలతో ఈటల మాట్లాడతారని ఆరోపించారు. ఆయన కూడా బతకడానికి హైదరాబాద్ వచ్చి ఎంపీ అయిన విషయాన్ని గుర్తుంచుకోవాలని.. గౌరవం నిలబెట్టుకోవాలని ఈటలకు సూచించారు. మూసీ ప్రక్షాళనకు చేతనైతే ప్రధానిని రూ. 25 వేల కోట్లు ఇవ్వాల్సిందిగా కోరదామని.. ప్రధానిని కలవడానికి తనకు భేషజాల్లేవని చెప్పారు. జవహర్‌నగర్‌లో వెయ్యి ఎకరాల భూములున్నాయని.. కేంద్రం ఆర్థిక సాయం చేస్తే మూసీ బాధితులకు ఇందిరమ్మ ఇళ్లతో కాలనీలే కడతామన్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సబర్మతీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసిన మోదీని అనుసరించే బీజేపీ నేతలు.. మూసీ అభివృద్ధిని వద్దనడం ఏం న్యాయమని ప్రశ్నించారు.

ఇంకుడుగుంతల్లేని ఇళ్లకు పంపే ట్యాంకర్లకు రెండింతల చార్జీ..

'కొందరు దురాశపరుల వల్ల చెరువుల్లోని నీళ్లు రోడ్లపైకి.. అక్కడి నుంచి ఇళ్లలోకి వస్తున్నాయి. కొందరి స్వార్థంతో లక్షల కుటుంబాలు నీట మునుగుతున్నాయి. దీనికో పరిష్కారం చూపించాలి. అందరూ నాకెందుకులే అనుకుంటే నగరం మునుగుతుంది. చూస్తుండగానే చెరువులు, నాలాలు మూసుకుపోయాయి. ఇలాగే చూస్తూపోతే మూసీ కూడా మూసుకుపోతుంది'అని రేవంత్ అన్నారు. అందుకే ఇకపై ఇంకుడు గుంతల్లేకుంటే ఇళ్ల నిర్మాణాలకు అనుమతులివ్వబోమని.. ఇంకుడుగుంతల్లేని ఇళ్లకు పంపే ట్యాంకర్లకు రెండింతల చార్జీలు వసూలు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

నల్లగొండను చంపేద్దామా?

'నల్లగొండ జిల్లా ప్రజలు ఓవైపు ఫ్లోరైడ్‌తో, మరోవైపు మూసీ కాలుష్యంతో బతకలేని పరిస్థితిలో ఉంటే ప్రక్షాళనను అడ్డుకుంటున్న వారు ఏం ముఖం పెట్టుకొని నల్లగొండలో తిరుగుతారన్నారు. ఆ జిల్లాలో మీకు ఓట్లేయకుంటే ప్రజలను చంపేస్తారా అని బావబావామరుదులను అడుగుతున్నా'అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

పేదలకు మెరుగైన సేవల కోసమే డిజిటల్ కార్డు

కంటోన్మెంట్: పేదలకు మెరుగైన సేవలు అందించడానికే డిజిటల్ ఫ్యామిలీ హెల్త్ కార్డు ప్రాజెక్టు చేపట్టామని సీఎం రేవంత్ చెప్పారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో రెండు గ్రామాలు లేదా వార్డుల్లో పైలట్ ప్రాజెక్టుగా సర్వే మొదలుపెట్టామన్నారు. కుటుంబ సమగ్ర సమాచారాన్ని.. సంక్షేమ పథకాల అమల్లో 30 శాఖల సమాచారమంతా ఒకే కార్డులో పొందుపరిచి ఒక్క క్లిక్‌తో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం వివరించారు. వన్‌స్టేట్ వన్‌కార్డు విధానంతో ప్రభుత్వం ముందుకెళుతోందని చెప్పారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ కూడా పొందుపరుస్తామన్నారు. తాము అధికారంలోకి రాగానే కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో కలిపేలా కేంద్రాన్ని ఒప్పించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును పట్టాలెక్కించామన్నారు. కాగా, దసరాలోపే నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల పేరిట లబ్ధిదారులకు అందిస్తామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

మూసీ మురికి అంతా వారి నోట్లోనే

▶ మొదటి పేజీ తరువాయి



తగ్గడం లేదన్నారు. ఉమ్మడి కుటుంబాలను రోడ్డుకు ఈడ్చి చిచ్చు పెట్టిన మూర్ఖుడు సీఎం రేవంత్‌రెడ్డి అని మండిపడ్డారు. మూసీ వద్ద ఇళ్లు ఖాళీ చేస్తే డబుల్ బెడ్ రూమ్ ఇల్లుతో పాటు రూ.25 వేల పారితోషికం.. అంటూ అధికారులు వెకిలి ఆఫర్లు ఇస్తున్నారని మండిపడ్డారు. కోటి ఆశలతో కట్టుకున్న కలల సౌధం ఖరీదు కేవలం రూ.25 వేలేనా అని ప్రశ్నించారు. మీ సోదరుడు, మంత్రుల ఇళ్లకు రూ.50 వేలు ఇస్తే కూల్చమంటారా? అని వ్యాఖ్యానించారు. ఇండ్లు పోతాయనే భయంతో బుచ్చమ్మ, కుమార్ ప్రాణాలు పోయాయని, సీఎం ధన దాహం, కుంభకోణాలకు ఎంత మంది ప్రాణాలు పోవాలో చెప్పాలన్నారు. ఇల్లు కూలుస్తారనే భయంతో కుమార్ అనే వ్యక్తి మరణించడంతో ఇప్పటికే తల్లి కూడా లేని ముగ్గురు పిల్లలు అనాథలు అయ్యారన్నారు. వీటన్నిటికీ ప్రజలు కాంగ్రెస్‌కు మిత్తితో సహా గుణపాఠం చెప్తారన్నారు.

పాలనా వైఫల్యంతో ఆదాయానికి గండి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుభవ రాహిత్యం, పాలనా వైఫల్యంతో ప్రభుత్వ ఆదాయం పడిపోతోందని కేటీఆర్ విమర్శించారు. సంపద సృష్టించి పేదలకు పంచే తెలివి లేకపోవడంతోనే అనర్థం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే ప్రభుత్వ ఆదాయం వేగంగా పడిపోతుంటే.. వచ్చే నాలుగేళ్లు రాష్ట్ర ప్రజలకు కష్టకాలమే అని పేర్కొన్నారు. ఈ గడ్డు పరిస్థితులను మరింత దిగజార్చే చేష్టలే తప్ప, దిద్దుబాటు చర్యలు కనుచూపు మేరలో కనిపించడం లేదన్నారు. మార్పు మార్పు.. అంటూ తెలంగాణ ప్రగతికి పాతరేసిన పాపం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ లోపాలను ప్రశ్నిస్తున్న జర్నలిస్టులపై భౌతిక దాడులకు తెగబడుతున్నారన్నారు. ప్రభుత్వాన్ని నిలదీస్తున్న చిలుక ప్రవీణ్‌పై దాడి చేసిన కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్ట్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

స్మైల్ ప్లీజ్ !



రఘునాథపాలెం: డిజిటల్ కార్డుల జారీ కోసం.. ఖమ్మం జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లోని పది ప్రాంతాల్లో గురువారం సర్వే మొదలు కాగా.. రఘునాథపాలెం మండలం రాములు తండాలోనూ సర్వే మొదలు పెట్టారు. ఈమే రకు సర్వేను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఓ గిరిజన కుటుంబ సభ్యులను ఫోన్‌తో ఫొటో తీశారు. తనను కలెక్టర్‌గా పరిచయం చేసుకున్న ఆయన.. ఆ కుటుంబానికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్లు లూథర్ విల్సన్, ఎంపీడీవో ఆశోక్, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

పేదల ఇళ్లు కూలిస్తే.. ప్రభుత్వం కూలుతుంది

▶ మొదటి పేజీ తరువాయి

బడాబాబులు, పెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీలు, వ్యాపారవేత్తలు ఫాంహౌస్‌లు, ఎస్టేట్‌ల పేరుతో నిర్మాణాలు చేసుకున్నారు. ముందు వారిపై హైడ్రా ప్రతాపం చూపాలి. దమ్ముంటే అక్రమంగా నిర్మించుకున్న ఒవైసీ ఫాతిమా కాలేజీని కూల్చండి'అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

కొండా సురేఖ వ్యాఖ్యలపై..

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై విలేకరులు స్పందన కోరగా.. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం రాజకీయ ప్రయోజనాలు, ప్రత్యర్థులపై విమర్శల కోసం ఇతరుల కుటుంబ వ్యవహారాలు, మహిళల వ్యక్తిగత విషయాలను వాడుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. 'అలాంటి నీచ సంస్కృతిని కేసీఆర్ మొదలు పెట్టారు. కేటీఆర్ ముందుకు తీసుకెళ్లారు. నేడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనసాగిస్తున్నారు'అని అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ చేస్తున్న తప్పులకు ఆ పార్టీలను బహిష్కరించాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. 'కేసీఆర్ సర్కార్ గతంలో ఫోన్ ట్యాపింగ్‌తో సినీ ప్రముఖులు, వ్యాపారస్తుల వ్యక్తిగత విషయాలను తెలుసుకుని, వారిని బ్లాక్ మెయిల్ చేసి కోట్లాది రూపాయలు వసూలు చేసినట్లు పోలీసు అధికారులే చెప్పారు'అని వ్యాఖ్యానించారు.

కొత్తాదేవుడండి.. పవన స్వామి

- క్షుద్ర రాజకీయాలకు పవన్‌కళ్యాణ్ మతం ముసుగు
- నిప్పులు చెరిగిన భూమన కరుణాకరరెడ్డి



సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు పీఠాధిపతి పవనానంద స్వామి తిరుపతి వచ్చారు. 14 ఏళ్లుగా తన కుమార్తెలను శ్రీవారి దర్శనానికి తీసుకురాని వ్యక్తి పవన్‌కళ్యాణ్. భక్తిపరులు, సనాతన ధర్మ ఆచార్యుల పిల్లలకు 9, 11 నెలలకే తలనీలాలు తీస్తారు. అలా చేయని పవనస్వామి సనాతన ధర్మ పరిరక్షకుడయ్యారు.

....

కొత్తగా అవతరించిన పరమ హంస పరివ్రాజకాచార్య, మంత్రశాస్త్ర పయోనిధి, నరరూప నారాయణుడు, నిత్య సత్య ప్రవచనాల దీక్షాపరుడు, అస్ఖలిత బ్రహ్మచర్య దీక్షాపరుడు, సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ పవన స్వాముల వారు మన తిరుపతికి వేంచేసి అనుగ్రహ భాషణం చేశారు. నిన్నకాక మొన్న తిరుపతిలో అడుగుపెట్టి, కాలినడకన శ్రీవారి దర్శనానికి వెళ్తూ.. దారిపొడవునా వందల సంవత్సరాలుగా శాపగ్రస్తులైన కొన్ని మెట్లకు శాపవిముక్తి చేయడం కోసం కొన్ని చోట్లపడి దొర్లుతూ, కొన్నిచోట్ల పూర్తిగా పడిపోయారు. అలా తన స్వేదంతో ఆ మెట్లకు ప్రోక్షణ చేసి తిరుమలకు చేరుకున్నారు.

సాక్షి ప్రతినిధి, తిరుపతి : వారాహి సభలో పవన్‌కళ్యాణ్ ప్రసంగాన్ని చూసి కెవ్వుకేక పాట గుర్తుకొచ్చిందని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వారాహి సభలో చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి భూమన తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పవన్‌కళ్యాణ్ వేషధారణ, ప్రసంగాన్ని తప్పుబట్టారు. క్షుద్ర రాజకీయాలతో మతం ముసుగులో పవన్ స్వాములు ప్రజలను మభ్యపెట్టేందుకు వారాహి డిక్లరేషన్ అంటూ తిరుపతికి వచ్చారన్నారు. 11 రోజులు వారాహి దీక్ష చేసి, శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసి నానా హంగామా చేస్తూ సినీ డైరెక్టర్ త్రివిక్రమ్ స్క్రిప్టును చదివారని మండిపడ్డారు. గత 14 ఏళ్లుగా ఏనాడూ తన కుమార్తెలను దైవ దర్శనానికే తీసుకురాని వ్యక్తి.. దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సనాతన ధర్మ ఆచారం ప్రకారం శ్రీవారి పట్ల అపారమైన నమ్మకం కలిగిన భక్తులు.. తమ పిల్లలకు 9వ నెలలో, 11వ నెలలో తలనీలాలు తీసే సంప్రదాయాన్ని పాటిస్తారని, అయితే సనాతన ధర్మ పరిరక్షణకు కంకణబద్ధుడైన ఈ కొత్త పీఠాధిపతి ఆ సంప్రదాయాన్ని ఏనాడూ పాటించలేదని చెప్పారు. తన కుమార్తెలను ఏనాడూ దైవ దర్శనానికి తీసుకురాని పవన్ స్వామి.. డిక్లరేషన్‌లో సంతకం చేయించడం అర్థంకాని విషయమన్నారు. 'రాజకీయాలు మాట్లాడనంటూనే పవన్ సనాతన ధర్మానికి నష్టం జరిగిందంటూ ఈరోజు డిక్లరేషన్ ఇస్తూ ప్రసంగించడం అపచారం. మా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిపై ఇష్టమొచ్చినట్లుగా రాజకీయ ప్రేలాపనలు చేయడం కూడా విడ్డూరం' అని అన్నారు.

ఫార్మా సిటీ భూములతో రియల్ దందా చేస్తావా..

- అనుయాయులకు 10వేల ఎకరాలు కట్టబెట్టాలని చూస్తున్నాడు
- దప్పూరు ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు


దప్పూరులో ఫార్మా విలేజ్ నిర్వాసితులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఫార్మాసిటీ కోసం హైదరాబాద్‌కు సమీపంలో సేకరించిన 15 వేల ఎకరాల భూములతో సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారని, ఇందులో పది వేల ఎకరాలు తన అనుయాయులకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మాజీమంత్రి టి.హరీశ్‌రావు ఆరోపించారు. రేవంత్‌రెడ్డి.. నువ్వు సీఎంవా, రియల్ ఎస్టేట్ బ్రోకర్‌వా అంటూ హరీశ్ నిలదీశారు. రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని, ఇప్పుడు ఫార్మా విలేజ్ పేరుతో దప్పూరుపై ఈ రాయి పడిందన్నారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం దప్పూరులో ఫార్మా విలేజ్ ఏర్పాటుతో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు మద్దతుగా జరిగిన రచ్చబండకు హరీశ్‌రావు హాజరయ్యారు. ప్రభుత్వం సేకరిస్తున్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ పచ్చని పల్లెల్లో ఫార్మా విలేజీ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిర్వాసితుల తరఫున న్యాయపోరాటం చేస్తామన్నారు. ఇందుకోసం గ్రీన్ ట్రిబ్యునల్‌తో పాటు, హైకోర్టును కూడా ఆశ్రయిస్తామని చెప్పారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై మాట్లాడతామని, మూడు పంటలు పండుతున్న ఈ భూముల్లో ఫార్మా పరిశ్రమ ఏర్పాటు చేయొద్దని, బలవంతంగా భూములను తీసుకోవాలని ప్రయత్నిస్తే బాధితుల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. మూసీని శుద్ధి చేస్తానని చెప్పి అక్కడి పేదల ఇళ్లు కూల్చివేస్తున్న రేవంత్‌రెడ్డి.. దప్పూరు పచ్చని పంట పొలాల్లో ఫార్మా విలేజ్ ఏర్పాటు చేసి ఇక్కడి చెరువులు, కుంటలు, పక్కనే ఉన్న మంజీర నదిని విషంతో నింపుతావా అని హరీశ్‌రావు నిలదీశారు.

రాహుల్.. రేవంత్‌కు బుద్ధి చెప్పు..

'మూసీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇళ్లు కూలగొట్టుడు.. వారి భూములు కొల్ల గొట్టడమే ఇందిరమ్మ రాజ్యమా 'అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇందిరమ్మ గరీబీ హఠావో అంటే.. రేవంత్‌రెడ్డి గరీబోంకో హఠావో చేస్తున్నారని మండిపడ్డారు. పేదల భూములు లాక్కోవొద్దని రేవంత్‌రెడ్డికి రాహుల్‌గాంధీ బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. హరీశ్ వెంట ఆ పార్టీ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపూరం శివకుమార్ తదితరులు ఉన్నారు.

సెక్యూరిటీ లేకుండా మూసీ బాధితుల వద్దకు వస్తావా?

- సీఎం రేవంత్‌కు ఈటల రాజేందర్ సవాల్
- తనను బతకొచ్చినవాడని సీఎం అనడంపై తీవ్ర అభ్యంతరం


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

కంటోన్మెంట్ (హైదరాబాద్): మూసీ ప్రక్షాళన పేరిట ఇళ్లు కూల్చివేస్తున్న బాధితుల వద్దకు సెక్యూరిటీ లేకుండా రావాలని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. కూల్చివేత బాధితులు రేవంత్ రెడ్డి చర్యలను మెచ్చుకుంటే తాను ముక్కు నేలకు రాసి, రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని, అయితే ఇష్టానుసారంగా ఇళ్ల కూల్చి వేతను మాత్రమే తాము ప్రశ్నిస్తున్నామని ఈటల పేర్కొన్నారు. కంటోన్మెంట్‌లో గురువారం చేపట్టిన డిజిటల్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఎం తనను బతకొచ్చినవాడు.. అంటూ చేసిన వ్యాఖ్యలపై ఈటల తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ నేపథ్యంలో సాయంత్రం కంటోన్మెంట్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈటల.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు.

ప్రక్షాళన వెనుక అవినీతి


మూసీ ప్రక్షాళన పేరిట భారీ స్థాయిలో అవినీతికి పాల్పడే అవకాశముందని ఈటల అన్నారు. సబర్మతి, గంగా ప్రక్షాళన గురించి మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, ఆయా ప్రాజెక్టులకు ఎంత వ్యయం అయిందో తెలుసుకోవాలన్నారు. సబర్మతి రివర్ ఫ్రంట్‌కి రూ.1,400 కోట్లు ఖర్చు పెడుతున్నారు. 2,500 కిలోమీటర్ల మేర విస్తరించిన గంగానది ప్రక్షాళన కోసం రూ.20 వేల కోట్లు ఖర్చు మాత్రమే ఖర్చుపెట్టారు, మరి మూసీ కోసం రూ.1.50 లక్షల కోట్లు ఎందుకు అని ఆయన ప్రశ్నించారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చట్టం, సిస్టం లేని అరాచక శక్తి అని ఈటల మండిపడ్డారు. రేవంత్ భాష జుగుప్సాకరంగా ఉందని, పిట్టల దొరలా మాట్లాడుతున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డిని గతంలో కొడంగల్ ప్రజలు బొందపెడితే.. ప్రశ్నించే గొంతునంటూ మల్కాజ్‌గిరి వచ్చారని ఎద్దేవా చేశారు. అయితే గెలిపించిన మల్కాజ్‌గిరి ప్రజల గోసను పట్టించుకోలేదని మండిపడ్డారు.

స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తా

డిజిటల్ కార్డుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి తనను అధికారికంగా పిలవకపోవడంపై లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని ఈటల రాజేందర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో ఒక్క పని కూడా చేయలేదన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం తప్ప రూ.2,500 ఇవ్వలేదని, తులంబంగారం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణాల ఊసే లేదని ఆయన ధ్వజమెత్తారు.

మూసీ ప్రక్షాళనతో పేదలకు నష్టం లేకుండా చూస్తాం

- స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల ప్రతినిధుల సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు


ప్రజా సంఘాల ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: మూసీనది ప్రక్షాళన, సుందరీకరణ వల్ల పేదలు నష్టపోకుండా చూస్తామని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. గురువారం ఆయన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో 20కి పైగా స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు విషయంలో ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించొద్దని అధికార యంత్రాంగాన్ని ఇప్పటికే సీఎం రేవంత్ ఆదేశించారని గుర్తు చేశారు. మూసీ నదీ గర్భంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి పునరావాసం కల్పిస్తామని, ఎవరినీ రోడ్ల పైకి పంపించే ప్రసక్తే లేదన్నారు. మూసీకి లక్ష క్యూసెక్కులకు పైగా భారీ వరద వచ్చినప్పుడు రివర్ బెడ్‌లో ఉన్న ప్రజానీకానికి ప్రాణాపాయం, ఆస్తి నష్టం జరుగుతుందనేదే తమ ఆందోళన అని వివరించారు. బఫర్ జోన్‌లో ఆక్రమణల తొలగింపు విషయంలో కూడా అందరి అభిప్రాయాలను సానుకూలంగా వింటామన్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుతో పరీవాహక ప్రాంతమంతా పర్యాటక కేంద్రంగా మారుతుందని చెప్పారు. ఎవరు రెచ్చగొట్టినా, ప్రలోభ పెట్టాలని చూసినా అనవసర ఆవేశాలకు పోవొద్దని మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు హితవు చెప్పారు. వారికి ఏ ఆపద వచ్చినా ఆదుకోవాల్సింది ప్రభుత్వమేనని, రాజకీయంగా వాడుకోవాలని చూసేవారి వల్ల నష్టపోవడం తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. సమావేశంలో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, శాంతాసిన్హా, సజయ, సంధ్య, బ్రదర్ వర్గీస్, మీరా సంఘమిత్ర, బిలాల్, తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణ ఓటర్లు @ 1,67,33,584

వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాను ప్రచురించిన ఎస్ఈసీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తాజాగా గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా తుది ఓటర్ల జాబితాలను ప్రచురించింది. దీనికి సంబంధించి ఇదివరకే ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలపై వచ్చిన అభ్యంతరాల పరిష్కారం, ఆ మేరకు ఓట్ల తొలగింపు తర్వాత మండల, పంచాయతీ కార్యాలయాల్లో నోటీస్ బోర్డులపై డిస్‌ప్లే చేసింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్రంలో 1,67,33,584 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నట్టుగా తేలింది. రాష్ట్రంలోని మొత్తం 538 మండలాలు, వాటి పరిధిలోని 12,867 గ్రామ పంచాయతీలు, 1,13,722 వార్డుల్లో ఈ మొత్తం ఓటర్లలో 82,04,518 మంది పురుషులు, 85,28,573 మంది మహిళలు, 493 మంది ఇతరులు (ట్రాన్స్‌జెండర్లు) ఉన్నారు.

నల్లగొండ జిల్లా టాప్.. మేడ్చల్ లాస్ట్

గ్రామీణ ఓటర్ల పరంగా చూస్తే నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంది. ఈ జిల్లాలోని 31 మండలాల్లోని 856 గ్రామపంచాయతీల్లో 7,392 వార్డుల్లో మొత్తం 10,42,545 ఓటర్లున్నారు.

- మేడ్చల్ మల్కాజిగిరిలో అత్యల్ప గ్రామీణ ఓటర్లు ఉన్నారు. ఈ జిల్లాలో గతంలో ఐదు మండలాలు ఉండగా వాటిలో కీసర, ఘట్‌కేసర్ మండలాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో మేడ్చల్ జిల్లా 3 మండలాల్లోని 34 గ్రామపంచాయతీలు..320 వార్డుల్లో మొత్తం 64,397 ఓటర్లు ఉన్నట్టుగా తేలింది.

	జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
టాప్-5 జిల్లాల్లో	నల్లగొండ	31	856	7,392	5,16,713	5,25,780	52	10,42,545
	ఖమ్మం	20	589	5,398	4,13,048	4,39,807	23	8,52,878
	సంగారెడ్డి	25	646	5,718	4,15,201	4,19,113	46	8,34,360
	నిజామాబాద్	27	545	5,022	3,87,017	4,43,548	15	8,30,580
	సూర్యాపేట	23	486	4,388	3,35,542	3,47,320	20	6,82,882
లాస్ట్-5 జిల్లాల్లో	మేడ్చల్	03	34	320	32,402	31,992	03	64,397
	ములుగు	09	174	1,556	1,15,501	1,22,332	25	2,37,858
	భూపాలపల్లి	11	240	2,044	1,42,217	1,48,432	14	2,90,663
	సిరిసిల్ల	12	260	2,268	1,67,686	1,78,553	20	3,46,259
	వనపర్తి	14	260	2,366	1,83,382	1,84,135	04	3,67,521

ఇన్ని రోజులు ఏం చేశారు?



గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలు జూలై 7న విడుదల చేశారు

మీరు నెల రోజుల తర్వాత కోర్టును ఆశ్రయించారన్న హైకోర్టు

అభ్యంతరాలు స్వీకరించాం.. నిపుణుల కమిటీకి పంపాం

వారు తేల్చిన తరువాతే ఫలితాలు విడుదల చేశాం

'గ్రూప్-1' పై దాఖలైన పిటిషన్లపై ప్రభుత్వం వాదనలు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలు జూలై 7న వస్తే దాదాపు నెల రోజులు ఏం చేశారని, అలస్యమెందుకో చెప్పాలని పిటిషనర్లను హైకోర్టు ప్రశ్నించింది. ప్రిలిమ్స్ 'కీ'పై అభ్యంతరాలు స్వీకరించామని, సబ్జెక్టువారీగా నిపుణుల కమిటీని నియమించి వాటిని పరిశీలించామని ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. '155 అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని రెండు ప్రశ్నలను తొలగించి మెరిట్ జాబితాను విడుదల చేశాం. కీపై తాము అభ్యంతరాలు తెలిపామని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వాటిని పరిగణనలోకి తీసుకోలేదని ఐదుగురు పిటిషనర్లు పేర్కొంటున్నా.. అందులో ఒక్కరే కమిషన్‌ను ఆశ్రయించారు. మిగతా నలుగురు అభ్యంతరం తెలపలేదు' అని జీపీ చెప్పారు. అనంతరం న్యాయస్థానం తదుపరి విచారణను నేటికి వాయిదా వేసింది.

'ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల జాబితాను ప్రచురించే ముందు ప్రాథమిక కీపై వచ్చిన అభ్యంతరాలను పూర్తిగా పరిశీలించాకే మెరిట్ జాబితా ప్రకటించాలి. కానీ టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్‌పై ఆ మేరకు చర్యలు తీసుకోలేదు. తప్పుగా వచ్చిన ప్రశ్నలను తొలగించి మళ్లీ మెరిట్ జాబితా ప్రకటించేలా ఆదేశించాలి' అని వికారాబాద్‌కు చెందిన దామోదర్‌రెడ్డితో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే రీ నోటిఫికేషన్, ఎస్టీ రిజర్వేషన్ సవాల్ చేస్తూ మరికొందరు పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తీక్ గురువారం విచారణ చేపట్టారు.

తార్కిక విశ్లేషణ అవసరం

స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'టీఎస్‌పీఎస్సీకి పరీక్షల నిర్వహణపై ఏ చర్యలైనా చేపట్టేఅధికారం ఉంటుంది. రూల్ ఆఫ్ ప్రొసీజర్‌లో భాగంగా పరీక్ష రద్దు, రీ నోటిఫికేషన్, రిజర్వేషన్లు సహా ఎలాంటి నిర్ణయమైనా తీసుకోవచ్చు. తొలుత ఇచ్చిన 503 పోస్టులకు అదనంగా 60 పోస్టులు పెంచడం అభ్యర్థులకు లబ్ధిచేకూర్చడమే తప్ప నష్టం లేదు. రీ నోటిఫికేషన్‌కు అభ్యంతరం తెలిపిన పిటిషనర్, 'కీ'ని చాలెంజ్ చేసిన వారిలో కూడా ముగ్గురు మెయిన్స్‌కు ఎంపికయ్యారు. గ్రూప్-1లాంటి అత్యున్నత స్థాయి పోస్టుల పరీక్షలు రాసేటప్పుడు వన్ ప్లస్ వన్ అనగానే టు అనడం కాదు. ప్రశ్నలకు తార్కిక, విశ్లేషణాత్మకంగా ఆలోచన అవసరం. ఒకరిద్దరు ప్రశ్నలు అర్థం చేసుకోలేకపోయినంత మాత్రాన అభ్యంతరం వ్యక్తం చేయడం సరి కాదు. ప్రిలిమ్స్ ప్రశ్నల్లోగాని, సమాధానాల్లోగాని ఎలాంటి లోటుపాట్లు, తప్పులు చోటుచేసుకోలేదు. వేల మంది అభ్యర్థులు మెయిన్స్ రాసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఒకరిద్దరి కోసం కోర్టు జోక్యం చేసుకోవడం సరికాదు. మరోసారి ప్రిలిమ్స్ రద్దు చేస్తే అభ్యర్థుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహ ఏర్పడతాయి. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రాసిన దాదాపు మూడు లక్షల మంది అభ్యర్థుల నుంచి కమిషన్ భౌతికంగా 721, ఆన్‌లైన్‌లో 6,470 అభ్యంతరాలను స్వీకరించింది. వీటన్నింటిని కమిషన్ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ పరిశీలించింది. అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే కమిషన్ తుది కీ విడుదల చేసింది. విద్యా విధానం, పరీక్షల్లో కోర్టుల జోక్యం స్వల్పమేనని సుప్రీంకోర్టు గతంలో పేర్కొంది. ఈ పిటిషన్లను కొట్టివేయాలి' అని రాహుల్ విజ్ఞప్తి చేశారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది సుధీర్ వాదనలు వినిపించారు.

సింగిల్ జడ్జి తీర్పుపై స్టేకు నిరాకరణ

▶ మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుపై సింగిల్ జడ్జి ఆధారపడ్డారు. స్పీకర్ ఐదేళ్లపాటు మౌనంగా ఉండేందుకు ఇష్టపడితే కోర్టులు చూస్తూ ఉండలేవని చెప్పారు. బీఆర్ఎస్ కాలంలో అనేక అనర్హత పిటిషన్లు పదవీకాలం ముగిసే వరకు పెండింగ్‌లోనే ఉన్నాయి. పిటిషనర్లు స్పీకర్‌ను ఊపిరి తీసుకునే అవకాశమైనా ఇవ్వకుండా కోర్టును ఆశ్రయించారు'అని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయ సమీక్ష అధికారాలతో అనర్హత పిటిషన్‌లను నిర్ణీత గడువులోగా నిర్ణయించాలని శాసనసభ స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేయగలదో.. లేదో తేల్చాలని కోరారు. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన గడువు సమీపిస్తోందని, ఏదైనా నిర్ణయం వెలువరించే అవకాశముందని చెప్పారు. సింగిల్ జడ్జి సుమోటోగా విచారణ చేపట్టకున్నా.. బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సింగిల్ జడ్జి ఆదేశాలను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఒకవేళ ఏదైనా ఉత్తర్వులు ఇస్తే వెంటనే ఇక్కడ (సీజే ధర్మాసనం) ఆశ్రయించే స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. దీనికి అనుమతించిన ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

సింగిల్ జడ్జి తీర్పు ఇది...

ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, వెంకట్రావును అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద్.. దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి... ఎమ్మెల్యే నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా, స్పీకర్ సమయం ఇవ్వడం లేదంటూ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. ఎమ్మెల్యేల ఫిరాయింపుపై దాఖలైన అనర్హత పిటిషన్ల స్టేటస్ చెప్పేందుకు 4 వారాలకు గడువిస్తున్నాం.. ఆలోగా వివరాలు అందజేయకుంటే మేమే ఆదేశాలు జారీ చేయాల్సి వస్తుందని గత నెల 9న స్పీకర్ కార్యదర్శికి హైకోర్టు తేల్చిచెప్పింది.

క్లుప్తంగా...

రుణమాఫీపై దీక్షల పేరిట కొత్త డ్రామాలు: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: రాజకీయ పబ్బం కోసం రుణమాఫీపై బీజేపీ నేతలు గందరగోళం సృష్టిస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. రుణమాఫీపై సరైన లెక్కలు తెలుసుకోకుండా దీక్షల పేరిట కొత్త డ్రామాకు తెరతీశారని బీజేపీ నేతలను ఉద్దేశించి గురు వారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం రైతులు 65.56 లక్షలమంది ఉన్నారని, ఇందులో కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిన 42లక్షల మందికి మొదటి పంట కాలంలోనే రుణమాఫీ అమలు చేయడానికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. తుమ్మలకి మంత్రి పదవులు కొత్త కాదని, మంత్రిపదవి కోసమో, ఇతర పదవులకు ఆశపడో మాట్లాడే నైజం తనది కాదన్నారు. భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని రూ.10వేల కోట్లు అడిగితే కేంద్రం ఇచ్చింది రూ.400 కోట్లు మాత్రమేనని, దీనిపై కేంద్ర బీజేపీ పెద్దలను మీరేమైనా ప్రశ్నించారా అని అడిగారు. తెలంగాణలో బీజేపీ పరపతిని పెంచుకోవాలనుకుంటే, రాష్ట్రానికి వచ్చే నిధుల కోసమో, తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసమో ప్రభుత్వం తరఫున ఆ పార్టీ నేతలు కూడా కేంద్రంపై పోరాడాలని హితవు పలికారు.

ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి

న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి టీఎస్ఎల్ఎస్ఏ పిలుపు

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు ఆవరణలో జరిగే మల్టీ స్పెషాలిటీ ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు వినియోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర న్యాయసేవల అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ) పిలుపునిచ్చింది. ఉస్మానియా ఆసుపత్రి, నిర్మాణ్ ఆర్గనైజేషన్ (ఎన్‌జీవో) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొంది. ఈ మేరకు టీఎస్ఎల్ఎస్ఏ సభ్యకార్యదర్శి సీహెచ్.పంచాక్షరి గురువారం మీడియాతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, టీఎస్ఎల్ఎస్ఏ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే శిబిరాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. టీఎస్ఎల్ఎస్ఏ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజోయ్‌పాల్‌తోపాటు ఇతర న్యాయమూర్తులు పాల్గొంటారన్నారు. బార్ అసోసియేషన్, అధికారులు, కోర్టు సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.రవీందర్‌రెడ్డి, ఉస్మానియా సూపరింటెండెంట్ రాకేశ్‌కుమార్, నిర్మాణ్ సీఈవో మయూర్ పాట్నాల పాల్గొననున్నట్లు వివరించారు.

6 నుంచి సికింద్రాబాద్-వాస్కోడిగామా మధ్య కొత్త ట్రైన్

9 నుంచి రెగ్యులర్ సేవలు

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్-వాస్కోడిగామా మధ్య ఈనెల 6 నుంచి కొత్త బై వీక్లీ ట్రైన్ ప్రారంభం కానుంది. సికింద్రాబాద్ నుంచి ప్రతి బుధ, శుక్రవారాల్లో... వాస్కోడిగామా (గోవా) నుంచి ప్రతి గురు, శనివారాల్లో ఈ ట్రైన్ రాకపోకలు సాగించనుంది. రెగ్యులర్ సర్వీస్‌లు ఈ నెల 9 నుంచి మొదలవనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ సికింద్రాబాద్-వాస్కోడిగామా (07039) రైలు ఉదయం 11.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు వాస్కోడిగామా చేరుకుంటుంది. 9 నుంచి ప్రారంభమయ్యే రెగ్యులర్ సికింద్రాబాద్ బై వీక్లీ (17039/17040) మర్నాటి ఉదయం 4.20కి వాస్కోడిగామా చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 10న ఉదయం 9 గంటలకు వాస్కోడిగామాలో బయలుదేరి మర్నాటి ఉదయం 5.20కి గమ్యం చేరుకుంటుంది.

బాబు మోసాలపై ప్రజాగ్రహం

పార్టీ నేతలు, జడ్పీటీసీలతో సమావేశంలో వైఎస్ జగన్

సూపర్ సిక్స్ హామీల అమల్లో విఫలం

ఏపీలో పాలన అస్తవ్యస్థం.. ప్రతిదీ స్కామే

మళ్లీ వచ్చేది కచ్చితంగా మన ప్రభుత్వమే



సమావేశంలో మాట్లాడుతున్న జగన్

సాక్షి, అమరావతి: ఏపీలో అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా సీఎం చంద్రబాబు కనీసం వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టలేకపోతున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. దేశం, రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా, ఎన్నడూ జరగని విధంగా ఈ ప్రభుత్వం ఇంతవరకు రెగ్యులర్‌బడ్జెట్ పెట్టలేదని, ఇంకా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పైనే కాలం గడుపుతోందని విమర్శించారు. రెగ్యులర్ బడ్జెట్ ప్రవేశపెడితే ఏయే స్కీమ్‌కు ఎంత కేటాయించారన్నది చెప్పాల్సి ఉంటుందని.. అలా చెప్పకుంటే ప్రజలు తిడతారనే భయంతో బడ్జెట్ ప్రవేశపెట్టకుండా చంద్రబాబు కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల పార్టీ నాయకులు, జడ్పీటీసీలతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జడ్పీ చైర్మన్ పార్టీ మారినా, జడ్పీటీసీలు కలసికట్టుగా నిలబడ్డారని ప్రశంసించారు. సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే...

సమస్యలున్నా మేం వెనక్కి తగ్గలేదు

మన ఐదేళ్ల పాలనలో ప్రజలకు చెప్పిన ప్రతి మాట నెరవేర్చాం. ఐదేళ్ల పాలనా కాలంలో మనం చేసిన మంచి ఎక్కడికీ పోలేదు. ఆ మంచి ఇంకా బతికే ఉంది. 'జగన్ మంచే చేశాడు... ఎక్కడా చెడు చేయలేదు'అన్న మాటే ప్రతి చోటా వినిపిస్తోంది. గత ఎన్నికల్లో అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబుతో మనం అస్సలు పోటీ పడలేదు. ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసేటప్పుడు చంద్రబాబులా జగన్ కూడా హామీలు ఇవ్వాలని చాలా మంది ఆశించారు. పిల్లలు కనిపిస్తే చంద్రబాబులా.. నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అని.. చెల్లెమ్మలు కనిపిస్తే నీకు రూ.18 వేలు అని, 50 ఏళ్లు నిండిన పెద్దమ్మలు కనిపిస్తే నీకు రూ.48 వేలు అని జగన్ కూడా చెబుతాడని ఆశించారు. మెడలో కండువాలతో రైతులు కనిపిస్తే.. నీకు రూ.20 వేలు అని జగన్ చెబుతాడని ఆశించారు. కానీ జగన్ అలా చెప్పలేకపోయాడు. ఒకవేళ జగన్ అవే మాటలు చెప్పి ఉంటే.. అధికారంలోకి వచ్చి ఉండే వాళ్ల మేమో! కానీ ఇవాళ పరిస్థితులను మీరంతా చూస్తూనే ఉన్నారు. చంద్రబాబు కనీసం బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేని పరిస్థితి ఉంది. ప్రజలను దారుణంగా మోసం చేశారు. ఇచ్చిన మాట ఏ ఒక్కటీ నెరవేర్చని పరిస్థితి కనిపిస్తోంది. మరి నేను కూడా అదే మాదిరిగా చేసి ఉంటే.. మీలో ఏ ఒక్కరైనా తలెత్తుకుని గ్రామాల్లోకి వెళ్లగలిగేవారా? మా జగన్ ఇది చెప్పాడు..! కానీ మా ప్రభుత్వంలో ఇది చేయలేకపోతున్నా మనే మాట చెప్పాల్సి వస్తే.. మిమ్మల్ని ప్రజలు ప్రశ్నిస్తే తట్టుకునేవారా? అందుకే.. రాజకీయాల్లో వ్యక్తిత్వం, విశ్వసనీయత, విలువలు లేకపోతే ప్రజల్లో చులకన అవుతాం. మనం ఎప్పుడూ తలెత్తుకునేలా రాజకీయాలు చేశాం. ఇకపై కూడా అలాంటి రాజకీయాలే చేస్తాం.


వచ్చేది కచ్చితంగా మన ప్రభుత్వమే..

ప్రజల తరఫున మనం ఉద్యమించాలి. ప్రజల కష్టాల్లో భాగస్వాములు కావాలి. కేసులు పెడతారని భయపడొద్దు. కేసులు పెడితే ఏమవుతుంది? నన్ను 16 నెలలు జైలుకు పంపించారు. నన్ను వేధించినట్టుగా ఎవరినీ వేధించి ఉండరు. అయినా ప్రజల ఆశీస్సులతో ముందుకు సాగాం. మళ్లీ బయటకు వచ్చి ప్రజలకు అండగా నిలబడ్డాం. ముఖ్యమంత్రిని కూడా అయ్యా. కేసులు పెట్టడం మినహా ఇంతకన్నా ఏం చేయగలుగుతారు? రెడ్ బుక్ పెట్టడం ఏమన్నా పెద్ద పనా? అదేమన్నా గొప్ప విషయమా? న్యాయం, ధర్మం కచ్చితంగా ఉండాలని మన ప్రభుత్వంలో తాపత్రయ పడ్డాం. అందుకే ఈ మాదిరిగా పరిపాలన చేయలేదు. ఇవాళ రాష్ట్రంలో అన్యాయమైన పాలన సాగుతోంది. ధైర్యంగా, కలిసికట్టుగా పోరాడుతూ ఉద్యమిద్దాం. కచ్చితంగా.. వచ్చేది మన ప్రభుత్వమే.

కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టుపై సీఎం పునరాలోచించాలి

ఫోర్ వాటర్ కాన్సెప్ట్ అమలుచేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎంపీ లక్ష్మణ్



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి. చిత్రంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కె. లక్ష్మణ్

సనత్‌నగర్ (హైదరాబాద్): కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి పునరాలోచించాలని, దానికి బదులుగా ఫోర్ వాటర్ కాన్సెప్ట్ కింద తక్కువ ఖర్చుతో వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ సూచించారు. డాక్టర్ ఎం.చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం 'దివంగత హనుమంతరావు ఫోర్ వాటర్ కాన్సెప్ట్ ఫర్ అల్టిమేట్ వాటర్ సెక్యూరిటీ ఇన్ తెలంగాణ' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. బేగంపేట సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) ప్రాంగణంలోని నిజామి యా అబ్జర్వేటరీ క్యాంపస్‌లో ఎన్‌డీఎంఏ మాజీ వైస్ చైర్మన్, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అధ్య క్షతన జరిగిన ఈ సమావేశానికి లక్ష్మణ్‌తో పాటు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పలువురు సాగునీటి ప్రాజెక్టుల నిపుణులు హాజరై చర్చించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ 'ఫోర్ వాటర్ కాన్సెప్ట్'పై చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్‌తో పాటు శశిధర్‌రెడ్డి చేస్తున్న కృషిని ప్రశంసించారు. ప్రతిపాదిత కొత్త లిఫ్ట్ పథకంపై సీఎం రేవంత్‌రెడ్డి పునరాలోచించాలని కోరారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఏడాదిలో 3 పంటలకు నీరు అందించే ఈ కాన్సెప్ట్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

రెట్టింపు వ్యయం అవుతుంది: శశిధర్‌రెడ్డి

ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష ఎకరాలకు సాగునీ రు అందించేందుకు రూ.4,350 కోట్ల అంచనా వ్యయంతో కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని అమ లు చేయాలన్న నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. భూసేకరణతో వాస్తవ వ్యయానికి రెట్టింపు అవుతుందన్నారు. ఫోర్ వాటర్ కాన్సెప్ట్‌తో లక్ష ఎకరాలకు నీరందించేందుకు ఎకరాకు దాదాపు రూ.15 వేల చొప్పున రూ.150 కోట్లే ఖర్చవుతుందన్నారు. కాగా గొటిగారిపల్లి గ్రామంలో జరిగిన పనుల గురించి ఆ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాచప్ప తదితరుల సమక్షంలో డాక్టర్ దొంతి నరసింహారెడ్డి ప్రదర్శన ద్వారా తెలియజేశారు.

'లడ్డూ' వివాదంపై విచారణ నేటికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: తిరుమల లడ్డూ తయారీ ఆరోపణలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టనుంది. ఈ పిటిషన్లపై గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు విచారణ ప్రారంభించగా.. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విచారణ చేపట్టాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా... జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో ధర్మాసనం ఈ పిటిషన్లపై శుక్రవారం విచారణ జరుపుతామని తెలిపింది. కాగా సెప్టెంబరు 30న ఈ కేసును విచారించిన అత్యున్నత న్యాయస్థానం.. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తును కొనసాగించాలా లేదా స్వతంత్ర సంస్థతో విచారణ చేపట్టాలా అనే విషయంలో తమకు సహకరించాలని మెహతాను కోరిన విషయం తెలిసిందే. అంతేకాకుండా దేవుళ్లను రాజకీయాలకు దూరంగా ఉంచాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూల తయారీలో జంతువుల కొవ్వును ఉపయోగించారని ఆరోపించిన సీఎం చంద్రబాబుపై న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైఎస్ వివేకా హత్య కేసులో సునీల్ యాదవ్‌కు బెయిల్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు (ఏ-2) సునీల్ యాదవ్‌కు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల వ్యక్తిగత బాండ్‌తోపాటు ఇద్దరి పూచీకత్తు సమర్పించాలని, పులివెందుల పోలీస్ స్టేషన్‌లో ప్రతి శనివారం హాజరుకావాలని ఆదేశించింది. పాస్‌పోర్టును సీబీఐ కోర్టులో అందజేయాలని, ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని నిర్దేశించింది. కేసు విచారణలో జోక్యం చేసుకోకూడదని, దర్యాప్తు అధికారులకు సహకరించాలని స్పష్టం చేసింది. ఒకవేళ పిటిషనర్ షరతులను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు కోరవచ్చని సీబీఐకి చెప్పింది. వివేకా హత్య కేసులో 2021 ఆగస్టు 2 నుంచి జైల్లో ఉంటున్నానని, సీబీఐ చార్జిషీట్ సైతం వేసినందున బెయిలివ్వాలని సునీల్ యాదవ్ హైకోర్టులో వేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ తీర్పు చెప్పారు.

తెలంగాణ తలసరి విద్యుత్ వినియోగం 2,349 యూనిట్లు

కేంద్ర విద్యుత్ సంస్థ నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ తలసరి విద్యుత్ వినియోగం 2349 యూనిట్లుగా నమోదైంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర విద్యుత్ అథారిటీ (సీఈఏ) ఇటీవలే నివేదికను విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం డామన్ అండ్ డయ్యూ, దాద్రా నగర్ హవేలీ 8870 యూనిట్లుగా అగ్రస్థానంలో ఉండగా.. ఆ తర్వాత 3360 యూనిట్లతో గోవా రెండో స్థానంలో ఉంది. ఇక పంజాబ్ 2574 యూనిట్లతో మూడో స్థానంలో, 2419 యూనిట్లతో ఒడిశా నాలుగో స్థానంలో, గుజరాత్ 2393 యూనిట్లతో ఐదో స్థానంలో, హరియాణా 2360 యూనిట్లతో ఆరో స్థానంలో, 2349 యూనిట్లతో తెలంగాణ ఏడో స్థానంలో ఉంది. ఇక 2006-07లో జాతీయ తలసరి విద్యుత్ వినియోగం 672 యూనిట్లు కాగా.. 2022-23లో 1331 యూనిట్లుగా ఉంది. రాష్ట్రంలో విద్యుత్ వినియోగంలో వ్యవసాయ రంగం వాటా అధికంగా ఉంది. 39.33% వాటా వ్యవసాయరంగం కలిగి ఉంది. 27 లక్షలకు పైగా వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వం 24 గంటల పాటు ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తుండటం తెలిసిందే. ఇక ఎత్తిపోతల పథకాలు కలిపి 39.33 శాతం వాటాను వ్యవసాయ రంగం కలిగి ఉంది. ఇక గృహ వినియోగం వాటా తెలంగాణలో 20.30 శాతంగా ఉండగా.. వాణిజ్య వినియోగం 10.62 శాతంగా ఉంది.

సాగునీటి ప్రాజెక్టులకు రూ.527 కోట్ల చెల్లింపులు

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల ప్రాజెక్టుల బిల్లులకు కదలిక వస్తోంది. రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు రూ.527.8 కోట్ల బిల్లులు విడుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో ప్రాధాన్య ప్రాజెక్టుల వాటా రూ. 390 కోట్లుగా ఉంది. ఇక కీలకమైన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం)కు సంబంధించి రూ.110 కోట్లను విడుదల చేశారు. తక్కువ వ్యయం.. ఎక్కువ ఆయకట్టు.. లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతున్న విషయం విదితమే. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డితోపాటు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వరుసగా బకాయిలపై సమీక్ష చేశారు. దాంతో బిల్లులు క్రమంగా క్లియర్ అవుతున్నాయి.

చంద్రబాబు స్నేహితుడు ఈశ్వరన్‌కు జైలు శిక్ష

▶ మొదటి పేజీ తరువాయి

ఓంగ్ బెంగ్ సంగ్‌తోపాటు ఈశ్వరన్‌ను గత ఏడాది జూలై 12న సీపీఐబీ అధికారులు అరెస్ట్ చేశారు. దీంతో పదవికి రాజీనామా చేసిన ఈశ్వరన్ అనంతరం బెయిల్‌పై విడుదలయ్యారు. సీపీఐబీ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ఈశ్వరన్ అవినీతిని నిగ్గు తేలుస్తూ 27 అభియోగాలతో చార్జ్‌షీట్లు దాఖలు చేసింది. మంత్రి హోదాలో భారీ ముడుపులు తీసుకున్నట్లు 24 అభియోగాలు, అవినీతికి కేంద్ర బిందువుగా ఉన్నట్లు రెండు అభియోగాలు, న్యాయ విచారణకు అడ్డంకులు కల్పించినట్లు ఒక అభియోగం నమోదైంది.

బాబు భూ దోపిడీలో పార్టనర్

2014-19 మధ్య టీడీపీ హయాంలో చంద్రబాబు బృందం రాజధాని పేరిట యథేచ్ఛగా సాగించిన భూ దోపిడీలో ఈశ్వరన్ ప్రధాన భూమిక పోషించారు. ఏపీ రాజధాని నిర్మాణం కోసం ఏకంగా సింగపూర్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని భ్రమింపజేశారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌లో అత్యంత కీలకమైన స్టార్టప్ ఏరియా అభివృద్ధి ప్రాజెక్ట్‌ను చంద్రబాబు, ఈశ్వరన్ ద్వయం కుట్రపూరితంగా తెరపైకి తెచ్చింది. ఒప్పందం సమయంలో సింగపూర్‌కు చెందిన ప్రైవేట్ కంపెనీ అసెందాస్-సిన్‌బ్రిడ్జ్-సెంబ్ కార్ప్ కన్సార్షియంను తెరపైకి తెచ్చారు. స్విస్ చాలెంజ్ విధానంముసుగులో ఇతర సంస్థలేవీ పోటీ పడకుండా ఏకపక్షంగా 2017 మే 2న కట్టబెట్టేశారు. దీనికి నాటి చంద్రబాబు కేబినెట్ రాజముద్ర వేసింది. ఆ ఒప్పంద పత్రాలపై ఈశ్వరన్ సంతకాలు చేశారు. అప్పుడు ఆయన సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నారు. ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతోనే ఒప్పందం చేసుకున్నట్టు చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా హడావిడి చేసింది. స్టార్టప్ ఏరియా వాటాల కేటాయింపులోనూ చంద్రబాబు గోల్‌మాల్ చేశారు. స్టార్టప్ ఏరియా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.5,721.9 కోట్లు వెచ్చించే రాష్ట్ర ప్రభుత్వానికి కేవలం 42 శాతం వాటా కల్పించారు. రూ.306.4 కోట్లు మాత్రమే వెచ్చించే అసెందాస్-సిన్‌బ్రిడ్జ్-సెంబ్ కార్ప్ కన్సార్షియానికి ఏకంగా 58 శాతం వాటా కట్టబెట్టేశారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌గా అభివృద్ధి చేసే స్టార్టప్ ఏరియా స్థూల టర్నోవర్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి మొదట విడతలో 5 శాతం, రెండో విడతలో 7.5 శాతం, మూడో విడతలో 12 శాతం వాటా మాత్రమే కేటాయించారు. స్టార్టప్ ఏరియా టర్నోవర్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి సగటున కేవలం 8.7 శాతం వాటా దక్కనుండగా అసెందాస్-సిన్‌బ్రిడ్జ్-సెంబ్ కార్ప్ కన్సార్షియానికి మాత్రం 91.3 శాతం వాటా దక్కుతుందన్నది స్పష్టమైంది. ఆ కన్సార్షియం ముసుగులో చంద్రబాబు బినామీ పెట్టుబడులు పెట్టారు. అందుకు ఈశ్వరన్ సహకరించారు. తద్వారా స్టార్టప్ ఏరియాలో రూ.లక్షల కోట్ల విలువైన రియల్ ఎస్టేట్ సామ్రాజ్యాన్ని హస్తగతం చేసుకోవాలని చంద్రబాబు పథకం వేశారు. స్టార్టప్ ఏరియాను ఆనుకుని ఉన్న 1,400 ఎకరాల అసైన్డ్ భూములను చంద్రబాబు బృందం బినామీ పేర్లతో కొల్లగొట్టింది. ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్డును ఆనుకుని భారీగా భూములు కొనుగోలు చేసింది. సింగపూర్‌లో చంద్రబాబు బినామీల పేరిట ఉన్న స్టార్ హోటళ్లు, ఇతర రియల్ ఎస్టేట్ పెట్టుబడులలోనూ ఈశ్వరన్ కీలక పాత్ర పోషించినట్లు అధికారిక, పారిశ్రామిక వర్గాలు చెబుతుండటం గమనార్హం.

● టెక్...టాక్



యాపిల్ ఐఫోన్ 16 ప్లస్

సైజ్: 6.7 అంగుళాలు **రిఫ్రెష్‌రేట్:** 60 హెచ్‌జెడ్ **ర్యామ్:** 8జీబి **రియర్ కెమెరా:** 48 ఎంపీ ప్లస్ 12 ఎంపీ **బ్యాటరీ:** 4674 ఎంఏహెచ్ **ఫ్రంట్ కెమెరా:** 12 ఎంపీ **రిజల్యూషన్:** 1290×2796 పిక్సెల్స్ **బరువు:** 199 గ్రా.

షావోమీ 14 టీ



డిస్‌ప్లే: 6.67 అంగుళాలు **రిఫ్రెష్‌రేట్:** 144 హెచ్‌జెడ్ **రిజల్యూషన్:** 1220×2712 పిక్సెల్స్ **ఓఎస్:** ఆండ్రాయిడ్ 14 **మెమోరీ:** 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 16జీబి ర్యామ్ **బ్యాటరీ:** 5500 ఎంఏహెచ్ **ఫ్రంట్ కెమెరా:** 32 ఎంపీ

వాట్సాప్‌లో ఇన్‌స్టా రీల్స్ చూడడానికి...



● ఆండ్రాయిడ్ లేదా ఐఫోన్‌లలో వాట్సాప్ యాప్ వెర్షన్ అప్‌డేట్‌గా ఉండేలా చూసుకోవాలి. ● వాట్సాప్ హోమ్‌స్క్రీన్‌లో మెటా ఏఐ ఐకాన్ ట్యాప్ చేయాలి. ● టెక్స్ట్‌బాక్స్‌తో మెటా ఏఐ చాట్‌బాట్ స్క్రీన్‌పై ఓపెన్ అవుతుంది. ● 'షో మీ ఇన్‌స్టాగ్రామ్స్ రీల్స్' టెక్స్ట్‌ను ఎంటర్ చెయ్యాలి. ● చాట్‌లోని కొన్ని రీల్స్‌ను వాట్సాప్ చూపిస్తుంది. వాటిని యూజర్‌లు యాప్‌లో చూడడానికి ట్యాప్ చేయవచ్చు.

గూగుల్ ఫొటోస్‌లో...



బెస్ట్ గ్యాలరీ యాప్‌లలో 'గూగుల్ ఫొటోస్' ఒకటి. అయితే 'ఫ్లిప్ ఫొటోస్'లాంటి ఫీచర్ లేకపోవడం లోపంగా ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఫ్లిప్పింగ్ ఫీచర్‌ని యాడ్ చేశారు. ఈ ఆప్షన్ గూగుల్ ఫొటోస్ ఆండ్రాయిడ్ అండ్ ఐవోఎస్‌లలో అందుబాటులో ఉంది. ఈ కొత్త ఫ్లిప్పింగ్ టూల్‌తో రొటేట్, రీసైజ్, స్కేల్ చేయవచ్చు. ఫొటోలు, వీడియోలను క్రాప్ చేయవచ్చు. ఫ్లిప్ చేసిన తరువాత ఒరిజినల్ లేదా కాపీ టాప్‌లో ఫొటోను సేవ్ చేయవచ్చు. శాంసంగ్, యాపిల్‌ల నుంచి పోటీ తట్టుకోవడానికి గూగుల్ ఫొటోస్ యాప్ మ్యాజిక్ ఎరేజర్, మ్యాజిక్ ఎడిటర్‌లాంటి జెన్‌ఏఐ ఫీచర్‌లను తీసుకువచ్చింది.

హైడ్ చేయడానికి...



ఇన్‌స్టాగ్రామ్ స్టోరీని కొంత మంది వ్యక్తులకు కనిపించకుండా హైడ్ చేయడానికి... 1. ఇన్‌స్టాగ్రామ్‌లో లాగిన్ అయిన తరువాత స్క్రీన్ బాటమ్-రైట్ కార్నర్‌లోని ప్రొఫైల్ ఐకాన్ క్లిక్ చేయాలి. 2. పర్సనల్ ప్రొఫైల్ పేజీలోకి వచ్చిన తరువాత టాప్-రైట్ కార్నర్‌లోని 3 హారిజాంటల్ లైన్స్ ట్యాప్ చేయాలి. 3. 'హూ ఆదర్స్ కెన్ ఇంటరాక్ట్ విత్ యూ' మెనూలో 'హూ కెన్ సీ యువర్ స్టోరీ' ఆప్షన్ కనిపిస్తుంది. 4. 'హూ కెన్ సీ యువర్ స్టోరీ' సెక్షన్‌లో మీరు హైడ్ చేయాలనుకుంటున్న వ్యక్తుల పేర్లను సెలెక్ట్ చేసుకోవాలి.

● సోషల్ మీడియా





అనన్య పాండే

కంట్రోల్...కంట్రోల్

జీవితాన్ని 'విధి' నియంత్రించడం మాట దేవుడెరుగు... రకరకాల యాప్‌లు మాత్రం నియంత్రిస్తున్నాయి. టెక్నాలజీపై అతిగా ఆధారపడి అనర్థాలను కొని తెచ్చుకోవడం నుంచి డీప్‌ఫేక్ వరకు డిజిటల్ స్పేస్‌లోని చీకటి ప్రపంచంపై దృష్టి సారిస్తుంది కంట్రోల్. నెట్‌ఫ్లిక్స్ సైబర్-థ్రిల్లర్ 'కంట్రోల్' ట్రైలర్ నేపథ్యంలో సాంకేతిక వైపరీత్యాల గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది...

అనగనగా 'కంట్రోల్' అనే యాప్. ఈ యాప్‌లోకి అడుగుపెడితే ఏ.ఐ అసిస్టెంట్ ప్రత్యక్షమౌతాడు. 'నేను మీకు ఏ విధంగా సహాయపడగలను' అని అడుగుతాడు.

యూజర్ తన మనసులో మాట చెప్పుకోవచ్చు. ఇక అప్పటి నుంచి యూజర్ జీవితం, సంతోషం ఏఐ అసిస్టెంట్ నియంత్రణలోకి వెళ్లిపోతుంది.

విక్రమాదిత్య మోత్వానే దర్శకత్వం వహించిన సైబర్ థ్రిల్లర్ 'కంట్రోల్'లో అనన్య పాండే, విహాన్ సమత్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇందులో అనన్య పాత్ర పేరు... నెల్లా అవస్థీ.

కంట్రోల్‌యాప్. ఇన్‌లోకి నెల్లా లాగిన్ కావడంతో రెండు నిమిషాల నిడివిగల ట్రైలర్ మొదలవుతుంది. ఈ యాప్‌లోకి లాగిన్ అయిన నెల్లా తన జీవితాన్ని నియంత్రించే హక్కును ఏఐ-జనరేటెడ్ పర్సన్ ఎలెన్‌కు ఇస్తుంది. నెల్లా, జో ల మధ్య ఆనందకరమైన ప్రేమ అర్ధంతరంగా విచ్ఛిన్నం అవుతుంది. దీనికి కారణం జో చేసిన మోసం. బ్రేకప్ తరువాత కక్షసాధింపు చర్యల్లో భాగంగా నెల్లాను విపరీతంగా ట్రోలింగ్ చేస్తుంటాడు జో.

జో టార్చర్ తట్టుకోలేక 'కంట్రోల్' యాప్‌ను ఆశ్రయిస్తుంది నెల్లా. తన 'ఎక్స్'ను రిమూవ్ చేయడానికి ఏఐ అసిస్టెంట్ సహాయం కోరుతుంది. దీంతో జో సోషల్ మీడియా బ్లూప్రింట్ పిక్సెల్ బై పిక్సెల్ తుడిచిపెట్టుకుపోతుంది. సోషల్ మీడియాలోనే కాదు రియల్ వరల్డ్‌లోనూ అతడి ఉనికి కనిపించదు. జో 'మిస్సింగ్' వార్త నెల్లా చెవిలో పడుతుంది.

'నీకు కావాల్సింది ఇదే కదా' అని నెల్లాతో ఏఐ-అసిస్టెంట్ చెప్పడంతో క్లిప్ ముగుస్తుంది.

'ఆన్‌లైన్‌లో మన ఉనికికి, నిజ జీవితంలో మనం ఎవరం అనే దానికి మధ్య గీసుకోవాల్సిన విభజన రేఖ గురించి కంట్రోల్ సిరీస్ దృష్టి పెడుతుంది' అంటుంది అనన్య.

ఇటీవల కాలంలో అమీర్‌ఖాన్, రణ్‌వీర్ సింగ్, ఆలియాభట్, రష్మిక మందనలాంటి టాప్ మూవీస్టార్స్ 'డీప్‌ఫేక్' బారిన పడ్డారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'చాలా భయంగా ఉంది. సెలబ్రిటీలుగా మా ముఖాలు, గొంతులు ఎప్పుడు ఏ రకంగా బయటకు వస్తాయో తెలియకుండా ఉంది. మనం ఎంత వరకు భద్రంగా ఉన్నామో తెలియడం లేదు. టెక్నాలజీ దుర్వినియోగం కాకుండా చట్టాలు తేవాలి. గట్టిగా అమలు పర్చాలి. ఇదొక్కటే పరిష్కారం' అంటుంది అనన్య పాండే.

యస్...నేనే.... ట్రోల్ చేయకండి!





ప్రియాంక చోప్రాకు ట్రోలింగ్ కొత్త కాదు. ఎన్నో సందర్భాలలో ట్రోలింగ్‌కు గురైంది. అయితే చోప్రా ఎప్పుడూ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. డీలా పడిపోలేదు. ఆమె జపించే మంత్రం... సెల్ఫ్-లవ్. తాజాగా ప్రియాంక చోప్రా ఒక హార్ట్‌వామింగ్ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. విశాలమైన కళ్ల అబ్బాయిలా కనిపించే తొమ్మిది సంవత్సరాల అమ్మాయి ఫొటో అది. ఆ ఫొటో చోప్రాదే. ఫొటోను షేర్ చేస్తూ ప్రియాంక ఇలా రాసింది... వార్నింగ్: నా తొమ్మిదేళ్ల చిన్నారిని ట్రోల్ చేయకండి. తన ప్రీ-టీనేజ్ హెయిర్ స్టైల్‌ను 'కటోరి కట్'గా అభివర్ణించింది. 'మిమ్మల్ని మీరు ప్రేమించండి' అంటూ సెల్ఫ్-లవ్ ప్రాముఖ్యత గురించి చెప్పింది.

మహిళలే బాధితులు



జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత ఉత్సాహవంతమైనదో, సృజనాత్మకమైనదో మరో కోణంలో చూస్తే వినాశకరమైనది. డీప్‌ఫేక్ టెక్నాలజీని మహిళల విషయంలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఆన్‌లైన్ వేధింపులలో మహిళలలే బాధితులు. కృత్రిమ మేధను ఒక ప్రత్యేకమైన జీవిగా, ఒక కొత్త జాతిగా... ఇలా ఎన్నో రకాలుగా వర్ణించారు. అయితే ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచి కోసం ఉపయోగించుకోవడంలో ఆ వర్ణనలేవీ ఉపయోగపడడం లేదు.

– వెరిటీ హార్డింగ్,
కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ జియో పాలిటిక్స్' ప్రాజెక్ట్ డైరెక్టర్

● ఇన్నోవేషన్

ఐరిస్...జ్ఞాపకాల సముద్రం

శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత సంతతికి చెందిన అద్వైత్ పాలీవల్ 'ఐరిస్' అనే వేరబుల్ డివైజ్‌ను లాంచ్ చేశాడు. 'ఐరిస్ ప్రతి నిమిషం చిత్రాలను తీస్తుంది. డివైజ్‌లో స్టోర్ చేస్తుంది లేదా క్లౌడ్‌లో అప్‌లోడ్ చేస్తుంది. మనం మిస్ అయ్యే విలువైన క్షణాలను పట్టుకోవడానికి ఉపకరించే పరికరం. ఇది ఫొటోలను షూట్ చేస్తుంది. వాటికి కాప్షన్‌లు ఇస్తుంది. వాటిని టైమ్‌ఫ్రేమ్‌లో అమరుస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే ఈ డివైజ్ గతంలో మరిచిపోయిన డేటాను గుర్తుంచుకోవడంలో సహాయపడుతుంది. ఐరిస్‌కు ఫోకస్ మోడ్ కూడా ఉంది. మీరు దృష్టి మరల్చినప్పుడు ఇది గమనించి, తిరిగి ట్రాక్‌లోకి రావాలని సూచిస్తుంది' అని 'ఐరిస్' గురించి వివరించాడు అద్వైత్.





'ఏఐ అండ్ హార్డ్‌వేర్ టాలెంట్' ప్రోగ్రామ్‌లో భాగంగా 'ఐరిస్' కోసం కేంబ్రిడ్జిలోని 'ఆగ్‌మెంటేషన్ ల్యాబ్'లో కష్టపడ్డాడు అద్వైత్. ప్రోగ్రామ్ చివరిలో ఈ పరికరాన్ని ఎంఐటీ మీడియాలో 250 మందికి పైగా పరిచయం చేస్తే... ఎంతోమందికి అద్వైత్ ఐడియా బాగా నచ్చింది. ఈ డివైజ్‌పై ఆసక్తి చూపడమే కాదు తమకు కూడా ఒకటి కావాలని అడగడం... అద్వైత్ తొలి విజయం.

● గేమింగ్

అడుగడుగునా ఆపద ఉంది.... అయినా సరే!



ఇంటరాక్టివ్ డ్రామా హారర్ గేమ్ 'అంటిల్ డాన్' విడుదల అయింది. ఈ గేమ్‌లో ప్లేయర్స్ చేయాల్సింది ఏమిటి? అనే విషయానికి వస్తే...బ్లాక్‌వుడ్ పర్వతంపై నివసిస్తున్న నలుగురు యువకుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. వీరిని అధీనంలోకి తీసుకొని రక్షించాల్సిన బాధ్యత ప్లేయర్స్‌పై ఉంది. ప్లేయర్స్ వేసే అడుగులపైనే ఆ నలుగురి మనుగడ ఆధారపడి ఉంటుంది. మిస్టరీని ఛేదించే ఆధారాలను కనిపెట్టాల్సిన బాధ్యత కూడా ప్లేయర్స్‌పై ఉంటుంది. కట్‌సీన్స్, థర్డ్-పర్సన్ ఎక్స్‌ప్లోరేషన్ కాంబినేషన్‌లో ఉండే గేమ్‌ప్లే ఇది. ఈ గేమ్‌లోని యాక్షన్-సీక్వెన్స్‌లను 'క్విక్ టైమ్ ఈవెంట్స్' మెథడ్‌లో సెట్ చేశారు. **ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5. విండోస్ **జానర్:** సర్వైవల్ హారర్, ఇంటరాక్టివ్ డ్రా **మోడ్స్:** సింగిల్-ప్లేయర్

ఇంగ్లీష్ ఇడియమ్స్



కీప్ ది వూల్ఫ్ ఫ్రమ్ ది డోర్

ఆకలి బాధ నుంచి తప్పించుకోవడానికి తగినంత డబ్బు ఉంది, ఏదైనా చేసి ప్రమాదం నుంచి తృటిలో బయటపడడం... ఇలాంటి సందర్భంలో వాడే మాట...కీప్ ది వూల్ఫ్ ఫ్రమ్ ది డోర్.

ఉదా: డూరింగ్ ది రెసిషన్ మోస్ట్ ఆఫ్ ది అమెరికన్స్ వర్ ఫైండింగ్ ఇట్ డిఫికల్ట్ టు కీప్ ది వూల్ఫ్ ఫ్రమ్ ది డోర్

మేక్ ఏ కిల్లింగ్

తక్కువ కష్టంతో, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బును సంపాదించడానికి సంబంధించి ఉపయోగించే మాట... మేక్ ఏ కిల్లింగ్.

ఉదా: దే మేడ్ ఏ కిల్లింగ్ వెన్ దే సోల్డ్ దేర్ స్టార్టప్ టు ఏ మేజర్ కార్పొరేషన్

సినిమా

కలికి ప్రేక్షకుల సపోర్ట్ ఉంటుందని ఆశిస్తున్నాను – వరుణ్ తేజ్



● వరుణ్ తేజ్, ప్రియదర్శి, ప్రిన్స్, 'అల్లరి' నరేశ్, ఆకాశ్ జగన్నాథ్

''ప్రిన్స్ అంకితభావం ఉన్న నటుడు. నాకు క్లోజ్ ఫ్రెండ్. హీరోగా చేస్తూనే మంచి రోల్స్ వస్తే సపోర్టింగ్ క్యారెక్టర్స్ కూడా చేస్తున్నాడు. మంచి కథ ఉంటే తెలుగు ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు. 'కలి' సినిమాకి ప్రేక్షకుల సపోర్ట్ ఉంటుందని ఆశిస్తున్నాను'' అని హీరో వరుణ్ తేజ్ అన్నారు. ప్రిన్స్, నరేష్ అగస్త్య హీరోలుగా, నేహా కృష్ణన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కలి'. శివ శేషు దర్శకత్వం వహించారు. కె. రాఘవేంద్ర రెడ్డి సమర్పణలో లీలా గౌతమ్ వర్మ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి వరుణ్ తేజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ– ''రైతులు, విద్యార్థులు ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆత్మహత్యలు వద్దని చెబుతూ తీసిన 'కలి' సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అని లీలా గౌతమ్ వర్మ, శివ శేషు కోరారు. ''ఆత్మహత్యలు వద్దని చెప్పే హార్ట్ టచింగ్ మూవీ ఇది'' అని నేహా కృష్ణన్ అన్నారు. ప్రిన్స్ మాట్లాడుతూ– ''నేను ఇష్టపడే హీరో ఉదయ్ కిరణ్‌గారి ఆత్మహత్య ఎంతోకాలం నన్ను బాధించింది. అలాగే నా క్లోజ్ ఫ్రెండ్ కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఆత్మహత్యల నివారణకు నా వంతు ప్రయత్నం చేయాలని పించింది. ఆ టైమ్‌లో 'కలి' కథ నా వద్దకు రావడంతో అంగీకరించాను'' అని పేర్కొన్నారు. ''ఆత్మహత్యలు వద్దనే ఒక మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న 'కలి'ని థియేటర్స్‌లో చూడండి'' అని హీరో 'అల్లరి' నరేశ్ అన్నారు.

దసరా తర్వాత...



● రవితేజ

రవితేజ హీరోగా భాను భోగవరపు దర్శకత్వంలో ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ రూపొందుతోంది. 'ధమాకా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత రవితేజ, శ్రీలీల ఈ సినిమాలో మరోసారి జంటగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ ఆఫీసర్ లక్ష్మణ్ భేరీ పాత్రలో రవితేజ కనిపిస్తారని సమాచారం. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. అయితే ఓ యాక్షన్ సీక్వెన్స్‌లో రవితేజ భుజానికి గాయమైంది. దీంతో ఈ మూవీ షూటింగ్‌కి తాత్కాలిక బ్రేక్ పడింది. కాగా రవితేజ ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నారని, దసరా తర్వాత తిరిగి సెట్స్‌లో అడుగుపెట్టనున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ నెల 14న హైదరాబాద్‌లో ఆరంభమయ్యే షెడ్యూల్‌లో రవితేజ పాల్గొంటారని, ఈ షెడ్యూల్ ఇరవై రోజులు ఉంటుందని టాక్. అంటే... దసరా తర్వాత రవితేజ సెట్స్‌లో అడుగుపెడతారని ఊహించవచ్చు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రం నిర్మిస్తున్నారు.

ముందుగా ఓవర్సీస్‌లో రిలీజ్ చేస్తున్నాను – 'దిల్' రాజు



● 'దిల్' రాజు, సుహాస్, సంగీర్తన

''హ్యాపీ డేస్, శతమానం భవతి' చిత్రాలను ఓవర్సీస్‌లో ముందుగా రిలీజ్ చేశాను. ఆ సెంటిమెంట్‌తోనే 'జనక అయితే గనక'ని ముందుగా అక్టోబర్ 10న ఓవర్సీస్‌లో రిలీజ్ చేస్తున్నాను. 11న తెలుగులో ప్రీమియర్లు వేసి, 12న సినిమాని రిలీజ్ చేయనున్నాం. అలాగే ఈ నెల 6న విజయవాడలో, 8న తిరుపతిలో పబ్లిక్ షోలు వేస్తున్నాం'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. సుహాస్, సంగీర్తన జంటగా సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహించిన చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న రిలీజ్ కానుంది. ''మా సినిమా ఎవర్నీ నిరాశపరచదు'' అని సుహాస్ చెప్పారు. ''ఫాదర్, గ్రాండ్‌మదర్, వైఫ్, హజ్బెండ్.. ఇలా అందరి కోణంలో ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు హర్షిత్. ''మా సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది'' అన్నారు సందీప్ రెడ్డి.

అది సవాల్‌గా అనిపించింది – టీజీ విశ్వప్రసాద్




''శ్వాగ్'లో వినోదంతో పాటు భావోద్వేగాలతో కూడిన సందేశం ఉంటుంది. ఈ మూవీ నిర్మాణంలో ఎలాంటి చాలెంజ్ అనిపించలేదు. కానీ, క్రియేటివ్ సైడ్ సవాల్‌గా అనిపించింది. ఇంత పెద్ద కథని 2 గంటల 36 నిమిషాల్లో చెప్పడం కష్టమైన జాబ్. కానీ హసిత్ గోలి ఈ సబ్జెక్ట్‌ని, అన్ని పాత్రలను చాలా అద్భుతంగా హ్యాండిల్ చేసి ఎంగేజింగ్‌గా చెప్పారు'' అని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ అన్నారు. శ్రీవిష్ణు, రీతూ వర్మ జంటగా హసిత్ గోలి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శ్వాగ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ– ''శ్రీవిష్ణుని ఈ చిత్రంలో దాదాపు తొమ్మిది గెటప్స్‌లో ప్రేక్షకులు చూడనున్నారు. తరతరాలుగా మారుతూ వస్తున్న జెండర్ డామినేషన్స్ విషయాన్ని ఈ మూవీలో ఆసక్తిగా చూపించారు హసిత్. ఇలాంటి కథలు చాలా అరుదుగా వస్తాయి. కమల్ హాసన్‌గారి 'ఇంద్రుడు చంద్రుడు, మైఖేల్ మదన కామరాజు' సినిమాల్లోలాంటి క్యారెక్టరైజేషన్‌లోని మ్యాజిక్ 'శ్వాగ్'లో ఉంటుంది. శ్రీవిష్ణు అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్ చేస్తాడు. ప్రస్తుతం కన్నడ ఇండస్ట్రీలో డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నాం. ప్రభాస్‌గారి 'రాజా సాబ్' సినిమా టాకీ పార్ట్‌ని నవంబర్‌లోపు పూర్తి చేయాలన్నది మా ప్లాన్. మేం నిర్మించిన 'హరికథ' వెబ్ సిరీస్ త్వరలో హాట్‌స్టార్‌లో స్ట్రీమ్ కానుంది. అలాగే 'న్యూసెన్స్ 2' అనే వెబ్ సిరీస్ నిర్మిస్తున్నాం'' అన్నారు.

ఆ ట్యాగ్‌కి అర్హుణ్ణి కాదంటే తీసేస్తాను! – చంద్రహాస్



''రామ్‌నగర్ బన్నీ' సినిమా పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. ఈ చిత్రాన్ని బాగా ఎంజాయ్ చేస్తారు. ఫైనల్ ఔట్‌పుట్ చూశాక సినిమా విజయంపై మాకు చాలా నమ్మకం వచ్చింది'' అని చంద్రహాస్ అన్నారు. శ్రీనివాస్ మహత్ (వెలిగొండ శ్రీనివాస్) దర్శకత్వంలో చంద్రహాస్ హీరోగా నటించిన చిత్రం 'రామ్‌నగర్ బన్నీ'. విస్మయ శ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రీతూ మంత్ర హీరోయిన్లుగా నటించారు. దివిజ ప్రభాకర్ సమర్పణలో మలయజ ప్రభాకర్, ప్రభాకర్ పొడకండ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చంద్రహాస్ మాట్లాడుతూ– ''శ్రీనివాస్ మహత్‌గారు ఫైట్స్, డ్యాన్స్, లవ్, ఎమోషన్, రొమాంటిక్ ఇలా... అన్ని షేడ్స్‌లో నన్ను బాగా చూపించారు. అన్ని అంశాలున్న 'రామ్‌నగర్ బన్నీ' నా తొలి సినిమా కావడం హ్యాపీగా ఉంది. ఈ చిత్రం చూశాక 'ఆటిట్యూడ్ స్టార్' అనే ట్యాగ్‌కు నేను అర్హుణ్ణి కాదంటే తీసేస్తాను. ఈ కథపై ఉన్న నమ్మకంతోనే మా నాన్న ప్రభాకర్‌గారు సినిమా నిర్మించారు. అన్ని జానర్ మూవీస్‌లో నటించి, మంచి నటుడిగా పేరు తెచ్చుకోవాలని ఉంది. ప్రస్తుతం నేను నటించిన రెండు సినిమాలు రిలీజ్‌కి రెడీగా ఉన్నాయి. మరో సినిమాలో నటిస్తున్నాను'' అన్నారు.

వినూత్న కథతో మెన్షన్ హౌస్



● శ్రీనాథ్ మాగంటి

శ్రీనాథ్ మాగంటి, గాయత్రి రమణ, సాయి, కామాక్షీ భాస్కర్ల ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రానికి 'మెన్షన్ హౌస్ మల్లేష్' అనే టైటిల్ ఖరారు చేశారు. బాల సతీష్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రాజేష్ నిర్మించారు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని డైరెక్టర్ శైలేష్ కొలను విడుదల చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ చిత్రంలోని శ్రీనాథ్ మాగంటి లుక్‌ని విడుదల చేశారు. వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన 'మెన్షన్ హౌస్ మల్లేష్' సినిమా త్వరలో రిలీజ్ కానుంది.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



● సందీప్, సోనూ

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, సువేక్ష, మేఘా లేఖ, ఖుష్బూ చౌదరి ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మించారు. ఈ చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''కొత్త పాయింట్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తీసిన ఈ చిత్రంతో హిట్ సాధిస్తాం'' అన్నారు విక్రమ్ రెడ్డి.

ఓటీటీ ఇది చూడొచ్చు

విషయమున్న విశేషం

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'విశేషం' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఏదైనా సినిమా హిట్ అవ్వాలంటే కంటెంట్‌లో గ్లామర్ ఉండాలి అని నమ్మే దర్శకులు నేడు ఎక్కువ. కానీ కంటెంట్‌కు గ్లామర్ కన్నా గ్రామర్ ఎక్కువ అలరిస్తుందని నిరూపించారు మలయాళ దర్శకుడు సూరజ్ టామ్. అదెలాగంటారా? అయితే ఇటీవల ప్రైమ్ వీడియో ఓటీటీ ద్వారా విడుదలైన 'విశేషం' సినిమాపై ఓ లుక్కేద్దాం. మామూలుగా సినిమా అంటే చక్కటి కథ, కామెడీతో పాటు చూడచక్కని పాత్రధారులు కూడా ఉండాలి. 'విశేషం' సినిమాకి కథ, కామెడీ ఉన్నాయి కానీ డీ గ్లామరైజ్డ్ హీరో, హీరోయిన్లు ఉంటారు. దానితో పాటు ఇదో సందేశాత్మక చిత్రం. ఇంకేముంది... దీంట్లో విశేషం అనుకోకండి. అసలైన విషయమున్న విశేషం ఏంటంటే... శీజు భక్తన్ మొదటి పెళ్లి జరిగిన కొన్ని నిమిషాల్లోనే పెటాకులవడంతో రెండో పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. ఎన్నో విపరీత, వినోద ప్రయత్నాల తర్వాత కానిస్టేబుల్ సజితతో మళ్లీ పెళ్లి జరుగుతుంది. సజితది కూడా రెండో వివాహమే. ఇద్దరూ సంతోషంగా ఉంటారు. ఇక్కడ నుండే దర్శకుడి గ్రామర్ స్టార్ట్ అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్యను ఈ సినిమా ద్వారా హృద్యంగా చూపించారు దర్శకుడు. అదే సంతానలేమి సమస్య. మరీ ముఖ్యంగా నేటి ఆధునిక సమాజంలో పిల్లలు లేకపోవడం అనేది కొంతమంది దంపతుల్లో విపరీత సమస్య. సంతానం లేని దంపతులు తమ కుటుంబంలో, సమాజంలో తమ సమస్య వల్ల ఎటువంటి ఇబ్బందులు పడతారో కళ్లకు కట్టినట్లు చూపించారు దర్శకుడు. ఈ సినిమాలోని హీరో, హీరోయిన్ల సమస్య సంతాన లేమి అయితే దానిని పరిష్కరించడంలో ఎటువంటి ఇబ్బందులు పడ్డారు? అనే కోణాన్ని అద్భుతంగా చిత్రీకరించారు దర్శకుడు. ఎంతో సున్నితమైన సమస్యను అంతే సున్నితంగా ఎవ్వరినీ నొప్పించకుండా రూపొందించారు సూరజ్ టామ్. సినిమా చివర్లో శీజు భక్తన్, సజితలకు ఉన్న సమస్య ఎలా పరిష్కారమైంది? ఎలా పరిష్కరించుకున్నారు? అనే విషయం మాత్రం ఈ 'విశేషం'లోనే చూడాలి. రోజూ మనం ఎన్నో మెసేజ్‌లు, వీడియోలు మన దగ్గరివారికి షేర్ చేసుకుంటాం. ఈ సినిమా గురించి మనం పది మందికి చెబితే అందులో ఎవరైనా ఈ సమస్య బాధితులు ఉంటే వారికి వినోదంతోపాటు కొంత బాసటగా ఉంటుంది ఈ సినిమా. ఎందుకంటే ఇది విషయమున్న విశేషం కాబట్టి.

– ఇంటూరు హరికృష్ణ

సాక్షి బిజినెస్
శుక్రవారం
4-10-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	1,769	82,497
నిఫ్టీ ▽	547	25,250

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,873	▽	53
డోజోన్స్	41,894	▽	303
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,283	▽	8
డాక్స్	19,015	▽	149
షాంఘై సోమవారం ముగింపు	3,337	△	249
నికాయ్	38,552	△	743

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	75,615
బంగారం (99.5 స్వచ్ఛత)	75,312
వెండి (కిలో)	90,671

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.51	84.53
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	110.02	112.64
€	యూరో	ఎస్‌బీఐ	91.53	93.91
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.55	57.83
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.71	58.67
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.55	66.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.50	23.04
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.98	23.74
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.09	12.91



మార్కెట్లో యుద్ధ కల్లోలం

- ఇజ్రాయిల్‌-ఇరాన్ ప్రతీకార దాడులతో వణికిన దలాల్ స్ట్రీట్
- ఎఫ్అండ్ఓ ట్రేడింగ్‌పై సెబీ కఠిన నిబంధనల ఎఫెక్ట్
- సెన్సెక్స్ 1,769 పాయింట్లు; నిఫ్టీ 547 పాయింట్ల పతనం
- రూ.9.78 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల ప్రభావంతో దలాల్ స్ట్రీట్ రెండు నెలల్లో అతిపెద్ద పతనాన్ని చవిచూసింది. ఇజ్రాయిల్‌-ఇరాన్ పరస్పర ప్రతీకార దాడుల నేపథ్యంలో ఇన్వెస్టర్లు భారీ అమ్మకాలకు దిగారు. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 1,769 పాయింట్లు క్షీణించి 3 వారాల కనిష్టం 82,497 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 547 పాయింట్లు నష్టపోయి 25,250 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 2% పతనంతో ఒక్కరోజులో రూ.9.78 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.465 లక్షల కోట్ల(5.54 ట్రిలియన్ డాలర్లు)కు తగ్గింది. ఆసియాలో జపాన్ మినహా అన్ని సూచీలు 3% వరకు పతనయ్యాయి. యూరప్ మార్కెట్లు 2% నష్టపోయాయి. అమెరికా మార్కెట్లు 1.5% నష్టంతో ట్రేడవుతున్నాయి.

రోజంతా నష్టాలే..

అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం భారీ నష్టాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 1,264 పాయింట్ల పతనంతో 83,002 వద్ద, నిఫ్టీ 338 పాయింట్లు క్షీణించి 25,453 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. తొలి సెషన్‌లో కోలుకునేందుకు ప్రయత్నించినా.., అమ్మకాలకే ఎదురయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 1837 పాయింట్లు క్షీణించి 82,434 వద్ద, నిఫ్టీ 561 పాయింట్లు కోల్పోయి 25230 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు..

- సెన్సెక్స్ సూచీలోని 30 షేర్లలో ఒక్క జేఎస్‌డబ్ల్యూ షేరు (1.18%) మాత్రమే లాభపడింది. అత్యధికంగా ఎల్అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, మారుతీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు 4% నష్టపోయాయి. బీఎస్‌ఈ రియల్టీ ఇండెక్స్ 4.50% మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 2% చొప్పున పతనమయ్యాయి.
- డాబర్ ఇండియా షేరు 6% నష్టపోయి రూ.581 వద్ద నిలిచింది.
- మార్కెట్ పతనంలోనూ కేఆర్ఎన్ హీట్ ఎక్స్చేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్ లిస్టింగ్ మెప్పించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.220)తో పోలిస్తే 114% ప్రీమియంతో రూ.470 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 133% ఎగసి రూ.513 గరిష్టాన్ని తాకింది. చివరికి 117% లాభంతో రూ.478 వద్ద నిలిచింది.
- రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 4% నష్టపోయి రూ.2,815 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 5% పతనమై రూ.2,775 వద్ద కనిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 77,607 కోట్లు ఆవిరైంది.

నష్టాలకు 4 కారణాలు

- హెజ్బొల్లా, హమాస్ అగ్రనేతలను ఇజ్రాయెల్ మట్టుపెట్టడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్ర రూపం దాల్చాయి. ఈ సంస్థలకు మద్దతుగా నిలిచిన ఇరాన్ ప్రత్యక్ష దాడులకు పాల్పడింది. ఇజ్రాయెల్‌పై ఏకంగా 180కి పైగా క్షిపణులతో విరుచుకుపడింది. ఇరాన్-ఇజ్రాయెల్‌ల మధ్య పోరు భీకర యుద్ధానికి దారి తీయొచ్చనే ఆందోళనలతో ఇన్వెస్టర్లు అప్రమత్త వహిస్తూ అమ్మకాలకు పాల్పడ్డారు.
- చిన్న ఇన్వెస్టర్ల ప్రయోజనాలను పరిరక్షించడంతో పాటు ఈక్విటీ మార్కెట్లో స్థిరత్వం కోసం సెబీ ఎఫ్అండ్ఓ ట్రేడింగ్ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. డెరివేటివ్స్ కనీస కాంట్రాక్టు విలువను రూ.15-20 లక్షలకు పెంచింది. దీంతో విస్తృత మార్కెట్లో ట్రేడింగ్ వాల్యూమ్స్ భారీగా తగ్గే అవకాశం ఉంది. సెబీ కొత్త మార్గదర్శకాలు మార్కెట్‌పై ఒత్తిడి పెంచాయి. స్టాక్ బ్రోకింగ్ కంపెనీల షేర్లు ఎస్ఎంసీ గ్లోబల్ సెక్యూరిటీస్ 4%, ఆదిత్యా బిర్లా మనీ 3.50%, 5పైసా క్యాపిటల్ 3%, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ 2% చొప్పున నష్టపోయాయి.
- పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ పరిస్థితులు నెలకొనడంతో కొన్ని వారాలుగా నిలకడగా ఉన్న క్రూడాయిల్ ధరలు ఇటీవల మళ్లీ ఎగబాకాయి. గడిచిన 3 రోజుల్లో చమురు ధరలు 5% పెరిగాయి. ప్రస్తుతం భారత్‌కు దిగుమతయ్యే బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 77 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. సరఫరా అవాంతరాల దృష్ట్యా రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందనే ఆందోళనలు నెలకొన్నాయి. దేశీయ ముడి చమురుల దిగుమతుల బిల్లు భారీగా పెరగొచ్చనే భయాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 14 పైసలు బలహీనపడి 83.96 వద్ద స్థిరపడింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 23 పైసలు క్షీణించి 84.00 స్థాయిని తాకింది.
- చైనా ప్రభుత్వం ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే సంస్కరణలు, ఉద్దీపన చర్యలను, వరుస వడ్డీరేట్ల కోతను ప్రకటించడంతో గతవారంలో ఆ దేశ స్టాక్ మార్కెట్ ఏకంగా 15 శాతం ర్యాలీ చేసింది. ఇప్పటికీ అక్కడి షేర్లు తక్కువ ధరల వద్ద ట్రేడవుతున్నాయి. దీంతో విదేశీ ఇన్వెస్టర్లు భారత్ వంటి వర్ధమాన దేశాల మార్కెట్లో లాభాల స్వీకరణకు పాల్పడి, చైనా మార్కెట్లకు తమ పెట్టుబడులు తరలిస్తున్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
పెళ్లి బాజా @ రూ.5.9 లక్షల కోట్లు!
ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి బంగారం ధర

అపోలో హెల్త్ విక్రయం!

చర్చలు జరుపుతున్న అపోలో హాస్పిటల్స్



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగ దిగ్గజం అపోలో హాస్పిటల్స్.. అనుబంధ సంస్థ అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్(ఏహెచ్ఎల్ఎల్)ను విక్రయించనున్నట్లు తెలుస్తోంది. మెజారిటీ వాటాను విక్రయించేందుకు కొనుగోలుదారులతో చర్చలు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మల్టీస్పెషాలిటీ క్లినిక్స్, డయాగ్నోస్టిక్ సెంటర్లు నిర్వహిస్తున్న ఏహెచ్ఎల్ఎల్‌ను 2000లో ఏర్పాటైంది. 2016లో ప్రపంచ బ్యాంక్‌కు చెందిన పీఈ సంస్థ ఐఎఫ్‌సీ 31 శాతం వాటాను సొంతం చేసుకుంది. అయితే ఐఎఫ్‌సీ సైతం ఏహెచ్ఎల్ఎల్‌లో వాటాను అమ్మివేయనున్నట్లు తెలుస్తోంది. ఏహెచ్ఎల్ఎల్ 2021-22లో రూ. 1,314 కోట్ల ఆదాయం సాధించగా.. 2022-23కల్లా రూ. 1,233 కోట్లకు క్షీణించింది. కంపెనీ ఇండియాసహా మధ్యప్రాచ్యంలో అపోలో క్లినిక్స్ బ్రాండుతో మల్టీ స్పెషాలిటీ క్లినిక్స్‌ను నిర్వహిస్తోంది. అపోలో డయాగ్నోస్టిక్స్‌సహా.. మహిళలు, పిల్లలకు ప్రత్యేకించిన క్లినిక్‌లను సైతం నిర్వహిస్తోంది.

బెంగళూరులో పౌలోమీ తొలి ప్రాజెక్ట్!



- రూ.800 కోట్ల పెట్టుబడులతో నివాస సముదాయం
- 9 ఎకరాలు.. 4 టవర్లలో 850 అపార్ట్‌మెంట్లు
- రూ.1,100 కోట్లతో హైదరాబాద్ నిర్మాణంలో రెండు ప్రాజెక్టులు
- పౌలోమీ ఎస్టేట్స్ డైరెక్టర్ ప్రశాంత్ రావు వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ సంస్థ పౌలోమీ ఎస్టేట్స్ బెంగళూరుకు విస్తరిస్తోంది. రూ.800 కోట్ల పెట్టుబడులతో థనిసాంద్రలో తొలి హైరైజ్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను నిర్మించనుంది. పౌలోమీ ఎస్టేట్స్ డైరెక్టర్ ప్రశాంత్ రావు గురువారం హైదరాబాద్‌లో విలేకరులకు ఈ విషయం వెల్లడించారు. 80 ఎకరాల్లోని మాన్యత ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లో ఈ ప్రీమియం రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ ఉంటుందని, 9 ఎకరాల్లో 18 లక్షల చ.అ. బిల్టప్ ఏరియాలో నిర్మాణం ఉంటుందని తెలిపారు. '35 అంతస్తుల్లో మొత్తం 850 అపార్ట్‌మెంట్లు ఉంటాయి. 1,450 చ.అ. నుంచి 2,550 చ.అ. మధ్య 3 బీహెచ్‌కే విస్తీర్ణాలుంటాయి. ధర రూ.1.4 కోట్ల నుంచి ప్రారంభమవుతుంది. ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లో ఐటీ, కమర్షియల్ స్పేస్, హోటల్స్, హాస్పిటల్స్, స్కూల్స్ వంటి వాణిజ్య భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. మెరుగైన కనెక్టివిటీతో పాటు ప్రధాన ఐటీ హబ్‌లకు, విద్యా సంస్థలకు చేరువలో ఉండటంతో థనిసాంద్రలో డిమాండ్ బాగుంది' అని ప్రశాంత్ వివరించారు.

1,100 కోట్లతో నగరంలో రెండు ప్రాజెక్టులు..

ఇప్పటికే పౌలోమీ హైదరాబాద్‌లో 22.5 లక్షల చ.అ.ల్లో ఆరు నివాస సముదాయాలు, 10 లక్షల చ.అ.ల్లో రెండు వాణిజ్య సముదాయాలను నిర్మించింది. ప్రస్తుతం రూ.1,100 కోట్ల పెట్టుబడులతో రెండు ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. కోకాపేటలో రూ.700 కోట్లతో పల్లాజో లగ్జరీ అపార్ట్‌మెంట్, రూ.500 కోట్లతో ఇన్ఫినిటీ ఐటీ పార్క్‌లను నిర్మిస్తున్నారు. 2.3 ఎకరాల్లో పల్లాజో 55 అంతస్తులలో ఉంటుంది. 2026 డిసెంబర్ నాటికి ప్రాజెక్ట్ పూర్తవుతుంది. కాగా, ఈ ఏడాది ముగింపు నాటికి మరో రెండు ప్రాజెక్టులను ప్రణాళికలు చేస్తున్నారు.

బిగ్‘సి’ దసరా ధమాకా ఆఫర్లు

హైదరాబాద్: దసరా పండుగ సందర్భంగా మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్‌'సి' ధమాకా ఆఫర్లు ప్రకటించింది. ప్రతి స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.10 వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్, అంతే విలువైన మొబైల్ ప్రొటెక్షన్ ఉచితంగా ఇవ్వనుంది. అలాగే రూ.5,999 వరకు విలువైన ఒక కచ్చితమైన బహుమతి అందిస్తుంది. ఆయా బ్రాండ్ల మొబైల్ కొనుగోళ్లపై లక్కీ డ్రా ద్వారా రూ.10 లక్షలు నగదు, కార్లు, బైక్స్, మరెన్నో బహుమతులు గెలుచుకొనే అవకాశం ఉంది. ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండా మొబైళ్లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఏసీలు కొనుగోలు చేసే సదుపాయం అందిస్తోంది. ఆకర్షణీయమైన ఈ ఆఫర్లను ప్రజలంతా వినియోగించుకోవాలని కంపెనీ వ్యవస్థాపకులు బాలు చౌదరి తెలిపారు.



దసరా ఆఫర్లను ఆవిష్కరిస్తున్న బాలు చౌదరి

సాక్షి స్పోర్ట్స్



పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో విష్ణువర్ధన్

జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ విభాగంలో తెలంగాణ ప్లేయర్ విష్ణువర్ధన్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో మాజీ విజేత విష్ణు 6-3, 6-3తో హావోబమ్ (మణిపూర్)పై గెలిచాడు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో తెలంగాణ అమ్మాయి హుమేరా బహార్మస్ 2-6, 6-7 (2/7)తో మాయా రేవతి (తమిళనాడు) చేతిలో ఓడిపోయింది.

ఒడిశా, కేరళ బ్లాస్టర్స్ మ్యాచ్ ‘డ్రా’

ఇండియన్ సూపర్ లీగ్‌లో భాగంగా ఒడిశా ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ), కేరళ బ్లాస్టర్స్ ఎఫ్‌సీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 2-2 గోల్స్‌తో 'డ్రా'గా ముగిసింది. భువనేశ్వర్‌లో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఒడిశా తరఫున డీగో మారిసియో (36వ ని.లో), కోఫ్ (29వ ని.లో)... కేరళ తరఫున జిమినెజ్ (21వ ని.లో), సాదుల్ (18వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. 13 జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో ప్రస్తుతం కేరళ బ్లాస్టర్స్ ఐదు పాయింట్లతో నాలుగో స్థానంలో, ఒడిశా ఎఫ్‌సీ నాలుగు పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉన్నాయి. నేడు జరిగే మ్యాచ్‌లో గోవా ఎఫ్‌సీతో నార్త్ ఈస్ట్ యునైటెడ్ క్లబ్ ఆడుతుంది.

పదేళ్ల తర్వాత...

- మహిళల టి20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ విజయం
- తొలి పోరులో స్కాట్లాండ్‌పై 16 పరుగులతో గెలుపు



షార్జా: బంగ్లాదేశ్ మహిళల క్రికెట్ జట్టు 2014లో తమ సొంతగడ్డపై జరిగిన టి20 వరల్డ్ కప్‌లో తొలిసారి బరిలోకి దిగింది. ఆ టోర్నీలో తొలి 3 మ్యాచ్‌లు ఓడి తర్వాతి 2 మ్యాచ్‌లు గెలిచింది. ఆ తర్వాత ఆడిన నాలుగు వరల్డ్ కప్‌లలో కలిపి ఒక్క మ్యాచ్‌లోనూ గెలవని జట్టు... వరుసగా 16 మ్యాచ్‌లలో ఓటమి పాలైంది. దశాబ్ద కాలం తర్వాత ఇప్పుడు తమ కెప్టెన్ నిగార్ సుల్తానా 100వ టి20 మ్యాచ్‌లో మళ్లీ బంగ్లా టీమ్ వరల్డ్ కప్ గెలుపు రుచి చూసింది. స్వదేశంలోనే జరగాల్సినా... వేదిక మారిన వరల్డ్ కప్ తొలి పోరులో విజయం సాధించి శుభారంభం చేసింది. గురువారం జరిగిన ఈ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో బంగ్లాదేశ్ మహిళలు 16 పరుగుల తేడాతో స్కాట్లాండ్‌ను ఓడించారు. స్కాట్లాండ్ మహిళలకు ఇదే తొలి వరల్డ్ కప్ మ్యాచ్ కావడం విశేషం. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. శోభన మొస్తారి (38 బంతుల్లో 36; 2 ఫోర్లు), శతి రాణి (32 బంతుల్లో 29; 3 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. స్కాట్లాండ్ బౌలర్లలో సస్కియా హార్లీ 13 పరుగులిచ్చి 3 వికెట్లు తీసింది. అనంతరం స్కాట్లాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 103 పరుగులే చేయగలిగింది. వికెట్ కీపర్ సారా బ్రైస్ (52 బంతుల్లో 49 నాటౌట్; 1 ఫోర్) మినహా అంతా విఫలమయ్యారు. ఓపెనర్‌గా దిగిన సారా చివరి వరకు క్రీజ్‌లో నిలిచినా బాగా నెమ్మదిగా ఆడటం స్కాట్లాండ్‌ను దెబ్బ తీసింది. బంగ్లా ప్లేయర్లు మూడు క్యాచ్‌లు వదిలేసినా, ఒకే బౌండరీ కొట్టిన సారా జట్టును గెలిపించడంలో విఫలమైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', మీడియం పేసర్ రితూ మోని (2/15) ప్రత్యర్థిని నిలువరించింది.

ఫాతిమా ఆల్‌రౌండ్ షో

ఆసియా చాంపియన్ శ్రీలంకపై పాకిస్తాన్ ఘనవిజయం

షార్జా: కెప్టెన్ ఫాతిమా సనా ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టడంతో మహిళల టి20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్ జట్టు శుభారంభం చేసింది. గురువారం జరిగిన గ్రూప్ 'ఎ' రెండో మ్యాచ్‌లో పాకిస్తాన్ 31 పరుగుల తేడాతో ఆసియా చాంపియన్ శ్రీలంక జట్టును ఓడించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. ఫాతిమా (20 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... నిదా దర్ (23; 1 సిక్స్), ఉమైమా సోహైల్ (18; 1 ఫోర్) రాణించారు. శ్రీలంక బౌలర్లలో చమరి ఆటపట్టు, ప్రబోధిని, సుగంధిక తలా మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 85 పరుగులు చేసి ఓడిపోయింది. విష్మి గుణరత్నే (20), నీలాక్షిక సిల్వా (22) రెండంకెల స్కోరు చేయగా... కెప్టెన్ చమరి ఆటపట్టు (6) విఫలమైంది. పాకిస్తాన్ బౌలర్లలో సాదియా 3... ఫాతిమా, ఉమైమా, నష్ర తలా రెండు వికెట్లు తీశారు. ఫాతిమా సనాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.



ఫాతిమా

బోణీ బాగుండాలి

మహిళల టి20 ప్రపంచకప్‌లో నేడు భారత్ తొలి మ్యాచ్

- న్యూజిలాండ్‌తో మొదటి పోరు
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, డిస్నీ హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



దుబాయ్: తొమ్మిదో ప్రయత్నంలోనైనా ఐసీసీ ట్రోఫీని సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో ఉన్న భారత మహిళల జట్టు టి20 ప్రపంచకప్ టైటిల్ వేటను నేడు ఆరంభించనుంది. తొలి మ్యాచ్‌లో పటిష్టమైన న్యూజిలాండ్ జట్టుతో టీమిండియా తలపడనుంది. ఇప్పటి వరకు జరిగిన ఎనిమిది టి20 ప్రపంచకప్‌లలో భారత్ ఒక్కసారి మాత్రమే ఫైనల్ (2020లో) చేరి రన్నరప్‌గా నిలిచింది. ఈసారి మాత్రం కొత్త చరిత్ర తిరగరాయాలని హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం పట్టుదలతో ఉంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా శుక్రవారం జరగనున్న మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టుతో టీమిండియా తలపడనుంది. గత ఏడాది వరల్డ్‌కప్ సెమీఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడి ఇంటిదారి పట్టిన టీమిండియా ఈసారి కప్‌తో తిరిగి రావాలంటే శుభారంభం లభించాలి. ఈ ఏడాది అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) పురుషుల టి20 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టు విజయం సాధించగా... ఇప్పుడు అదే బాటలో తొలిసారి 'విశ్వ కిరీటం' దక్కించుకోవాలని హర్మన్‌ప్రీత్ జట్టు తహతహలాడుతోంది. టి20 ఫార్మాట్‌లో ప్రపంచకప్ ప్రవేశపెట్టినప్పటి (2009) నుంచి భారత జట్టులో కొనసాగుతున్న 35 ఏళ్ల హర్మన్‌ప్రీత్ కౌర్... జట్టును ఎలా నడిపిస్తుందనేది ఆసక్తికరం.

టాపార్డర్ రాణిస్తేనే!

అంతర్జాతీయ స్థాయిలో గొప్ప విజయాలు సాధిస్తున్న భారత మహిళల జట్టు ఐసీసీ టోర్నీల్లో మాత్రం గెలుపు గీత దాటలేకపోతోంది. ఒత్తిడిని ఎదుర్కోలేకపోవడం, ఆటలో కీలక దశలో పట్టు సడలించడం వంటి చిన్న చిన్న తప్పిదాలకు భారీ మూల్యం చెల్లించుకుంటోంది. ఇటీవల ఆసియా కప్‌లో అద్వితీయ ప్రదర్శన కనబర్చిన టీమిండియా... శ్రీలంకతో ఫైనల్లో అనూహ్యంగా తడబడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. దీంతో లోపాలను గుర్తించిన కోచింగ్ బృందం జట్టుకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించింది. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో ప్లేయర్ల ఫిట్‌నెస్, ఫీల్డింగ్‌ను మరింత సానబెట్టింది. అదే సమయంలో మానసిక దృఢత్వం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించింది. స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్, రిచా ఘోష్, దీప్తి శర్మతో భారత బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా కనిపిస్తోంది. గత ఐదు మ్యాచ్‌ల్లో మూడు అర్ధశతకాలు సాధించిన స్మృతి మంధాన ఆసియా కప్‌లో అదరగొట్టింది. స్మృతి అదే జోరు కొనసాగించాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. ఆమెతో పాటు మిగిలిన ప్లేయర్లు సత్తా చాటాల్సిన అవసరముంది. భారత్‌ను పోలి ఉండే దుబాయ్, షార్జా పిచ్‌లపై మన స్పిన్నర్ల ప్రదర్శన కీలకం కానుంది. దీప్తి శర్మపై భారీ అంచనాలు ఉండగా... శ్రేయాంక, ఆశ శోభన, రాధ కూడా రాణిస్తే జట్టుకు తిరుగుండదు.

4 న్యూజిలాండ్ జట్టుతో భారత్ ఇప్పటి వరకు 13 టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 4 మ్యాచ్‌ల్లో గెలిచింది. 9 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఇక టి20 ప్రపంచకప్‌లో రెండు జట్లు నాలుగుసార్లు తలపడ్డాయి. చెరో రెండు మ్యాచ్‌ల్లో గెలిచాయి. గత రెండు ప్రపంచకప్‌లలో న్యూజిలాండ్‌పై భారతే గెలిచింది.

4/4 భారత జట్టు ఆడిన ఎనిమిది ప్రపంచకప్‌లలో తొలి నాలుగింటిలో ఆడిన తొలి మ్యాచ్‌లో ఓటమి చవిచూసింది. తర్వాతి నాలుగింటిలో ఆడిన తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. తొమ్మిదోసారి ఎలాంటి ఫలితం వస్తుందో వేచి చూడాలి.

సమతూకంగా న్యూజిలాండ్...

న్యూజిలాండ్ జట్టు అటు అనుభవజ్ఞులు ఇటు యంగ్ ప్లేయర్లతో సమతూకంతో ఉంది. కెప్టెన్ సోఫీ డివైన్, టి20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్ సుజీ బేట్స్ (36 మ్యాచ్‌ల్లో 1066 పరుగులు), లీ తహుహూ, అమెలియా కెర్‌లతో కివీస్ జట్టు పటిష్టంగా ఉంది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో రెండుసార్లు (2009, 2010) రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ జట్టు ఈసారైనా చాంపియన్‌గా అవతరించాలని భావిస్తోంది. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగనున్న ఈ టోర్నీలో లీగ్ దశలో ప్రతి జట్టు గ్రూప్‌లోని మిగిలిన నాలుగు జట్లతో తలపడనుంది. దీంతో ప్రతి మ్యాచ్ కీలకమే కాగా... లీగ్ దశ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో ఉన్న జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధించనున్నాయి. గ్రూప్ 'ఎ'లో భారత్‌తో పాటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, పాకిస్తాన్ శ్రీలంక ఉన్నాయి. దుబాయ్‌లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా... పిచ్ స్పిన్నర్లకు సహకరించే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆల్‌రౌండర్ అమెలియా కెర్ న్యూజిలాండ్ జట్టుకు కీలకం కానుంది.

తుది జట్లు (అంచనా)

భారత జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా, రిచా ఘోష్, హేమలత, దీప్తి శర్మ, పూజ వస్త్రకర్, రేణుక, రాధ యాదవ్, ఆశ శోభన. **న్యూజిలాండ్ జట్టు:** సోఫీ డివైన్ (కెప్టెన్), సుజీ బేట్స్, అమెలియా కెర్, బ్రూక్ హ్యాలీడే, మ్యాడీ గ్రీన్, ఇజీ గేజ్, కాస్పెరెక్, జెస్ కెర్, లీ తహుహూ, ఈడెన్ కార్సన్, రోస్‌మేరీ మైర్.



సుజీ బేట్స్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పేపర్‌బాయ్ టు పీహెచ్‌డీ పట్టా..


చాట్ల ఈదయ్య

ఉస్మానియా యూనివర్సిటీ: ఉన్నత విద్య మనిషి జీవితాన్ని ఎంతగా సంస్కరిస్తుందో.. ఆయనే నిదర్శనం. ఒకప్పుడు పేపర్ బాయ్‌గా పని చేసి.. కష్టపడి చదువు కుని.. ఇప్పుడు ఏకంగా పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నా రు. నల్లగొండ జిల్లా, చందంపేట మండలం, పెద్దమూల గ్రామానికి చెందిన చాట్ల ఈదయ్య పాఠశాల నుంచి డిగ్రీ వరకు మిర్యాలగూడలో విద్యాభ్యాసం చేశారు. పేదరికం వల్ల పేపర్ బాయ్‌గా జీవితాన్ని ఆరంభించి ట్యూషన్లు చెప్పారు. హాస్టల్ వార్డెన్‌గా పని చేస్తూ బీఈడీ తర్వాత ఓయూలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ లో సీటు సాధించి పూర్తి చేశారు. ఓయూ ఫిజిక్స్ విభాగం అధ్యాపకుడు ప్రొఫెసర్ శ్రీనాథ్ రెడ్డి పర్య వేక్షణలో 'స్ట్రక్చరల్ ఎలక్ట్రిక్ మాగ్నెటిక్ అండ్ ఐరన్ మాస్బర్ స్టడీ ఆఫ్ హోల్మియం ఐరన్ ఆక్సైడ్ బేస్డ్ మ్యాగ్నెటో ఎలక్ట్రిక్ మల్టీఫెరాలిక్ మెటీ రియల్స్' అనే అంశంపై పరిశోధన చేసిన చాట్ల ఈదయ్య పీహెచ్‌డీ డాక్టరేట్ అందుకున్నారు.

సారూ.. కొడుకులు తిండి పెడుతలేరు

కలెక్టర్‌కు వృద్ధురాలి గోడు



కలెక్టర్ కోయ శ్రీహర్షకు గోడు చెప్పుకొంటున్న కొమురమ్మ

ముత్తారం(మంథని): 'సారూ కొడుకులు తిండి పెడుత లేరు. పంచి ఇచ్చిన భూమిని సార్లు రిజిష్టర్ చేయమంటే చేస్తలేరు.. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న మీరే న్యాయం చేయాలి'.. అని ఒక వృద్ధురాలు గురువారం పెద్దపల్లి జిల్లా ముత్తారం తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఎదుట గోడు వెళ్లబోసుకుంది. వివరాలివి. అడవిశ్రీరాంపూర్‌కు చెందిన ఒడ్నాల కొమురమ్మకు ముగ్గురు కొడుకులు. భర్త చనిపోయాక కొమురమ్మ తమకున్న 2.14 ఎకరాలను ముగ్గురు కొడుకులకు పంచి ఇచ్చింది. అయినా కొడుకులు తిండి పెట్టడం లేదని, తన బాగోగులు చూసుకోకపోవడంతో అనారోగ్యం బారినపడ్డానని వాపోయింది. స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ సుమన్‌ను ఆదేశించారు.

డబ్బులు ఊరికే రావు!

కమీషన్ల కోసం కక్కుర్తి పడితే.. కటకటాలే

- మ్యూల్ బ్యాంక్ ఖాతాదారులను హెచ్చరిస్తున్న పోలీసులు
- నగరంలో ఇటీవల ఇలాంటి ముఠా అరెస్ట్



సాక్షి, హైదరాబాద్: కమీషన్ల కక్కుర్తి కోసం కొందరు చిక్కులు కొని తెచ్చుకుంటున్నారు. మీరు ఇంటి వద్దే ఉంటూ నెలకు రూ. వేల నుంచి లక్షల్లో డబ్బులు సంపాదించొచ్చని సైబర్ ముఠాల కేటుగాళ్లు అమాయకులకు గాలం వేస్తున్నారు. వారు చెప్పే మాయమాటలు నమ్మి తమ బ్యాంకు ఖాతాలను (మ్యూల్ అకౌంట్స్‌ను) కమీషన్ల కోసం ఇస్తున్నారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరమని, సైబర్ నేరంలో భాగస్తులవుతారు అని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కొన్ని బ్యాంకు ఖాతాల్లో అప్పటివరకు రూ.వందల్లో లావాదేవీలు జరిగి..ఒక్కసారిగా లక్షల రూపాయలు క్రెడిట్, డెబిట్ అవుతున్నాయంటే అది కచ్చితంగా అనుమానాస్పద ఖాతాగానే గుర్తించాలి. సైబర్ నేరగాళ్లు తెలివి మీరిపోయారు. ఎక్కడా తమ వివరాలు బయటకు పొక్కకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బాధితుల సొమ్మును అప్పనంగా కొట్టేసేందుకు, అమాయకులైన ప్రజల బ్యాంకు ఖాతాలనే వాడుకుంటున్నారు. ఇదే తరహా కేసులపై టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఫోకస్ పెంచింది. ఎక్కువ ఆర్థిక మోసాల్లో ఆరితేరిన వారు తమ అవసరాలు తీర్చుకునేందుకు కొందరికి కమీషన్లు ఆశచూపి ఇలా బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. పూర్తి సాంకేతికతతో ఈ తరహా బ్యాంకు ఖాతాలపై నిఘా పెడుతున్న టెక్నికల్ టీంలు, నిందితుల పూర్తి వివరాలను వెలుగులోకి తెస్తున్నాయి. రాజస్తాన్‌లో చేపట్టిన అంతర్రాష్ట్ర ఆపరేషన్‌లోనూ 27 మంది నిందితుల అరెస్టులో సాంకేతికత విశ్లేషణ బృందాలు కీలకంగా పనిచేశాయి.

అనుమానాస్పద ఖాతాలపై నిఘా

సైబర్ నేరగాళ్లకు బ్యాంకు అకౌంట్లు సరఫరా చేస్తున్న ముఠాలపైనా టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నిఘా కొనసాగుతోంది. గత నెలలోనూ ఇదే తరహాలో ఓ ముఠాను గుర్తించారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట ఒకరి నుంచి రూ.5.27 కోట్లు కొల్లగొట్టిన కేసులో టీజీ సీఎస్‌బీ దర్యాప్తులో మ్యూల్ బ్యాంక్ ఖాతాల గుట్టు రట్టయ్యింది. అల్మాస్‌గూడ వినాయకహిల్స్‌కు చెందిన కందుకూరి రవీందర్‌రెడ్డి, అత్తాపూర్ నలందనగర్‌కు చెందిన బండ్లమూడి రవి సైబర్ నేరగాళ్లకు కమీషన్ల బేసిస్‌లో బ్యాంక్ అకౌంట్స్ సప్లయ్ చేస్తున్నట్టు గుర్తించి వారిని అరెస్టు చేశారు. నెలకు రూ.5వేల వరకు ఆశజూపి వనస్థలిపురానికి చెందిన రమణమురళికృష్ణ, కుత్బుల్లాపూర్ సుభాష్ నగర్‌కు చెందిన మాధవరావులతో కలిసి మొత్తం 14 కరెంట్ అకౌంట్స్ ఓపెన్ చేయించినట్టు వెల్లడైంది. ఒక్కో అకౌంట్‌కు రూ.25 వేల చొప్పున సైబర్ నేరగాళ్ల నుంచి కమీషన్ పొందుతున్న ఈ దళారులు బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేసిన వారికి నెలకు రూ.5 వేలు ఇస్తున్నట్టు తేలింది.

విదేశాల్లో ఉంటూ ఇక్కడి ఏజెంట్లతో...

అత్యాశకు పోయి

తమ బ్యాంకు వివరాలను కమీషన్ల కోసం ఇస్తున్న వారిలో ఎక్కువ మంది తెలిసే ఈ 'మ్యూల్' దందాలోకి దిగుతున్నట్టుగా పోలీసులు చెబుతున్నారు. టీజీ సీఎస్‌బీ అధికారులు రాజస్తాన్‌లో చేపట్టిన ఆపరేషన్‌లో గుర్తించిన వారే ఇందుకు నిదర్శనంగా వారు పేర్కొంటున్నారు. పట్టుబడిన 27 మందిలో ప్రైవేట్ కాంట్రాక్టర్, జిమ్ ట్రైనర్, హోటల్ వ్యాపారి, వస్త్ర వ్యాపారి, డేటాఎంట్రీ వర్కర్, అగర్‌బత్తీల వ్యాపారి, ప్రైవేట్ ఉద్యోగులు, నిరుద్యోగులు, వ్యవసాయం చేసేవారు సైతం ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఈ తరహాలో తెలంగాణలోనూ మ్యూల్ బ్యాంకు ఖాతాలు అద్దెకు ఇస్తున్న వారు పెరుగుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. అయితే కమీషన్ల కోసం తమ బ్యాంకు ఖాతాలను, వ్యక్తిగత వివరాలు ఇతరులకు ఇచ్చి చిక్కులు కొనితెచ్చుకోవద్దని పోలీసులు హెచ్చరించారు. సైబర్ నేరాల్లో వాడిన బ్యాంకు ఖాతాలు ఎవరివి అయితే వారికి కూడా నేరంలో భాగం ఉంటుందన్నది మరవొద్దని వారు హెచ్చరిస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

శ్రీవారి బొమ్మల కొలువు

దేవీశరన్నవరాత్రి, దసరా ఉత్సవాల్లో భాగంగా.. కూరత్తాళ్వార్ వంశానికి చెందిన వేదవ్యాస భట్టార్లు గురువారం తమ ఇళ్లల్లో తమిళ సంస్కృతిలో శ్రీవారి బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. తమిళనాడులోని శ్రీరంగం, తిరుచురాపల్లికి చెందిన కూరత్తాళ్వార్ వంశానికి చెందిన వేదవ్యాస భట్టార్లు ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. తమ ఇళ్లల్లో వివిధ రూపాల్లో విష్ణుమూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేసి నవరాత్రి వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీ అని వారు తెలిపారు.

– కేసముద్రం



కోమటిపల్లిలోని ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

‘సిక్‌లీవ్’ పెడుతున్నారా..?

ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోండి

- తనిఖీలకు ఇళ్లకు వస్తున్న మేనేజర్లు
- బెర్లిన్ గిగా ఫ్యాక్టరీలో ఉద్యోగుల సిక్‌లీవ్
- ఉద్యోగుల ఇళ్లకు టెస్లా యాజమాన్య ప్రతినిధులు
- యాజమాన్యం తీరుపై సర్వత్రా విమర్శలు
- 17 శాతం ఉద్యోగుల సిక్‌లీవ్‌తో తప్పలేదంటున్న యాజమాన్యం
- ఆరువారాల సిక్ లీవ్ తీసుకుంటే పూర్తి జీతం ఇవ్వాలన్నది జర్మనీ ఎస్ఎల్ విధానం
- పనిఒత్తిడితో అధిక పని గంటలు పెరిగాయంటున్న కార్మిక సంఘాలు
- మేనేజర్లు ఇళ్లకు వెళ్లడాన్ని సమర్థిస్తూనే సిక్‌లీవ్‌లు పరిశీలిస్తానంటున్న టెస్లా ఎలన్ మస్క్



సాక్షి, హైదరాబాద్: సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులతో పాటు, ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగులకు సిక్ లీవ్ (ఎస్ఎల్) అనేది ఒక హక్కు అన్నది తెలిసిందే. ఒక్కోసారి ఎలాంటి అనారోగ్యం లేకపోయినా, సెలవు తీసుకోవాలంటే ‘ఎస్ఎల్’ అనేది ఓ తిరుగులేని ఆయుధంగా మారిన సందర్భాలు కూడా అనేకం. ఎంతటి కఠిన హృదయుడైన కంపెనీ యజమాని లేదా ఉన్నతస్థానంలో ఉన్న మేనేజర్లయినా.. ఉద్యోగుల ‘సిక్‌లీవ్’ను తోసిపుచ్చే అవకాశాలు చాలా తక్కువ. కానీ, ఇక ముందు సిక్‌లీవ్ పెట్టాలంటే.. ఉద్యోగులు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సి ఉంటుంది. ముఖ్యంగా జర్మనీలోని బెర్లిన్ ఫ్యాక్టరీ ఉద్యోగులు ఎదుర్కొన్న అనుభవాన్ని చూశాక.. ఇతర ఉద్యోగులు సైతం సిక్‌లీవ్ పెట్టాలంటే ఆలోచించాల్సిందే. ఇక్కడ ఎదురైన అనుభవాన్ని జాగ్రత్తగా గమనిస్తే.. ఈ సెలవు పెట్టేందుకు తప్పకుండా ఆలోచించ తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితి ఇప్పటికిప్పుడు భారత్‌లో కూడా వస్తుందా? అనే విషయం మాత్రం.. వివిధ కార్పొరేట్ కంపెనీల తీరును బట్టి ఉంటుందనే అంచనాలకు ఇక్కడి ఉద్యోగులు వస్తున్నారు.

అసలేం జరిగిందంటే..

జర్మనీలోని బెర్లిన్‌లో టెస్లా కంపెనీ గిగా ఫ్యాక్టరీలో సిక్‌లీవ్ పెట్టిన ఉద్యోగుల ఇళ్లకు ఆ సంస్థ మేనేజర్లు వెళ్లి.. అసలు వారు నిజంగానే అనారోగ్యంతో ఉన్నారా? లేక ఎస్ఎల్ పెట్టేందుకు ఆ విధంగా అబద్ధం ఆడుతున్నారా? అని పరిశీలించారట.. దీంతో ఈ సంస్థ మేనేజ్‌మెంట్ తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. తమకు పనిఒత్తిళ్లు పెరగడంతో పాటు అధిక పని గంటలతో తరచూ అనారోగ్యం బారిన పడడంతో సిక్ లీవ్‌లు పెట్టక తప్పని పరిస్థితులు ఎదురవుతున్నాయని కార్మిక సంఘాలు గట్టిగా వాదిస్తున్నాయి. సిక్‌లీవ్‌లు తీసుకున్న ఉద్యోగులను తనిఖీ చేసేందుకు మేనేజర్లు వారి ఇళ్ల తలుపులు తట్టినపుడు, అధికారుల మొహాలపైనే తలుపులు మూసేయడమో, తిట్ల దండకం అందుకోవడమో లేదా పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించడమో జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఎస్ఎల్‌లు తీసుకుంటున్నవారి సంఖ్య ఏకంగా 17 శాతానికి చేరుకోవడంతో.. ఈ పద్ధతికి అడ్డుకట్ట వేసేందుకు ఉద్యోగుల ఇళ్లకు మేనేజర్లు వెళ్లడాన్ని తప్పుపట్టనవసరం లేదని యాజమాన్య ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. మరింత మెరుగైన పని సంస్కృతిని, ఉత్పాదకతను పెంచేందుకు సిక్‌లీవ్‌లు పెట్టే విషయంలో ఉద్యోగుల్లో తగిన మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తామని వారు స్పష్టం చేస్తున్నారు.

లీవు తీసుకోకుంటే వెయ్యి యూరోల బోనస్

లీవ్‌లు తీసుకోని వారికి వెయ్యి యూరోలు బోనస్‌గా చెల్లించేందుకు కూడా టెస్లా సంసిద్ధత వ్యక్తం చేసింది. టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ సైతం.. సిక్‌లీవ్‌లతో తలెత్తిన పరిస్థితిని, అందుకు దారితీసిన పరిణామాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్టుగా ఎక్స్ వేదికగా స్పష్టం చేయడం గమనార్హం. ఉద్యోగులు అత్యంత కఠినమైన పని సంస్కృతిని అలవరుచుకోవాలని, డెడ్‌లైన్లు, ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు పనిచేసే చోటే కొంతసేపు కునుకేసినా పరవాలేదని మస్క్ గతంలో పేర్కొనడాన్ని కూడా గుర్తు చేసుకుంటున్నారు. ఐతే సిక్‌లీవ్‌లకు సంబంధించి టెస్లా వివాదాస్పద విధానాలను అవలంబిస్తోందనే విమర్శలు మరోవైపు ఉండనే ఉన్నాయి. జర్మన్ కార్ల ప్లాంట్‌లో ఏటా పదిలక్షల కార్లు ఉత్పత్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. కానీ సప్లయ్ చెయిన్ సమస్యలు, ఉత్పత్తి నిలిచిపోవడం, డిమాండ్ తగ్గుదల వంటి కారణాలతో అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోవడం అక్కడ సమస్యగా మారింది. ఐతే టెస్లా తన విధానాలను గట్టిగా సమర్థిస్తూనే.. సెలవు తీసుకున్న ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి తనిఖీ చేయడం అనేది జవాబుదారీతనం పెంపుదలకు అవసరమని నొక్కి చెబుతోంది. కానీ ఇలాంటి విధానాల వల్ల ఇప్పటికే అధిక పనివత్తిడితో బాధపడుతున్న ఉద్యోగులను మరింత ఆందోళనకు, చిరాకుకు గురిచేయడమే అవుతుందని యూనియన్లు, వర్కర్లు వాదిస్తున్నారు.

జర్మనీ సిక్‌లీవ్ విధానమిది...

జర్మనీ సిక్‌లీవ్ విధానం ప్రకారం చూస్తే మాత్రం.. అనారోగ్యం కారణంగా ఆరువారాల సెలవు తీసుకున్న ఉద్యోగులకు పూర్తి వేతనం చెల్లించాల్సిందే. దీంతో ఈ విధానాన్ని అక్కడి కొందరు ఉద్యోగులు తమకు అనుకూలంగా మార్చుకుని బిజీ వర్క్‌షెడ్యూల్స్‌ను తప్పించుకుని సిక్‌లీవ్‌లను ఎంచక్కా ఎంజాయ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

న్యాయవాదుల ఆందోళన

సాక్షి, హైదరాబాద్: డబుల్ బెడ్ రూం విషయంలో పోలీసులను ప్రశ్నించిన మొహమ్మద్ అబ్దుల్ కలీం అనే న్యాయవాదిపై మాదన్నపేట ప్రాంతంలో సైదాబాద్ ఎస్ఐ దాడికి నిరసనగా పలువురు న్యాయవాదులు డీజీపీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేసేందుకు వారు గురువారం మధ్యాహ్నం లక్డీకాపూల్‌లో డీజీపీ కార్యాలయానికి వచ్చారు. అయితే, తమ ఫిర్యాదును స్వీకరించకుండా డీజీపీ జితేందర్ బయటికి వెళ్లారని ఆరోపిస్తూ వారు డీజీపీ కార్యాలయం గేట్ వద్ద కాసేపు బైఠాయించి.. రోడ్డుపై ట్రాఫిక్‌ను సైతం నిలిపివేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాల్సి ఉన్నందున డీజీపీ జితేందర్ వెళ్లారని పోలీసు అధికారులు పేర్కొన్నారు. చివరకు ఏఐజీ రమణకుమార్ న్యాయవాదుల నుంచి వినతిపత్రం తీసుకున్నారు. డీజీపీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తానని ఆయన హామీ ఇవ్వడంతో న్యాయవాదులు అక్కడి నుంచి వెళ్లారు.

పాలనపై పట్టులేక ప్రత్యర్థులపై దాడి

రేవంత్‌రెడ్డిని సీఎం పదవి నుంచి తప్పించండి



సాక్షి, హైదరాబాద్: పాలనపై పట్టు లేక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యర్థులపై దాడులు చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు కేతిరెడ్డి వాసుదేవరెడ్డి విమర్శించారు. గ్రూప్ 1 పరీక్ష నిర్వహించకముందే ఫలితాలు ప్రకటిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి విచిత్ర ప్రకటనలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో వాసుదేవరెడ్డి గురువారం మీడియాతో మాట్లాడుతూ...సీఎం రేవంత్ తాను ఇచ్చిన హామీలు, చెప్పిన అబద్ధాల నుంచి తప్పించుకునేందుకు మతిమరుపు ఉన్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. గ్రూప్ 1,2,3 అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, దీంతో గ్రూప్ 4 అభ్యర్థులు గురువారం గాంధీభవన్‌ను ముట్టడించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం లెక్కలేనితనంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల ఉద్యోగాలు అంటూ ప్రకటించి పది నెలలు గడుస్తున్నా కనీసం రెండు వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని మండిపడ్డారు. అంబేడ్కర్ యూనివర్సిటీ ఆవరణలోకి జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ కాలేజీ తరలించడాన్ని వాసుదేవరెడ్డి ప్రశ్నించారు. సీఎం రేవంత్‌ను మార్చి పాలన అనుభవం ఉన్న వారికి పగ్గాలు అప్పగించాలని కాంగ్రెస్ అధిష్టానానికి సూచించారు.

జాతీయ విద్యా సంస్థల ఏర్పాటుకు వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరిన్ని జాతీయ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ (ఐఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, కాంగ్రెస్ ఎంపీ మల్లు రవిని.. ఐఎస్‌యూ అధ్యక్షుడు పాపని నాగరాజు కలిసి వినతి పత్రం సమర్పించారు. జాతీయ విద్యా సంస్థలతో రాష్ట్రంలో వేలాదిమంది విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక విద్యను అందించవచ్చని వివరించారు. ప్రస్తుత ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీల్లో మిగిలిన సీట్లను ఖాళీగా ఉంచకుండా.. ర్యాంకు దగ్గరకు వచ్చి, క్వాలిఫై అయినవారితో భర్తీ చేయాలని పాపని నాగరాజు కోరారు.

టీజీవో భవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గెజిటెడ్ భవన్(టీజీవో)లో గురువారం బతుకమ్మ పండుగ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీజీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, ఎ.సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు దీపారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపారెడ్డి మాట్లాడుతూ...మహిళా ఉద్యోగులందరూ విధిగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటాలని కోరారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బతుకమ్మ పండుగ నిర్వహించాలని తెలిపారు.



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టర్

మేక, మద్యం బాటిళ్లు, బీర్లు!

- దసరా ఉత్సవాల సందర్భంగా ఖమ్మం జిల్లాలో యువకుల వినూత్న బహుమతులు
- రూ.100 టికెట్‌తో డ్రా...

నేలకొండపల్లి: రానున్న దసరా పండుగ సందర్భంగా ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన కొందరు యువకులు డ్రా ద్వారా బహుమతులు అందించాలని నిర్ణయించారు. అయితే, టీవీలు, కూలర్లు, బైక్‌లు వంటివి కాకుండా ఈసారి వినూత్న బహుమతులను ప్రకటించారు. రూ.100 చొప్పున టికెట్లు అమ్మకం చేపట్టి ఈనెల 10న తీయనున్న డ్రాలో మొదటి బహు మతి 10కిలోల మేక ఇస్తామని పోస్టర్లను సామా జిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. రెండో బహు మతిగా బ్రాండెడ్ మద్యం బాటిల్, మూడో బహుమతి కేసు బీర్లు, నాలుగో బహు మతి రెండు నాటు కోళ్లు, ఐదో బహుమతిగా మద్యం బాటిల్ ఇస్తామని ప్రకటించడంతో టికెట్లు జోరుగానే అమ్ముడవుతున్నాయని తెలుస్తోంది.

ఉపకులపతుల కోసం ‘సెర్చ్’

నేడు సెర్చ్ కమిటీల కీలక భేటీ • ముగ్గురి ఎంపికతో జాబితా

ప్రభుత్వం సూచించిన పేరే ఖరారు • జాతీయ స్థాయి విధానం లేదనే విమర్శలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఉప కులపతుల ఎంపిక కోసం ప్రభుత్వం నియమించిన సెర్చ్ కమిటీ కసరత్తు మొదలుపెట్టింది. గురువారం ప్రాథమికంగా భేటీ అయిన సెర్చ్ కమిటీ సభ్యులు, శుక్రవారం తుది సమావేశం నిర్వహించనున్నారు. సచివాలయంలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మీటింగ్ హాలులో జరిగే ఈ కార్యక్రమానికి సెర్చ్ కమిటీ సభ్యులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు హాజరవుతారు. ఈ మేరకు అన్ని వర్సిటీల రిజిస్ట్రార్లు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. అందిన దరఖాస్తులను అన్నివిధాలా సెర్చ్ కమిటీలు పరిశీలించి, ఒక్కొక్క వర్సిటీకి ముగ్గురిని ఎంపిక చేసి, ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాయి. ఈ జాబితాలోని వ్యక్తుల వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయం గవర్నర్‌కు పంపుతుంది. గవర్నర్ ఆమోదం తర్వాత వీసీల నియామకం జరుగుతుంది. మే 21తో రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల ఉపకులపతుల పోస్టుల పదవీ కాలం ముగిసింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గత మార్చిలో కొత్త ఉపకులపతుల నియామకం కోసం నోటిఫికేషన్ ఇచ్చింది. పది విశ్వవిద్యాలయాలకు 312 మంది దరఖాస్తు చేశారు. చాలామంది అన్ని వర్సిటీలకు దరఖాస్తు చేయడంతో.. దరఖాస్తుల సంఖ్య 1,382కు చేరింది. అత్యధికంగా బీఆర్ అంబేడ్కర్ వర్సిటీకి 208 దరఖాస్తులొచ్చాయి. వీసీల నియామకం చేపట్టిన దగ్గరనుంచి అన్ని స్థాయిల నుంచి పెద్ద ఎత్తున సిఫార్సులు వచ్చాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని కూడికలు, తీసివేతలు చేపట్టారని తెలుస్తోంది. సెర్చ్ కమిటీ కూడా నామమాత్రంగానే దరఖాస్తులను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఏ యూనివర్సిటీకి ఎవరిని నియమించాలనే పేర్లతో సీఎం కార్యాలయం నుంచి సెర్చ్ కమిటీకి సమాచారం వచ్చినట్టు తెలిసింది. ఈ పేరుతో పాటు, మరో రెండు పేర్లు జోడించి పంపుతారని అధికార వర్గాల సమాచారం.

ఏ వర్సిటీకి ఎన్ని దరఖాస్తులు

వర్సిటీ	దరఖాస్తుల సంఖ్య
బీఆర్ అంబేడ్కర్	208
ఉస్మానియా	193
పాలమూరు	159
శాతవాహన	158
మహాత్మాగాంధీ	157
కాకతీయ	149
తెలంగాణ	135
జేఎన్‌టీయూహెచ్	106
తెలుగు వర్సిటీ	68
జేఎన్ఎఫ్ఏయూ	51

అభ్యర్థుల అసంతృప్తి

ఉపకులపతుల నియామక ప్రక్రియపై పలువురు ప్రొఫెసర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ పైరవీలతో కొంతమందికి పదవులు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తున్నారు. సెర్చ్ కమిటీని తూతూమంత్రంగా ఏర్పాటు చేశారని, ఎలాంటి స్వేచ్ఛ ఇవ్వలేదని వారు విమర్శిస్తున్నారు. వాస్తవానికి జాతీయ యూనివర్సిటీల్లో ఉపకులపతుల నియామకంలో అనేక నిబంధనలు పాటించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఉపకులపతి పోస్టుకు దరఖాస్తు చేసిన అభ్యర్థులను సెర్చ్ కమిటీ పిలిపించి, ముఖాముఖి మాట్లాడాల్సి ఉంటుందని ఓ మాజీ ఉపకులపతి తెలిపారు. రాష్ట్రంలో రాజకీయ నేతలు చెప్పిన వారికే ఉపకులపతి పదవి ఇవ్వడానికి మార్గం సుగమమైందన్న విమర్శలు వస్తున్నారు.



ఖర్గేతో ఎంపీ మల్లు రవి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో.. నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవి భేటీ అయ్యారు. జమ్మూకశ్మీర్ ఎన్నికల ప్రచార సభలో ఖర్గే అస్వస్థతకు గురవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఢిల్లీలో ఖర్గేను ఆయన కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులను ఖర్గేకు మల్లు రవి వివరించారు. అంతకుముందు.. పార్లమెంటరీ ఎస్సీ, ఎస్టీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఫగ్గన్ సింగ్ కులస్తేను కలుసుకుని.. దేశంలోని ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.



గురువారం అగ్రసేన్ మహారాజ్ జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

చల్ల చల్లని.. కూల్ కూల్



గురువారం సాయంత్రం అమరవీరు స్మారకం వద్ద కురుస్తున్న వర్షం

క్లుప్తంగా...

పటిష్టంగా అమలు చేయాలి

ఆహార భద్రతా ప్రమాణాల చట్టంపై మంత్రి సత్యకుమార్ యాదవ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఉన్నతాధికారుల్ని ఆదేశించారు. చట్టం అమలుపై సచివాలయంలో మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. దేశ ఆహార భద్రత ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)తో వెంటనే ఒప్పందం చేసుకుని రాష్ట్రంలో ఆహార భద్రతా చట్టం అమలుకు చేపట్టాల్సిన చర్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రాంతీయ, రాష్ట్ర ప్రయోగశాలల్ని పటిష్టం చేయాలని సూచించారు.

రోడ్ల నిర్మాణం కోసం భూముల కొనుగోలు

సాక్షి, అమరావతి: రోడ్ల నిర్మాణానికి భూసేకరణ సమస్య తలెత్తకుండా ఉండేందుకు భూముల కొనుగోలు విధానాన్ని అమలు చేస్తున్నామని అసోం ఉన్నతాధికారులు ఏపీ బృందానికి తెలిపారు. రెండురోజుల అసోం పర్యటనలో భాగంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితోపాటు అధికారుల బృందం అసోం అధికారులతో గురువారం సమావేశమైంది. రహదారుల నిర్మాణ అంశంపై వారితో చర్చించింది. అసోంమాల పేరుతో తమ రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి అంశాన్ని ఆ రాష్ట్ర అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఏపీ బృందానికి వివరించారు.

రెండు డిస్కంలకు డైరెక్టర్ల నియామకం

సాక్షి, అమరావతి: రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఆర్ఈసీ) నుంచి ఇద్దరు అధికారులను ఆంధ్రప్రదేశ్ తూర్పు, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు డైరెక్టర్లుగా రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. ఆర్ఈసీ ఫైనాన్స్ డైరెక్టర్‌గా ఉన్న హర్ష్ బవేజాను ఏపీఎస్పీడీసీఎల్‌కు, ఆర్ఈసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న జే.కే నాయక్‌ను ఏపీఈపీడీసీఎల్‌కు నామినీ డైరెక్టర్లుగా నియమించింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పెండింగ్ ఇన్సెంటివ్స్ వెంటనే చెల్లించాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న తమకు ఇన్సెంటివ్స్ (ప్రోత్సాహకాలు) చెల్లించడంలేదని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్(సీహెచ్‌వో) ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఇన్సెంటివ్స్ చెల్లించడంతో పాటు, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల తరహాలోనే తమకు కూడా 23 శాతం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సీహెచ్‌వోల సంఘం గురువారం విజయవాడలో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు.

అదనపు నిధులకు పరిపాలన అనుమతులు

సాక్షి, అమరావతి: 2024–25 ఆర్థిక సంవత్సరంలో పీఎం ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ అమలు కోసం రూ.69.87 కోట్ల అదనపు నిధులకు ప్రభుత్వం పరిపాలన అనుమతులను ఇచ్చింది. ఈ మేరకు వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలకు డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలకు దసరా సెలవులు ప్రకటించినా ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు అమలు చేయడం లేదని, దీనిపై వెంటనే విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సెలవుల్లోనూ తరగతులు నిర్వహిస్తున్న విషయం విద్యాశాఖ అధికారులకు తెలిసినా ఎందుకు స్పందించడం లేదని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షుడు శిఖరం నరహరి, కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రశ్నించారు.

మద్యం దుకాణాల వర్కర్లను కొనసాగించాలని డిమాండ్

సాక్షి, అమరావతి: ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న 15 వేల మంది సూపర్‌వైజర్లు, సేల్స్ బాయ్స్, వాచ్‌మెన్లను కొనసాగించాలని డీవైఎఫ్ఐ అధ్యక్షుడు వై.రాము, కార్యదర్శి జి.రామన్న గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిగ్రీ అర్హతతో సూపర్‌వైజర్లు, ఇంటర్ అర్హతతో సేల్స్ బాయ్స్ జిల్లా జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

రాష్ట్రంలో కార్గో సేవల విస్తరణ

మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రం నుంచి ఆక్వా, కూరగాయలు, పూలు, పండ్లు ఇతర ఉత్పత్తులను దేశంలో ఇతర ప్రాంతాలకు కార్గో సర్వీస్ ద్వారా ఎగుమతి చేయొచ్చని మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో కార్గో సేవల విస్తరణపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. గురువారం విజయవాడలో నిర్వహించిన 'స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్' లో సురేష్ కుమార్ మాట్లాడుతూ.. కోడిగుడ్ల ఉత్పత్తిలో ఏపీ ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే ఐదు పోర్టులు, మూడు అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉన్నాయన్నారు. కొత్తగా కుప్పం, మూలపేట తదితర ప్రాంతాల్లో ఇండస్ట్రీ క్లస్టర్స్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. ఈ క్లస్టర్లలో వ్యవసాయం, ఉద్యాన, మత్స్య, ఫార్మా, ఆహార శుద్ధి, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారని వెల్లడించారు.

పుంజు భలే రంజుగా

సంక్రాంతి పందేలకు సిద్ధమవుతున్న కోడి పుంజులు


ఆకివీడులోని నాటుకోళ్ల కేంద్రంలోని పందెం పుంజులు



సంక్రాంతి పేరు చెబితే గుర్తొచ్చేవి ఉమ్మడి గోదావరి జిల్లాల్లో జరిగే కోడి పందేలే. పండుగ మూడు రోజులు నిర్వహించే కోడి పందేల్లో రూ.కోట్లు చేతులు మారతాయి. పందేల బరిలో ప్రత్యర్థి పుంజును మట్టి కరిపించేందుకు సంక్రాంతికి 3 నెలల ముందు నుంచే పందెం పుంజుల సన్నద్ధతకు పెద్ద కసరత్తే మొదలవుతుంది.

- సాక్షి, భీమవరం

కోడి పందేలకు ఉన్న క్రేజ్‌కు తగ్గట్టుగానే పుంజుల పెంపకంలో పందెం రాయుళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. కొందరు తమ ఇళ్లు, చెరువులు, పొలాలు వద్ద పుంజులను పెంచితే.. ఎక్కువ మంది నాటుకోళ్ల కేంద్రాల్లో పుంజులను ఎంచుకుని వాటిని పందేలకు సిద్ధం చేసే పనిని పెంపకందారులకే అప్పగిస్తారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాలతో పాటు విదేశాల నుంచి సంక్రాంతికి వచ్చే ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో పుంజులను ఎంపిక చేసుకుని పెంపకందారులకు ముందే అడ్వాన్స్‌లు చెల్లిస్తుంటారు. పందెం పుంజులకు ఉన్న డిమాండ్‌తో పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం, ఉండి, ఆకివీడు, పాలకోడేరు, పాలకొల్లు, కాళ్ల తదితర మండలాల్లో 200కు పైగా నాటుకోళ్ల పెంపక కేంద్రాలు ఉన్నాయి.


నాటుకోళ్లు కేంద్రం వద్ద పందెం పుంజులు


పుంజును నీళ్ల తొట్టిలో ఉంచి ఈతకొట్టిస్తున్న దృశ్యం

అత్యంత గోప్యంగా..

కాకి, నెమలి, అబ్రాస్, డేగ, పచ్చకాకి, కేతువ తదితర జాతులకు చెందిన ఏడాదిన్నర నుంచి రెండేళ్ల వయసు కలిగిన పుంజులను పందేలకు వినియోగిస్తుంటారు. ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో వీటి పాత ఈకలు ఊడిపోయి కొత్త ఈకలు వస్తుంటాయి. అనంతరం వీటికి శరీర పటుత్వం, శక్తిని పెంచేందుకు శిక్షణ ప్రారంభిస్తారు. అందుకోసం ఎవరికి వారు ఎన్నో సంప్రదాయ, ఆధునిక పద్ధతులు పాటిస్తారు. పుంజులకిచ్చే ఆహారం, మందులు నుంచి శిక్షణ వరకు ప్రతి విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. తాము ఎలా పెంచుతున్నదీ ఇతరులకు తెలియకుండా గోప్యత పాటిస్తారు. మకాంలోని ఐరన్ కేజ్‌లలో ఉండే పందెం కోళ్లను బయటకు తీసి ఆరుబయట కట్టడం మొదలుపెడతారు. అప్పటి నుంచే వీటి శిక్షణ మొదలవుతుంది. ప్రస్తుతం చాలా మకాంల వద్ద పుంజులను బయట కట్టడం ప్రారంభించారు. రోజు ఉదయాన్నే వేడి నీటిని పట్టిస్తారు. బరిలో చురుగ్గా కదిలేందుకు వీలుగా కాళ్లల్లో చురుకుదనానికి నెలరోజులు పాటు రోజు విడిచి రోజు సమీపంలోని చెరువులు, నీళ్ల తొట్టిల్లో ఈత కొట్టిస్తారు. తర్వాత 'వీ' ఆకారంలో నెట్‌లు కట్టి పుంజు అందులోనే తిరిగే విధంగా బేటా (నిర్ణీత పద్ధతిలో వాకింగ్) కొట్టిస్తారు. మరికొందరు ఖాళీ జాగాలో వాటి వెనుకే ఉండి తరుముతూ వాకింగ్ చేయిస్తారు. మేత పెట్టి 11 గంటల సమయం వరకు ఎండలో కట్టేసిన తర్వాత మకాంలోకి మార్చేస్తారు. పండుగలు దగ్గర పడుతున్నకొద్దీ పుంజు శరీరం గట్టిపడేందుకు, నొప్పులేమైనా ఉంటే తగ్గేందుకు ప్రత్యేక ట్రైనర్లతో నీళ్లపోతలు, శాఖలు చేయిస్తారు.

5 వేలకు పైగా కోళ్లు

కోడికి అందించే ప్రత్యేక మేత, మందులతో ఒక్కో పందెం పుంజును సిద్ధం చేసేందుకు మూడు నెలల్లో రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. ఇలా పెంచిన పుంజులను వాటి రంగు, ఎత్తు, పోరాట పటిమను బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్షల్లో అమ్ముతుంటారు. వీటిపై భారీస్థాయిలో పందేలు జరుగుతుంటాయి. సంక్రాంతి పందేల కోసం 5వేలకు పైగా పందెం కోళ్ల అమ్మకాలు జరుగుతుంటాయి. వీటిద్వారా రూ.20 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని అంచనా.


మేత దర్జానే వేరు

శిక్షణలో శక్తి, సామర్థ్యం పెంచేందుకు, శరీరంలో కొవ్వు చేరకుండా తేలిగ్గా ఎగురుతూ ప్రత్యర్థిపై విరుచుకుపడేందుకు పందెం పుంజులకు ఈ మూడు నెలలు ప్రత్యేక మేత అందిస్తారు. కోడి సైజును బట్టి ఉదయం పూట 20 నుంచి 40 గ్రాముల వరకు ఉడకబెట్టిన మేక మాంసం, 5 వరకు బాదం గింజలు, రెండు వెల్లుల్లి రేకలు, ఒక ఎండు ఖర్జూరం, కోడిగుడ్డును ముక్కలు చేసి పెడతారు. తిరిగి సాయంత్రం చోళ్లు, గంట్లు, రాగులు మొదలైన వాటిని ఆహారంగా ఇస్తారు.









విశాఖ ఉక్కుపై 'ఎక్స్'లో వార్

- కాంగ్రెస్ నేత, కేంద్ర మంత్రి మధ్య మాటల యుద్ధం
- ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుపై పోరాడుతాం : ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్
- వాళ్లందరినీ తిరిగి చేర్చుకున్నాం.. రాజకీయమొద్దు : కేంద్ర మంత్రి కుమారస్వామి

సాక్షి, న్యూఢిల్లీ : వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అంశాలపై ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి మధ్య గురువారం 'ఎక్స్' వేదికగా మాటల యుద్ధం నడిచింది. ప్లాంట్‌లో కార్మికుల తొలగింపును తప్పుపడుతూ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో కేసీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోదీ ప్రభుత్వం తన ప్రియ మిత్రులకు ప్లాంట్‌ను కట్టబెట్టేందుకే కార్మికుల తొలగింపు చేపట్టిందని దుయ్యబట్టారు. దీనికి అంతే తీవ్రతతో ప్రతిస్పందించిన కుమారస్వామి.. కాంగ్రెస్ నేత చేసిన ఆరోపణలు తోసిపుచ్చారు. ఇంతకీ ఎవరేమన్నారంటే..

కార్పొరేట్ కుబేరులకు కట్టబెట్టేందుకే..



వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో 4,200 మంది కాంట్రాక్ట్ కార్మికులను అన్యాయంగా తొలగించడం బీజేపీ కార్మిక వ్యతిరేక దృక్పథాన్ని మరోసారి బహిర్గతం చేసింది. ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి, దానిని ప్రధాన మంత్రికి ప్రియమైన కార్పొరేట్ కుబేరులకు అప్పగించే ప్రయత్నంలో జరుగుతున్న ముందస్తు కుట్ర అనడంలో సందేహం లేదు. కాంగ్రెస్ దీనిని ఖండిస్తోంది. తొలగించిన కార్మికులను తక్షణమే తిరిగి విధుల్లోకి తీసుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వర దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు కార్మికులకు కాంగ్రెస్ అండగా నిలుస్తుంది. 48 గంటల్లోగా కార్మికులను విధుల్లోకి తీసుకోకుంటే ప్లాంట్ వద్ద నిరవధిక నిరాహార దీక్షకు దిగుతానని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిళ ఇదివరకే ప్రకటించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ భవిష్యత్తును రక్షించడంలో కాంగ్రెస్ నిబద్ధతతో ఉంది. ప్రతిష్టాత్మక పారిశ్రామిక యూనిట్‌ను ప్రైవేట్ కంపెనీలకు విక్రయించడానికి కాంగ్రెస్ ఎన్నడూ ఒప్పుకోదు.

– కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి

కార్మికులను తిరిగి తీసుకున్నాం



వైజాగ్ స్టీల్ ప్లాంట్ నుంచి సెప్టెంబర్ 27న తొలగించిన 4,200 మంది కాంట్రాక్ట్ కార్మికులను 48 గంటల్లోనే తిరిగి చేర్చుకున్నారు. ఈ పునరుద్ధరణ సెప్టెంబర్ 29 నుండి అమల్లోకి వచ్చింది. చిల్లర, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఈ అంశాన్ని రాజకీయం చేసే ప్రయత్నం మానేయండి. ఈ సమస్య పరిష్కారమయ్యాక కూడా తప్పుడు సమాచారంతో ఉద్రిక్తతలు రేకెత్తించే ప్రయత్నాలు చేయకండి. సుమారు 3,700 కాంట్రాక్ట్ లేబర్ పాస్‌లను రద్దు చేశామని, త్వరలో ఆన్‌లైన్ సిస్టమ్‌లో పాస్‌లను పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నామని ప్లాంట్ యాజమాన్యం సైతం స్పష్టం చేసింది. ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సందర్శించి, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్మికులతో చర్చించాం. ప్రధాని, ఆర్థిక మంత్రితో చర్చించి వారి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చాం. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేందుకు ఎన్డీయే ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న మీ ఆరోపణలు నిరాధారం, సత్యదూరం.

– హెచ్‌డీ కుమారస్వామి, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి

చంద్రబాబూ.. తిరుమల జోలికి పోవద్దు

- మీ కుళ్లురాజకీయాలకు దేవుడిని వాడుకోవద్దు
- వైఎస్సార్‌సీపీ రాజ్యసభాపక్ష నేత విజయసాయిరెడ్డి

సాక్షి,అమరావతి: వందరోజుల పాలనలో వైఫల్యాలను పక్కదారి పట్టించేందుకు సీఎం చంద్రబాబు తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారంటూ ఆరోపణలు చేశారని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభాపక్ష నేత విజయసాయిరెడ్డి అన్నారు. 'చంద్రబాబూ.. తిరుమల జోలికి వెళ్లొద్దు, మీ కుళ్లు రాజకీయాలకు దేవుడిని వాడుకోవద్దు, హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే నాశనమైపోతావ్' అంటూ హెచ్చరించారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను టీడీపీ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని, చంద్రబాబు అబద్ధాలన్నీ ఇప్పుడు మోసాలుగా మారాయని విమర్శించారు. వ్యవసాయం, విద్య, వైద్యం సహా అన్ని రంగాల్లోనూ చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.

మూడు నెలల్లో లక్షన్నర పెన్షన్లు కట్

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో లక్షన్నర పెన్షన్లు కట్ చేశారన్నారు. విజయవాడ వరదల్లో బాధితులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని విజయసాయిరెడ్డి విమర్శించారు. కనీసం జరిగిన నష్టాన్ని కూడా ఈ ప్రభుత్వం అంచనావేయలేకపోతోందని, బాధితులను కలెక్టర్ ఆఫీసు చుట్టూ తిప్పుతున్నారని దుయ్యబట్టారు. చివరికి బాధితులకు పరిహారం చెల్లింపుల్లోనూ స్వార్థ రాజకీయాలు చూపుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు మోసాలతో ప్రజల్లో ఆగ్రహం వెల్లువెత్తుతోందని, నాలుగు నెలల్లో ఈ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు.

కాంతిరాణా, గున్నీ పిటిషన్లపై విచారణ 15కి వాయిదా

సాక్షి, అమరావతి: సినీనటి కాదంబరి జత్వానీ కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారులు కాంతిరాణా టాటా, విశాల్ గున్నీతో పాటు అప్పటి ఏసీపీ హనుమంతరావు, దర్యాప్తు అధికారి సత్యనారాయణ, న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లు దాఖలు చేసిన పిటిషన్లలో తదుపరి విచారణ ఈ నెల 15వ తేదీకి వాయిదా పడింది. జత్వానీ ఫిర్యాదు ఆధారంగా పిటిషనర్లపై నమోదైన కేసులో దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయని, వాటిన్నింటినీ కౌంటర్ రూపంలో కోర్టు ముందుంచుతామని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. కౌంటర్ దాఖలు చేసేందుకు వీలుగా విచారణను వాయిదా వేయాలని కోరారు. ఇందుకు న్యాయస్థానం అంగీకరిస్తూ విచారణ ఈ నెల 15కి వాయిదా వేసింది.


ఇసుక సరఫరా కోసం ప్రత్యేక కార్యాచరణ

- 70 లక్షల టన్నుల సామర్థ్యంతో వినియోగంలోకి 108 రీచ్‌లు
- అబ్కారీ, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా

సాక్షి, అమరావతి: వర్షాకాలం తర్వాత ఇసుక సరఫరా కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామని రాష్ట్ర భూగర్భ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. ఇసుక లభ్యతను పెంచడానికి 2024 అక్టోబర్ 1న జారీ చేసిన జీవో 59 ప్రకారం పట్టా భూముల నుంచి ఇసుక తవ్వకాలకు అనుమతి ఉందన్నారు. 2024 అక్టోబర్ 15నుండి స్టాక్ యార్డులు, డిసిల్టేషన్ పాయింట్లు, రీచ్‌ల ద్వారా ఇసుక డిమాండ్‌ను తీర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 70 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 108 రీచ్‌లు మాన్యువల్ పద్ధతులను ఉపయోగించి పనిచేయించటం వల్ల, అక్టోబర్ 15 నుంచి అన్ని జిల్లాల్లో సరఫరా గణనీయంగా పెరుగుతుందన్నారు. ఫిబ్రవరి 2023లో జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఇసుక రీచ్‌లకు పర్యావరణ అనుమతులను రద్దుచేసి, సెమీ మెకనైజ్డ్ మైనింగ్ కోసం పబ్లిక్ హియరింగ్‌లను తప్పనిసరి చేసిందన్నారు. ఈ రీచ్‌లను వినియోగంలోకి తీసుకువచ్చేలా కార్యాచరణ కోసం ప్రభుత్వం చర్యలు ప్రారంభించగా, 2024 జూన్ తరువాత 18 పబ్లిక్ హియరింగ్‌లను పూర్తి అయ్యాయని, మరో 32 పురోగతిలో ఉన్నాయని మీనా వివరించారు. రాష్ట్ర పర్యావరణ మదింపు కమిటీ నిర్మాణాన్ని పూర్తి చేసి, అదనపు రీచ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పర్యావరణ శాఖతో కలిసి పని చేయనున్నామన్నారు. త్వరితగతిన జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ కేసుల పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. వర్షాకాలం ముగిసే వరకు నదీగర్భాల్లో రీచ్‌లు పనిచేయకపోవడం వల్ల స్టాక్‌యార్డుల సంఖ్య జూలైలో 86 నుండి 14కి తగ్గినా, 58 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 20 డిసిల్టేషన్ పాయింట్‌లు అవసరమైన అనుమతులు మంజూరు చేయటంతో ఆగస్టు 15 నుండి జల వనరుల శాఖ ఆధ్వర్యంలో అవి పని చేస్తున్నాయని మీనా పేర్కొన్నారు.


రిటైర్డ్ అధికారికి పెత్తనమా?

సాక్షి, అమరావతి: ప్రభుత్వ సర్వీస్‌ల నుంచి రిటైర్డ్ అయిన అధికారికి కూటమి ప్రభుత్వం కీలక బాధ్యతలను కట్టబెట్టింది. రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగం డైరెక్టర్‌గా ఎంబీఆర్ ప్రసాద్‌ను నియమించింది. ఆగస్టు నెలాఖరున డైరెక్టర్ హోదాలో ఉద్యోగ విరమణ పొందిన ఆయన్ను ఏడాది పాటు డైరెక్టర్‌గా నియమిస్తూ (రీ–ఎంప్లాయిమెంట్ ప్రాతిపదికన) వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు గురువారం ఉత్తర్వులిచ్చారు. నిబంధనల ప్రకారం ఈ విభాగంలో డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించడానికి అర్హులెవరు లేరన్న కారణాన్ని సాకుగా చూపి ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకున్న ఎంబీఆర్‌కు తిరిగి పట్టం కట్టారని ఆ విభాగంలో చర్చించుకుంటున్నారు. డిప్యూటీ డైరెక్టర్‌లు ఎం.వి.ఎస్.ఎస్. వరప్రసాద్, ఎం. పాండురంగప్రసాద్ విజయవాడ, విశాఖపట్నం జాయింట్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) కలిగి ఉన్నారు. నిబంధనల ప్రకారం 30 ఏళ్ల పాటు సేవలు అందించిన వీరిద్దరికి జేడీలుగా పదోన్నతి కల్పించి, ఇద్దరిలో సీనియర్ అయిన వారికి డైరెక్టర్‌గా ఎఫ్ఏసీ ఇవ్వాలి. అలా కాకుండా ఎనిమిదేళ్ల పాటు డైరెక్టర్‌గా పని చేసి రిటైర్ అయిన అధికారికే తిరిగి పట్టం కట్టడంపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 80,613 మంది స్వామివారిని దర్శించుకోగా 24,403 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 2.92 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



శాస్త్రోక్తంగా కలశ ప్రతిష్ట



శ్రీకాళహస్తి: పట్టణంలోని కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా కలశ ప్రతిష్ట చేశారు. దీంతో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు కలశాన్ని ప్రతిష్ఠించారు. విశేష పూజలు నిర్వహించి, కర్పూర హారతులు సమర్పించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు 404 బస్సులు

తిరుపతి అర్బన్: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు 404 సర్వీసులు నడపనున్నామని కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తిరుపతి జిల్లా ప్రజారవాణా అధికారి తిమ్మాడి చెంగల్ రెడ్డి వెల్లడించారు. తిరుపతిలోని తమ చాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలకు 340 డీజిల్ సర్వీసులు, 64 విద్యుత్ బస్సులను కేటాయించామని తెలిపారు.

సింహగిరిపై నేటి నుంచి శరన్నవరాత్రి పూజలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి శరన్నవరాత్రి పూజలను విశేషంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ గురువారం తెలిపారు. రోజూ ఉదయం రామాయణ పారాయణం ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవార్లకు ఆలయ బేడా మండపంలో తిరువీధి మహోత్సవం, విశేష పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆదిలక్ష్మి అలంకరణలో సిరులతల్లి



డాబాగార్డెన్స్: విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు శాస్త్రోక్తంగా పూజలు ప్రారంభించారు. తొలి రోజు గురువారం మూలవిరాట్ వద్ద కనకమహాలక్ష్మి.. ఆదిలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజ నిర్వహించారు.

సూర్యప్రభపై శైలపుత్రి



మహానంది: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహానందిలో కామేశ్వరీదేవి అమ్మవారు మొదటి రోజు గురువారం రాత్రి శైలపుత్రి దుర్గగా దర్శనమిచ్చారు. ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. సూర్యప్రభ వాహనంపై అమ్మవారి గ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు.

నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో నవరాత్రి వేడుకలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ పలికారు.

ఎస్వీ వైద్య కళాశాలలో స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు గురువారం స్టేట్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీపీ చంద్రశేఖరన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాల మేరకు ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ టోర్నమెంట్ పోటీలను ఎస్వీ వైద్య కళాశాల క్రీడా మైదానం, వెటర్నరీ యూనివర్సిటీ క్రీడా మైదానం, అగ్రికల్చర్ కాలేజ్ క్రీడా మైదానంలో మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.



5న ఏహెచ్ డిప్లొమోలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ కళాశాలలో అనిమల్ హస్బెండరీ డిప్లొమో కోర్సుకు సంబంధించిన 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు మరిన్ని వివరాలకు వెటర్నరీ వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

16న ఉద్యోగ మేళా

చిత్తూరు కలెక్టరేట్: అంతర్జాతీయ కంపెనీల్లో ఒకటైన హెచ్‌సీఎల్ కంపెనీలో అసోసియేట్ రోల్స్ ఉద్యోగాలకు ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023–2024 సంవత్సరాల్లో మ్యాథ్స్‌తో సంబంధం లేని గ్రూపుల్లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసి 75 శాతం ఫలితాలు వచ్చిన విద్యార్థులు ఉద్యోగమేళాకు హాజరు కావచ్చన్నారు. ఈ నెల 16న జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ఒకేషనల్ కళాశాలలో నిర్వహించబోయే ఉద్యోగ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్య తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు గుంటూరులోని చేబ్రోలు మహాలక్ష్మి–పుల్లయ్య నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి చేతిరాత నైపుణ్య తరగతులను నిర్వహించారు. రెండు రోజుల తరగతులకు వివిధ జిల్లాల ఉపాధ్యాయులు హాజరయ్యారు. క్యాలిగ్రఫీ టీం ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామ్మోహన్ రావు నేతృత్వంలో రీసోర్స్ పర్సన్లు అవగాహన కల్పించారు. గ్రాఫాలజిస్ట్ మన్నెం రామారావు అవగాహన కల్పించారు.


• కమల్‌హాసన్

ఓటీటీ రిలీజ్‌కు ఇండియన్ 3?

'ఇండియన్ 3' సినిమా డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజ్ కానుందా? అంటే అవుననే సమాధానాలే కోలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమా ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇరవైఎనిమిదేళ్ల తర్వాత 'ఇండియన్' సినిమాకు సీక్వెల్స్‌గా 'ఇండియన్ 2, ఇండియన్ 3' సినిమాలను తెరకెక్కించారు దర్శకుడు శంకర్. రెండు సీక్వెల్స్‌లోనూ కమల్‌హాసన్ హీరోగా నటించారు. 'ఇండియన్ 2' విడుదలైన ఆరు నెలల తర్వాత 'ఇండియన్ 3' సినిమాను రిలీజ్ చేయాలనుకున్నారు. ఈ ఏడాది జూలై 12న 'ఇండియన్ 2' థియేటర్స్‌లో విడుదలైంది. కానీ ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి సరైన స్పందన లభించలేదు. దీంతో 'ఇండియన్ 3' విడుదల మరింత ఆలస్యం అవుతుందని, వేసవిలో ప్రేక్షకుల ముందుకు వచ్చే చాన్సెస్ ఉన్నాయని కోలీవుడ్‌లో టాక్ వినిపించింది. అయితే 'ఇండియన్ 2' సక్సెస్ కాని నేపథ్యంలో 'ఇండియన్ 3' సినిమాను డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజ్ చేస్తే ఎలా ఉంటుందా? అని చిత్రయూనిట్ ఆలోచిస్తోందనే టాక్ కోలీవుడ్‌లో ప్రచారంలోకి వచ్చింది. మరి... తమిళ పరిశ్రమలో ప్రచారంలో ఉన్నట్లుగా 'ఇండియన్ 3' చిత్రం డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలవుతుందా? అనేది చూడాలి. ఇక 'ఇండియన్ 3' సినిమాను లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై సుభాస్కరన్ నిర్మించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే... నయనతార, సిద్ధార్థ్, మాధవన్, మీరా జాస్మిన్ లీడ్ రోల్స్‌లో నటించిన స్పోర్ట్స్ డ్రామా 'ది టెస్ట్'. శశికాంత్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. అయితే ఈ చిత్రం కూడా డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజ్ అవుతుందనే ప్రచారం కోలీవుడ్‌లో సాగుతోంది. ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

కథ విన్నారా?


• ఎన్టీఆర్

హీరో ఎన్టీఆర్, తమిళ దర్శకుడు 'జైలర్' ఫేమ్ నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కే అవకాశం కనిపిస్తోంది. ఇటీవల ఎన్టీఆర్‌ను నెల్సన్ దిలీప్‌కుమార్ కలిసి ఓ కథ వినిపించారని, ఈ కథకు ఎన్టీఆర్ అంగీకారం తెలిపారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో తెరపైకి వచ్చింది. అయితే ప్రస్తుతం ఎన్టీఆర్ హిందీ చిత్రం 'వార్ 2' (ఇందులో హృతిక్ రోషన్ మరో హీరో)తో బిజీగా ఉన్నారు. త్వరలోనే ప్రశాంత్ నీల్‌తో చేయనున్న 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమా సెట్స్‌లో జాయిన్ అవుతారు. మరోవైపు 'జైలర్ 2' సినిమా స్క్రిప్ట్‌ను మరింత మెరుగుపరిచే పనుల్లో ఉన్నారు నెల్సన్. 'జైలర్'లో హీరోగా నటించిన రజనీకాంత్ 'జైలర్ 2'లోనూ నటిస్తారు. ఇలా... 'వార్, డ్రాగన్' సినిమాలను ఎన్టీఆర్ పూర్తి చేశాక, అటు 'జైలర్ 2'ను నెల్సన్ కంప్లీట్ చేశాక... కానీ ఎన్టీఆర్–నెల్సన్ కాంబోలోని సినిమా సెట్స్‌పైకి వెళ్లే చాన్సెస్ కనిపించడం లేదు. దీంతో ఈ సినిమా పై అధికారిక ప్రకటన రావడానికి, ఈ చిత్రం సెట్స్ పైకి వెళ్లడానికి చాలా సమయం పడుతుందని ఊహించవచ్చు.

ముహూర్తం ఖరారు


• నాని

'దసరా' (2023) వంటి సూపర్ హిట్ ఫిల్మ్ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 'దసరా' సినిమాను నిర్మించిన సుధాకర్ చెరుకూరియే ఈ సినిమాను నిర్మించనున్నారు. కాగా ఈ సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం కుదిరిందని, దసరా పండగ రోజు పూజా కార్యక్రమాలు జరగనున్నాయని, ఈ ఏడాదే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని తెలిసింది. అంతేకాదు... ఈ సినిమా సికింద్రాబాద్ నేపథ్యంలో సాగుతుందని, ఇందులో నాని రోల్ పవర్‌ఫుల్‌గా ఉంటుందని సమాచారం. అలాగే ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించే అవకాశం ఉందని, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తారన్న వార్తలు ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే.

నానికి జోడీగా శ్రీనిధీ శెట్టి

నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో 'హిట్ 3' సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్ర కోసం శ్రీనిధీ శెట్టిని తీసుకున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం 'హిట్ 3' సినిమా చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతోంది. నాని, శ్రీనిధిలపై కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమాను 2025 మే 1న రిలీజ్ చేయనున్నట్లుగా ఆల్రెడీ చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

నా కల నిజమైంది


– ప్రసన్న



అజిత్ కాంబినేషన్‌లో నటించాలనుకున్న తన కల 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాతో నిజమైందని సంబరపడుతున్నారు తమిళ నటుడు ప్రసన్న. అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిష, మరో కీలక పాత్రలో శ్రీలీల నటిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. కాగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రంలో ఆర్. ప్రసన్న ఓ కీలక పాత్రలో నటించనున్నారు. ఈ విషయాన్ని ప్రసన్న 'ఎక్స్' వేదికగా అధికారికంగా వెల్లడించారు. ''మంగాత్త' చిత్రం తర్వాత నుంచి అజిత్‌గారి సినిమాలో నటించాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. అజిత్‌గారి సినిమాలో నేను నటించాలని ఆయన ఫ్యాన్స్ ఆశించారు. నేను కూడా కోరుకున్నాను. కానీ చేతి దాకా వచ్చినట్లే వచ్చి, అవకాశాలు చేజారాయి. అయితే ఈసారి మాత్రం అలా జరగలేదు. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమాలో అజిత్‌గారితో నటిస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది. అజిత్ సార్‌తో ఆల్రెడీ నా ఫస్ట్ షాట్ పూర్తయింది. నా కల నిజమైనట్లుగా అనిపిస్తోంది. ఈ అవకాశం నాకు దక్కినందుకు అజిత్‌గారు, దర్శకుడు అధిక్, నిర్మాణ సంస్థ మైత్రీమూవీ మేకర్స్‌తో పాటు దేవుడికి కూడా ధన్యవాదాలు చెబుతున్నాను'' అని పేర్కొన్నారు ప్రసన్న. ఇక ఈ చిత్రాన్ని 2025 సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లు ఆల్రెడీ యూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.


• ప్రియమణి

విదేశాల్లో హౌస్‌ఫుల్


• అక్షయ్‌కుమార్

విదేశాల్లో హౌస్‌ఫుల్ హంగామా మొదలైంది. అక్షయ్ కుమార్, రితేష్ దేశ్‌ముఖ్, అభిషేక్ బచ్చన్, సంజయ్ దత్, ఫరీద్ ఖాన్, జాకీ ష్రాఫ్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్ వంటి భారీ తారాగణంతో రూపొందుతున్న హిందీ చిత్రం 'హౌస్‌ఫుల్ 5'. తరుణ్ మన్సుఖాని దర్శకత్వంలో సాజిద్ నడియాడ్‌వాలా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ విదేశాల్లో ప్రారంభమైందని సమాచారం. మేజర్ షూటింగ్ లండన్‌లో జరగనుందని తెలిసింది. లండన్, ఫ్రాన్స్, స్పెయిన్, యూకే లొకేషన్స్‌లో 'హౌస్‌ఫుల్ 5' చిత్రీకరణను ప్లాన్ చేశారట. బాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీస్‌లో ఒకటైన 'హౌస్‌ఫుల్' నుంచి వస్తున్న ఈ తాజా 'హౌస్‌ఫుల్ 5'ను తొలుత 2024 దీపావళి సందర్భంగా రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ వచ్చే ఏడాది జూన్ 6కు వాయిదా వేశారు.

పదమూడేళ్లు సినిమాలు చేయలేదు!


• అరవింద్ స్వామి

అరవింద్ స్వామి... ఈ పేరు వినగానే 'రోజా, బొంబాయి' చిత్రాలు టక్కున ప్రేక్షకులకు గుర్తొస్తాయి. ఆ సినిమాల ద్వారా ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేశారాయన. వరుస సినిమాలతో దూసుకెళుతున్న ఆయన కెరీర్‌కు ఆరోగ్య సమస్యల వల్ల ఒక్కసారిగా బ్రేక్ పడింది. అది కూడా పదమూడేళ్ల పాటు. కార్తీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సత్యం సుందరం'. సి. ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో సూర్య, జ్యోతిక నిర్మించిన ఈ సినిమా తమిళంలో సెప్టెంబర్ 27న, తెలుగులో సెప్టెంబర్ 28న విడుదల అయింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్‌లో వచ్చిన బ్రేక్‌పై అరవింద్ స్వామి మాట్లాడుతూ– ''నా కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడు ఆరోగ్య సమస్యలు వచ్చాయి. వెన్నెముకకు గాయం కావడంతో రెండేళ్లు పూర్తిగా విశ్రాంతి తీసుకున్నాను. అదే సమయంలో నా కాలికి పాక్షికంగా పక్షవాతం వచ్చింది. ఇలా ఆరోగ్య సమస్యల కారణంగా 13 ఏళ్లపాటు (2000 నుంచి 2013) ఒక్క సినిమాలో కూడా నటించలేదు. మళ్లీ సినిమాల్లో నటించాలనుకోలేదు. అయితే మణిరత్నంగారు అవకాశం ఇవ్వడంతో 'కడల్' (తెలుగులో కడలి) సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చాను. ప్రస్తుతం నా కెరీర్ చాలా బాగుంది'' అన్నారు.

విజయ్ సినిమాలో...


• గౌతమ్ మీనన్

విజయ్ హీరోగా హెచ్. వినోద్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హీరోయిన్‌గా పూజా హెగ్డే, ఇతర కీలక పాత్రల్లో మమితా బైజు, బాబీ డియోల్ నటించనున్నారు. కాగా ఈ చిత్రంలోని రెండు కీ రోల్స్‌లో ప్రియమణి, గౌతమ్ వాసుదేవ మీనన్ నటించనున్నట్లుగా చిత్రయూనిట్ గురువారం అధికారికంగా వెల్లడించింది. ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించాలనుకుంటున్నారు. కెవిన్ ప్రొడక్షన్స్ నిర్మించనున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తారు. ఈ చిత్రం వచ్చే ఏడాది అక్టోబరులో రిలీజ్ కానుంది.


• వాణీ కపూర్

బోర్డర్ సీక్వెల్‌లో అహాన్ శెట్టి



బాలీవుడ్ 'బోర్డర్' సీక్వెల్ 'బోర్డర్ 2'లో జాయిన్ అయ్యారు అహాన్ శెట్టి. సన్నీ డియోల్ హీరోగా, వరుణ్ ధావన్, దిల్జీత్ సింగ్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'బోర్డర్ 2'. అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఆల్రెడీ మొదలైంది. ఈ చిత్రంలో అహాన్ శెట్టి ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు చిత్రయూనిట్ గురువారం అధికారికంగా వెల్లడించింది. ''బోర్డర్' సినిమాతో నా అనుబంధం 29 ఏళ్ల క్రితమే ప్రారంభమైంది. మా నాన్న (బాలీవుడ్ సీనియర్ నటుడు సునీల్ శెట్టి) 'బోర్డర్' సినిమా సెట్స్‌లో ఉన్నప్పుడు మా అమ్మ సెట్స్‌కు వెళ్లేది. అప్పుడు మా అమ్మ గర్భవతి. నేను మా అమ్మ గర్భంలో శిశువుగా ఉన్నాను. ఆ తర్వాత జేపీ దత్తా ('బోర్డర్' సినిమా దర్శకుడు, 'బోర్డర్ 2' నిర్మాత) అంకుల్ చెప్పే కథలు వింటూ, ఆయన చేయి పట్టుకుని నడిచాను... పెరిగాను. నా జీవితంలోని ఇలాంటి అనుభవాలే నాకు సినిమాల వైపు ఆసక్తి కలిగేలా చేశాయి. ఇప్పుడు నేను 'బోర్డర్ 2' సినిమాలో ఓ రోల్ చేయనున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. సన్నీ డియోల్ సార్‌తో వర్క్ చేయబోతున్నాను. దిల్జీత్‌గారికి నేను అభిమానిని. వరుణ్ ధావన్‌గారితో స్క్రీన్ షేర్ చేసుకోవడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. మా నాన్నగారి వల్లే నేను ఇలా ఉండగలిగాను. ఆయన వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తాను'' అని పేర్కొన్నారు అహాన్ శెట్టి. 'బోర్డర్ 2' చిత్రాన్ని 2026 జనవరి 23న రిలీజ్ చేయనున్నారు. ఇక సన్నీ డియోల్, సునీల్ శెట్టి, జాకీ ష్రాఫ్, అక్షయ్ ఖన్నా లీడ్ రోల్స్‌లో నటించిన హిందీ 'బోర్డర్' 1997లో విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు జేపీ దత్తా దర్శకత్వం వహించారు.


• కుమార్తె దియా, కుమారుడు దేవ్‌తో సూర్య, జ్యోతిక

ఓ తండ్రిగా గర్వపడుతున్నాను

– హీరో సూర్య

హీరో సూర్య–హీరోయిన్ జ్యోతిక ఫుల్ ఖుషీలో ఉన్నారు. ఇంతకీ విషయం ఏంటంటే... వీరి కుమార్తె దియా 'లీడింగ్ లైట్: ది అన్‌టోల్డ్ స్టోరీస్ ఆఫ్ ఉమెన్ బిహైండ్ ది సీన్స్' అనే డాక్యుమెంటరీ తీశారు. సినిమా ఇండస్ట్రీలో టెక్నికల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే మహిళల గుర్తింపు, వారి కష్టం, వారిపై ఉండే వివక్ష వంటి అంశాలతో ఈ పదమూడు నిమిషాల డాక్యుమెంటరీ ఉంటుంది. త్రిలోక ఇంటర్‌నేషనల్ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్‌లో 'బెస్ట్ స్క్రీన్ రైటర్, బెస్ట్ స్టూడెంట్ షార్ట్ ఫిలిమ్' విభాగాల్లో దియాకు అవార్డులొచ్చాయి. ఇలా కుమార్తెకు రెండు అవార్డులు రావడంతో సూర్య, జ్యోతికలు హ్యాపీ ఫీలవుతున్నారు. ''ఇలాంటి డాక్యుమెంటరీని నువ్వు తీసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఓ తండ్రిగా నేను గర్వపడుతున్నాను. బిహైండ్‌ది సీన్స్‌లో పని చేసే మహిళలకు నువ్వు ఒక వాయిస్ ఇచ్చావ్. నీ అద్భుతమైన జర్నీకి ఇదొక ఆరంభం. నీ ప్యాషన్‌ను ఫాలో అవుతూ ఉండు. నీ తర్వాతి గమ్యం ఏమై ఉంటుందా? అని నేను ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అని ఇన్‌స్టాలో పేర్కొన్నారు సూర్య. ''వినోద రంగంలో మహిళా సాంకేతిక నిపుణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నీ స్టూడెంట్ డాక్యుమెంటరీలో చాలా అర్థవంతంగా చూపించావు. చాలా గర్వంగా ఉంది. అలాగే ఎంతోకాలంగా ఉన్న సమస్యలను వెలుగులోకి తెచ్చినందుకు ధన్యవాదాలు'' అని జ్యోతిక పేర్కొన్నారు.

చలో లండన్

లండన్ కాలింగ్ అంటున్నారు హీరోయిన్ వాణీ కపూర్. పాకిస్తాన్ నటుడు ఫవాద్ ఖాన్, ఇండియన్ నటి వాణీ కపూర్ హీరో హీరోయిన్లుగా ఓ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మూవీ తెరకెక్కనుంది. దర్శకురాలు ఆర్తి బగ్డీ ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఈ చిత్రంలో ఫవాద్ ఖాన్ చెఫ్ పాత్రలో కనిపిస్తారట. ఈ సినిమా చిత్రీకరణ అతి త్వరలో లండన్‌లో ప్రారంభం కానుందని, దాదాపు నలభై రోజులు లండన్‌లోనే జరుగుతుందని టాక్. అలాగే ఈ సినిమాకు 'రైట్ నౌ' అనే టైటిల్‌ను అనుకుంటున్నారట మేకర్స్. విడి విడిగా ప్రేమలో విఫలమైన ఓ అమ్మాయి, అబ్బాయి ఓ సందర్భంలో కలుసుకుంటారు. వాళ్లు ఏ విధంగా మళ్లీ ప్రేమలో పడ్డారు? వీరి పాత ప్రేమకథలు ఎలా వీరి జీవితాలను ప్రభావితం చేశాయి? అన్నదే 'రైట్ నౌ' సినిమా కథాంశమని బాలీవుడ్ సమాచారం.

బిజినెస్ రీల్

పసిడి, వెండికి పండుగ డిమాండ్

ఢిల్లీలో ఆల్‌టైమ్ గరిష్టానికి బంగారం



న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలకు పండుగల డిమాండ్ తోడయ్యింది. ఢిల్లీలో పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర రూ.200 పెరిగి ఆల్‌టైమ్ గరిష్ట స్థాయి రూ.78,300కు చేరింది. స్టాకిస్టులు, రిటైల్ కస్టమర్ల నుంచి పసిడికి డిమాండ్ పటిష్టంగా ఉన్నట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. ఇక వెండి విషయానికి వస్తే, కేజీ ధర రూ.665 ఎగసి రూ.93,165కు చేరింది. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా కమోడిటీ మార్కెట్లు బుధవారం పనిచేయని సంగతి తెలిసిందే. నవరాత్రి ప్రారంభంలో డిమాండ్ పెరగడంతో సెంటిమెంట్ మెరుగ్గా మారిందని, హిందూ పురాణాల ప్రకారం కొత్త వస్తువులను ముఖ్యంగా విలువైన లోహాలను కొనుగోలు చేయడానికి ఇది శుభప్రదమైన వారమని వ్యాపారులు తెలిపారు. మరోవైపు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో చురుగ్గా ట్రేడవుతున్న డిసెంబర్ కాంట్రాక్ట్ 10 గ్రాముల ధర ఈ వార్త రాస్తున్న 10 గంటల సమయంలో రూ.200కుపైగా లాభంతో రూ.45,500 వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో ధర రూ.400కు పైగా పెరిగింది. వెండి సైతం రూ.1,000కి పైగా లాభంతో రూ. 92,453 వద్ద ట్రేడవుతోంది.

మనాక్సియా కోటెడ్ మెటల్స్‌కు రూ.200 కోట్ల ఆర్డర్



హైదరాబాద్: మనాక్సియా కోటెడ్ మెటల్స్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఎంసీఎంఐఎల్) యూరోప్ క్లయింట్ నుంచి 24 మిలియన్ డాలర్ల (రూ.200 కోట్లు) కాంట్రాక్టును సొంతం చేసుకున్నట్టు ప్రకటించింది. ఇందులో భాగంగా వచ్చే 12 నెలల కాలంలో 20,000 మెట్రిక్ టన్నుల ప్రీమియం ప్రీ పెయింటెడ్ స్టీల్ కాయిల్స్, అలూ జింక్ కోటెడ్ స్టీల్ కాయిల్స్, గాల్వనైజ్డ్ స్టీల్ ఉత్పత్తులను సరఫరా చేయనుంది. తాజా ఒప్పందంతో భవిష్యత్తులోనూ ఈ తరహా ఆర్డర్లు మళ్లీ రావొచ్చని, కంపెనీకి స్థిరమైన ఆదాయ మార్గానికి ఇది వీలు కల్పిస్తుందని ఎంసీఎంఐఎల్ పేర్కొంది. తన సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు ఈ ఆర్డర్ సాయపడుతుందని తెలిపింది. అంతర్జాతీయ పోటీతత్వాన్ని పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో విస్తరించేందుకు ఈ కాంట్రాక్టు కీలకంగా పనిచేస్తుందని కంపెనీ హోల్‌టైమ్ డైరెక్టర్ కరణ్ అగర్వాల్ పేర్కొన్నారు.

కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు రూ.317 కోట్లు

KNR Constructions Limited.

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ రంగ సంస్థ కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ తాజాగా ఎన్‌హెచ్ఏఐ నుంచి రూ.317 కోట్లు అందుకుంది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాతో (ఎన్‌హెచ్ఏఐ) కంపెనీకి చెందిన స్పెషల్ పర్పస్ వెహికిల్ కేఎన్ఆర్ ముజఫర్‌పూర్ బరౌని టోల్‌వేకు ఉన్న ఒప్పందంలో భాగంగా ఈ మొత్తం పొందినట్టు గురువారం తెలిపింది. ప్రాజెక్టు పూర్తి కావడంతో రుణదాతలకు బాకీలు పూర్తిగా చెల్లించినట్టు కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ వెల్లడించింది. ముజఫర్‌పూర్ బరౌని టోల్ ప్రాజెక్టు టోల్ వసూలు బాధ్యతలను 2024 నవంబర్ 1 నుంచి ఎన్‌హెచ్ఏఐ చేపట్టనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-10-2024	
విశాఖ	535-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	10,260
ఎన్ఎస్ఈ	1,37,063
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,98,179
ఎఫ్ఐఐ	- 15,243
డీఐఐ	+ 12,914

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.39	$ 70.01
బ్రెంట్	77.27	$ 73.09

పెళ్లి బాజా @ రూ.5.9 లక్షల కోట్లు!

- నవంబర్–డిసెంబర్లో దేశవ్యాప్తంగా 48 లక్షల వివాహాలు
- రిటైల్ రంగానికి బిగ్ బూస్ట్: సీఏఐటీ
- మధ్యతరగతి సగటు పెళ్లి ఖర్చు రూ. 5–25 లక్షలు



న్యూఢిల్లీ: రాబోయే పెళ్లిళ్ల సీజన్ కోసం వధూవరులతో పాటు వ్యాపారులు కూడా చాలా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. ఈసారి వివాహాల విషయంలో గెస్ట్‌ల సంఖ్య తగ్గినా ఖర్చు బాజా మాత్రం గట్టిగానే మోగుతుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నవంబర్ 12 నుంచి డిసెంబర్ 16 మధ్య 18 రోజుల పాటు దివ్యమైన పెళ్లి ముహూర్తాలు ఉన్నాయని.. ఈ సీజన్‌లో రిటైల్ రంగంలో రూ.5.9 లక్షల కోట్ల మేర వ్యాపారం ఉంటుందని అఖిల భారత ట్రేడర్స్ సమాఖ్య (సీఏఐటీ) లెక్కగట్టింది. అంతేకాదు ఒక్క ఢిల్లీలోనే 4.5 లక్షల మేర వివాహాలు జరుగుతాయని.. రూ.1.5 లక్షల కోట్ల వ్యాపారానికి ఆస్కారం ఉందని పేర్కొంది.

అతిథుల సంఖ్య తగ్గుతోంది...

వివాహ పరిశ్రమలో ఫ్యాషన్, ట్రావెల్, ఆతిథ్యం ఇంకా ఇతరత్రా సర్వీసులు కలగలిసి ఉంటాయి. ముఖ్యంగా దేశీయంగా కూడా డెస్టినేషన్ వెడ్డింగ్ సంస్కృతి పెరుగుతుండటంలో ట్రావెల్, ఆతిథ్య రంగానికి ఫుల్ జోష్ లభిస్తోంది. ప్రత్యేకమైన ఫుడ్ మెనూల నుంచి గెస్ట్‌లకు విభిన్నమైన అనుభూతులను అందించడంపై ఎక్కువగా ఫోకస్ చేస్తున్నారు. 'ఇటీవలి కాలంలో పెళ్లిళ్లకు అతిథుల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ముఖ్యంగా మిలీనియల్ జంటలు తమకు అత్యంత దగ్గరి బంధువులు, ఆత్మీయులను మాత్రమే అతిథులుగా పిలుస్తున్నారు. గెస్ట్ లిస్టులో కోత పెట్టినప్పటికీ.. మొత్తం మీద బడ్జెట్ విషయంలో మాత్రం ఎక్కడా తగ్గడం లేదు. అందుకే ఏటికేడు వివాహాల ఖర్చు పెరుగుతూనే ఉంది. అలంకరణలు, వ్యక్తిగత సర్వీసులు, అతిథుల అభిరుల మేరకు కేటరింగ్ ఇలా ప్రతి విషయంలోనూ ప్రత్యేకత కోరుకుంటున్నారు' అని న్యూఢిల్లీలోని షాంగ్రీలా ఈరోస్ జనరల్ మేనేజర్ అభిషేక్ సాధూ పేర్కొన్నారు. మరో నెల రోజుల్లో పెళ్లిళ్ల సీజన్ కళకళలాడనుండటంతో ఈ లగ్జరీ హోటల్ చైన్ 'బంధన్ బై షాంగ్రీలా' పేరుతో వివాహ సేవలను ప్రారంభించింది. ఈ హోటల్‌లో సాధారణ స్థాయి పెళ్లి బడ్జెట్ రూ. 25 లక్షలతో మొదలై కోట్లలోకి వెళ్తోంది. జైపూర్ హయత్ ప్యాలెస్‌లోనూ సాధారణ పెళ్లి బడ్జెట్ రూ.20–30 లక్షలుగా ఉంది.

ఖర్చెంతైనా తగ్గేదేలే...

పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం... పెళ్లి ఖర్చు రూ. 25 లక్షల స్థాయి నుంచి ఏకంగా రూ.100 కోట్లకు కూడా వెళ్లే సందర్భాలున్నాయట. వివాహ వేడుకను గ్రాండ్‌గా జరిపించేందుకు ఎంతైనా ఖర్చు పెట్టేందుకు సై అంటున్నారని, అవసరమైతే కొందరు ఆస్తులమ్మేందుకూ వెనుకాడటం లేదంటున్నారు పరిశీలకులు! మధ్యతరగతి వర్గాల పెళ్లి ఖర్చు రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ ఉంటుందని, ఎగువ మధ్యతరగతి విషయానికొస్తే.. ఇది రూ. 25 లక్షల నుంచి రూ.2.5 కోట్లకు చేరుతోందని వెడ్డింగ్ ప్లానర్ వెడ్డింగ్‌సూత్ర.కామ్ సీఈఓ పార్థీప్ త్యాగరాజన్ పేర్కొన్నారు. 'సంపన్నులు (హెచ్ఎన్ఐలు) రూ.1.5 కోట్ల నుంచి రూ.25 కోట్ల స్థాయిలో వెచ్చిస్తున్నారు. అల్ట్రా హెచ్ఎన్ఐల బడ్జెట్ అయితే ఏకంగా రూ.2.5 కోట్ల నుంచి రూ.100 కోట్లకు కూడా దూసుకెళ్తోంది' అని ఆయన వివరించారు. ఇటీవలి కాలంలో అనంత్ అంబానీ–రాధికా మర్చెంట్ వివాహ వేడుక ఖర్చు చూసి (దాదాపు రూ.5,000 కోట్లుగా అంచనా) ప్రపంచమంతా నోరెళ్లబెట్టడం తెలిసిందే!! భారతీయుల పెళ్లిళ్లా మజాకానా అనే రేంజ్‌లో అంగరంగ వైభవంగా ఈ వివాహం జరిగింది.

డెస్టినేషన్ వెడ్డింగ్ క్రేజ్



బ్రైడల్ మేకప్ నుంచి ఫోటోగ్రఫీ, వేదిక, డెకరేషన్, వెడ్డింగ్ లొకేషన్ వరకూ ప్రత్యేకంగా ఉండాలని యువ జంటలు కోరుకుంటున్నారు. 'గతంలో వెడ్డింగ్ ఫోటోగ్రఫీకి రూ. 2 లక్షలు వరకు ఒక కుటుంబం ఖర్చు చేస్తే, ఇప్పుడిది రూ. 6 లక్షలకు చేరుతోంది. కొందరు వధువులు టాప్ మేకప్ ఆర్టిస్టులతో ప్రత్యేకంగా సింగారించుకుంటున్నారు. ఒక్కో ఫంక్షన్‌కు ఖర్చు రూ. లక్ష వరకూ ఉంటోంది' అని త్యాగరాజన్ తెలిపారు. ఇక జైపూర్, ఉదయ్‌పూర్, జోధ్‌పూర్, గోవా, మహాబలిపురం వంటి డెస్టినేషన్ వెడ్డింగ్ హాట్‌స్పాట్‌లకు క్రేజ్ ఓ రేంజ్‌లో ఉంటోందట! శీతాకాలంలో పెళ్లిళ్లు, శుభ ముహూర్తాలు కూడా ఉండటంతో హోటల్ రేట్లు భారీగా ఎగబాకుతున్నాయని పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి. కాగా, రాజస్థాన్, గోవా, కేరళ ప్రాచుర్యం కొనసాగుతుండటంతో పాటు ఇప్పుడు డెహ్రాడూన్, రిషికేష్, కూర్గ్ వంటి కొత్త ప్రదేశాలు కూడా డెస్టినేషన్ వెడ్డింగ్స్ లిస్టులోకి చేరుతున్నాయి. 'అత్యంత సంపన్న వర్గాల్లో 10 శాతం మాత్రమే పెళ్లిళ్ల కోసం విదేశీ గమ్యాలను ఎంచుకుంటున్నారు, ఈ విషయంలో థాయ్‌లాండ్ తొలి స్థానంలో ఉంది. ఇక్కడ ఏటా 450–550 భారతీయ పెళ్లిళ్లు జరుగుతున్నాయి' అని త్యాగరాజన్ వివరించారు.

హ్యుందాయ్ ఐపీవో 14న!

- రూ. 25,000 కోట్ల సమీకరణ
- భారీ ఇష్యూ రికార్డుకు చాన్స్



న్యూఢిల్లీ: ఆటోరంగ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా పబ్లిక్ ఇష్యూ ఈ నెల 14న ప్రారంభమయ్యే వీలుంది. దక్షిణ కొరియా ఆటో దిగ్గజం హ్యుందాయ్‌కు దేశీ అనుబంధ సంస్థ ఇది. ఐపీవో ద్వారా రూ. 25,000 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. వెరసి బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం ఎల్ఐసీ తదుపరి భారీ ఐపీవోగా నిలవనుంది. సెబీకి దాఖలు చేసిన ప్రాస్పెక్టస్ ప్రకారం మాతృ సంస్థ, ప్రమోటర్ హ్యుందాయ్ మోటార్ కంపెనీ 14,21,94,700 ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. 2003లో జపనీస్ ఆటో దిగ్గజం మారుతీ సుజుకీ ఐపీవో తదుపరి మళ్లీ మరో ఆటో రంగ దిగ్గజం లిస్టింగ్‌కు సిద్ధపడుతుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది! దేశీయంగా కార్ల తయారీలో మారుతీ సుజుకీ టాప్ చెయిర్‌ను ఆక్రమిస్తుంటే.. హ్యుందాయ్ మోటార్ ఇండియా రెండో ర్యాంకులో నిలుస్తున్న సంగతి తెలిసిందే. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం ఐపీవో ద్వారా కంపెనీ 15–20 శాతం వాటాను విక్రయించనుంది. 3.3–5.6 బిలియన్ డాలర్ల మధ్య నిధులు సమీకరించే ప్రణాళికలు వేసినట్లు తెలుస్తోంది. లిస్టింగ్ ద్వారా బ్రాండ్ విలువ మరింత బలపడనున్నట్లు హ్యుందాయ్ మోటార్ ఇండియా ముసాయిదాలో పేర్కొంది.

1996లో..

దేశీయంగా హ్యుందాయ్ మోటార్ ఇండియా కార్యకలాపాలు 1996లో ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం విభిన్న కార్ల విభాగాలలో 13 మోడళ్లను విక్రయిస్తోంది. కాగా.. గత నెల(సెప్టెంబర్)లో ఎలక్ట్రిక్ వాహన కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ ఐపీవో ద్వారా రూ. 6,145 కోట్లు సమీకరించింది. ప్రైమరీ మార్కెట్‌పట్ల దేశ, విదేశీ ఇన్వెస్టర్ల నుంచి అత్యంత ఆసక్తి సమోదవుతున్న నేపథ్యంలో ఓలా ఐపీవో విజయవంతమైంది. దీంతో ఈ ఏడాది(2024) ఇప్పటికే 62 కంపెనీలు ఉమ్మడిగా రూ. 64,000 కోట్లు సమీకరించడం ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యాయి. 2023లో 57 కంపెనీలు సమకూర్చుకున్న రూ. 49,436 కోట్లతో పోలిస్తే ఇది 29 శాతం అధికం.

మహీంద్రా నుంచి జియో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాల తయారీలో ఉన్న మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ.. మహీంద్రా జియో పేరుతో చిన్న వాణిజ్య వాహనాన్ని ప్రవేశపెట్టింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.7.52 లక్షల నుంచి ప్రారంభం. సంప్రదాయ డీజిల్ చిన్న వాణిజ్య వాహనంతో పోలిస్తే ఏడేళ్లలో జియో ద్వారా కస్టమర్లు రూ.7 లక్షల వరకు ఆదా చేస్తారని కంపెనీ తెలిపింది. 18.4/21.3 కిలోవాట్ అవర్ లిక్విడ్ కూల్డ్ బ్యాటరీ పొందుపరిచారు. టాప్ స్పీడ్ గంటకు 60 కిలోమీటర్లు. 765 కిలోల బరువు మోయగలదు. ఒకసారి చార్జింగ్‌తో 160 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని మహీంద్రా వెల్లడించింది. ఏడేళ్లు లేదా 1.5 లక్షల కిలోమీటర్ల వరకు బ్యాటరీ వారంటీ ఉంది. అడాస్ ఫీచర్లు జోడించారు.



రూపాయికి గ్రాము ఐస్ క్రీమ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రూపాయికి గ్రాము ఐస్ క్రీమ్. అదికూడా మీరు కోరుకున్నట్టు. 26 ఫ్లేవర్లు, 50కిపైగా టాపింగ్స్‌తో కస్టమర్ ముందే సహజ పదార్థాలతో నోరూరించే ప్రీమియం ఐస్ క్రీమ్ రెడీ. ఆర్గానిక్ ఐస్ క్రీమ్స్ తయారీ, విక్రయంలో ఉన్న ఐస్‌బర్గ్ ఈ వినూత్న ఆలోచనకు తెరతీసింది. ఆర్గానిక్ క్రీమరీ పేరుతో తొలి ఔట్‌లెట్‌ను హైదరాబాద్‌లో ఈ నెల ప్రారంభిస్తోంది. హైదరాబాద్‌లో 15, ఇతర ప్రాంతాల్లో 10 ఆర్గానిక్ క్రీమరీ కేంద్రాలను ఏడాదిలోగా ఏర్పాటు చేస్తామని ఐస్‌బర్గ్‌ను ప్రమోట్ చేస్తున్న ఆర్ఎస్ బిజినెస్ వెంచర్స్ ఫౌండర్, సీఈవో సుహాస్ బి శెట్టి మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. పారదర్శకత కోసం ఐస్ క్రీమ్ బాక్సులపై క్యూఆర్ కోడ్ ముద్రిస్తున్నామని వివరించారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ప్రొడక్ట్ వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు.

నెల్లూరు కుర్రోడు..

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుకు చెందిన సుహాస్ ఫార్మసీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2013లో ఐస్ క్రీమ్స్ విక్రయ వ్యాపారంలోకి ప్రవేశించారు. తండ్రి ఇచ్చిన రూ.3 లక్షలతో 200 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఒక గదిలో తన ప్రస్థానం మొదలుపెట్టాడు. 'అప్పటికే ఆ గదిలో 12 మంది వ్యాపారాలు పెట్టి మూసేశారు. అయినా నేను ధైర్యం చేశాను. సాధించాలి అన్న తపన నన్ను నిలబెట్టింది. రెండవ ఏడాది రెండవ స్టోర్ ప్రారంభించాను. 2015 నుంచి ఫ్రాంచైజీల రాక మొదలైంది. అన్ని కంపెనీల్లో ఒకటిగా కాకుండా విభిన్నంగా ఉంటూ మా స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలన్న ఆలోచనతో 2019లో ఆర్గానిక్ ఐస్ క్రీమ్స్ తయారీకి శ్రీకారం చుట్టాం. హృతిక్ రోషన్ కంపెనీ హెచ్ఆర్ఎక్స్ ఫిట్‌నెస్‌కు కీటో ఐస్ క్రీమ్స్ సరఫరా చేస్తున్నాం' అని సుహాస్ వివరించారు.

రోజుకు 25,000 లీటర్లు..

నెల్లూరు ప్లాంటు సామర్థ్యం ప్రస్తుతం రోజుకు 12,500 లీటర్లు. దీనిని రెండింతలకు విస్తరించేలా కంపెనీ ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌సహా ఏడు రాష్ట్రాల్లో ఐస్‌బర్గ్ విస్తరించింది. 72 ఔట్‌లెట్లు ఉన్నాయి. వీటిలో ఎనిమిది సొంతవి కాగా మిగిలినవి ఫ్రాంచైజీలుగా ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం కంపెనీ టర్నోవర్ రూ.14 కోట్లు. 2025–26లో రూ.100 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా చేసుకుంది. ఆర్గానిక్ విభాగంలోకి ప్రవేశించడం కంపెనీని మలుపు తిప్పిందని అంటారు సుహాస్. చిన్న నగరాల్లో విజయవంతం అయిన తర్వాతే మహానగరంలో అడుగు పెట్టామని ధీమాగా చెప్పారు.

సాయంత్రం తర్వాతే ఐస్ క్రీమ్స్..

సగటున ఒక్కో భారతీయుడు ఏటా 600 గ్రాముల ఐస్ క్రీమ్ ఆరగిస్తున్నారు. యూఎస్‌లో ఇది 2.3 కిలోలు ఉంది. మెట్రో నగరాల్లో 70 శాతం ఐస్ క్రీమ్ వినియోగం సాయంత్రం ఆరు తర్వాతే జరుగుతోందని సుహాస్ వెల్లడించారు. 'మెట్రో యేతర నగరాల్లో ఇది పూర్తిగా భిన్నంగా ఉంటుంది. రూ.25,000 కోట్ల మొత్తం వ్యాపారంలో 5 శాతం వార్షిక వృద్ధితో ఐస్ క్రీమ్స్ రూ.10,000 కోట్లు, 2–3 శాతం వృద్ధితో ఫ్రోజెన్ డెసర్ట్స్ విభాగం రూ. 15,000 కోట్లు కైవసం చేసుకుంది. మొత్తం వినియోగంలో 50 శాతం స్టోర్స్ ద్వారా, 18–20 శాతం వీధుల్లో తోపుడు బండ్ల ద్వారా, మిగిలినది ఆన్‌లైన్‌లో జరుగుతోంది. క్విక్ కామర్స్ వేగం ఇలాగే కొనసాగితే పరిశ్రమ 2030 నాటికి రూ.50,000 కోట్లకు చేరుతుంది' అని వివరించారు.

రిస్క్ తీసుకునే ఇన్వెస్టర్లకు కొత్త సాధనం



న్యూఢిల్లీ: పెట్టుబడులపై అధిక రిస్క్ తీసుకునే ఇన్వెస్టర్ల కోసం సెబీ 'న్యూ అస్సెట్ క్లాస్' (కొత్త సాధనం)ను ప్రవేశపెట్టింది. అలాగే, ప్యాసివ్ ఫండ్స్‌కు ప్రోత్సాహకంగా 'ఎంఎఫ్ లైట్-టచ్' కార్యాచరణను అనుమతించింది. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు సంబంధించి నిబంధనల సవరణలకూ ఆమోదం తెలిపింది. ఇలా 17 ప్రతిపాదనలకు సెబీ బోర్డు సమావేశంలో ఆమోదం లభించింది. అందరూ అనుకున్నట్టు ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో)లో రిటైల్ ట్రేడర్ల స్పెక్యులేషన్ కట్టడిపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడం గమనార్హం. సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌పై అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ సంస్థ, కాంగ్రెస్ పార్టీ ఆరోపణల తర్వాత జరిగిన మొదటి బోర్డు సమావేశం ఇది కావడంతో అందరిలోనూ దీనిపై ఆసక్తి నెలకొంది.

- కనీసం రూ.10 లక్షల పెట్టుబడి
- ఫండ్స్, పీఎంఎస్‌కు ప్రత్యామ్నాయం
- ప్యాసివ్ ఫండ్స్‌కు 'ఎంఎఫ్ లైట్'
- ఇకపై వేగంగా రైట్స్ ఇష్యూలు

న్యూ అస్సెట్ క్లాస్

మ్యూచువల్ ఫండ్స్‌లో రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సేవలు (పీఎంఎస్) పొందాలంటే కనీసం రూ.50 లక్షలు పెట్టుబడి పెట్టాలి. రాబడుల కోసం రిస్క్ తీసుకునే సామర్థ్యం ఉన్నప్పటికీ, రూ.50 లక్షల పెట్టుబడి అందరికీ సాధ్యం కాకపోవచ్చు. ఈ తరహా ఇన్వెస్టర్ల కోసం మ్యూచువల్ ఫండ్స్, పీఎంఎస్‌కు ప్రత్యామ్నాయంగా కొత్త ఉత్పత్తిని సెబీ ప్రవేశపెట్టింది. దీనిపై ప్రజల నుంచి అభిప్రాయాలు సైతం స్వీకరించింది. ఈ సాధనంలో డెరివేటివ్స్‌లో పెట్టుబడులకు అనుమతి ఉంటుంది. రుణాలు తీసుకోవడానికి అనుమతి ఉండదు. అన్‌లిస్టెడ్, అన్‌రేటెడ్ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయడానికి కూడా అనుమతి లేదు.

టీప్లస్0

ప్రస్తుతం టీప్లస్1 సెటిల్‌మెంట్ విధానం అమల్లో ఉంది. అంటే స్టాక్స్ కొనుగోలు చేసిన మరుసటి పనిదినంలో దాన్ని సెటిల్ చేస్తారు. తదుపరి దశలో టీప్లస్0కు మళ్లాలన్నది సెబీ ప్రణాళిక. ఇందులో భాగంగా 25 స్క్రిప్‌లకు ఆప్షనల్ (ఐచ్ఛికం) టీప్లస్0 విధానం (ట్రేడింగ్ రోజే సెటిల్‌మెంట్) అమల్లో ఉంది. ఇప్పుడు టాప్-500 (మార్కెట్ విలువ పరంగా) స్టాక్స్‌కు టీప్లస్0 విధానాన్ని ఐచ్ఛికంగా చేస్తూ సెబీ నిర్ణయం తీసుకుంది. రిజిస్టర్డ్ స్టాక్ బ్రోకర్లు అందరూ తమ ఇన్వెస్టర్లకు టీప్లస్0 సెటిల్‌మెంట్‌ను ఆఫర్ చేయవచ్చు. ఇందుకోసం ప్రత్యేకమైన బ్రోకరేజీ చార్జీలను వసూలు చేసుకునే స్వేచ్ఛను సెబీ కల్పించింది. మ్యూచువల్ ఫండ్స్ సైతం టీప్లస్0 విధానాన్ని పొందొచ్చు.

ఎంఎఫ్ లైట్

ప్యాసివ్ ఫండ్స్‌కు సంబంధించి సరళించిన కార్యాచరణను సెబీ ప్రకటించింది. కేవలం ప్యాసివ్ ఫండ్స్‌ను నిర్వహించే సంస్థలకు నిబంధనల భారాన్ని తగ్గించింది. కేవలం ప్యాసివ్ ఫండ్స్ రూపంలో ప్రవేశించే కొత్త సంస్థలకు మార్గం తేలిక చేసింది. నికర విలువ, ట్రాక్ రికార్డు, లాభదాయకత పరిమితులను తగ్గించింది.

రైట్స్ ఇష్యూ వేగవంతం

రైట్స్ ఇష్యూలు వేగంగా పూర్తి చేసేందుకు సెబీ కొత్త నిబంధనలు రూపొందించింది. దీని కింద బోర్డు ఆమోదించిన నాటి నుంచి 23 పనిదినాల్లో రైట్స్ ఇష్యూ ముగుస్తుంది. ప్రస్తుతం 317 రోజుల సమయం తీసుకుంటోంది. ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్‌కు పట్టే 40 రోజుల కంటే కూడా తక్కువ కానుంది.

ఇతర నిర్ణయాలు..

- సెకండరీ మార్కెట్‌లో (నగదు విభాగం) యూపీఐ బ్లాక్ విధానం (ఏఎస్‌బీఏ) లేదా 3ఇన్1 ట్రేడింగ్ సదుపాయం ద్వారా ఇన్వెస్టర్లు ట్రేడ్ చేసుకోవచ్చు. 2025 ఫిబ్రవరి 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. ప్రస్తుతం మాదిరే తమ బ్యాంక్ ఖాతా నుంచి నిధులను ట్రేడింగ్ అకౌంట్‌కు బదిలీ చేసి కూడా ట్రేడ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఐపీవో దరఖాస్తుకు ఏఎస్‌బీఏ విధానం అమల్లో ఉన్న సంగతి తెలిసిందే.
- ఆఫ్‌షోర్ డెరివేటివ్ ఇన్‌స్ట్రుమెంట్లను (ఓడీఐలు) జారీ చేసే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు (ఎఫ్‌పీఐలు) సంబంధించి పర్యవేక్షణ యంత్రాంగం ఏర్పాటు కానుంది. ఎఫ్‌పీఐలు తమ నుంచి ఓడీఐలను పొందిన వారి వివరాలను సరిగ్గా అందిస్తున్నాయా? అన్నది ఈ యంత్రాంగం పర్యవేక్షించనుంది.

జీపే ద్వారా 'బంగారు' రుణాలు

- ముత్తూట్ ఫైనాన్స్‌తో ఒప్పందం
- ప్రాంతీయ భాషలలో జెమినీ ఏఐ
- గూగుల్ ఇండియా సదస్సులో వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం గూగుల్ తాజాగా పేర్కొంది. దీనిలో భాగంగా మొబైల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ జీపే బంగారు ఆభరణాలపై రుణాలు అందించనున్నట్లు పేర్కొంది. ఇందుకు ముత్తూట్ ఫైనాన్స్‌తో చేతులు కలిపినట్లు వెల్లడించింది. అంతేకాకుండా ఏఐ అసిస్టెంట్ జెమినీ లైవ్‌ను హిందీ భాషలో ప్రారంభించినట్లు తెలియజేసింది. తదుపరి దశలో మరో 8 ప్రాంతీయ భాషలలో జెమినీ సేవలు లభ్యంకానున్నట్లు వెల్లడించింది. గూగుల్ ఫర్ ఇండియా 10వ సదస్సులో ఇంకా పలు విషయాలను తెలియజేసింది. వీటి ప్రకారం దేశవ్యాప్తంగా ప్రజలు చౌక వడ్డీ రేట్లలో గోల్డ్ లోన్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. ఇందుకు రుణగ్రహీతలకు సౌకర్యవంతమైన అవకాశాలను కల్పిస్తోంది. మరో పక్క రుణదాతలకు సెక్యూరిటీని అందిస్తోంది. కాగా.. ప్రపంచ పసిడిలో ఇండియా వాటా 11 శాతమని గూగుల్ ఇండియా ఎండీ రోమ దత్త చోబే తెలియజేశారు.

తెలుగులోనూ..

ఏఐ అసిస్టెంట్ జెమినీ లైవ్ యూజర్లలో 40శాతానికిపైగా వాయిస్ ద్వారానే సేవలను వినియోగించుకుంటున్నట్లు గూగుల్ ఇండియా ప్రాడక్ట్ మేనేజ్‌మెంట్ సీనియర్ డైరెక్టర్ హేమ బూదరాజు పేర్కొన్నారు. ప్రస్తుతం హిందీ భాషలో జెమినీ లైవ్‌ను ఆవిష్కరించినట్లు తెలియజేశారు. రానున్న రోజుల్లో తెలుగుసహా మలయాళం, తమిళ్, బెంగాలీ, కన్నడ, గుజరాతీ, మరాఠీ, ఉర్దూ భాషలలో ఏఐను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. గూగుల్ సెర్చ్‌లో జెన్-ఏఐ ఆధారిత ఏఐ ఓవర్‌వ్యూను ప్రవేశపెట్టనున్నట్లు తెలియజేశారు. ఈ గూగుల్ సెర్చ్‌ను తెలుగు, తమిళ్, బెంగాలీ, మరాఠీ భాషలలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. రానున్న రెండు నెలల్లో దేశీయంగా జెమినీ ఫ్లాష్ 1.5ను ఆవిష్కరించనున్నట్లు గూగుల్ వెల్లడించింది. దీంతో వివిధ సంస్థలు క్లౌడ్, ఏఐ సొల్యూషన్లను భద్రంగా అమలు చేయవచ్చని తెలిపింది. తద్వారా డేటాను భద్రపరచుకోవడంతోపాటు.. దేశవ్యాప్తంగా మెషీన్ లెర్నింగ్ ప్రాసెస్‌కు తెరతీయవచ్చని వివరించింది. 2025లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొంది.





ఈశ్వరన్ భారీ సెంచరీ

- రెస్ట్ ఆఫ్ ఇండియా దీటైన జవాబు
- తొలి ఇన్నింగ్స్‌లో 289/4
- ముంబైతో ఇరానీ కప్

లక్నో: ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ (212 బంతుల్లో 151 బ్యాటింగ్; 12 ఫోర్లు, ఒక సిక్సర్) భారీ సెంచరీతో చెలరేగాడు. ఫలితంగా రంజీ చాంపియన్ ముంబై జట్టుతో జరుగుతున్న ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు దీటుగా బదులిచ్చింది. ఓవర్‌నైట్ స్కోరు 536/9తో మూడోరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై జట్టు ఒక్క పరుగు మాత్రమే జోడించి ఆలౌటైంది. మిడిలార్డర్ ప్లేయర్ సర్ఫరాజ్ ఖాన్ (286 బంతుల్లో 222 నాటౌట్; 25 ఫోర్లు, 4 సిక్సర్లు) అజేయంగా నిలిచాడు. రెస్ట్ ఆఫ్ ఇండియా బౌలర్లలో ముకేశ్ కుమార్ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ ఇండియా గురువారం ఆట ముగిసే సమయానికి 74 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది. అభిమన్యు ఈశ్వరన్ అజేయ శతకంతో ఆకట్టుకోగా... సాయి సుదర్శన్ (32; 4 ఫోర్లు), ఇషాన్ కిషన్ (38; 5 ఫోర్లు), ధ్రువ్ జురెల్ (41 బంతుల్లో 30 బ్యాటింగ్; 4 ఫోర్లు, ఒక సిక్సర్) ఫర్వాలేదనిపించారు. అభిమన్యు ఈశ్వరన్‌కు ఈ సీజన్‌లో ఇది వరుసగా మూడో సెంచరీ కావడం విశేషం. ఇటీవల దులీప్ ట్రోఫీలో రెండు సెంచరీలు కొట్టి అత్యధిక పరుగులు చేసిన జాబితాలో రెండో స్థానంలో నిలిచిన అతను ఇరానీ కప్‌లోనూ అదే జోరు కనబర్చాడు. సహచరుల నుంచి పెద్దగా సహకారం అందకపోయినా విలువైన భాగస్వామ్యాలతో ఇన్నింగ్స్‌ను నడిపించాడు. సాయి సుదర్శన్‌తో రెండో వికెట్‌కు 87 పరుగులు జోడించిన ఈశ్వరన్.. నాలుగో వికెట్‌కు ఇషాన్‌తో కలిసి 70 పరుగులు జత చేశాడు. ఇక ధ్రువ్ జురెల్‌తో అబేధ్యమైన ఐదో వికెట్‌కు 61 పరుగులు జోడించాడు. రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (9) విఫలమయ్యాడు. చేతిలో ఆరు వికెట్లు ఉన్న రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు... ముంబై తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 248 పరుగులు వెనుకబడి ఉంది.

క్వార్టర్స్‌తో సరి...

నాకౌట్ మ్యాచ్‌లో ఇండోనేసియా చేతిలో ఓడిన భారత్


తన్వీ శర్మ

నాన్‌చాంగ్ (చైనా): ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు కథ ముగిసింది. ఇండోనేసియాతో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత జట్టు 92–110 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో ప్రణయ్ షెట్టిగర్ 1–11తో జకీ ఉబైదిల్లా చేతిలో... రెండో మ్యాచ్‌లో అరిగెల భార్గవ్ రామ్–గొబ్బూరు విశ్వతేజ్ 7–11తో డెక్స్‌టర్ ఫారెల్–ప్రసెట్యో చేతిలో... మూడో మ్యాచ్‌లో తన్వీ శర్మ 9–11తో పుస్పితాసారి చేతిలో ఓటమి పాలయ్యారు. నాలుగో మ్యాచ్‌లో శ్రావణి–తారిణి 12–11తో ఇస్యానా–రింజనిలపై గెలిచారు. ఐదో మ్యాచ్‌లో భవ్య ఛాబ్రా–శ్రావణి 13–11తో తాఫిక్ అదెర్యా–క్లారిన్ ములియాలపై నెగ్గారు. ఆరో మ్యాచ్‌లో ప్రణయ్ 10–11తో రిచీ రిచార్డో చేతిలో ఓడిపోయాడు. ఏడో మ్యాచ్‌లో భార్గవ్ రామ్–విశ్వతేజ్ 12–11తో ఫ్రెడీ ప్రసెత్య–పులుంగ్ రమధాన్‌లపై విజయం సాధించారు. ఎనిమిదో మ్యాచ్‌లో తన్వీ శర్మ 10–11తో అమర్త్య ప్రతవి చేతిలో పరాజయం పాలైంది. తొమ్మిదో మ్యాచ్‌లో తారిణి–శ్రావణి 8–11తో ఇస్యానా–రింజని చేతిలో ఓటమి చవిచూశారు. పదో మ్యాచ్‌లో భవ్య–శ్రావణి 10–11తో అరులియస్–వర్ధన చేతిలో ఓడిపోయారు. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో చైనా 110–74తో చైనీస్ తైపీపై, మలేసియా 110–85తో డెన్మార్క్‌పై, జపాన్ 110–88తో అమెరికాపై గెలిచాయి. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ఈ టోర్నీలో ప్రయోగాత్మకంగా రిలే స్కోరింగ్ పద్ధతిని ప్రవేశపెట్టింది. ఇరు జట్ల మధ్య 10 మ్యాచ్‌లు జరుగుతుండగా... తొలుత 110 పాయింట్లు సాధించిన జట్టు విజేతగా నిలుస్తుంది. గ్రూప్ దశలో టర్కీ, పెరూ, అజర్‌బైజాన్, మారిషస్‌లపై విజయం సాధించిన భారత్ గ్రూప్ 'ఇ' టాపర్‌గా నిలిచి క్వార్టర్ ఫైనల్ చేరుకుంది.

మనుష్–మానవ్ జోడీ ఓటమి



బీజింగ్: చైనా స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. బరిలో మిగిలిన పురుషుల డబుల్స్ జోడీ మనుష్ ఉత్పల్‌భాయ్ షా–మానవ్ ఠక్కర్ క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో మానవ్–మనుష్ జంట 5–11, 2–11, 11–8, 7–11తో లియాంగ్ జింగ్‌కున్–వాంగ్ చుకిన్ (చైనా) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. 26 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మానవ్–మనుష్ తమ సర్వీస్‌లో 16 పాయింట్లు గెలిచి, 16 పాయింట్లు కోల్పోయారు. ప్రత్యర్థి జోడీ సర్వీస్‌లో తొమ్మిది పాయింట్లు స్కోరు చేశారు. క్వార్టర్ ఫైనల్లో ఓడిన మానవ్–మనుష్ జోడీకి 3,500 డాలర్ల (రూ. 2 లక్షల 93 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 350 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

భారత్‌కు మరో పతకం

కాంస్యం నెగ్గిన షూటర్ ఖుషి



లిమా (పెరూ): ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో 15వ పతకం చేరింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో భారత షూటర్ ఖుషి కాంస్య పతకం సాధించింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో ఖుషి 447.3 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. క్వాలిఫయింగ్‌లో ఖుషి 585 పాయింట్లు స్కోరు చేసి ఏడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత్ 10 స్వర్ణాలు, ఒక రజతం, నాలుగు కాంస్యాలు సాధించి 15 పతకాలతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది.

రామ్‌కుమార్ పరాజయం



షాంఘై మాస్టర్స్ సిరీస్ టోర్నీ

చెన్నై: షాంఘై ఓపెన్ మాస్టర్స్ సిరీస్ ఏటీపీ–1000 టెన్నిస్ టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారుడు రామ్‌కుమార్ రామనాథన్ సంచలన ప్రదర్శన ముగిసింది. చైనాలో జరుగుతున్న ఈ టోర్నీలో ప్రపంచ 335వ ర్యాంకర్ రామ్‌కుమార్‌కు చివరి నిమిషంలో క్వాలిఫయింగ్ టోర్నీలో పాల్గొనే అవకాశం దక్కింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న రామ్‌కుమార్ రెండు క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో తనకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న ఆటగాళ్లను ఓడించి మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. అయితే మెయిన్ 'డ్రా'లో మాత్రం రామ్‌కుమార్ తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్ మ్యాచ్‌లో రామ్‌కుమార్ 1–6, 6–7 (3/7)తో ప్రపంచ 58వ ర్యాంక్ అలెగ్జాండర్ షెవ్‌చెంకో (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. 72 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్‌కుమార్ 8 ఏస్‌లు సంధించి, 8 డబుల్ ఫాల్ట్‌లు చేయడం గమనార్హం. 20 విన్నర్స్ కొట్టిన రామ్... నెట్ వద్దకు 29 సార్లు దూసుకొచ్చి 14 సార్లు పాయింట్లు గెలిచాడు. 37 అనవసర తప్పిదాలు చేసిన ఈ చెన్నై ప్లేయర్ తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసేందుకు నాలుగుసార్లు అవకాశం వచ్చినా రామ్ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. రామ్‌కుమార్‌కు 23,250 డాలర్ల (రూ. 19 లక్షల 52 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 30 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 2017లో రామ్‌కుమార్ ఏకైకసారి సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్ టోర్నీలో మెయిన్ 'డ్రా'కు అర్హత పొంది రెండో రౌండ్‌లో ఓడిపోయాడు. ఆ తర్వాత రామ్ ఎనిమిదిసార్లు మాస్టర్స్ టోర్నీలో పోటీపడ్డా క్వాలిఫయింగ్‌ను దాటలేకపోయాడు.

9 మంది విండీస్ క్రికెటర్లకు రెండేళ్ల కాంట్రాక్టు


షమర్ జోసెఫ్

సెయింట్ జాన్స్ (అంటిగ్వా): సాధారణంగా ఏ క్రికెట్ బోర్డు అయినా తమ ప్లేయర్లకు ఏడాది కాంట్రాక్టే ఇస్తుంది. ప్రపంచంలోనే అత్యంత ధనవంతమైన బోర్డు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కూడా ఏడాదికే సెంట్రల్ కాంట్రాక్టు ఇస్తుంది. ఆ ఏడాదికి సంబంధించిన ఆటతీరును బట్టి తదుపరి ఏడాది గ్రేడ్‌ను నిర్ణయించి కాంట్రాక్టు ఖరారు చేసింది. కానీ దీనికి భిన్నంగా క్రికెట్ చరిత్రలో కొత్త ఒరవడికి వెస్టిండీస్ క్రికెట్ బోర్డు శ్రీకారం చుట్టింది. గత సీజన్‌లో కనబరిచిన అసాధారణ ప్రదర్శన ఆధారంగా తొమ్మిది మంది క్రికెటర్లకు రెండేళ్ల కాంట్రాక్టును ఇచ్చింది. ఇందులో ఆరుగురు పురుషులు కాగా, ముగ్గురు మహిళా క్రికెటర్లు ఉన్నారు. క్రికెట్ వెస్టిండీస్ (సీడబ్ల్యూఐ) 15 మంది చొప్పున మహిళా, పురుషుల క్రికెటర్లకు వార్షిక కాంట్రాక్టులు కట్టబెట్టింది. అదనపు కాంట్రాక్టు పొందిన వారిలో పురుషుల జట్టు వైస్ కెప్టెన్ అల్జారీ జోసెఫ్, పేస్ సంచలనం షమర్ జోసెఫ్, హిట్టర్లు షై హోప్, బ్రాండన్ కింగ్, గుడకేశ్ మోతీ, సిలెస్ ఉండగా... మహిళల జట్టుకు సంబంధించి కెప్టెన్ హేలీ మాథ్యూస్, వైస్ కెప్టెన్ షెమైన్ క్యాంప్‌బెల్, స్టెఫానీ టేలర్ ఉన్నారు. 15 మందిలో ఎంపికైన మిగతా వారికి ఎప్పట్లాగే ఏడాది కాంట్రాక్టు లభించింది.

మెరిసిన రికెల్టన్, స్టబ్స్

తొలి వన్డేలో ఐర్లాండ్‌పై 139 పరుగులతో గెలిచిన దక్షిణాఫ్రికా


రికెల్టన్

అబుదాబి: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన దక్షిణాఫ్రికా జట్టు ఐర్లాండ్‌తో జరిగిన తొలి వన్డేలో 139 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 271 పరుగులు చేసింది. ఓపెనర్ రియాన్ రికెల్టన్ (102 బంతుల్లో 91; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (86 బంతుల్లో 79; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్ 50 పరుగులిచ్చి 4 వికెట్లు, క్రెయిగ్ యంగ్ 45 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టారు. 272 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ తడబడి 31.5 ఓవర్లలో 132 పరుగులకే ఆలౌటైంది. జార్జి డాక్‌రెల్ (21; 2 ఫోర్లు), ఆండీ బాల్‌బిర్నీ (20; 2 ఫోర్లు, 1 సిక్స్), కుర్టిస్ కాంఫర్ (20; 2 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో నిలదొక్కుకుంటున్న దశలో అవుటయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో లిజాడ్ విలియమ్స్ (4/32), ఇన్‌గిడి (2/35), ఫోర్టూన్ (2/28) రాణించారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా రెండో వన్డే నేడు జరుగుతుంది.

అల్పైన్ ఎస్‌జీ పైపర్స్ జట్టు శుభారంభం

లండన్: గ్లోబల్ చెస్ లీగ్ అల్పైన్ ఎస్‌జీ పైపర్స్ జట్టు శుభారంభం చేసింది. గురువారం మొదలైన ఈ లీగ్‌లో గ్యాంజెస్ గ్రాండ్ మాస్టర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అల్పైన్ ఎస్‌పీ పైపర్స్ జట్టు 11–6 పాయింట్ల తేడాతో గెలిచింది. విశ్వనాథన్ ఆనంద్ (గ్యాంజెస్), మాగ్నస్ కార్ల్‌సన్ (అల్పైన్) మధ్య జరిగిన గేమ్ 48 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. ప్రపంచ మూడో ర్యాంకర్ అర్జున్ (గ్యాంజెస్)తో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద (అల్పైన్) 74 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. రిచర్డ్ రాపోర్ట్ (అల్పైన్) 108 ఎత్తుల్లో పర్హామ్ (గ్యాంజెస్)పై, హు ఇఫాన్ (అల్పైన్) 31 ఎత్తుల్లో వైశాలి (గ్యాంజెస్)పై గెలిచారు. నుర్గుల్ (గ్యాంజెస్) 49 ఎత్తుల్లో లాగ్నో (అల్పైన్)పై విజయం సాధించగా... డానియల్ (అల్పైన్), వొలోదర్ (గ్యాంజెస్) మధ్య జరిగిన గేమ్ 35 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. ఇతర మ్యాచ్‌ల్లో పీబీజీ అలాస్కాన్ నైట్స్ 15–3తో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్‌పై, అమెరికన్ గ్యాంబిట్స్ 11–6తో అప్‌గ్రేడ్ ముంబా మాస్టర్స్‌పై నెగ్గాయి.


ఇరిగేశి అర్జున్‌తో ప్రజ్ఞానంద గేమ్

ఐఓఏలో వైరం... ఎస్‌జీఎం చక్కదిద్దేనా?

25న ఏర్పాటు చేసిన ఐఓఏ చీఫ్ పీటీ ఉష


పీటీ ఉష

న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ)లోని సహచరులతో ఏర్పడిన వైరంతో ఇబ్బంది పడుతున్న ఐఓసీ అధ్యక్షురాలు పీటీ ఉష ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎం)ను ఏర్పాటు చేసింది. ఈ నెల 25న జరగబోయే ఈ మీటింగ్‌లో సమస్యలు, విబేధాలు, ఇతరత్రా అంశాలపై చర్చిద్దామని ఆమె పేర్కొంది. 'వివాదానికి దారి తీసిన అంశాలు, అసాధారణ సమస్యలు... ఇలా అన్నింటిపై చర్చించేందుకు ఎస్‌జీఎం నిర్వహించాలని నిర్ణయించాను. ఈ నెల 25న ఆఫీస్ బేరర్లు, స్టేక్ హోల్డర్లంతా హాజరు కావాలని కోరుతున్నాను. ఈ ఎస్‌జీఎం హైబ్రిడ్ మీటింగ్. అంటే నియమావళిలోని ఆర్టికల్ 8.3 ప్రకారం ఎవరైనా సభ్యులు ప్రత్యక్షంగా హాజరు కాలేని పరిస్థితి ఉంటే ఆన్‌లైన్ మీటింగ్ ద్వారా కూడా పాల్గొనవచ్చు. దీనికి సంబంధించిన లింక్ ఐఓఏ వెబ్‌సైట్‌లో ఉంటుంది' అని ఉష ఐఓఏ సభ్యులకు ఈ–మెయిల్ పంపారు. ముఖ్యంగా ఒలింపిక్ సంఘానికి సీఈఓగా రఘురామ్ అయ్యర్‌ను నియమించడాన్ని ఎగ్జిక్యూటివ్ (ఈసీ) సభ్యులు ఏమాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు. తాము ఎంతగా వ్యతిరేకించినా ఆయనకు పదవిని కట్టబెట్టడంపై ఈసీ సభ్యులంతా గుర్రుగా ఉన్నారు. కోశాధికారి సహదేవ్ యాదవ్‌పై వచ్చిన తీవ్రమైన అవినీతి ఆరోపణలు కూడా చర్చనీయాంశమైంది. ఈ లుకలుకలతో ఐఓఏ గత కొంతకాలంగా వార్తల్లో నిలుస్తోంది. మరోవైపు ఐఓఏను ఒక ప్రొఫెషనల్ దృక్పథంలో నడిపించేందుకు సీఈఓ అవసరం ఎంతో ఉందని ఉష వాదిస్తోంది. అయ్యర్‌కు సీఈఓ పదవేమీ పూర్తిగా కొత్తేం కాదు. ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీలతో పాటు ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ లీగ్, అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ)లకు సీఈఓ పనిచేసిన విశేషానుభవం రఘురామ్ అయ్యర్ సొంతం. ఐఓఏ నిర్వహించే ఎస్‌జీఎంలో స్పోర్ట్స్ కోడ్‌పై కూడా చర్చ జరిగే అవకాశముంది. గరిష్ఠ వయోపరిమితిపై ప్రధానంగా చర్చిస్తారు.

ఫ్రాంచైజీ లీగ్‌లలో ఆడేందుకు...

సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి వైదొలిగిన దక్షిణాఫ్రికా స్పిన్నర్ షమ్సీ



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా లెఫ్టార్మ్ స్పిన్నర్ తబ్రేజ్ షమ్సీ ఆ దేశ సెంట్రల్ కాంట్రాక్టు నుంచి తప్పుకున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా ఫ్రాంచైజీ లీగ్‌లలో పాల్గొనేందుకు మరింత వెసులుబాటు కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు షమ్సీ వెల్లడించాడు. అయినా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో జాతీయ జట్టు ఎంపికకు అందుబాటులో ఉంటానని షమ్సీ పేర్కొన్నాడు. 'అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకునేందుకు సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా. దీంతో కుటుంబ సభ్యులతో మరింత సమయం గడిపే అవకాశం లభిస్తుంది. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడంలో ఇది ఎలాంటి ప్రభావం చూపదనుకుంటున్నా. దక్షిణాఫ్రికా తరఫున బరిలోకి దిగేందుకు సదా సిద్ధంగా ఉంటా. దక్షిణాఫ్రికా ప్రపంచకప్ విజేతగా నిలవాలని ఎప్పటి నుంచో కలలు కంటున్నా. దేశానికి ప్రాతినిధ్యం వహించడం కన్నా ముఖ్యమైంది మరొకటి లేదు' అని షమ్సీ తెలిపాడు. దక్షిణాఫ్రికా తరఫున 2 టెస్టులు, 51 వన్డేలు, 70 టి20లు ఆడిన షమ్సీ మూడు ఫార్మాట్లలో కలిపి 167 వికెట్లు పడగొట్టాడు.

మళ్లీ 'రింగ్'లోకి దిగాలనుంది

మహిళా దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ వ్యాఖ్య

ముంబై: బాక్సింగ్ క్రీడకు తాను ఇంకా రిటైర్మెంటే ప్రకటించలేదని... మళ్లీ ప్రొఫెషనల్ బాక్సింగ్ సర్క్యూట్‌లోకి దిగాలనే ఆలోచన ఉందని భారత మేటి బాక్సర్ మేరీకోమ్ తెలిపింది. 'పోటీల్లో పాల్గొనాలనుకుంటున్నాను. పునరాగమనంపై నా అవకాశాల కోసం చూస్తున్నా. ఇంకో నాలుగేళ్లు ఆడే సత్తా నాలో వుంది. నా ప్రపంచం బాక్సింగే. అందుకే అందులో ఎంత ఆడినా, పతకాలు, ప్రపంచ చాంపియన్‌షిప్‌లెన్ని గెలిచినా ఇంకా కెరీర్‌ను కొనసాగించాలనే ఆశతో ఉన్నాను' అని మాజీ రాజ్యసభ ఎంపీ అయిన మేరీకోమ్ తెలిపింది. పారిస్‌లో భారత బాక్సర్ల వైఫల్యం... దరిమిలా తన అభిప్రాయాలను కేంద్ర క్రీడాశాఖ, భారత బాక్సింగ్ సమాఖ్యతో వివరించాలనుకుంటున్నట్లు చెప్పింది. ప్రపంచ చాంపియన్, తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, రియో పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ పారిస్‌లో పతకాలు గెలుపొందలేకపోయారు. ఇక టోర్నీల సమయంలో బరువు నియంత్రణ, నిర్వహణ బాధ్యత పూర్తిగా క్రీడాకారులదేనని మేరీకోమ్ స్పష్టం చేసింది. ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో రెజ్లర్ వినేశ్ ఫొగాట్ వంద గ్రాముల అధిక బరువుతో పసిడి వేటలో అనర్హతకు గురైంది. ఈ నేపథ్యంలో 42 ఏళ్ల మేరీ ఆమె పేరును ప్రస్తావించకుండా 'బరువు' బాధ్యత గురించి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. 'ఈ విషయంలో నేనెంతగానో నిరాశకు గురయ్యాను. నేను కూడా ఇలాంటి సమస్యల్ని కొన్నేళ్ల పాటు ఎదుర్కొన్నాను. అతి బరువు నుంచి మనమే జాగ్రత్త వహించాలి. ఇది మన బాధ్యతే! ఇందులో నేను ఎవరినీ నిందించాలనుకోను. వినేశ్ కేసుపై నేను వ్యాఖ్యానించడం లేదు. నా కెరీర్‌లో ఎదురైన చేదు అనుభవాల గురించి మాత్రమే మాట్లాడుతున్నా. బరువును నియంత్రించుకోకపోతే బరిలోకి దిగడం కుదరదు. పతకం లక్ష్యమైనపుడు మన బాధ్యత మనకెపుడు గుర్తుండాలిగా' అని వివరించింది.


మేరీకోమ్

అగ్రరాజ్యాధిపతి ఎవరవుతారు?

అమెరికా అధ్యక్ష ఎన్నికలకు మరో నెల రోజులే

- రోజురోజుకూ పెరుగుతున్న ఉత్కంఠ
- నేషనల్ పోలింగ్ సగటులో ట్రంప్ కంటే కమలా హారిస్ ముందంజ
- ఏడు స్వింగ్ రాష్ట్రాల్లో ప్రజాదరణలో ఇరువురి మధ్య 2 శాతం లోపు వ్యత్యాసం



అమెరికా అధ్యక్ష ఎన్నికల విషయంలో ఉత్కంఠ నానాటికీ పెరిగిపోతోంది. ఎన్నికలకు మరో నెల రోజుల సమయమే మిగిలి ఉంది. నవంబర్ 5న జరిగే ఎన్నికలపై ప్రపంచ దేశాలన్నీ అమితాసక్తి చూపుతున్నాయి. కాబోయే అగ్రరాజ్యాధిపతి ఎవరు? అనే ప్రశ్న అందరి మదిని తొలచి వేస్తోంది. రకరకాల సర్వేలు, అంచనాలు ఊహాగానాలు వెలువడుతున్నాయి. అమెరికాకు మొట్టమొదటి మహిళా అధ్యక్షురాలు వస్తారా? లేక డొనాల్డ్ ట్రంప్ మరోసారి రాజ్యమేలుతారా? అనే ప్రశ్నకు సమాధానం రావాలంటే మరికొన్నాళ్లు వేచి చూడాల్సిందే. ఇప్పుడున్న పరిణామాలను బట్టి చూస్తే అధ్యక్ష రేసులో రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ కంటే డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి, భారతీయ అమెరికన్ కమలా హారిస్ ముందంజలో ఉన్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ఏడాది జూలై నెలాఖరులో కమలా హారిస్ డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా తెరపైకి వచ్చారు. పోటీ నుంచి జో బైడెన్ తప్పుకోవడంతో హారిస్‌కు మార్గం సుగమమైంది. జూలై నెలాఖరు నుంచి ఇప్పటిదాకా వివిధ ముఖ్యమైన సర్వేల్లో నేషనల్ పోలింగ్ సగటును పరిగణనలోకి తీసుకుంటే ట్రంప్ కంటే హారిస్‌కు విజయావకాశాలు అధికంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. కమలా హారిస్‌కు 49 శాతం, ట్రంప్‌నకు 46 శాతం ప్రజాదరణ కనిపిస్తోంది. ఇరువురు నేతల మధ్య వ్యత్యాసం స్వల్పంగానే ఉంది. మరో నెల రోజుల్లో ప్రజాభిప్రాయంలో మార్పు వచ్చే అవకాశం లేకపోలేదు.

- సాక్షి, నేషనల్ డెస్క్

- ట్రంప్, హారిస్ మధ్య సెప్టెంబర్ 10న కీలకమైన డిబేట్ జరిగింది. ఈ డిబేట్‌లో ట్రంప్‌పై హారిస్ పైచేయి సాధించారు. ఆ రోజు ఆమె ప్రజాదరణ 2.5 పర్సంటేజీ పాయింట్లు పెరగా, మరో వారం తర్వాత .3 3 పాయింట్లు పెరిగింది. ట్రంప్ పట్ల ప్రజాదరణ గణనీయంగా తగ్గిపోయింది.
- ఎన్నికల్లో ఎవరెక్కువ ఎలక్టోరల్ ఓట్లు సాధిస్తే వారిదే విజయం. అమెరికాలో మొత్తం 50 రాష్ట్రాలున్నాయి. ఒక్కో రాష్ట్రంలోని జనాభాను బట్టి ఆ రాష్ట్రానికి ఎలక్టోరల్ ఓట్లు కేటాయించారు.
- మొత్తం ఎలక్టోరల్ ఓట్లు 538. విజయానికి కావాల్సింది 270.
- దేశంలో 50 రాష్ట్రాలు ఉన్నప్పటికీ అభ్యర్థుల గెలుపోటములను నిర్దేశించేవి మాత్రం కొన్నే ఉన్నాయి. వీటినే స్వింగ్ స్టేట్స్ అంటున్నారు. ఇక్కడ ఎవరు పాగా వేస్తే వారిదే అధికారం.
- మొత్తం 7 స్వింగ్ స్టేట్స్ ఉన్నాయి. అవి నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, నెవడా, జార్జియా, అరిజోనా, విస్కాన్సిన్, మిషిగాన్.
- ఇందులో నార్త్ కరోలినా, జార్జియా, అరిజోనాలో ట్రంప్ వైపు మొగ్గ కనిపిస్తోంది. మిగిలిన రాష్ట్రాల్లో కమలా హారిస్‌కు జనం జేజేలు పలుకున్నారు.
- ఇద్దరి మధ్య ఈ ఏడు రాష్ట్రాల్లో హోరాహోరీ పోటీ తథ్యమని చెప్పక తప్పదు.
- స్వింగ్ రాష్ట్రాల్లో ఇరువురు నేతల నడుమ ప్రజాదరణలో వ్యత్యాసం 2 శాతం లోపే ఉండడంగమనార్హం. ఈ స్వల్ప వ్యత్యాసం నెల రోజుల్లో తారుమారు కావడం పెద్ద విశేషం కాదు.
- అందుకే ఎన్నికల్లో ఎవరు గెలుస్తారన్నది ఎన్నికల పరిశీలకులు కచ్చితంగా అంచనా వేయలేకపోతున్నారు.
- మిషిగాన్, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్ రాష్ట్రాల్లో డెమొక్రటిక్ పార్టీకి గట్టి పట్టుంది. కానీ, 2016లో అక్కడి ప్రజలు ట్రంప్ వైపు మొగ్గు చూపడంతో ఆయన సునాయాసంగా గెలిచారు.
- 2020లో మిషిగాన్, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్‌లో డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్‌కు ఆదరణ లభించింది. ఈసారి కూడా ఈ మూడు రాష్ట్రాల్లో డెమొక్రటిక్ అభ్యర్థి అయిన కమలా హారిస్ పట్ల ఆదరణ కనిపిస్తోంది.

కోర్టు నుంచి భార్యను ఎత్తుకెళ్లిన భర్త

చైనాలో వింత ఘటన

విడాకులివ్వడం ఇష్టం లేని ఓ వ్యక్తి.. భార్యను ఎత్తుకొని కోర్టు నుంచి పారిపోయే ప్రయత్నం చేశాడు. ఈ విచిత్ర ఘటన చైనాలో జరిగింది. లీకి, చెన్‌కి 20 ఏళ్ల కిందట పెళ్లయ్యింది. వారికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. అయితే తాగొచ్చిన భార్యను లీ హింసిస్తున్నాడు. ఎంత చెప్పినా వినకపోవడం, భర్తలో ఎంతకీ మార్పు రాకపోవడంతో విడాకుల కోసం భార్య చెన్ కోర్టును ఆశ్రయించారు. గృహ హింస కింద కేసు పెట్టిన ఆమె విడాకులు ఇవ్వాలని కోర్టును కోరింది. అయితే పిల్లల పోషణ బాధ్యతల దృష్ట్యా సయోధ్య సాధ్యమని భావించిన కోర్టు తొలుత విడాకులకు నిరాకరించింది. అయినా భర్త మారకపోవడంతో చెన్ మళ్లీ కోర్టును ఆశ్రయించారు. విచారణకు వచ్చిన భార్యను ఎత్తుకుని కోర్టు హాల్ నుంచి లీ పారిపోయాడు. కోర్టు న్యాయాధికారులు వెంటనే జోక్యం చేసుకుని లీని మందలించారు. దీంతో లీ సెప్టెంబర్ రెండో తేదీన కోర్టుకు లిఖితపూర్వకంగా క్షమాపణలు చెప్పాడు. మళ్లీ అలాంటి తప్పు చేయబోనని ప్రతిజ్ఞ చేశాడు. 'విడాకులు ఇస్తున్నారని పొరపడ్డా. అందుకే ఆందోళనకు గురై భార్యను ఎత్తుకెళ్లా''అని క్షమాపణ పత్రంలో రాశారు. ఎక్కడ దూరమైపోతుందోనని భర్త పడ్డ ఆవేదన చూసి భార్య మనసు కాస్తంత కరిగింది. ఇకనైనా మారతాడేమో చూద్దామని ఆయనకు మరో అవకాశం వచ్చింది. దీంతో ఈ జంటకు విడాకులు మంజూరుకాలేదు. మరోవైపు చైనాలో గృహ హింస పెద్ద సమస్యగా ఉంది. ఆల్-చైనా ఉమెన్స్ ఫెడరేషన్ ప్రకారం వివాహిత మహిళల్లో 30 శాతం గృహ హింసను ఎదుర్కొంటున్నారు. 60శాతం మంది మహిళల ఆత్మహత్యలకు గృహ హింసే కారణం. 'జడ్జీలు, పోలీసుల ముందే కోర్టు నుంచి ఎత్తుకెళ్లిన వ్యక్తి.. ఒంటరిగా ఉన్నపుడు భార్యను ఎంతైనా హింసిస్తాడు'అని కొందరు ఆందోళన వ్యక్తం చేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

మారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించలేం

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: మారిటల్ రేప్ (భార్య సమ్మతి లేకుండా భర్త ఆమెతో బలవంతంగా సంభోగం జరపడం)ను నేరంగా పరిగణించలేమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. భార్యతో లైంగిక చర్యలను శిక్షార్హం చేస్తే.. దాంపత్య జీవితంపై తీవ్ర ప్రభావం పడుతుందని, వైవాహిక వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుందని పేర్కొంది. మారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించాలని సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపడతామని సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేసింది. మారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించాలనే వాదనను వ్యతిరేకించింది. భార్య అభీష్టానికి వ్యతిరేకంగా ఆమెతో సంభోగం జరిపినా.. అది నేరం కాదని భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 63.. 2వ మినహాయింపు (ఐపీసీ సెక్షన్ 375, రెండవ మినహాయింపు) చెబుతోంది. భార్య మైనర్ కాకుంటే అది నేరంగా కాదని పేర్కొంటోంది. మారిటల్ రేప్ అనేది న్యాయపరమైన అంశం కంటే ఎక్కువగా సాంఘిక సమస్యని కేంద్రం పేర్కొంది. ఈ అంశంలో ఏదైనా నిర్ణయానికి వచ్చే ముందు భాగస్వాములందరితో విస్తృత సంప్రదింపులు జరపాల్సి ఉంటుందని తెలిపింది. సమాజంలో, కుటుంబ వ్యవస్థలో నిరంతరంగా, వేగంగా చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో మారిటల్ రేప్ దుర్వినియోగం అయ్యే అవకాశాలను కొట్టివేయలేమని పేర్కొంది. భార్య సమ్మతి ఉందా, లేదా అనేది రుజువు చేయడం కష్టమని, సవాళ్లతో కూడుకున్నదని వివరించింది.



ఉన్నత విద్యా సంస్థలకు నిధుల కేటాయింపుల్లో కోత పెట్టాలని అర్జెంటీనా ప్రభుత్వం నిర్ణయించుకుంది. ప్రభుత్వ వైఖరిని తప్పబడుతూ బుధవారం రాజధాని బ్యునస్ ఎయిర్స్‌లో భారీ ప్రదర్శన చేపట్టారు. ఇందులో పాల్గొన్న ఓ నిరసనకారుడు 'నో టూ ది యూనివర్సిటీ కట్స్' అని రాసి ఉన్న భారీ కత్తెర కటౌట్‌ను ప్రదర్శించారు.

22 ఏళ్ల తర్వాత కుటుంబం చెంతకు

నాలుగేళ్ల వయసులో తప్పిపోయిన బాలుడు రెండు దశాబ్దాల తర్వాత కుటుంబం చెంతకు చేరాడు. అసలున్నాడో లేడో తెలియని కొడుకు మళ్లీ ఇంటికి రావడంతో ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేవు. అద్భుతంలా అనిపిస్తున్న ఈ ఘటన ఉత్తరప్రదేశ్ జరిగింది. బబ్లూ అనే యువకుడు ఢిల్లీలోని షెల్టర్ హోమ్‌లో ఉంటూ 'ప్రయాస్‌బాల్ గృహ'లో పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్నాడు. 2024 మార్చిలో పిల్లలకు కౌన్సిలింగ్ ఇచ్చేందుకు పోలీసు అధికారులు ఆ గృహానికి వచ్చారు. ఈ సమయంలో ఆ యువకుడు పోలీసుల వద్దకు వచ్చి ''నేనూ ఇలాగే చిన్నప్పుడు తప్పిపోయా. నన్నూ కుటుంబంతో కలపండి. మా నాన్న పేరు సుఖ్‌దేవ్. తల్లి పేరు అంగూరిదేవి. ఊరు ధనౌరా. అది ఏ రాష్ట్రంలో ఉందో నాకు గుర్తు లేదు''అని వేడుకున్నాడు. వెంటనే అధికారులు ఆగ్రా గవర్నమెంట్ రైల్వే (జీఆర్పీ) పోలీసులకు సమాచారం అందించారు. ఈ వివరాలను తెలుసుకున్న జీఆర్పీ దర్యాప్తు ప్రారంభించింది. గ్రామాలు, జిల్లాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ఉత్తరప్రదేశ్ పోలీసులు చేపట్టిన కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం సి-ప్లాన్ యాప్, గూగుల్ మ్యాప్స్ సహాయం తీసుకున్నారు. వాటి సాయంతో బిజ్నోర్, బాగ్‌పట్, బులంద్‌షహర్‌లలో 'ధనౌరా'అనే పేరుతో పలు గ్రామాలున్నాయని గుర్తించారు. బబ్లూను లోతుగా విచారించగా తాను రైలులో ఢిల్లీకి చేరుకున్నానని చెప్పాడు. పలు దఫాల విచారణ అనంతరం 'చోళ'రైల్వే స్టేషన్ సమీపంలో ఊరే బబ్లూ సొంతూరు అని పోలీసులు తేల్చారు. పోలీసులు అక్కడి బృందానికి సమాచారం ఇవ్వడంతో బబ్లూ ఫోటోను గ్రామంలో సర్క్యులేట్ చేశారు. గ్రామానికి చెందిన సుఖ్‌దేవ్ శర్మ అనే వ్యక్తి తన కుమారుడు చాలా ఏళ్ల క్రితం కనిపించకుండా పోయాడని, ఇప్పటివరకు ఆచూకీ లభించలేదని పోలీసులకు ఫోన్ చేశాడు. పోలీసులు సుఖ్‌దేవ్ శర్మను సంప్రదించి అతని కుటుంబంలోని ఇతర సభ్యుల గురించి అడిగారు. సుఖ్‌దేవ్ చెప్పిన కుటుంబ సభ్యుల పేర్లు బబ్లూ చెప్పిన పేర్లతో సరిపోలాయి. ధ్రువీకరణ అనంతరం పోలీసులు బబ్లూను ఇంటికి చేర్చారు. 22 ఏళ్ల తర్వాత బబ్లూ ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. ఇరుగుపొరుగు వారు సైతం కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబసభ్యుడిని కుటుంబంతో తిరిగి కలిపిన జీఆర్పీ బృందానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ''కొన్నేళ్లపాటు వెతికి వెతికి ఆశలు వదులుకున్నాం. మా బాబు తిరిగి రావడం అద్భుతంలా అనిపిస్తోంది''అని బబ్లూ తల్లి అంగూరీ దేవి ఆనందం వ్యక్తంచేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

అవినీతే కాంగ్రెస్ గ్యారంటీ

ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా



న్యూఢిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న గ్యారంటీలపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ గ్యారంటీలు అవినీతి, బంధుప్రీతి, కులపిచ్చి, మతపిచ్చి మాత్రమేనని ఎద్దేవా చేశారు. హరియాణలో ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో ఆయన గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాంగ్రెస్ విభజన రాజకీయాలు, ప్రతికూల రాజకీయాలను దేశభక్తులైన హరియాణా ప్రజలు అంగీకరించబోరని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ అంటే రాజకీయ నేతలు, అల్లుడి మధ్య సిండికేట్ అని ధ్వజమెత్తారు. హరియాణాలో 2004 నుంచి 2014 దాకా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి భూపీందర్‌సింగ్ హుడాతో సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా చేతులు కలిపి, అవినీతికి పాల్పడినట్లు మోదీ పరోక్షంగా గుర్తుచేశారు. హరియాణాలో కాంగ్రెస్ ఏనాడూ స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదని ఆక్షేపించారు. ఢిల్లీ, హరియాణాలో ఉండే రెండు కుటుంబాలు రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేశాయని ఆరోపించారు. సోనియా గాంధీ, భూపీందర్ సింగ్ హుడా కుటుంబాలపై విమర్శలు గుప్పించారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్వాకాలు చూస్తూనే ఉన్నామని, హరియాణాలో కాంగ్రెస్ సర్కారు అక్కర్లేదని తేల్చిచెప్పారు. దళితులకు, అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు తొలగిస్తామని కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలని హరియాణా ప్రజలకు పిలుపునిచ్చారు. గత పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను చూసి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు.

హరియాణాలో ప్రచారం పరిసమాప్తం

చండీగఢ్: హరియాణాలో శాసనసభ ఎన్నికల ప్రచారం గురువారం సాయంత్రం ముగిసింది. ప్రచార మైకులు మూగబోయాయి. ఈ నెల 5న జరిగే ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. 2 కోట్ల మందికిపైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోబుతున్నారు. వీరిలో 8,821 మంది వందేళ్ల వయసు దాటినవారు ఉండడం విశేషం. రాష్ట్రంలో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 20,629 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, ఐఎన్ఎల్, బీఎస్పీ, జేజేపీ, ఆజాద్ సమాజ్ తదితర పార్టీలు తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. మొత్తం 1,031 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో 101 మంది మహిళలు ఉన్నారు. ఈ నెల 5న పోలింగ్, 8న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. 2019 ఎన్నికల్లో బీజేపీ 40 స్థానాలు, కాంగ్రెస్ 31 స్థానాలు గెలుచుకున్నాయి. ఇతర పార్టీలతోపాటు స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

బీజేపీని గద్దె దించండి!

హరియాణా ఎన్నికల సభల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్



నూహ్/మహేంద్రగఢ్: మతం, భాష, కులం ప్రాతిపదికన దేశంలో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్న బీజేపీని గద్దె దించాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన హరియాణాలో పలు ఎన్నికల సభలో ప్రసంగించారు. గతేడాది నూహ్‌లో వీహెచ్‌పీ చేపట్టిన ఊరేగింపుపై జరిగిన దాడి అనంతరం ఘర్షణల్లో మత బోధకుడు, ఇద్దరు హోంగార్డులు సహా ఆరుగురు చనిపోయారని ఆయన చెప్పారు. 'ప్రస్తుతం ప్రేమ, విద్వేషం మధ్య పోరాటం జరుగుతోంది. బీజేపీ విద్వేషాన్ని వ్యాప్తి చేస్తుండగా, కాంగ్రెస్ ప్రేమను పంచుతోంది. సోదరభావం మనకు కావాలి. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు ఎక్కడికెళ్లినా విద్వేషాలను నూరిపోస్తున్నాయి. విద్వేషం అంతమవ్వాలి. మన దేశంలో విద్వేషానికి చోటు లేదు'అని రాహుల్ స్పష్టం చేశారు. సోదరభావం, ప్రేమతోనే దేశం ముందుకు వెళ్తుంది. కానీ, బీజేపీ దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. 'పేదలు, రైతులు, కార్మికుల హక్కులకు రక్ష మన రాజ్యాంగం. మీడియాను భయపెడుతూ రాజ్యాంగంపైనే బీజేపీ దాడి చేస్తోంది'అంటూ ఆయన రాజ్యాంగం ప్రతిని చూపారు. 'రాజ్యాంగమే లేకుంటే పేదలకు భూమి, ధనం, నీళ్లు వంటివేమీ ఉండవు. ఇవన్నీ కొద్ది మంది చేతుల్లోకి వెళ్లిపోతాయి'అని హెచ్చరించారు. 'అభివృద్ధిని గురించి ప్రధాని మోదీ మాట్లాడుతున్నారు. నిరుద్యోగంలో దేశంలోనే టాప్‌లో ఉన్న హరియాణాలో అభివృద్ధి ఎలా సాధ్యం'అని ప్రశ్నించారు. 20-25 మంది పారిశ్రామికవేత్తల రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన మోదీ ప్రభుత్వం.. ఎంతమంది రైతులు, కార్మికులు, పేదల రుణాలను రద్దు చేసిందని నిలదీశారు.

నల్లజాతి మహిళలను చంపి పందుల దొడ్లో వేసి..

దక్షిణాఫ్రికా వ్యవసాయ క్షేత్రంలో శ్వేత జాతీయుల క్రూరత్వం

జోహన్నెస్‌బర్గ్: ఆహారం కోసం వ్యవసాయ క్షేత్రానికి వచ్చిన ఇద్దరు మహిళలను చంపి అక్కడి పెంపుడు పందుల దొడ్లో వేశారు ఇద్దరు శ్వేతజాతీయులు. పందులు వదిలేసిన శరీరభాగాలను పాతిపెట్టారు. ఈ ఘటన దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్ సమీపంలోని లింపోపో ప్రావిన్స్‌లో జరిగింది. దీంతో ఎంతోకాలంగా శ్వేతజాతీయులు, నల్లజాతి వారి మధ్య కొనసాగుతున్న భూ యాజమాన్య ఉద్రిక్తతలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఆగస్టు నెల మధ్యలో డెయిరీ కంపెనీకి చెందిన ఓ ట్రక్కు కాలం చెల్లిన (ఎక్స్‌పైర్డ్) పదార్థాలను అక్కడ పడేసింది. ఆహారం తీసుకోవడానికి ఇద్దరు మహిళలు 44 ఏళ్ల మరియా మకాథో, 35 ఏళ్ల లొకాడియా ఎండ్లోవూ అక్కడి వెళ్లారు. మక్గా భర్త సైతం తోడు వచ్చారు. శ్వేతజాతీయులైన పొలం యజమాని జకారియా జోహన్నెస్ ఒలీవియర్, ఫామ్ సూపర్‌వైజర్ 19 ఏళ్ల ఆండ్రియన్ రుడాల్ఫ్ డి వెట్ ఈ ఇద్దరు మహిళలను కాల్చి చంపారు. కాల్పుల్లో మకాథో భర్త గాయాలతో తప్పించుకున్నాడు. చంపాక వారి మృతదేహాలను మొదట పందుల దొడ్లో వేశారు. ఆ తర్వాత నల్లజాతి కార్మికుడు విలియం ముసోరా సహకారంతో పొలంలో పాతిపెట్టారు. మకాథో భర్త ఇచ్చిన సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు మొదలెట్టారు. సగం కుళ్లిపోయిన మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. పొలం యజమాని, ఇద్దరు పనివాళ్లను అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ జరుగుతుండగా కోర్టు బయట నల్లజాతీయులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. దశాబ్దాల కాలంలో చాలా మంది నల్లజాతీయుల భూములను శ్వేతజాతీయులు లాక్కున్న ఉదంతాలు ఎన్నో వెలుగుచూశాయి. ఇప్పటికీ అనేక ప్రధాన వాణిజ్య పొలాలు శ్వేతజాతీయుల యాజమాన్యంలోనే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని అనేక మంది నల్లజాతి దక్షిణాఫ్రికా ప్రజలు పేదరికంలో నివసిస్తున్నారు. పొలాల్లో ఆహారం కోసం ఇలా వెళ్లి శ్వేతజాతీయుల దాడి బారిన పడుతున్నారు.

ఈషా ఫౌండేషన్‌పై దర్యాప్తు నిలిపేయండి

తమిళనాడు పోలీసులకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: ఇద్దరు మహిళలను నిర్బంధించినట్లు నమోదైన కేసులో తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన ఈషా ఫౌండేషన్ ఆశ్రమానికి భారీ ఊరట లభించింది. ఈ కేసులో దర్యాప్తు నిలిపివేయాలని తమిళనాడు పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈషా ఫౌండేషన్‌పై తదుపరి చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. మద్రాసు హైకోర్టులో విచారణలో ఉన్న హెబియస్ కార్పస్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తమకే బదిలీ చేసుకుంది. ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ నిర్వహిస్తున్న ఈషా యోగా కేంద్రంలో నిర్బంధంలో ఉన్న తన ఇద్దరు కుమార్తెలు గీత, లతకు విముక్తి కల్పించాలని కోరుతూ మాజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.కామరాజ్ మద్రాసు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన మద్రాసు హైకోర్టు ఈషా ఫౌండేషన్ వ్యవహారాలపై దర్యాప్తు జరపాలని పోలీసులను ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ ఫౌండేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

ఢిల్లీలో డాక్టర్ దారుణ హత్య

పథకం ప్రకారం చంపిన టీనేజర్లు

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఓ డాక్టర్ దారుణ హత్యకు గురయ్యారు. గాయపడిన కాలి బొటనవేలికి డ్రెస్సింగ్ చేయించుకోవాలనే వంకతో వచ్చిన యువకులు అనంతరం డాక్టర్‌ను కాల్చి చంపారు. జైత్‌పూర్‌లో ఓ ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌కు బుధవారం అర్ధరాత్రి దాటాక ఇద్దరు టీనేజర్లు వచ్చారు. కాలి బొటనవేలుకు డ్రెస్సింగ్ మార్చాలని వారిలో ఒకరు సిబ్బందిని కోరారు. ముందురోజు రాత్రి ఆ యువకుడికి అదే ఆస్పత్రిలో చికిత్స అందించారు. డ్రెస్సింగ్ పూర్తయిన తర్వాత యువకులు ప్రిస్క్రిప్షన్ కావాలని చెప్పి యునానీ వైద్యుడు డాక్టర్ 52 ఏళ్ల జావెద్ అఖ్తర్ గదిలోకి వెళ్లారు. తర్వాత డాక్టర్‌ను తలపై షూట్‌చేసి చంపారు. తుపాకీ శబ్దం విన్న నర్సింగ్ సిబ్బంది గజాలా పర్వీన్, మహ్మద్ కమిల్ పరుగున డాక్టర్ గదిలోకి పరుగెత్తారు. అక్కడ రక్తమోడుతున్న డాక్టర్ పడిఉన్నారు. దీంతో సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న ఢిల్లీ పోలీసుల ఫోరెన్సిక్ బృందం అక్కడి ఆధారాలను స్వాధీనం చేసుకుంది. పథకం ప్రకారం ఈ హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. రెక్కీ కోసం హత్యకు ముందు రోజు దుండగులు ఆస్పత్రికి వచ్చి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

బిహార్ మాజీ మంత్రి హత్య కేసు.. మాజీ ఎమ్మెల్యే సహా ఇద్దరికి జీవిత ఖైదు

న్యూఢిల్లీ: 1998 నాటి బిహార్ మాజీ మంత్రి బ్రిజ్ బిహారీ ప్రసాద్ హత్య కేసులో మాజీ ఎమ్మెల్యే వినయ్ కుమార్ శుక్లా అలియాస్ మున్నా శుక్లా సహా ఇద్దరికి సుప్రీంకోర్టు జీవిత ఖైదు విధించింది. గురువారం ఈ కేసును విచారించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం.. నిందితులందరినీ విడుదల చేయాలని, దోషులైన మంటు తివారీ, మాజీ ఎమ్మెల్యే శుక్లాలను 15 రోజుల్లోగా లొంగిపోవాలంటూ పట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పును పాక్షికంగా పక్కనబెట్టింది. మంటూ తివారీ, మున్నాలపై హత్య, హత్యాయత్నం ఆరోపణలకు తగు ఆధారాలు న్నాయన్న ధర్మాసనం..వీరిద్దరినీ 15 రోజుల్లోగా లొంగిపోవాలంటూ ఆదేశించింది. అదే సమయంలో, మాజీ ఎంపీ సూరజ్‌భాన్ సింగ్ సహా ఆరుగురిని సంశయ లాభం(బెనిఫిట్ ఆఫ్ డౌట్)కింద విడుదల చేస్తూ పట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది.

ఆరేళ్ల బాలికలపై స్కూలు వ్యాను డ్రైవర్ పైశాచికం

పుణె: ఆరేళ్ల వయస్సున్న ఇద్దరు చిన్నారులపై స్కూలు వ్యాను డ్రైవర్(45) అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ దారుణం మహారాష్ట్రలోని పుణెలోని వన్‌వాడీ ప్రాంతంలో చోటుచేసుకుంది. సెప్టెంబర్ 30వ తేదీన బాధిత బాలికలు స్కూలు నుంచి ఇళ్లకు వస్తున్న సమయంలో డ్రైవర్ వ్యానులోనే వారిపై దారుణానికి ఒడిగట్టాడు. బాధిత చిన్నారి ఒకరు తల్లికి ఈ విషయం తెలపడంతో, ఆమె వన్‌వాడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బుధవారం సజయ్ రెడ్డి అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. స్కూలు వ్యానులో మహిళా సహాయకురాలు ఉన్నారా అని పోలీసులు ఆరా తీస్తున్నారు. గతంలోనూ ఇతడు బాలికలపై అత్యాచారానికి పాల్పడ్డాడా అనే కోణంలోనూ దర్యాప్తు చేపట్టామని డీసీపీ ఎస్.రాజా తెలిపారు. ఇటీవల థానె జిల్లా బద్లాపూర్‌లోని ఓ స్కూల్‌లో స్వీపర్ నాలుగేళ్ల చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడటం, నిందితుడు అక్షయ్ షిండే ఎదురుకాల్పుల్లో ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే.

ఆప్ ఎంపీ బంగ్లాలోకి కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం అధికారిక నివాసాన్ని ఖాళీ చేసి ల్యూటెన్స్‌లోని ఫిరోజ్‌షా రోడ్, నంబర్ 5 బంగ్లాలోకి మారనున్నారు. ఇది ఆప్ రాజ్యసభ ఎంపీ అశోక్ మిట్టల్ (పంజాబ్)కు కేటాయించిన నివాసం. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రధాన కార్యాలయానికి సమీపంలో కేజ్రీవాల్ కొత్త నివాసం ఉంది. ఉత్తర ఢిల్లీలోని సివిల్‌లైన్స్‌లో ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్, నంబర్-6లో ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్ 2015 నుంచి నివసించారు. సీఎంగా రాజీనామా చేయడంతో అధికారిక నివాసాన్ని ఖాళీ చేస్తున్నారు. ఫిరోజ్‌షా రోడ్‌లోని నివాసం కేజ్రీవాల్ అసెంబ్లీ నియోజకవర్గం న్యూఢిల్లీ పరిధిలోకి వస్తుంది. ఆప్ జాతీయ కన్వీనర్ అయిన కేజ్రీవాల్ కొత్త నివాసం నుంచే పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా కూడా రాజేంద్రప్రసాద్ రోడ్‌లోని నివాసానికి మారారు. ఇది ఆప్ రాజ్యసభ ఎంపీ, మాజీ క్రికెటర్ హర్భజన్‌సింగ్‌కు కేటాయించిన గృహం.

కాంగోలో పడవ మునక.. 78 మంది జల సమాధి

గొమా: కాంగోలో పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న పడవ మునిగి 78 మంది ప్రాణాలు కోల్పోయారు. సౌత్ కివు ప్రావిన్సులోని మినోవ నుంచి గొమాకు వెళ్తూ ప్రమాదానికి గురైంది. మొత్తం 78 మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు గురువారం తెలిపారు. మరో 10 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. పడవ సామర్థ్యం 30 మంది మాత్రమే కాగా, ప్రమాదం సమయంలో 100 మంది ఉన్నట్లు సమాచారం.

మాయమైన కృష్ణుడి విగ్రహం దొరికింది

- పది రోజుల్లోనే తిరిగి ఇచ్చేసిన దొంగ
- ఆలయ పెద్దను క్షమాపణ కోరుతూ లేఖ

ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో ఓ ఆలయంలో చోరీకి గురైన వందేళ్ల నాటి అష్టధాతు విగ్రహం పది రోజుల తర్వాత మళ్లీ దొరికింది. రాధా కృష్ణుల విగ్రహాన్ని ఎత్తుకుపోయిన దొంగ ఓ క్షమాపణ లేఖ కూడా రాశాడు. విగ్రహాన్ని ఇంటికి తీసుకెళ్లాక పీడకలలతో కంటికి నిద్ర కరువైందని, తన కుమారుడి ఆరోగ్యం క్షీణించిందని అందులో గోడు వెళ్లబోసుకున్నాడు. విగ్రహాన్ని ఎత్తుకెళ్లడం తప్పేనంటూ ఒప్పుకున్నాడు. క్షమించాలంటూ ఆశ్రమ పెద్ద అయిన స్వామి జైరాం మహారాజ్‌ను వేడుకున్నాడు. గో ఘాట్ కలశ ఆశ్రమంలోని జానకీ రాముని ఆలయంలో రాధా కృష్ణుని విగ్రహం సెప్టెంబర్ 23న చోరీకి గురైంది. విగ్రహం కనిపించకపోవడంతో ఆ ఆలయ పూజారి నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఫిర్యాదు అందడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం స్థానిక జాతీయ రహదారి పక్కన గో ఘాట్ లింకు రోడ్డులో గోనె సంచీ స్థానికుల కంటబడింది. అందులో రాధా కృష్ణుల విగ్రహం ఉంది. దానిని వారు గో ఘాట్ ఆశ్రమం స్వామీజీకి అందజేశారు.

సాక్షి ప్లస్
శుక్రవారం। 4-10-2024

కాకతి రాజ్య భార ధౌరేయుడు... రేచర్ల రుద్రారెడ్డి

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ హిస్టరీ

కాకతీయుల సామంతులు

రేచర్ల రెడ్డి వంశం (1051-1289)

ఈ వంశీయులు కాకతీయుల వద్ద సేనాపతులుగా, సామంతులుగా, మంత్రులుగా పనిచేశారు. ఈ వంశంలోని ఒక శాఖ నల్గొండ జిల్లాలోని ఆమనగల్లు, పిల్లలమర్రి, మిర్యాలగూడ, నాగులపాడు, సోమవరం, తాలువాయి, బూరుగుగడ్డ, సిరికొండ, చిలుకూరు ప్రాంతాలను పాలించింది. మరో శాఖ వరంగల్ జిల్లాలోని ఎలకుర్తి, ములుగు, నర్సంపేట, మాచాపూర్‌తో పాటు కరీంనగర్ జిల్లాలో హుజూరాబాద్ తాలూకాలోని ప్రాంతాలను పరిపాలించింది. ఈ ప్రాంతాల్లో వీరు 30 శాసనాలు వేయించారు. 15 దేవాలయాలు నిర్మించారు. విద్యాపీఠాలు, మఠాలు నెలకొల్పారు. ఆమనగల్లు, పిల్లలమర్రి, ఉంద్రుకొండ, ఉర్లుగొండ, ఎలకుర్తి దుర్గాలను నిర్మించారు. రామప్ప చెరువు, నామసముద్రం మొదలైన 22 చెరువులు, కాలువలను తవ్వించారు.



రేచర్ల రెడ్డి వంశీయులు, రేచర్ల పద్మనాయకులు, చెరకు రెడ్డి వంశీయులు, కాయస్థులు, మల్యాల, విరియాల, బాణ వంశీయులు, కందూరి చోడులు, నతవాడి, వెన్గొండ వంశీయులు, పొలవాస పాలకులు, నాగ వంశీయులు, యాదవ రాజులు, వైదుంబులు, వావిలాల, త్యాగి, కోట, ఇందులూరి, గోన వంశీయులు కాకతీయ సామంత మాండలికుల్లో ముఖ్యులు. వీరిలో తెలంగాణ భూభాగంతో సంబంధం ఉన్నవారి గురించి తెలుసుకుందాం.

రేచర్ల బమ్మసేనాని

రేచర్ల రెడ్డి వంశీయులు కాకతీయ సామ్రాజ్య సంరక్షణ భారం వహించి, కాకతీయుల శత్రువులకు సింహస్వప్నంగా మారారు. అనేక యుద్ధాల్లో విజయం సాధించిన రేచర్ల రెడ్డి వంశీయులు కాకతీయ రాజుల అభిమానాన్ని చూరగొన్నారు. రేచర్ల రెడ్డి వంశ మూల పురుషుడు రేచర్ల బమ్మ(బ్రహ్మ) సేనాని. ఇతడినే బమ్మిరెడ్డి(1035-1055) అని పిలుస్తారు. ఇతడు కాకతీయ మొదటి (గరుడ) బేతరాజు వద్ద సేనాధిపతిగా పనిచేసి కాంచీపుర చోళులను జయించాడు. పాలంపేట, పిల్లలమర్రి, చిట్యాలంపాడు, మాచాపూర్ శాసనాలు ఇతడి గురించి తెలుపుతున్నాయి. బమ్మిరెడ్డి తర్వాత అతడి కుమారుడు లేదా మనువడి భావిస్తున్న ముచ్చ సేనాని మొదటి ప్రోలరాజు(1052-1076) వద్ద చమూపతిగా పనిచేశాడు. ముచ్చసేనాని కూడా కాకతీయ రాజ్య విస్తరణలో తోడ్పడ్డాడు. వేములవాడ చాళుక్య రాజైన భద్రగుణ్ని ఓడించి ఆ రాజ్యాన్ని ఆక్రమించడంలో ఇతడు ముఖ్య భూమిక పోషించాడు. ఇతడి కొడుకు ఒకటో కాట సేనాని రెండో బేతరాజు(1076-1108) వద్ద సేనానిగా పనిచేశాడు. కాట సేనాని కుమారుడైన కామ చమూపతి రెండో ప్రోలరాజు(1116-1157)కు చమూపతి అయ్యాడు.

తొలి రాజు రెండో కాట చమూపతి

కాకతీయులు, కందూరి చోడులు, పొలవాస రాజులు, గోవింద దండ నాయకులు తెలంగాణలో కళ్యాణి చాళుక్య సామంతులుగా పనిచేశారు. అనంతర కాలంలో కాకతీయుల విజృంభణను సహించని ఈ ఇతర సామంతులను ఓడించి లొంగదీసుకోవడంలో రెండో ప్రోలరాజుకు కామ చమూపతి సహాయం చేశాడు. పొలవాస రాజైన గుండన(మంథెన)ను సంహరించడం ముఖ్య సంఘటనగా చెప్పవచ్చు. ఇతడికి రెండో కాట చమూపతి, పిల్లలమర్రి బేతిరెడ్డి, నామిరెడ్డి అనే ముగ్గురు కుమారులు, వల్లసాని అనే కుమార్తె ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడైన రెండో కాట చమూపతి రుద్రదేవుడి దండనాయకుడు అయ్యాడు. రుద్రదేవుడు సింహాసనం అధిష్ఠించే నాటికి కాలచురి బిజ్జలుని ప్రోత్సాహంతో.. పొలవాస మేడరాజు, నగునూరు(కరీంనగర్ జిల్లా) దొమ్మరాజు కాకతీయ రాజ్యం మీద దండెత్తారు. రుద్రదేవుడు వీరిని ఓడించాడు. ఈ యుద్ధాల్లో తోడ్పడిన రెండో కాట చమూపతికి మహాసామంతాధిపత్యం ఇచ్చి ఎలకుర్తి రాజధానిగా నర్సంపేట, మాచాపూర్, ములుగు ప్రాంతాలను పరిపాలించేందుకు నియమించాడు. ఈ విధంగా రేచర్ల రెడ్డి వంశంలో రెండో కాట చమూపతి మొదటి రాజయ్యాడు.

ఇతడి రెండో తమ్ముడు బేతిరెడ్డి రుద్రదేవుడి సేనాని అయ్యాడు. ఈ లోగా తెలంగాణలో కాకతీయ ప్రత్యర్థులైన కందూరు చోడులు (ఉదయన చోడుడు, భీమ గోకర్ణులు) రాజ్య విస్తరణకు ప్రయత్నించారు. రుద్రదేవుడు వీరిని ఓడించి సామంతులుగా చేసుకున్నాడు. ఈ యుద్ధాల్లో తోడ్పడిన బేతిరెడ్డిని ఆమనగంటి రాజ్యానికి సామంతుడిగా నియమించాడు. ఆమనగల్లు, పిల్లలమర్రి, నాగులపాడు, మిర్యాలగూడ, సోమవరం ప్రాంతాలు ఇతడి రాజ్యంలో ఉన్నాయి. బేతిరెడ్డి పిల్లలమర్రి పట్టణాన్ని నిర్మించి రాజధానిని అక్కడికి మార్చాడు. రుద్రదేవుడు తెలంగాణ ప్రాంత విజయాల తర్వాత తీరాంధ్ర మీద దండెత్తాడు. ఈ యుద్ధాల్లో బేతిరెడ్డి తమ్ముడు నామిరెడ్డి, రెండో కాట చమూపతి కుమారుడైన రెండో ముచ్చ సేనాని తోడ్పడ్డారు. రుద్రదేవుడి మరణానంతరం బేతిరెడ్డి ఆమనగంటి రాజ్యాన్ని నామిరెడ్డికి అప్పగించాడు. ఆ విధంగా వీరిద్దరూ ఒకరి తర్వాత మరొకరు ఆమనగంటి పురవరేశ్వర, శౌర్య సొపర్ణ మొదలైన బిరుదులు ధరించారు. దీన్ని బట్టి వీళ్ల ఒకరి తర్వాత మరొకరు ఆమనగల్లును పాలించినట్లు తెలుస్తోంది. బేతిరెడ్డి భార్య ఎర్రక్క సాని, నామిరెడ్డి పిల్లలమర్రిలో ఎరకేశ్వర, కాచేశ్వర, కామేశ్వర, నామేశ్వర దేవాలయాలను కట్టించారు.

రేచర్ల రుద్రారెడ్డి

రెండో కాటసేనాని(కాట చమూపతి) రెండో కుమారుడైన రుద్ర సేనాని(రుద్రారెడ్డి) రేచర్ల రెడ్డి వంశంలో సుప్రసిద్ధుడు. ఇతడు రుద్రదేవుడి కాలంలో సేనాపతిగా చేరాడు. ఇతడి వంశం గురించి గోలకొండ పత్రికలో ఆసక్తికర చర్చ జరిగింది. కంభపాటి అప్పన్న శాస్త్రి ఇతడిని రేచర్ల రెడ్డి వంశీయుడిగా పేర్కొనగా, రుద్ర సేనాని వెలమ వీరుడని శేషాద్రి రమణ కవులు(మారుపేరుతో కూడా) తెలిపారు. రుద్ర సేనాని మంత్రి అయిన రాజెనాయకుడి ద్రాక్షారామ శాసనంలోని 'గుణినఃశ్రీ రుద్ర రెడ్డి ప్రభో' అనే భాగం, సోమవరం, ఉప్పరపల్లి శాసనాలు రుద్ర సేనాని రేచర్ల రెడ్డి వంశీయుడే అని తెలుపుతున్నాయి.

దేవగిరి యాదవ రాజులతో చేసిన యుద్ధంలో రుద్రదేవుడు(1195) మరణానంతరం, మహాదేవుడి కాలంలో, యాదవులతో జరిగిన యుద్ధంలో మహాదేవుడు మరణించి గణపతి దేవుడు యాదవ రాజుల బందీగా ఉన్న సమయంలో... ఈ మూడు సందర్భాల్లో కాకతీయ రాజ్యంలో సంక్షోభం తలెత్తింది. ముదిగొండ చాళుక్యులు, వెలనాటి చోళ పృథ్వీశ్వరుడు, కులోత్తుంగ చోళుడు కాకతీయ రాజ్య భూభాగాలను ఆక్రమించారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రేచర్ల రుద్రారెడ్డి వీరిని ఓడించి, ఆంతరంగిక శత్రువులను అణచివేశాడు. కాకతీయ సింహాసనాన్ని గణపతి దేవుడికి అప్పగించి 'కాకతి రాజ్య భార ధౌరేయు'డిగా 'కాకతి రాజ్య సమర్థుడు'గా పేరొందాడు. గణపతి దేవుడి(1199-1259) కాలంలో ప్రధాని అయ్యాడు. రుద్రారెడ్డి కుమారులైన లోక సేనాని, పెద్ద గణపతి, నాలుగో కాటసేనాని; మనుమలు గణపతి, వసాయిత చమూనాథ; మునిమనుమడు వీరవసాయితలు కాకతీయ సేవకులుగా ఎలకుర్తి ప్రాంతాన్ని పాలించారు. బేతిరెడ్డి రెండో కుమారుడు లోకిరెడ్డి నల్గొండ జిల్లా నిడమనూరు మండలంలోని ఊట్కూరు ప్రాంతాన్ని పాలించాడు.

రుద్రమదేవికి బాసటగా..

నామిరెడ్డి కుమారులైన కాట్రెడ్డి, నామిరెడ్డి మేనల్లుడైన చెవిరెడ్డి(బేతాళ రెడ్డి, బేతాళ నాయకుడు), గణపతిదేవుడి వద్ద సేనానులుగా పనిచేశారు. ఆ సమయంలో ఆమనగంటి లేదా పిల్లలమర్రి రాజ్యాన్ని నామిరెడ్డి కుమారులే పరిపాలించారు. గణపతిదేవుడి మరణం తర్వాత చెవిరెడ్డి కుమారులైన ప్రసాదిత్య, రుద్రనాయుడు రుద్రమదేవికి బాసటగా నిలిచారు. నామిరెడ్డి మనుమలు.. గణిపిరెడ్డి, మల్రెడ్డి (కామిరెడ్డి కుమారులు), నామయ, కామయ, మల్లయ (కాట్రెడ్డి కుమారులు) వేయించిన నాగులపాటి శాసనాల్లో వీరికి ఎలాంటి బిరుదులు ఉన్నట్లు తెలపలేదు. దీన్నిబట్టి వీరికి రాజ్యం లేదని భావించవచ్చు. ఆ తర్వాత రేచర్ల రెడ్డి వంశం ప్రశస్తిలోకి రాలేదు. చెవిరెడ్డి వంశీయులే వైష్ణవ మతం స్వీకరించి సంస్కరణ మార్గంలో పయనించి వెలమలై రేచర్ల పద్మనాయకులు అయ్యారని భావించవచ్చు. ఈ తెగకు చెందిన వారే వెంకటగిరి సంస్థానాధిపతులని, ఇతర ప్రాంతాల పాలకులని తెలుస్తోంది. ఈ కాలంలో పిల్లలమర్రి పినవీరన పూర్వీకులైన హరిహరార్యుడు, ఇవటూరి సోమన, మంచి రాజకవి, ప్రదిక్షణం మహాదేవ మంచి, సోమదేవ మంత్రి మొదలైన కవి పండితులు ఉండేవారు. ఈ కాలం నాటి పిల్లలమర్రి దేవాలయంలోని చిత్రాలు అజంతా తర్వాత ప్రాచీనమైనవి.

మాదిరి ప్రశ్నలు

1. కాకతీయుల ప్రభుత్వ సేవకులు కానివారు?
   1) పురోహితుడు 2) కరణం
   3) రెడ్డి 4) తలారి
2. చెరకురెడ్ల వంశ మూలపురుషుడు?
   1) బమ్మిరెడ్డి 2) బొల్లయ్యరెడ్డి
   3) కేతసేనాని 4) కాటసేనాని
3. కాటసేనానికి చెరకు అనే గ్రామంతోపాటు 12 గ్రామాలిచ్చిన కాకతీయ రాజు?
   1) మొదటి బేతరాజు 2) రెండో బేతరాజు
   3) గణపతిదేవుడు 4) రుద్రదేవుడు
4. చెరకురెడ్లకు 'జమ్మలూరు' రాజ్యమిచ్చి సామంతుడిగా చేసుకున్న కాకతీయ రాజు?
   1) మొదటి బేతరాజు 2) రెండో బేతరాజు
   3) గణపతిదేవుడు 4) రుద్రదేవుడు
5. చెరకురెడ్లు అనుసరించిన మతం?
   1) శైవం 2) వైష్ణవం
   3) జైనం 4) బౌద్ధం
6. జమ్మలూరులో కేతేశ్వర, కోటేశ్వర, మారేశ్వర, సూర్యదేవర ఆలయాలను నిర్మించింది?
   1) కాటసేనాని 2) కేతసేనాని
   3) బొల్లయ్యరెడ్డి 4) బమ్మిరెడ్డి
7. ఏ వంశంవారు దుర్జయ కులస్థులు?
   1) నాగ 2) మల్యాల
   3) చెరకురెడ్లు 4) విరియాల
8. దన్నసేనాని ఏ వంశ మూలపురుషుడు?
   1) యాదవ 2) నాగ
   3) గోన 4) మల్యాల
9. 'సమ్మక్క' ఎవరి కుమార్తె?
   1) మేడరాజు 2) గోవిందరాజు
   3) పగిడిద్దరాజు 4) యుగంధరుడు
10. గోన గన్నారెడ్డి సోదరి అయిన 'కుప్పాంబిక'ను ఎవరు వివాహం చేసుకున్నారు?
    1) చౌడసేనాని 2) బాచసేనాని
    3) గుండదండాధీశుడు 4) దన్నసేనాని
11. మొదటి 'బూదపూర' శాసనాన్ని వేయించింది ఎవరు?
    1) గోన గన్నారెడ్డి 2) కామసాని
    3) మైలమ 4) గుండదండాధీశుడు
12. రెండో బూదపూర శాసన కాలం?
    1) క్రీ.శ.1274 2) క్రీ.శ.1272
    3) క్రీ.శ.1276 4) క్రీ.శ.1280
13. విరియాల వంశ ఆద్యుడు?
    1) దన్నసేనాని 2) ఎర్రనరేంద్రుడు
    3) ఎర్ర భూపతి 4) పోరంటి వెన్న
14. కాకతీయుల కాలంలో పన్నులు వసూలు చేసి ప్రభుత్వానికి అందజేసే బాధ్యులు?
    1) తలారి 2) కరణం
    3) రెడ్డి 4) పురోహితుడు
15. నాలుగో గుండరాజు సోదరి అయిన 'కామసాని'ని ఎవరు వివాహం చేసుకున్నారు?
    1) ఎర్రనరేంద్రుడు 2) పోరంటి వెన్న
    3) ఎర్రభూపతి 4) దన్నసేనాని
16. కాకతీయ రాజ్యాన్ని నిలబెట్టిన వంశంగా ప్రసిద్ధిపొందిన వంశం?
    1) మల్యాల 2) విరియాల
    3) గోన 4) చెరకురెడ్లు
17. కామసాని రెండో తైలపుడిని ఒప్పించి హనుమకొండ రాజ్యాన్ని ఎవరికి ఇప్పించింది?
    1) మొదటి బేతరాజు 2) రెండో బేతరాజు
    3) మొదటి ప్రోలరాజు 4) రెండో ప్రోలరాజు
18. 'దేవగిరి' రాజధానిగా పరిపాలించింది ఎవరు?
    1) గోన వంశం 2) హొయసాలులు
    3) నతవాడి రాజులు 4) యాదవ రాజులు
19. యుద్ధాల్లో రుద్రదేవుడికి సహకరించిన యాదవ రాజు?
    1) ఒకటో సారంగధరుడు
    2) రెండో సారంగధరుడు
    3) మాధవ దేవుడు 4) సింగళదేవుడు
20. పానగల్లు శాసనాన్ని వేయించింది?
    1) రెండో సారంగధరుడు 2) మాధవదేవుడు
    3) ఒకటో సారంగధరుడు
    4) సింగళదేవుడు

సమాధానాలు

1) 1; 2) 4; 3) 2; 4) 4; 5) 1; 6) 3; 7) 2; 8) 4; 9) 1; 10) 3; 11) 4; 12) 3; 13) 4; 14) 3; 15) 1; 16) 2; 17) 1; 18) 4; 19) 1; 20) 1.

పరస్పర సంబంధాలున్న సత్యాల నుంచి ఏర్పడేది?



టెట్/డీఎస్సీ
జీవశాస్త్రం - బోధనా పద్ధతులు

విజ్ఞానశాస్త్ర స్వభావం - పరిధి

ఆదిమానవుడి కాలం నుంచి విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి చెందింది.ఆదిమానవుడు తన ప్రాథమిక అవసరాలైన, ఆకలి, ఆచ్ఛాదన ఆవాసం కోసం పరిశీలించడం ద్వారా కొత్త విషయాలు కనుగొన్నాడు. కాబట్టి ఆదిమానవుడే మొదటి శాస్త్రవేత్త.

- ప్రకృతి వనరుల వినియోగానికి పరిశీలన, ఆలోచన అవసరమైనవి.
- 'సైన్స్' అనే పదం 'సైన్షియా' లేదా 'సిరే' అనే లాటిన్ పదాల నుంచి ఉద్భవించింది. ఈ మాటలకు అర్థం 'జ్ఞానం'. ప్రాచీన భారతీయ పదమైన 'వేద'కు కూడా అర్థం 'జ్ఞానం'.

విజ్ఞాన శాస్త్రం అంటే?

- ప్రయోగాలకు పరిశీలనకు పరిమితమై తరగతి గదిలో బోధించే జ్ఞానం.
- క్రమబద్ధమైన, వ్యవస్థీకరించిన జ్ఞానం
- వ్యవస్థీకృతమైన లోకజ్ఞత(Common Sense)
- విజ్ఞాన శాస్త్రంలో ప్రక్రియలు, ఫలితాలు - యథార్థాలు, సంభావ్యతలు ఉంటాయి.
- విజ్ఞాన శాస్త్రం పరిశీలించదగిన దృగ్విషయాలపై ఆధారపడి, సత్య నిరూపణ రజువులతో కూడింది. జ్ఞానేంద్రియాల ద్వారా నమ్మకాన్ని ఏర్పరుస్తుంది.

నిర్వచనాలు:

సైన్స్ మ్యాన్‌పవర్ ప్రాజెక్ట్: జ్ఞాన శాస్త్రమంటే సంచిత, అంతులేని అనుభవాత్మక పరిశీలనల సమ్మేళనం.

జేమ్స్. బి. కొనాంట్: ప్రయోగాలు పరిశీలనల నుంచి వృద్ధి చెంది,ప్రయోగాత్మక పరీక్షలు, పరిశీలనలకు మధ్య ఫలితాలనిస్తూ- పరస్పర సంబంధాలు ఉన్న భావనలు, భావన పథకాల శ్రేణులే విజ్ఞాన శాస్త్రం.

స్తబ్ద దృష్టితో ఆలోచిస్తే: సంబంధాలు ఉన్న సూత్రాలు, సిద్ధాంతాలు, నియమాలు సమాచారం ఉన్న విభాగం.

గతిశీల దృష్టితో ఆలోచిస్తే: విజ్ఞాన శాస్త్రమంటే క్రియాత్మకత. ప్రక్రియలు పద్ధతులు, ప్రయోగాలు, అన్వేషణలు, పరిశోధనలు ఉంటాయి.

AAAS (అమెరికన్ అసోసియేషన్ ఫర్ ద అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్): నిరంతర పరిశీలన, ప్రయోగం, అన్వయం, నిరూపణల ద్వారా మన గురించి, ఈ విశ్వం గురించి అవగాహన పెంచుకుని, సరిదిద్దుకునే ప్రక్రియే విజ్ఞానశాస్త్రం.

ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ: భౌతిక ప్రపంచాన్ని, ప్రకృతి నియమాలను, సమాజాన్ని పరిశీలించి, సత్యాలను పరీక్షించడం ద్వారా వ్యవస్థీకరించిన జ్ఞానం.

కార్ల్‌పియర్ సన్:
విజ్ఞాన శాస్త్ర అన్వేషణకు భౌతిక విశ్వమంతా ముడిపదార్థమే

అర్హీనియస్: విజ్ఞాన శాస్త్రమంటే మాపనం.

ఐన్‌స్టీన్: మనం ఎలా ఉండాలో నేర్పే జ్ఞానరాశి.

క్లాడీబెర్నార్డ్: కళ అంటే నేను, శాస్త్రమంటే మనం.

జేమ్స్‌రాండీ: పరీక్షల ద్వారా లభించిన, ఆధారాలతో సాధించిన జ్ఞానాన్ని మళ్లీ లభించిన తదుపరి సాక్ష్యాలతో మార్పులు తెచ్చి మరింత మెరుగుపర్చే విధానమే శాస్త్రం.


హెన్రీ పాయింకర్: ఇల్లు ఏ విధంగా సిమెంట్, ఇసుక, రాళ్లతో నిర్మితమవుతుందో విజ్ఞానశాస్త్రం సత్యాలతో నిర్మితమవుతుంది.

వెబ్‌స్టర్ డిక్షనరీ: నిగమన పద్ధతిలో ప్రయోగం, పరీక్షించడం ద్వారా ఏర్పడే జ్ఞానం.

ఎ.డబ్ల్యు. గ్రీన్: విజ్ఞాన శాస్త్రమంటే ఒక పరిశోధనా విధానం.

విజ్ఞాన శాస్త్ర నిర్మాణం:

హెన్రీ పాయింకర్, ఆర్.సి. శర్మ నిర్మాణంలో ఉన్న భవనంతో విజ్ఞాన శాస్త్రాన్ని పోల్చారు.



పునాది: సూత్రాలు, సాధారణీకరణలు
నిలువు స్తంభాలు: సిద్ధాంతాలు
అడ్డు స్తంభాలు: పద్ధతులు, ప్రక్రియలు
రాళ్లు, ఇటుకలు, సిమెంట్, ఇసుక: సత్యాలు, భావనలు

ష్యాబ్, ఫినిక్స్: విజ్ఞాన శాస్త్రాన్ని రెండు భాగాలుగా విభజించారు.

1. సంశ్లేషాత్మక నిర్మాణం (ప్రక్రియ)	2. ద్రవ్యాత్మక నిర్మాణం (ఫలితం)
అన్వేషణలు	యదార్థాలు(సత్యాలు)
పరిశీలనలు	భావనలు
ప్రక్రియలు	సిద్ధాంతాలు
పద్ధతులు	నియమాలు
వైఖరులు	సాధారణీకరణలు
ప్రయోగాలు	సూత్రాలు

ద్రవ్యాత్మక నిర్మాణంలో అంశాల వివరణ

1. **యథార్థం (సత్యం):** ప్రత్యక్షంగా పరిశీలించేది. ఎక్కడైనా ప్రదర్శించేది. జ్ఞానేంద్రియాల ద్వారా తెలుసుకునేది.
   ఉదా: ఆకులు పచ్చగా ఉంటాయి. వేర్లు భూమ్యాకర్షణకు అనుకూలంగా పెరుగుతాయి.
2. **భావన:** పరస్పర సంబంధాలున్న సత్యాల నుంచి ఏర్పడేది.
   ఉదా: మొక్కలు జీవితాంతం పెరుగుతాయి.
   జీవులు ఒకదానిపై ఒకటి ఆధారపడి పరిసరాలపై కూడా ఆధారపడతాయి. భావనలు వయసును, వ్యక్తులను బట్టి మారుతుంటాయి.
3. **సిద్ధాంతం:** నిరూపితమవకపోయినా బలమైన సాక్ష్యాధారాలున్న పరిస్థితులను వివరించడానికి ఒక ప్రతిపాదన.
   ఉదా: జీవ పరిణామ సిద్ధాంతం, భూకేంద్రక సిద్ధాంతం, కణ సిద్ధాంతం
4. **నియమం:** సప్రమాణత ఉండి విస్తారంగా పరీక్షించి, నిరూపించిన సిద్ధాంతం.
   ఉదా: బహిర్గత నియమం,బాయిల్ నియమం.
5. **సాధారణీకరణం:** పరస్పర సంబంధం కలిగిన యథార్థాల్లో ఉన్న సామాన్య లక్షణాన్ని తెలపడం.
   ఉదా: మల్లెపూలు రాత్రివేళ వికసిస్తాయి. సువాసన కలిగి ఉంటాయి.
   జాజిపూలు రాత్రివేళ వికసిస్తాయి. సువాసన కలిగి ఉంటాయి.
   విరజాజి పూలు రాత్రివేళ వికసిస్తాయి. సువాసన కలిగి ఉంటాయి.
   సాధారణీకరణ: రాత్రి వేళ వికసించే పూలలో సువాసన ఉంటుంది.
6. **సూత్రం:** సూత్రం అనేది పరిశీలించే దృగ్విషయ వివరణ. చాలా విస్తారంగా పరిశీలించిన, ఏర్పర్చిన సామాన్యీకరణలనే సూత్రాలు అంటారు. సూత్రం విషయస్థిరీకరణకు ఉపయోగపడుతుంది.
   ఉదా: అనువంశిక సూత్రాలు, ఆర్కిమెడిస్ సూత్రం.

ప్రాకల్పన:

పరిశీలించిన సంఘటనల మధ్య ఉన్న సంబంధాల ప్రాథమిక భావన. దత్తాంశాల ఆధారంగా పరిష్కారాన్ని ఊహించడం.

ప్రాకల్పన రకాలు:

ప్రకటనాత్మక ప్రాకల్పన: భాష్పోత్సేకానికి, పత్ర రంధ్రాలకు సంబంధం ఉంది.
ప్రశ్నా ప్రాకల్పన: భాష్పోత్సేకానికి, పత్ర రంధ్రాలకు సంబంధం ఉందా?
ప్రాగుక్తీకరణ ప్రాకల్పన: భాష్పోత్సేకానికి, పత్ర రంధ్రాలకు సంబంధం ఉండవచ్చు.
శూన్య ప్రాకల్పన: భాష్పోత్సేకానికి, పత్ర రంధ్రాలకు సంబంధం లేదు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. విజ్ఞానశాస్త్ర లక్షణం కానిది? (డీఎస్సీ-02)
   1) విజ్ఞాన శాస్త్రం ఒక ప్రక్రియ
   2) విజ్ఞాన శాస్త్రం సంచిత జ్ఞానం
   3) విజ్ఞాన శాస్త్రం శాస్త్రీయ వైఖరులను పెంపొందిస్తుంది
   4) విజ్ఞాన శాస్త్ర విషయాలను ప్రయోగాత్మకంగా నిరూపించలేం
2. నిర్మాణంలో ఉన్న భవనంతో సైన్స్ నిర్మాణాన్ని పోల్చవచ్చు అన్నది? (డీఎస్సీ-02)
   1) హెన్రీ పాయింకర్, ఆర్.సి. శర్మ
   2) కార్ల్ పియర్‌సన్
   3) జేమ్స్ బి. కోనాంట్ 4) రిచర్డ్‌సన్
3. సాధారణీకరించిన ఊహ లేదా ఆలోచన? (డీఎస్సీ-2002)
   1) యథార్థం 2) సిద్ధాంతం
   3) సూత్రం 4) భావన
4. శాస్త్రీయ ప్రవచనాలు? (డీఎస్సీ-2004)
   1) సత్యదూరాలు 2) సహేతుకంగా ఉండవు
   3) క్రమరహితంగా ఉంటాయి
   4) క్రమబద్ధంగా ఉంటాయి
5. 'అమెరికన్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్ మెంట్ ఆఫ్ సైన్స్' అభిప్రాయం ప్రకారం 'విజ్ఞానశాస్త్రం'? (డీఎస్సీ-2004)
   1) ప్రయోగాలు పరిశీలనల నుంచి వృద్ధి పొంది, తర్వాత ప్రయోగాత్మక పరీక్ష లు, పరిశీలనల ఫలితాలనిస్తూ పరస్ప ర సంబంధాలున్న భావనల, భావనా పథకాల శ్రేణి
   2) నిరంతర పరిశీలన, ప్రయోగం, అన్వయం, నిరూపణల ద్వారా మన గురించి, ఈ విశ్వం గురించి అవగాహన పెంచుకుని, సరిదిద్దుకునే ప్రక్రియే విజ్ఞానశాస్త్రం.
   3) ప్రయోగాలు పరిశీలనలు ఉన్న విజ్ఞానం
   4) క్రమబద్ధం, వ్యవస్థీకరించిన విజ్ఞానం

సమాధానాలు

1) 4; 2) 1; 3) 4; 4) 4; 5) 2

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో ఎవరు తెలిపిన వాటిని అనువర్తిత శాఖలుగా పిలుస్తున్నారు?
   ఎ) కిరణ్ - బాహ్య స్వరూప శాస్త్రం జీవుల బాహ్య లక్షణాలను తెలిపేది.
   బి) కీర్తి- సూక్ష్మజీవ శాస్త్రం సూక్ష్మజీవుల గురించి తెలిపేది
   సి) కార్తిక్- అణుజీవశాస్త్రం అణు స్థాయి జీవుల గురించి తెలిపేది
   డి) కారుణ్య- హార్టికల్చర్ మొక్కల పెంపకానికి సంబంధించింది
   1) సి, డి 2) ఎ, సి
   3) బి, సి 4) బి, డి
2. కింది ఏ ప్రవచనాలు హెన్రీపాయింకర్, ఆర్.సి. శర్మలు వివరించిన విజ్ఞానశాస్త్ర నిర్మాణానికి సంబంధించినవి?
   ఎ) విజ్ఞాన నిర్మాణంలో సిద్ధాంతాలు నిలువు స్తంభాలుగా ఉంటాయి.
   బి) విజ్ఞానశాస్త్ర నిర్మాణాన్ని.. నిర్మాణంలో ఉన్న భవనంతో పోల్చటం
   సి) విజ్ఞాన శాస్త్ర నిర్మాణంలో ద్రవ్యాత్మక నిర్మాణం, సంశ్లేషణాత్మక నిర్మాణం అనే విభాగాలుంటాయి.
   డి) విజ్ఞాన శాస్త్ర నిర్మాణంలో సత్యాలు, భావనలను పునాదులతో పోల్చారు
   1) బి, సి 2) సి, డి
   3) ఎ, డి 4) ఎ, బి
3. ఆహారోత్పత్తిలో భాగంగా కింది వాటిలో ఏది జలచరాలకు సంబంధించిన అభివృద్ధిని సూచిస్తుంది?
   1) హరిత విప్లవం 2) శ్వేత విప్లవం
   3) నీలి విప్లవం 4) సాంఘిక విప్లవం
4. కింది నిర్వచనాల్లో సిద్ధాంతానికి సంబంధించి సరైంది?
   1) పరిశీలించిన సంఘటనల మధ్య ఉన్న ప్రాథమిక భావన
   2) నిరూపితంకాకపోయినా బలమైన సాక్ష్యాధారాలున్న పరిస్థితులను వివరించడానికి ప్రతిపాదన
   3) చాలా విస్తారంగా పరీక్షించి, సప్ర మాణత నెలకొల్పిన సిద్ధాంతం
   4) సేకరించిన సమాచారం ఆధారంగా తర్వాతి పరిణామాన్ని ఊహించడం
5. విజ్ఞానశాస్త్రంలోని ఇతర సబ్జెక్టుల కంటే జీవశాస్త్రం ప్రాథమికమైంది, ముఖ్యమైంది ఎందుకు?
   1) జీవరాశుల ప్రాథమిక అవసరాలను తీర్చడంలో ప్రధానపాత్ర పోషిస్తుంది
   2) సృజనాత్మకతను ప్రోత్సహిస్తుంది
   3) జ్ఞాన విస్ఫోటనానికి మార్గం సుగమం చేస్తుంది
   4) భూమిని అవగాహన చేసుకోవ టానికి సహాయపడుతుంది
6. A అనే విద్యార్థి భావనను అవగాహన చేసుకొన్నాడు. B సత్యం అంటే ఏమిటో తెలుసుకొన్నాడు. A, B ఇచ్చిన ఉదాహ రణలు సరైనవి అయితే కింది వాటిలో వేటిని ఇచ్చారు?
   1) A - ఆకులు పచ్చగా ఉంటాయి.
      B - మొక్కలు పెరుగుదలను సూచిస్తాయి.
   2) A - పీడనం పెరిగితే ఘనపరిమాణం తగ్గుతుంది.
      B- జీవులు శ్వాసిస్తాయి.
   3) A - జంతువులలో కిరణజన్య సంయోగక్రియ జరుగదు.
      B- సరళజీవుల నుంచి సంక్లిష్ట జీవులు ఏర్పడుతాయి.
   4) A - మొక్కలు జీవితాంతం పెరుగు దల చూపుతాయి.
      B - జంతువులు ప్రత్యుత్పత్తి ద్వారా తమ సంఖ్యను వృద్ధిచేసుకుంటాయి.
7. విజ్ఞానశాస్త్ర లక్షణాలను తెలుపుతూ క్రాంతి విజ్ఞానశాస్త్రం క్రమబద్ధమైంది అని, వినయ్ శాస్త్రీయ ప్రవచనం అని, భరత్ ఊహాజనితమైంది అని తెలిపారు. ఎవరెవరు సరైన లక్షణాలను తెలిపారు?
   1) క్రాంతి తప్పు- వినయ్, భరత్‌లు ఒప్పు
   2) క్రాంతి, వినయ్‌లు ఒప్పు- భరత్ తప్పు
   3) క్రాంతి భరత్‌లు ఒప్పు- వినయ్ తప్పు
   4) క్రాంతి, భరత్, వినయ్ ముగ్గురూ తప్పు

సమాధానాలు

1) 3 2) 2 3) 3 4) 2
5) 1 6) 4 7) 2

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ధ్వనివేగం ఎక్కువగా ఉన్న ఘనపదార్థం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
భౌతిక శాస్త్రం

ధ్వని

ప్రతిధ్వని: ధ్వని తరంగాలు ప్రయాణిస్తున్న మార్గంలో అడ్డు తలాలను తాకి పరావర్తనం చెందినప్పుడు వినిపించే ధ్వనినే ప్రతిధ్వని అంటారు. ప్రతిధ్వనిని వినాలంటే కింది షరతులను పాటించాలి.

1. మొదటిసారి వినిపించే ధ్వనికి, ప్రతిధ్వనికి మధ్య కనీస కాల వ్యవధి 1/10వ సెకను లేదా అంతకంటే ఎక్కువగా ఉండాలి.
2. ధ్వని జనక స్థానం, పరావర్తన తలాల మధ్య కనీస దూరం 16.5 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువగా ఉండాలి.

- ప్రతిధ్వని సమీకరణం

$v = 2d/t$

$d = vt/2$

$v \rightarrow$ ధ్వని వేగం($v = 330 m/s$)
$d \rightarrow$ ధ్వని జనకం నుంచి పరావర్తన తలానికి ఉన్న దూరం
$t \rightarrow$ ధ్వని తరంగాలు ప్రయాణించడానికి పట్టే కాలం

- కనీస కాల వ్యవధి
$t = 1/10$ sec
$d = vt/2, d=(330/2)\times(1/10)$
$d = 16.5m$

అనువర్తనాలు

1. ప్రతి ధ్వనిని ఉపయోగించి బావులు, లోయలు, గనుల లోతును కనుగొంటారు.
2. సముద్రాల లోతును కనుక్కోవడానికి ఉపయోగించే Sonar పరికరం ధ్వని పరావర్తనం ధర్మం ఆధారంగా పనిచేస్తుంది.
3. రెండు ఎత్తైన భవనాలు, పర్వతాల మధ్య దూరాన్ని కచ్చితంగా లెక్కించడానికి ఈ ధర్మాన్ని ఉపయోగిస్తారు.
4. డాక్టర్లు ఉపయోగించే స్టెతస్కోప్ ధ్వని పరావర్తనం(బహుళ పరావర్తనం)సూత్రం ఆధారంగా పనిచేస్తుంది. ఈ సాధనాన్ని 'లెన్నెక్' అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

ధ్వని వేగం

గాలిలో ధ్వని వేగం: డి.సి.మిల్లర్ అనే శాస్త్రవేత్త గాలిలో ధ్వని వేగాన్ని కనుగొన్నాడు. గాలి, ఉష్ణోగ్రత, పీడనం, సాంద్రత, తేమ మొదలైన వాటిపై ధ్వని వేగం ఆధారపడుతుంది.

వాయువులు: వాయువులకు స్వతంత్రమైన భౌతిక, రసాయనిక ధర్మాలుంటాయి. వేర్వేరు వాయువుల సాంద్రతలు వేర్వేరుగా ఉంటాయి.

ఉదా: H_2, He, Ne

గాలి: దీన్ని అనేక వాయువుల మిశ్రమ పదార్థం అని అంటారు. దీనిలో N_2, O_2, CO_2, తేమ, జడవాయువులు మొదలైనవి ఉంటాయి.

తేమ: గాలిలో ఉండే నీటి ఆవిరి శాతాన్ని 'తేమ' లేదా ఆర్ద్రత అంటారు.

పీడనం: ప్రమాణ వైశాల్యంపై కలుగజేసిన బలాన్ని పీడనం అంటారు.

పీడనం (p)= F/A
(బలం)/(ప్రమాణ వైశాల్యం)
ప్రమాణం: $dyne/m^2$
$Newton/cm^2$

- పాస్కల్ అంతర్జాతీయ ప్రమాణం.

గాలిలో ధ్వని వేగాన్ని కనుగొనడానికి కావాల్సిన సమీకరణాన్ని 16వ శతాబ్దంలో తొలిసారిగా న్యూటన్ ప్రతిపాదించాడు.

$v = \sqrt{(p/d)}$
$p \rightarrow$ గాలి పీడనం
$d \rightarrow$ గాలి సాంద్రత

కానీ, ఈ సమీకరణాన్ని లాప్లాస్ అనే శాస్త్రవేత్త సవరించాడు.

$v = \sqrt{(\gamma p/d)}$
$\gamma = Cp/Cv$,
Cp = స్థిరపీడనం వద్ద గాలి విశిష్టోష్ణం
Cv = స్థిరఘనపరిమాణం వద్ద గాలి విశిష్టోష్ణం
γను ఒక వాయువు 2 విశిష్టోష్ణాల మధ్య ఉండే నిష్పత్తి అంటారు.

గాలిలో ధ్వని వేగాన్ని ప్రభావితం చేసే అంశాలు

1. **ఉష్ణోగ్రత:** గాలిలో ధ్వనివేగం దాని పరమ ఉష్ణోగ్రత వర్గమూలానికి అనులోమానుపాతంలో ఉంటుంది. $V \propto \sqrt{T}$
కాబట్టి ఉష్ణోగ్రతను పెంచితే గాలిలో ప్రయాణిస్తున్న ధ్వనివేగం కూడా పెరుగుతుంది. గాలి ఉష్ణోగ్రతను 1°C చొప్పున పెంచినప్పుడు దానిలో ప్రయాణిస్తున్న ధ్వనివేగం 0.61m/s పెరుగుతుంది. అందువల్ల ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న వేసవికాలంలో ధ్వని వేగం కూడా ఎక్కువగా ఉంటుంది.
2. **పీడనం:** గాలిలో ప్రయాణిస్తున్న ధ్వనివేగం దాని పీడనంపై ఆధారపడి ఉండదు. కాబట్టి గాలి పీడనాన్ని పెంచినా లేదా తగ్గించినా ధ్వని వేగంలో ఎలాంటి మార్పు ఉండదు.
3. **సాంద్రత:**
న్యూటన్ - లాప్లాస్ సమీకరణం
$v = \sqrt{(\gamma p/d)} \Rightarrow v \propto 1/\sqrt{d}$
వాయువుల్లో ప్రయాణిస్తున్న ధ్వనివేగం వాయువుల సాంద్రత వర్గమూలానికి విలోమానుపాతంలో ఉంటుంది. కాబట్టి వాయువుల సాంద్రత తక్కువగా ఉంటే ధ్వనివేగం ఎక్కువగా ఉంటుంది.
ఉదా: H_2 వాయువు సాంద్రత తక్కువగా ఉండడం వల్ల దానిలో ధ్వనివేగం ఎక్కువగా (1230m/s) ఉంటుంది.
అనేక వాయువుల మిశ్రమమైన గాలి సాంద్రత ఎక్కువగా ఉండడం వల్ల దాని లో ధ్వనివేగం 330m/sగా ఉంటుంది.
4. **తేమ లేదా ఆర్ద్రత:** గాలిలో తేమశాతం పెరిగినప్పుడు గాలి సాంద్రత తగ్గుతుంది. కాబట్టి ధ్వని వేగం పెరుగుతుంది. తేమ శాతం ఎక్కువగా ఉన్న వర్షాకాలంలో ధ్వని వేగం ఎక్కువగా ఉంటుంది.
సమాన ఉష్ణోగ్రతల వద్ద వర్షాకాలం, వేసవికాలంలో ధ్వనివేగాన్ని పోల్చినప్పుడు సాంద్రత తక్కువగా ఉన్న వర్షాకాలంలో ఎక్కువగా, సాంద్రత ఎక్కువగా ఉన్న వేసవికాలంలో ధ్వని వేగం తక్కువగా ఉంటుంది.

ఘన పదార్థాల్లో ధ్వనివేగం

$V_S = \sqrt{(y/d)}$
y–యంగ్ గుణకం
d - సాంద్రత (ఘన పదార్థం)

వేర్వేరు ఘన పదార్థాల స్థితి స్థాపక గుణకాలు, సాంద్రతలు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి ధ్వని వేగం కూడా వేర్వేరు ఘనప దార్థాల్లో వేర్వేరుగా ఉంటుంది. ధ్వనివేగం ఎక్కువగా ఉన్న ఘనపదార్థం 'వజ్రం'. దీనిలో ధ్వనివేగం 12000 m/sగా ఉంటుంది(గాజులో 5500m/s, స్టీల్‌లో 5000 m/s).



ద్రవ పదార్థాల్లో ధ్వనివేగం

ద్రవ పదార్థాల్లో ధ్వనివేగం $V_L = \sqrt{(k/d)}$
k = స్థూలగుణకం లేదా ఆయతగుణకం
d = ద్రవ సాంద్రత

- నీటిలో ధ్వని వేగం ఎక్కువ(1435m/s) గా ఉంటుంది.
- ఉప్పునీటిలో ధ్వని వేగం =1485m/s

ఉప్పునీటిని 'బ్రైన్ ద్రావణం' అని కూడా అంటారు. ఆరోగ్యవంతుడైన మానవుని రక్తం లో ధ్వని వేగం సుమారు 1570m/sగా ఉంటుంది.

సమాన సాంద్రతల వద్ద ఘన, ద్రవ, వాయువుల స్థితిస్థాపక గుణకాలను పోల్చినప్పుడు
$y > k > \gamma p$
కాబట్టి ధ్వని వేగాలను పోల్చితే
$v_s > v_l > v_g$
∴ ధ్వనివేగం ఘన పదార్థాల్లో గరిష్ఠంగా, ద్రవ పదార్థాల్లో సాధారణంగా, వాయు పదార్థాల్లో చాలా తక్కువగా ఉంటుంది.

సూపర్ సోనిక్ వేగం

ఒక వస్తువు వేగం ధ్వని వేగం కంటే ఎక్కువగా ఉన్నట్లయితే దాన్ని 'సూపర్ సోనిక్ వేగం' అంటారు.

ఉదా: జెట్ విమానాలు, రాకెట్లు, క్షిపణులు సూపర్ సోనిక్ వేగంతో ప్రయాణిస్తాయి.

సూపర్ సోనిక్ వేగాన్ని కొలవడానికి ఉపయోగించే పదం మాక్ సంఖ్య. ఈ పేరును ఎర్నెస్ట్‌మాక్ అనే శాస్త్రవేత్త పేరు నుంచి గ్రహించారు.

మాక్ సంఖ్య = వస్తువు వేగం/ ధ్వని వేగం

జెట్ విమానం సూపర్ సోనిక్ వేగంతో ప్రయాణించేటప్పుడు అత్యంత శక్తివంతమైన 'షార్క్ వేవ్స్'ను విడుదల చేస్తుంది. ఈ సందర్భంలో వినిపించే ధ్వనిని 'సోనిక్ బూం' అంటారు. యుద్ధనౌకలు, జలాంతర్గాములు సూపర్ సోనిక్ వేగంతో ప్రయాణించినప్పుడు 'బౌ వేవ్స్' అనే శక్తివంతమైన ధ్వని తరంగాలను విడుదల చేస్తాయి.

ధ్వనివేగం ఆధారంగా వస్తువుల వేగాలను ఐదు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **సబ్ సోనిక్ వేగం:** ఒక వస్తువు వేగం ధ్వనివేగం కంటే తక్కువగా ఉన్నట్లయితే దాన్ని సబ్‌సోనిక్ వేగం అంటారు. ఈ సందర్భంలో మాక్ సంఖ్య '1' కంటే తక్కువ.
ఉదా: బస్సు, కారు, బైక్ మొదలైనవి.
2. **సోనిక్ వేగం:** ఒక వస్తువు వేగం ధ్వని వేగానికి సమానంగా ఉంటే ఆ వేగాన్ని 'సోనిక్ వేగం' అంటారు. ఈ సందర్భంలో మాక్ సంఖ్య '1'కి సమానం.
3. **సూపర్ సోనిక్ వేగం:** ఒక వస్తువు వేగం ధ్వని వేగానికి 1 నుంచి 5 రెట్లుగా ఉంటే ఆ వేగాన్ని 'సూపర్ సోనిక్ వేగం' అంటారు. ఈ సందర్భంలో మాక్ సంఖ్య 1–5 వరకు ఉంటుంది.
4. **హైపర్ సోనిక్ వేగం:** ఒక వస్తువు వేగం ధ్వని వేగానికి 5–10 రెట్లు ఉంటే దాన్ని హైపర్ సోనిక్ వేగం అంటారు. ఇలాంటి వస్తువుల మాక్ సంఖ్య 5–10.
5. **హై హైపర్ సోనిక్ వేగం:** ఒక వస్తువు వేగం ధ్వని వేగానికి 10 రెట్ల కంటే ఎక్కువగా ఉంటే దాన్ని 'హై హైపర్ సోనిక్ వేగం' అంటారు. ఈ వస్తువుల మాక్ సంఖ్య 10 కంటే ఎక్కువ.
ఉదా: 2011 జూలై 15 వరకు అమెరికా ప్రయోగించిన స్పేస్ షటిల్స్ (Discov-ery, Endeavour, Atlantous) ఇలాంటి వేగంతో ప్రయాణించాయి.

ధ్వని లక్షణాలు

1. **ధ్వని తీవ్రత:** ధ్వని తీవ్రత కంపన పరిమితి వర్గానికి అనులోమానుపాతంలో ఉంటుంది.
$I \propto a^2$
కంపన పరిమితి పెరిగితే ధ్వని తీవ్రత పెరుగుతుంది. దీని ప్రమాణం డెసిబుల్.
ఈ పదాన్ని అలెగ్జాండర్ గ్రహంబెల్ పేరు నుంచి గ్రహించారు. ఒక వస్తువు నుంచి వెలువడే ధ్వని తీవ్రతను కొలవడానికి ఉపయోగించే పరికరం 'సౌండ్ మీటర్'. ధ్వని తీవ్రత పౌనఃపున్యంపై ఆధారపడదు. పౌనఃపున్యాన్ని పెంచినా లేదా తగ్గించినా ధ్వని తీవ్రతలో ఎలాంటి మార్పు ఉండదు.
2. **స్థాయిత్వం:** ఇది కేవలం పౌనఃపున్యంపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. ప్రమాణం Hz. పౌనఃపున్యం పెంచినప్పుడు స్థాయిత్వం పెరిగి ధ్వనులు కీచుగా ఉంటా యి. 'టోనోమీటర్'ను ఉపయోగించి వస్తువు నుంచి వెలువడే ధ్వని స్థాయిత్వాన్ని కొలుస్తారు. స్థాయిత్వం కంపన పరిమితిపై ఆధారపడదు.
3. **నాద గుణం:** ఒకేసారి అనేక ధ్వనులు మనచెవిని చేరినప్పుడు వాటిని వేర్వేరుగా గుర్తించే ధర్మాన్ని 'నాదగుణం' అంటారు.
ఈ ధర్మం ఆయా వ్యక్తుల శృతి గ్రాహ్యతపై ఆధారపడి ఉంటుంది.

అనువర్తనాలు

పురుషుల కంఠస్వరం, సింహం గర్జించినప్పుడు, ఏనుగు ఘీంకరించినప్పుడు వెలువడే ధ్వనుల్లో కంపన పరిమితి ఎక్కువగా, పౌనఃపున్యం తక్కువగా ఉంటుంది. కాబట్టి ఇలాంటి స్వరాలు ఎక్కువ తీవ్రతను కలిగి ఉంటాయి. చిన్న పిల్లలు, స్త్రీలు, దోమ స్వరాల్లో కంపన పరిమితి తక్కువగా, పౌనఃపున్యం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ స్వరాలు కీచుగా ఉంటాయి.

My friend is really very good...

BANK EXAMS
GENERAL ENGLISH

Directions (Q.1-5): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in the proper sequence to form a meaningful paragraph; then answer the questions given below them.

A. With all the bid information being available and tracked online, corruption has considerably reduced.
B. Today, most, i.e. over ninety-five per cent, households, in the city enjoy broadband connection.
C. All city contracts are now bid for online.
D. Over twenty years ago the city government, Central Government and the private sector made a concerted effort to shift the economy to include IT.
E. As our cities do expand and become more complex, such a system will make governance more manageable.
F. This level of connectedness has changed not only the city's economy but also how it is governed and how business is conducted.

1. Which of the following should be the FIRST sentence after rearrangement?
1. A 2. B 3. C 4. D 5. E
2. Which of the following should be the SECOND sentence after rearrangement?
1. A 2. B 3. C 4. D 5. F
3. Which of the following should be the THIRD sentence after rearrangement?
1. A 2. C 3. D 4. E 5. F
4. Which of the following should be the FIFTH sentence after rearrangement?
1. A 2. B 3. C 4. D 5. E
5. Which of the following should be the LAST (SIXTH) sentence after rearrangement?
1. B 2. C 3. D 4. E 5. F

Directions (Q.6-10): Which of the phrases (1), (2), (3) (4) and (5) given below each sentence should replace the phrase printed in bold in the sentence to make it grammatically correct? If the sentence is correct as it is given and no correction is required, mark (5) as the answer.

6. We have hired an advertising agency to prepare a campaign to encourage people votes.
1. Votes by people
2. People to vote
3. Voting for people
4. People from voting
5. No correction required
7. During the training programme the new recruits will be briefed about how their role in the new organisation.
1. Which are their role
2. For its roles
3. About their role
4. What their roles
5. No correction required
8. The equipment is in such a poor condition that we have no alternative to buy new ones.
1. Many alternatives like
2. any alternative except
3. no other alternative
4. no alternative but
5. No correction required
9. Since the deadline has been changed from next week to this Thursday you should give this work priority.
1. Priority this work
2. Prioritized this work
3. Not give priority this work
4. Be given this work priority
5. No correction required
10. After the success of our project we have been receiving more requests than we do not have the resources to handle them.
1. Too many requests
2. More requests that
3. Most of the requests
4. Many requests but
5. No correction required

Directions (Q. 11-15): Each question below has a blank indicating that something has been omitted. Choose the word from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.



11. She has not recovered fully --- the shock of his failure.
1. against 2. from 3. of
4. off 5. in
12. The master dispensed --- the services of his servant.
1. of 2. with 3. off
4. for 5. to
13. I have been informed that the two brothers have fallen ---.
1. upon 2. through 3. in
4. out 5. up
14. He has great affection --- me.
1. with 2. on 3. for
4. in 5. towards
15. My friend is really very good -- cricket.
1. on 2. at 3. in
4. over 5. above

Directions (Q.16-25): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word in each case.

One of the best solutions -------- (16) the stubborn problem of literacy is ------- (17) teach parents to read, so that they can in turn ------ (18) their children. In a document published by the Department of Education of Colorado, it is explained that Children learn -------- (19) written language in a socially mediated way. Children also learn about the functions of written language as they observe and help parents make lists, -------- (20) letters to family members or friends, or read menus in a restaurant. If the adult women -------- (21) educated first, each generation will be able to read and write, since mothers are the first educators of children. The women will teach their children, both male and female, who will in turn teach their children. Thus women can bring a --------- (22) change in the society by and -------- (23). The -------- (24) of the economy will see a drastic change. If people in a society are -------- (25), that society tends to develop further capacities, and further value literacy. Thus economic stability largely rests on the literacy levels of the people.

16. 1) resolve 2) to resolving
3) to solved 4) to solving
5) resolution
17. 1) to 2) in 3) for
4) with 5) upon
18. 1) taught 2) teaching
3) teaches 4) is teaching
5) teach
19. 1) at 2) about 3) for
4) up 5) above
20. 1) written 2) writing 3) writes
4) write 5) wrote
21. 1) am 2) were 3) was
4) is 5) are
22. 1) vital 2) viral 3) small
4) meagre 5) enough
23. 1) by 2) large 3) bye
4) for 5) buy
24. 1) phase 2) site 3) face
4) rule 5) sight
25. 1) literacy 2) illiteracy
3) illiterate 4) literate
5) literature

Directions (Q.26-30): Read each sentence to find out whether there is any grammatical error or idiomatic error in it. The error, if any, will be in one part of the sentence. The letter of that part is the answer. If there is no error, the answer is (5) (Ignore errors of punctuation, if any.)

26. Passengers should (1)/ be prohibited (2)/ to smoke in (3)/ the trains and buses. (4)/ No error (5)
27. The world (1)/ comprises (2)/ good and (3)/ bad people. (4)/ No error (5)
28. The demand of the worker's union (1)/ that the dismissed (2)/ employee to be reinstated, (3)/ has been accepted by the management. (4)/ No error (5)
29. I need not offer (1)/ any explanation, (2)/ my behaviour (3)/ is speaking itself. (4)/ No error(5)
30. Neither any of the members (1)/ of the society (2)/ nor the Chairman were present (3)/ for the annual meeting. (4)/ No error(5)

KEY

1) 4	2) 2	3) 4	4) 1	5) 3
6) 2	7) 3	8) 4	9) 5	10) 4
11) 2	12) 2	13) 4	14) 3	15) 2
16) 4	17) 1	18) 5	19) 2	20) 4
21) 5	22) 1	23) 2	24) 3	25) 4
26) 3	27) 5	28) 4	29) 4	30) 3

ఉద్యోగాలు

ఐసీఎంఆర్-ఎన్ఐటీఎం, బెళగావిలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు

బెళగావి(కర్ణాటక)లోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్)కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రెడిషనల్ మెడిసిన్(ఎన్ఐటీఎం) తాత్కాలిక ప్రాతిపదికన టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



- మొత్తం పోస్టుల సంఖ్య: 04.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డైరెక్టర్, ఐసీఎంఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రెడిషనల్ మెడిసిన్, నెహ్రూ నగర్, బెళగావి చిరునామకు పంపించాలి.
- దరఖాస్తులకు చివరితేది: 18.10.2024.
- వెబ్‌సైట్: https://icmrnitm.res.in/

బామర్ లారీ లిమిటెడ్, కోల్‌కతాలో జూనియర్ ఆఫీసర్ పోస్టులు

కోల్‌కతాలోని బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్ ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 04.
- **పోస్టుల వివరాలు:** జూనియర్ ఆఫీసర్ (సేల్స్ అండ్ మార్కెటింగ్)–02, జూనియర్ ఆఫీసర్(ఆపరేషన్స్)–02.
- **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 04.10.2024.
- పని చేయాల్సిన ప్రదేశాలు: బెంగళూరు, కోల్‌కతా.
- వెబ్‌సైట్: https://www.balmerlawrie.com